# ఈనాడు
# హైదరాబాద్
HMDA

ఆదివారం 31 డిసెంబరు 2017 28 పేజీలు




ఈనాడు
హైదరాబాద్
HMDA
ఆదివారం 31 డిసెంబరు 2017 28 పేజీలు



విద్యార్థుల సంబరం

విద్యాసంవత్సరం ముగింపునకు వస్తుండటంతో పాఠశాలల్లో వార్షికోత్సవాల కోలాహలం కనిపిస్తోంది. శనివారం పలు విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఆడిపాడి అలరించారు.

అయ్యప్ప నామస్మరణతో నగరం మార్మోగుతోంది. భజనలు, భక్తిగీతాలాపనలతో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. పడిపూజల సందర్భంగా భారీ వ్యయంతో ఏర్పాటు చేస్తున్న సెట్టింగులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.



చిలకలగూడలో..

భక్తుల పరవశం

## 2, 3 తేదీల్లో నీటి సరఫరాకు అంతరాయం

గోదావరి నీటి ప్రాజెక్టు ఫేజ్-1లో పైప్‌లైన్ నిర్వహణ పనుల కారణంగా.. జనవరి 2, 3 తేదీల్లో నగరంలోని పలు ప్రాంతాలకు సరఫరాలో అంతరాయం ఉంటుందని జలమండలి తెలిపింది. రెండో తేదీన పూర్తిగా సరఫరాను నిలిపివేస్తారు. మూడో తేదీన కొంత ఆలస్యంగా సరఫరా జరుగుతుంది. ఎర్రగడ్డ, ఎల్లారెడ్డిగూడ, వెంగళరావ్‌నగర్, యూసుఫ్‌గూడ, సోమాజిగూడ, వెంకటగిరి, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, బోరబండ, ఎస్‌పీఆర్‌హిల్స్, సనత్‌నగర్, ప్రకాశ్‌నగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాలానగర్, భాగ్యనగర్, బాలాజీనగర్, ఎల్లమ్మబండ, మూసాపేట, హస్మత్‌పేట్, హైదర్‌నగర్, నిజాంపేట, ఆల్విన్ కాలనీ, జగద్గిరిగుట్ట, ఆదర్శ్‌నగర్, షాపూర్‌నగర్, రోడామిస్త్రీనగర్, హెచ్‌ఎంటీ కాలనీ, చింతల్, జీడిమెట్ల, హఫీజ్‌పేట, బొల్లారం, డిఫెన్స్‌కాలనీ, రాధికా సెక్షన్, అల్వాల్, ఫాదర్ బాలయ్యనగర్, ఓయూటీకాలనీ, ఐసీఐసీఐ నాలెడ్జ్ పార్క్, తుర్కపల్లి, చర్లపల్లి, దమ్మాయిగూడ, కంటోన్మెంట్ బోర్డు, రుద్రనగర్, రిసాలాబజార్, ఎంఈఎస్, త్రిశూల్ లైన్స్ ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని వివరించింది.

– ఈనాడు డిజిటల్, హైదరాబాద్

- అతిగా మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు
- నేటి రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ప్రత్యేక తనిఖీలు

# మత్తు దించుతారు..!



- కొత్త ఏడాది వేడుకలు సజావుగా ముగిసేలా పోలీసుల వ్యూహం

ఈనాడు, హైదరాబాద్

" కొత్త సంవత్సరం ఉత్సాహంగా ప్రారంభం కావాల్సిందే... కానీ ఆహ్వానం పలికే పేరుతో మందు పార్టీలు, విందులు, వినోదాలంటూ మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడిపితే.. వారెవరైనా సరే... వదలకండి... వారు ప్రమాదాలు చేస్తే రక్తసిక్తంగా నూతన ఏడాది మొదలయ్యే అవకాశాలున్నాయి. అందుకే నగరమంతా ఆదివారం రాత్రి 10 గంటల నుంచే డ్రంకన్‌డ్రైవ్ ప్రారంభించాలి.."


*- శనివారం పోలీసులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఉన్నతాధికారుల ఆదేశం ఇది.*

ముంబయిలోని ఓ పబ్బులో జరిగిన అగ్నిప్రమాదం నేపథ్యంలో .. నూతన సంవత్సర వేడుకల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. దీంతో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకలు పూర్తయ్యాక తిరిగి వెళ్లే సమయంలో ఒక్క రోడ్డు ప్రమాదం కూడా జరక్కుండా పకడ్బందీ చర్యలు తీసుకొంటున్నారు.

- కొత్త ఏడాది పార్టీలు 70 శాతం బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్ ప్రాంతాల్లోనే జరుగుతున్నాయి. పంచతార (ఫైవ్‌స్టార్) హోటళ్లు, పబ్బులు, బార్లలో న్యూ ఇయర్ పేరుతో ప్రత్యేక ఈవెంట్లను నిర్వహిస్తున్నారు. ఇందుకు

...మిగతా 2లో

- మూడు కమిషనరేట్ల పరిధుల్లో 150 ప్రత్యేక బృందాలతో డ్రంకెన్ డ్రైవ్‌ను నిర్వహించనున్నారు.
- మోతాదుకు మించి మద్యం తాగి నడిపే వారిని పట్టుకుని వాహనాలను అక్కడికక్కడే స్వాధీనం చేసుకొంటారు.
- పబ్బులు... బార్లు.. రెస్టారెంట్ల సమీపంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా గస్తీ బృందాలనూ నియమించారు.
- ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్‌రోడ్ ప్రాంతాల్లో అదివారం రాత్రి 10 గంటల నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. అన్ని పైవంతెనలను మూసేస్తారు.



## నయా సాల్ జోష్

నగరంలో కొత్త సంవత్సర హడావుడి మొదలైంది. ఘనంగా స్వాగతం చెప్పేందుకు నగరవాసులు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం పలు ప్రాంతాల్లోని బేకరీలు కేకులకు ఆర్డరిచ్చేందుకు వచ్చిన వారితో కళకళలాడాయి. మిఠాయిలు, పుష్పగుచ్ఛాల (బొకేలు) దుకాణాల్లో సందడి నెలకొంది. కుర్రకారు విందు .. వినోదాలతో వేడుకలను జరుపుకొనే సన్నాహాల్లో మునిగితేలుతున్నారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలకు, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

...వివరాలు లోపలి పేజీల్లో

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం



**ఆగాపల్లి(మంచాల):** సాగర్ రహదారి (ఆగాపల్లి) గేట్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. మంచాల ఎస్ఐ రాంబాబు కథనం ప్రకారం.. దేవరకొండ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు. . ఎదురుగా వెళ్తున్న వ్యాన్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది. అతికష్టం మీద మృతదేహాలను కారులో నుంచి బయటికి తీసి ఇబ్రహీంపట్నం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

# అమెరికా ఆస్పత్రిలో ఇంటిపెద్ద.. ఆవేదనలో కుటుంబం

## దుండగుల కాల్పుల్లో గాయపడ్డ నగరవాసి ● అక్కడికి వెళ్లేందుకు సాయం చేయాలని వేడుకోలు



సయ్యద్ బాకర్ హుస్సేన్

**షేక్‌పేట:** 'అమెరికా చికాగో డాల్టన్‌లో గ్యాస్ స్టేషన్ వద్ద దుండగుల దాడిలో గాయపడిన తన భర్తను చూసేందుకు అక్కడికి వెళ్లేందుకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని' బాధితుడి భార్య వేడుకుంటున్నారు. అమెరికా వెళ్లే ఆర్థిక స్తోమత తమకు లేదని తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. షేక్‌పేట గుల్షన్ కాలనీకి చెందిన సయ్యద్ బాకర్ హుస్సేన్ (55) 12 ఏళ్ల క్రితం కుటుంబాన్ని ఇక్కడే ఉంచి ఉపాధి కోసం అమెరికాకు వెళ్లారు. అక్కడి వివిధ సంస్థల్లో పని చేసి యేడాదిన్నర క్రితం షికాగో డాల్టన్‌లో గుజరాత్‌కు చెందిన ప్రవాస భారతీయుడు నిర్వహిస్తున్న ఒక గ్యాస్ స్టేషన్‌లో ఉద్యోగం చేస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. పెద్ద కుమారుడు సయ్యద్ ముజఫర్ హుస్సేన్ ఎంబీఏ, చిన్న కుమారుడు బీకాం చేస్తున్నాడు. ఇద్దరు కుమార్తెల వివాహం కాగా ఒకరు చదువుకుంటున్నారు. సయ్యద్ బాకర్ హుస్సేన్ సంపాదించి పంపించే డబ్బుపైనే కుటుంబం ఆధారపడి ఉంది. ఈ నెల 28 ఉదయం 11 గంటలకు దుండగులు గ్యాస్ స్టేషన్‌లోకి చొరబడి కాల్పులు జరిపి, దోపిడీ చేశారు. ఆ సమయంలో గ్యాస్‌స్టేషన్‌లో ఉన్న యజమాని కుమారుడు అర్షద్ వోరా(19), బాకర్ హుస్సేన్‌పై కాల్పులు జరిపారు. అర్షద్ ప్రాణాలు కోల్పోగా, హుస్సేన్ తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను అక్కడి క్రైస్ట్ చర్చి ఆసుపత్రికి తరలించారు. ఆయన ఊపిరితిత్తులు, భుజం వద్ద నుంచి తూటాలు దూసుకెళ్లినట్లు అక్కడి అధికారులు తెలిపారని కుటుంబ సభ్యులు వివరించారు. శస్త్రచికిత్స చేసి వాటిని తొలగించగా ప్రాణాపాయం తప్పిట్లు తప్పింది.

**వీసాలకు దరఖాస్తు చేసుకున్నాం..** సయ్యద్ బాకర్ హుస్సేన్‌ను చూసేందుకు అమెరికాకు రావాలని, ఇందుకు వీసా అందిస్తామని అమెరికా రాయబార కార్యాలయం అధికారులు ఫోన్‌లో తెలిపారని ఆ మేరకు ఇప్పటికే ఆన్‌లైన్‌లో రూ. 10,500 చొప్పున చెల్లించి దరఖాస్తు చేసుకున్నట్లు బాకర్ హుస్సేన్ కుమారుడు ముజఫర్ తెలిపారు. మూడు రోజుల పాటు వరస సెలవులు రావడంతో మంగళవారం(జనవరి 2న) ఉదయం విచారించి, వీసాల ఇస్తారని ముజఫర్ వివరించారు. తల్లిని అమెరికాకు తీసుకెళ్లేందుకు రూ.లక్షల్లో ఖర్చవుతుందని ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కోరారు.

# వీసా కోసం నకిలీ ధ్రువపత్రాలు

## నిందితుల అరెస్ట్

**రెజిమెంటల్‌బజార్:** అమెరికాలో ఓ కాంట్రాక్టు దక్కించుకునేందుకు ఆధార్ సహా అన్నిరకాల గుర్తింపు కార్డులు.. విద్యార్హత ధ్రువపత్రాలు తయారు చేయించి పాస్‌పోర్ట్ పొందిన ఓ వ్యక్తి వీసా పొందేందుకు ప్రయత్నించి పోలీసులకు దొరికిపోయాడు. నిందితుడు సహా నకిలీ ధ్రువపత్రాలు తయారు చేస్తున్న ముఠా సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు, ఉత్తరమండలం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు మీడియాకు వివరాలను వెల్లడించారు. కర్ణాటకకు చెందిన దావూద్ అబ్దుల్ మాజిద్(50) అలియాస్ మ్యానుయేల్‌దేవ్, బెంగళూరులోని వివేక్‌నగర్‌లో నివసిస్తున్నాడు. హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీకి సోలార్ ఎల్ఈడీ సిస్టమ్ సరఫరా చేస్తానని అధికారులను సంప్రదించి అనుమతి తీసుకున్నాడు. ఇందుకోసం యూఎస్‌లోని పెగూసస్ అనే సంస్థను సంప్రదించాడు. ఈ కాంట్రాక్టు దక్కాలంటే తన పేరును మార్చుకోవాలని మాజిద్ భావించాడు. మారేడుపల్లిలో ఉంటూ సుమిత్ రీసెర్చ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో కార్యకలాపాలు నిర్వహించే బైరెడ్డి సతీష్‌రెడ్డి(43)ను సంప్రదించాడు. ఇద్దరూ కలిసి ఈ కాంట్రాక్టును పొందాలని పథకం వేశారు. ఇందుకోసం నకిలీ ఆధార్‌సహా విద్యార్హత ధ్రువపత్రాల్ని తయారు చేయించాడు. ఈ కేసులో వీరిద్దరితోపాటు వెంకట కన్నారావు(37), ఎం.వెంకటాద్రి(39), జయరాములు(43), పరేష్ ప్రభాకర్ కేలాస్కర్ (47), గణేష్(43)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



# మత్తు దించుతారు..!

**(మొదటిపేజీ తరువాయి)** పోలీసుల అనుమతి తీసుకున్నా.. సామర్థ్యం కన్నా ఎక్కువ పాసులు జారీ చేయడం, వాహనాలను రహదారులపైనే ఉంచడం చేస్తున్నారు. ఫలితంగా ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు అర్ధరాత్రి దాటాక మద్యం మత్తులో గొడవలు జరిగేందుకు అవకాశాలున్నాయన్న అంచనాలతో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సికింద్రాబాద్, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, పాతబస్తీ ప్రాంతాల్లోని బార్లు, పబ్బుల సమీపంలో తాత్కాలిక పోలీస్ పికెట్లను ఏర్పాటు చేస్తున్నారు. సైబరాబాద్ పోలీసులు మాదాపూర్, నార్సింగి, గచ్చిబౌలి, మియాపూర్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడిపే వారిని పట్టుకుని వాహనాలను అక్కడికక్కడే స్వాధీనం చేసుకొంటారు.

**మారువేషాల్లో వెళ్లి ...** విందులు, వినోదాల్లో పాల్గొనే యువత స్వేచ్ఛకు భంగం కలగకుండానే పోలీసులు మందుబాబుల ఆగడాలపై కన్నేయనున్నారు. వేడుకల నిర్వాహకులు అసభ్య, అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకొంటారు. తక్షణమే వేడుకలను నిలిపివేస్తారు. ఇందుకోసం కొంతమంది పోలీసులను ప్రత్యేకంగా కేటాయించారు. సంబురాల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ కనిపించేలా సీసీ కెమెరాలను ప్రవేశ, నిష్క్రమణ ద్వారాల్లో అమర్చాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. బాణాసంచా ఉపయోగించకూడదని స్పష్టం చేశారు. ముంబయి పబ్బులో జరిగిన ఘోర ప్రమాదం దృష్ట్యా ఇప్పటికే జోనల్ డీసీపీలు కొన్నిచోట్ల తనిఖీలు చేయించారని కొత్వాల్ వి.వి.శ్రీనివాసరావు తెలిపారు.

### *ట్రాఫిక్ ఆంక్షలు....(ఎన్టీఆర్ మార్గ్... నెక్లెస్ రోడ్)*

● ఖైరతాబాద్ సర్కిల్ నుంచి ఫ్లైవోవర్ మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌వైపు వెళ్లే వాహన చోదకులు రాజ్‌భవన్ రోడ్ మీదుగా వెళ్లాలి.
● ఖైరతాబాద్ నుంచి నెక్లెస్ రోటరీ వైపు వచ్చే వాహనదారులు ఖైరతాబాద్, మీరాటాకీస్ మీదుగా పయనించాలి.
● బీఆర్‌కేఆర్ భవన్ నుంచి ఎన్టీఆర్ మార్గ్‌వైపు వెళ్లే వాహనాలు ఇక్బాల్ మినార్, లక్డీకాపూల్, అయోధ్య మీదుగా వెళ్లాలి. ● మింట్ కాంపౌండ్ నుంచి సచివాలయం రోడ్డును మూసేస్తారు. ● నల్లగుట్ట రైల్వే వంతెన నుంచి సంజీవయ్య పార్కు మీదుగా నెక్లెస్ రోడ్‌పైపు వచ్చే వాహనాలు కర్బలా మైదాన్ లేదా మినిస్టర్ రోడ్ మీదుగా వెళ్లాలి. ● సికింద్రాబాద్ నుంచి వచ్చే వాహనాలు కవాడిగూడ క్రాస్‌రోడ్స్, లోయర్ ట్యాంక్‌బండ్, కట్టమైసమ్మ దేవాలయం మీదుగా వెళ్లాలి.



# ప్రణాళిక.. విజయ వీచిక!

**● అనుభవాలే పాఠాలుగా.. కొత్త ఏడాదిలోకి.. ● సానుకూల దృక్పథంతోనే ఫలప్రదం**

**పాత సంవత్సరానికి వీడ్కోలు చెప్పి.. కొత్త ఏడాదికి ఘనంగా ఆహ్వానం పలికేందుకు భాగ్యనగర వాసులు సిద్ధమవుతున్నారు. కేక్ కటింగ్‌లు, పార్టీలు ప్రత్యేక టూర్లు, ఇలా ఎవరికీ వారు వేడుకల్ని జరుపుకొనేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇదే సంతోషం.. కొత్త ఏడాదంతా.. ఉండాలని కోరుకుంటున్నారా? అందుకు మీరు కొన్ని పనులు మొదలుపెట్టాల్సి ఉంటుంది.**

– న్యూస్‌టుడే, ఘట్‌కేసర్

## సమయసారిణి పాటించాలి



మనం చిన్నతనంలో చదువుకొనే రోజుల్లో పాఠశాలలో పాటించిన సమయసారిణి(టైంటేబుల్) గుర్తుంది కదా. రేపు ఏం తరగతులు ఉన్నాయో చూసుకొని ఇంటికి వెళ్లేవాళ్లం.. దాన్ని బట్టి మర్నాడు సిద్ధంగా వెళ్లేవాళ్లం. ఈ ఏడాదిలో మన గమ్యం.. ఏమేం చేయాలనుకుంటున్నాం.. కొత్తగా ఏం నేర్చుకోవాలనుకుంటున్నాం.. ఎక్కడికి వెళ్లాలనుకుంటున్నాం.. ఇలా తదితర అంశాలతో ఓ ప్రణాళిక రూపొందించుకోవాలి. మీ లక్ష్యాలను, ప్రాథమ్యాలను ఓ కాగితం మీద రాసుకుంటే సరి. దాన్ని మీకు ఎప్పుడూ కనిపించేలా పెట్టుకోవాలి.

## అభివృద్ధి నిరోధకాలను వదిలేద్దాం



కొత్త సంవత్సరం జరుపుకొనే వారిలో 70 శాతం మంది 'రోజూ త్వరగా నిద్ర లేవాలి', కచ్చితంగా అరగంటైనా వ్యాయామం చేయాలి, 'భావోద్వేగాల్ని అదుపులో ఉంచుకోవాలి' 'దుబారా ఖర్చులు చేయొద్దు'.. అని అనుకుంటూ.. కొత్త ఏడాదిలోకి అడుగు పెడతారు. కొందరే ఆచరణలో పెడుతున్నారు. ఈసారి కచ్చితంగా అభివృద్ధి నిరోధకంగా ఉన్న అలవాటును వదిలించుకోవాలని అనుకోండి. అలా ఉత్సాహంగా... ఆత్మవిశ్వాసంతో కొత్త సంవత్సరంలోకి అడుగుపెడదాం.

## ఒకసారి అవలోకనం..



గత ఏడాది తీసుకున్న నిర్ణయాల్ని సరిగా అమలు చేశామా? లేదా? అని చాలా మంది సమీక్షించుకోరు. పైగా.. కొత్త ఏడాదికి ప్రణాళికలను రూపొందించుకుంటారు. ఇది సరికాదు. ఒక్కసారి సమీక్షించుకుంటే. . ఏమేం పూర్తి చేశాం. ఇంకా ఏవేవి మిగిలిపోయాయి అనే అంశాలపై స్పష్టత వస్తుంది. లోపం ఎక్కడ ఉందో స్పష్టమవుతుంది. అప్పుడు మిగిలి పోయిన వాటిని ఈ ఏడాది కొత్త ప్రణాళికలో చేర్చేందుకు అవకాశం ఉంటుంది.

## అదో తృప్తి..



ఇది చలికాలం.. నిలువ నీడలేక ఎంతో మంది అభాగ్యులు ఫుట్‌పాత్‌లు, ప్రయాణ ప్రాంగణాల్లో నిద్రిస్తుంటారు. దుప్పట్లు లేక అవస్థలు పడుతున్న దృశ్యాలు నిత్యం తారసపడుతూనే ఉంటాయి. కొత్త సంవత్సరం వేడుకలకు ఖర్చు పెట్టే మొత్తంలో కొంత సేవకు కేటాయించండి. స్నేహితులు, బంధుమిత్రుల ఇళ్లలో పాత దుప్పట్లను సేకరించండి. పోగైన వాటిని అర్ధరాత్రి సమయంలో చలికి వణికే అభాగ్యులకు డిసెంబరు 31న అందించండి.

## కుటుంబసభ్యులతో గడపండి



కొత్త ఏడాది వేడుకల్ని ఏ పబ్‌లోనో లేదంటే ఏ హోటల్‌లోనో లేక దూరప్రాంతంలోనో జరుపుకోవడానికి ఆసక్తి చూపుతుంటారు. అలాంటి వాళ్లు కనీసం కొత్త ఏడాదిలో మొదటి రోజు పూర్తి సమయాన్ని కుటుంబ సభ్యులకే కేటాయించండి. వీలైతే వారిని నచ్చిన ప్రదేశాలకు విహారయాత్రలకు, లంచ్ లేదా డిన్నర్‌కు తీసుకెళ్లండి.

## కళాంజలిలో బుజ్జాయిలు మెచ్చే వస్త్రశ్రేణి



ఈనాడు, హైదరాబాద్: చిట్టి..పొట్టి.. చిన్నారులకు అనువైనవి.. ఆకట్టుకునేలా ఉండే దుస్తులు వేయాలని తల్లిదండ్రులు కోరుకొంటారు. ఇప్పటి ట్రెండ్‌కు తగ్గట్టు చేనేతలతో పాటు.. అందమైన డిజైన్లతో రూపొందించిన 'ఇండిగో బ్లూ ఫ్యాషనబుల్ జంప్ సూట్లు, ప్రింటెడ్ షార్టులు, ఫ్రాక్‌లు కళాంజలిలో కొలువు దీరాయి. పిల్లలు ఇష్టపడే డిజైన్లు అందుబాటులోకి వచ్చాయి. వివరాలకు www.kalanjali.com, www.facebook.com/kalanjali.com ను సందర్శించండి.

## బొల్లారం రాష్ట్రపతి నిలయం సందర్శన 2 నుంచి

**బొల్లారం(అల్వాల్):** బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలోనికి జనవరి 2 నుంచి సామాన్య ప్రజలను అనుమతి ఇవ్వనున్నారు. 15 వరకు ప్రజల సందర్శనార్థం తెరచి ఉంచనున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అనుమతి ఉంటుంది. నిలయంలో స్వచ్ఛ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చేలా ముందే అవగాహన కల్పించి ప్రవేశకులకు అనుమతి ఇవ్వనున్నట్లు నిర్వహణ అధికారి తెలిపారు. ఏటా రాష్ట్రపతి విడిది అనంతరం నిలయం సందర్శనకు అనుమతి ఇస్తున్న విషయం తెలిసిందే. 2011 నుంచి ఈ సంప్రదాయం మొదలైంది. గతంలో నిలయం సందర్శనకు నిషేధం అమల్లో ఉండేది.

## మొండి బకాయిదారులతో సంక్షోభంలోకి బ్యాంకులు

**బాగ్‌లింగంపల్లి:** మొండి బకాయిదారులతోనే బ్యాంకులు సంక్షోభంలో కూరుకు పోతున్నాయని మాజీ ఎమ్మెల్సీ, ప్రొ. కె.నాగేశ్వర్ అన్నారు. శనివారం రాత్రి సుందరయ్య కళానిలయంలో పట్నం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్ (ఎఫ్ఆర్‌డీఐ) బిల్లును వ్యతిరేకిస్తూ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎఫ్ఆర్‌డీఐ బిల్లుతో డిపాజిటర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆచార్య హరగోపాల్ అన్నారు. రైల్వే సికింద్రాబాద్ డివిజన్ కార్యదర్శి కె.శివకుమార్, ఎస్వై కొండల్‌రావు, ఈవీవీ ఎస్ఎన్‌రాజు, ఐ.రాజుభట్ రవీంద్రనాథ్, వెంకట్రామయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీజీ నరసింహారావు, కామేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్

## కనుల పండువగా కలశయాత్ర

**చార్మినార్, న్యూస్‌టుడే:** ఘాన్సీబజార్‌లోని రాణి సతీమందిరం నుంచి శనివారం సంప్రదాయ కలశయాత్ర కనుల పండువగా సాగింది. ఘాన్సీబజార్, చక్రమంఅడ్డా, మామజుమ్లా పాటక్, హైకోర్టు రోడ్డు, రికాబ్‌గంజ్ నుంచి తిరిగి కలశయాత్ర రాణిసతీమందిరం చేరుకుంది. ఈ కలశయాత్రను తొలుత రాణిసతీమందరిం వద్ద గుల్జార్‌హౌజ్ మాజీ కార్పొరేటర్ విద్యాధర్‌అగర్వాల్ చార్మినార్ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.

# వాళ్లో రకం.. వీళ్లోరకం




- గుత్తేదారు స్వార్థం.. అధికారుల నిర్లక్ష్యం
- మూణ్నాళ్లకే డ్రైనేజీలు ధ్వంసం.. రోడ్లు అస్తవ్యస్తం




**శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే:** వాహనాలు, పాదచారులు రాకపోకలు సాగించాల్సిన రహదారులపై మురుగు పారుతుంది. సాఫీగా వెళ్లాల్సిన మురుగు కాలువలో ఆటంకం ఏర్పడితే దుర్వాసనతో పాటు ఈగలు, దోమలు, పందులు స్వైరవిహారం చేస్తాయి. ప్రజారోగ్యంతో ముడిపడిన మురుగు సమస్య శాశ్వత పరిష్కారం కోసం రూ.లక్షల ప్రజాధనం వెచ్చించి భూగర్భ మురుగు కాలువలను పంచాయతీ అధికారులు నిర్మిస్తున్నారు. గుత్తేదారు స్వార్థం, అధికారుల ఉదాసీనత వెరసి నాసిరకం పనులు చేసి చేతులు దులుపుకొంటున్నారు. గ్రామంలో భవిష్యత్తు జనాభా, నిర్మాణాలను అంచనా వేసి భూగర్భ డ్రైనేజీ నిర్మించాల్సిన ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చిన్న పరిమాణం ఉన్న పైపులు ఉపయోగిస్తుండడంతో మ్యాన్‌హోళ్ల వద్ద పొంగి రోడ్లపై పారుతోంది. ప్రజాధనం మురుగులో పోసిన పన్నీరే కావడమే కాకుండా రహదారులు దెబ్బతింటున్నాయి.

### శంషాబాద్-షాబాద్ రోడ్డంతా మురుగే..

శంషాబాద్-షాబాద్ రహదారిపై శంషాబాద్ బస్టాండ్ నుంచి ప్రియాంక గ్యాస్ కంపనీ వరకు అర కి.మీ మార్గంలో ఏడాది పొడవునా మురుగు పారుతుంది. రెండు వరుసలు ఉన్న ఈ రహదారిని ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.కోట్లు వెచ్చించి సీసీ రోడ్డును నిర్మించారు. ఇరువైపుల పంచాయతీ అధికారులు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. నాసిరకం పనుల కారణంగా మ్యాన్ హోల్స్ ధ్వంసం కావడంతో ప్రధాన రహదారిపై ఏళ్లుగా మురుగు ప్రవహించి రోడ్డు మన్నిక ప్రశ్నార్థకంగా మారింది. మరమ్మతులు చేయాల్సిన పంచాయతీ అధికారులు మా పని కాదన్నట్లు వ్యవహరిస్తున్నారు. వందకు పైగా వ్యాపార సముదాయాలు ఉన్న ఈ రహదారిపై రాత్రి పగలు వాహనాల రాకపోకలతో కిటకిటలాడుతుంది.

### పట్టించుకోని అధికారులు..

అభివృద్ధి పనులను ఇంజినీరింగ్ అధికారులు తప్పకుండా పర్యవేక్షించాలి.. పనులు ప్రారంభం నాటి నుంచి పూర్తి చేసే వరకు నాణ్యతను పరిశీలించాలి. లేని పక్షంలో నాసిరకం పనులతో సమస్య మొదటికొచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో శంషాబాద్‌లోని సాయిబాబాకాలనీలో భూగర్భ డ్రైనేజీని ధ్వంసం చేసి మళ్లీ నిర్మించారు. శంషాబాద్ పాతఠాణా నుంచి ధర్మగిరికి వైపు వెళ్లే సీసీ రోడ్డును రెండోసారి వేయడంతో రూ.కోటికి పైగా ఖర్చయ్యింది. కానీ రెండు మాసాల్లో ఈ దారి దెబ్బతినడంతో స్థానికులు ఫిర్యాదు వరకు గుత్తేదారు మరోసారి మరమ్మతులు చేపట్టారు. ఇటీవలే మధురానగర్ కాలనీ ప్రధాన రహదారిని రెండుసార్లు బాగు చేశారు. ఇలా చేసిన పనిని నాసిరకం పనుల కారణంగా రెండు మూడు నెలలకే మళ్లీ చేస్తుండడం వల్ల ప్రజాధనం వృథా అవుతోంది. మొదటిసారి పనుల చేసేటప్పుడు అధికారులు కఠినంగా వ్యవహరిస్తే ఈ సమస్య ఉండదని స్థానికులు అంటున్నారు.

### మ్యాన్‌హోల్స్ కబ్జాకు గురవుతున్నాయి:

**శ్యాంసుందర్, ఈవో, శంషాబాద్**

రహదారులకు ఆనుకొని ఉన్న మ్యాన్‌హోల్స్‌ను చిరు వ్యాపారులు కబ్జా చేయడంతోనే మురుగు సమస్య తలెత్తుతోందని శంషాబాద్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి శ్యాంసుందర్ తెలిపారు. ఆక్రమణల తొలగింపులో కొందరు నేతలు అడ్డుతగులుతున్నారన్నారు. పంచాయతీలో అరకొర సిబ్బంది ఉండడంతోనే ఆక్రమణదారులు ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నారని అన్నారు. ధ్వంసమైన మురుగు కాలువలను పునరుద్ధరిస్తామని తెలిపారు.

### నడకే నరకమైంది..

మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఆర్బీనగర్ కాలనీకి వెళ్లే ప్రధాన మార్గం మురుగుమయమైంది. ఇక్కడ దుకాణాలు, భవనాలు ఎక్కువ ఉండడం.. భూగర్భ డ్రైనేజీ పైపులు చిన్నవి కావడంతో మ్యాన్‌హోల్స్ పొంగుతున్నాయి. ఈ దారిపై మురుగు నిలవడం, దుర్వాసన వస్తుండడంతో పాదచారులు నడవడమే మానేశారు. వాహనాలు వెళ్లే సమయంలో మురుగు చిమ్మడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇలాంటి రహదారులు మండల కేంద్రంలో కోకొల్లలు.



ఆర్బీనగర్ రోడ్డులో మురుగుతో ఏర్పడిన గుంతలు

## ఆరోగ్య సమస్యలపై సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న అతిథులు

**శంషాబాద్:** మండల కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాల ఆధ్వర్యంలో శనివారం ఆరోగ్య సమస్యలపై అవగాహన కోసం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రొ.చంద్రశేఖర్, ప్రభాకర్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి ఆధునిక యుగంలో అనేక అనారోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటున్నారని, శారీరక శ్రమ, మానసిక ప్రశాంతత లేకపోవడమే ఇందుకు కారణమన్నారు. సైకిల్ వాడడం వలన చాలా ఉపయోగాలు ఉన్నాయన్నారు. ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. సైకిల్ వాడడం వల్ల పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకున్నట్లేనని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి



విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తున్న ఎస్సై వీరేశం

**కాటేదాన్:** దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నాయి... అవగాహన లేక... వేగం, నిర్లక్ష్యం వాహనాదారుల ప్రాణాలు తీస్తున్నాయని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్సై వీరేశం పేర్కొన్నారు. శనివారం మైలార్‌దేవుపల్లి డివిజన్ మధుబన్ శ్రీరామకృష్ణ విద్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు తెలియక యువకులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. బైకుపై ఉంటే హెల్మెట్, కారులో ఉంటే సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. పిల్లలు నిబంధనలు తెలుసుకొని పెద్దలకు తెలియజేయాలని అన్నారు. నిర్వాహకులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అబ్దుల్‌కలాం పార్కు సుందరీకరణకు ఏర్పాట్లు



కాలనీవాసులతో చర్చిస్తున్న ఏడీ యాదగిరి

**నార్సింగి, న్యూస్‌టుడే:** నెక్నాంపూర్ పంచాయతీ అల్కాపూర్ కాలనీలో అబ్దుల్‌కలాం పార్కు సుందరీకరణకు హెచ్‌ఎండీఏ అధికారులు శ్రీకారం చుట్టారు. ఇటీవల హెచ్‌ఎండీఏ కమిషనర్ పర్యటించిన సమయంలో ఇచ్చిన హామీ మేరకు హార్టికల్చర్ ఏడీ యాదగిరి శనివారం కాలనీకి వచ్చి కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో పార్కులో ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాల గురించి చర్చించారు. పార్కు మధ్య అబ్దుల్‌కలాం విగ్రహం, చుట్టూ పూలమొక్కలు, కాలినడక కోసం వాకింగ్‌ట్రాక్, చిన్న పిల్లలు ఆడుకునేందుకు చిన్నప్లేగ్రౌండ్, ఫౌంటెయిన్, పచ్చగడ్డి ఏర్పాటు చేయాలని కాలనీ ప్రతినిధులు సూచించారు. 1.14 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పార్కు స్థలాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని కాలనీ అసోసియేషన్ కార్యదర్శి మనోజ్ కోరారు. మూడు, నాలుగు నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు మనోజ్ తెలిపారు.

## పలువురు ఎస్సైలకు పదోన్నతి

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ ఠాణా ఎస్సై శివప్రసాద్‌కు సీఐగా పదోన్నతి లభించింది. 2007వ సంవత్సరం బ్యాచ్‌కు చెందిన శివప్రసాద్ వివిధ ప్రాంతాలలో ఎస్సైగా పనిచేశారు. రాజేంద్రనగర్ ఠాణాలో 2016 ఏప్రిల్ నెలలో ఎస్సైగా బాధ్యతలు తీసుకున్నారు. సీఐగా సీఐడీ విభాగంలో బాధ్యతలు ఇస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. పదోన్నతి లభించడం పట్ల శివప్రసాద్ సంతోషం వ్యక్తం చేశారు.

**నార్సింగి:** నార్సింగి ఠాణాలో పనిచేస్తున్న ఇద్దరు ఎస్సైలు పదోన్నతి పొందారు. ఎస్‌ఐలు వి.సుధీర్‌కుమార్, డి.వెంకటేశ్‌లు ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి లభించింది. 2008 బ్యాచ్‌కు చెందిన సుధీర్‌కుమార్ వనస్థలిపురం, కూకట్‌పల్లి, సీసీఎస్, నార్సింగిలో పనిచేశారు. అదేబ్యాచ్‌కు చెందిన వెంకటేశం జీడిమెట్ల, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, సీసీఎస్, నార్సింగిలో పనిచేశారు. పదన్నోతి పొందిన ఎస్‌ఐలను ఇన్‌స్పెక్టర్ రమణాగౌడ్, ఎస్‌ఐలు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా పెద్దజీయర్ స్వామి పరంపదోత్సవ వేడుకలు

**శంషాబాద్ గ్రామీణ:** శ్రీరామనగరంలో శనివారం శ్రీ త్రిదండి రామానుజ పెద్దజీయర్ స్వామి పరంపదోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. పంచలోహాలతో దివ్యసాకేతంలో ప్రతిష్ఠించిన పెద్దజీయర్ స్వామి విగ్రహానికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. చినజీయర్ స్వామి, రామచంద్రజీయర్ స్వామి, అహోబిల జీయర్‌స్వామి, దేవనాథ జీయర్‌స్వామి పాల్గొన్నారు. అనంతరం అభిషేకాలు నిర్వహించారు. పెద్ద జీయర్ స్వామి సామాజిక శ్రేయస్సు కోసం, ప్రజలను చైతన్యపర్చడానికి చేపట్టిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిరుపమానమని కొనియాడారు. భారీగా తరలివచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు, మంగళశాసనాలు అందించడంతో తరించారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు



ప్రవచిస్తున్న చినజీయర్ స్వామి

# రాజేంద్రనగర్



## 'టీఎన్‌జీవోస్ కాలనీలో అక్రమార్కులపై చర్యలు'

**కాటేదాన్:** కాటేదాన్ టీఎన్‌జీవోస్ కాలనీలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని సొసైటీ నూతన అసిస్టెంట్ రిజిస్ట్రార్, అడ్మినిస్ట్రేటర్ బి.సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఇక్కడి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తాజాగా 70 అక్రమ నిర్మాణాలను గుర్తించామన్నారు. అన్నింటినీ నేలమట్టం చేస్తామన్నారు. మరోవైపు అక్రమంగా స్థలాలు కొనుగోలు చేసి నిర్మాణాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

# గడువు సమీపిస్తోంది..

# వేగం పెంచండి


మండల పరిషత్ సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ మల్లేష్, అధికారులు

- అభివృద్ధి పనుల పూర్తికి అంతా కృషి చేయాలి: ఎంపీపీ
- మండల సమావేశంలో గ్రామాల సమస్యలపై ఏకరవు

**నార్సింగి, న్యూస్‌టుడే:** గ్రామ పంచాయతీల్లోని పాలకవర్గాల గడువు సమీపిస్తున్న నేపథ్యంలో అభివృద్ధి పనులను వేగం చేయాలని ఎంపీపీ తలారి మల్లేష్ అన్నారు. శనివారం జరిగిన మండల పరిషత్ సమావేశానికి అధ్యక్షత వహించిన మల్లేష్ మాట్లాడుతూ.. నార్సింగిలో నిర్మాణంలో ఉన్న మండల పరిషత్ భవనం త్వరగా పూర్తిచేయడానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఇంజినీరింగ్ అధికారులను కోరారు. గ్రామాల్లో నీళ్ల సంపులకు అవసరమైన స్థలాలను కొన్ని గ్రామాల్లో ఇప్పటివరకు కేటాయించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు విద్యుత్ సమస్యలపై జరిగిన చర్చలో అక్రమ డాక్యుమెంట్లతో తప్పుడు పద్ధతుల్లో ఇంటి అనుమతులు తీసుకొన్న వారికి విద్యుత్ అధికారులు ఎన్‌ఓసీ లేకుండా కనెక్షన్ ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారని, దీంతో పాత డాక్యుమెంట్ కలిగిన నిజమైన యజమానులు ఇబ్బంది పడుతున్నారని సర్పంచి పూలపల్లి కృష్ణారెడ్డి వివరించారు. ఈ విషయంలో పలువురు సర్పంచిలు జోక్యం చేసుకుంటూ రోడ్ల పక్కన ఎలాంటి అనుమతి లేకుండా వేసుకుంటున్న డబ్బాలకు కూడా విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ మల్లేష్ మాట్లాడుతూ.. పంచాయతీ సర్పంచి, కార్యదర్శి నుంచి ఎన్‌ఓసీ లేకుండా విద్యుత్ మీటర్లు ఇవ్వవద్దని అధికారులకు సూచించారు. ఈ విషయమై ఇటీవల మంత్రి హరీష్‌రావుకు వివరించడం జరిగిందన్నారు. దీంతో గ్రామ పంచాయతీ సర్పంచి లేదా కార్యదర్శి సంతకంతో జారీ చేసిన ఎన్‌ఓసీతోనే విద్యుత్ మీటర్లు ఇవ్వాలని తీర్మానించారు. వ్యవసాయ అధికారి ఉదయకుమార్ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, వ్యవసాయ ఆధునికీకరణ పనిముట్ల పథకం గురించి వివరించారు. నార్సింగిలో 20గుంటల స్థలంలో రైతు వేదిక నిర్మాణం చేపడుతున్నామని, గత సెప్టెంబర్‌లో అధిక వర్షాలతో నష్టపోయిన జొన్న, వరి రైతులకు నష్టపరిహారం మంజూరైందని, 15 రోజుల్లో అందజేస్తామన్నారు. ఇంఛార్జి ఈఓపీఆర్డీ సునీత 100 శాతం ఆస్తిపన్ను వసూలుకు చర్యలు తీసుకుంటున్నామని అందరు సహకరించాలన్నారు. కిస్మత్‌పూర్‌లో 200లకుపైగా ఉన్న అక్రమ నిర్మాణాల గురించి డీపీఓ దృష్టికి తీసుకువెళతామన్నారు. ఉపాధిహామీ పథకం సాంకేతిక సహాయకురాలు అనిత మాట్లాడుతూ పాఠశాలల్లో వంటగదులు, మరుగుదొడ్లు, శ్మశానవాటికలు నిర్మిచండానికి ఉపాధి హామీ పథకం అవకాశం కల్పిస్తుందన్నారు. డంపింగ్‌యార్డుల నిర్మాణం కూడా చేపట్టేందుకు అవకాశం ఉందన్నారు. మండలంలో ముందుగా అనుమతి లేకుండా చేపట్టిన రూ.383 లక్షల పనులను ఆమోదించాలని కోరారు. అదేవిధంగా వివిధ గ్రామాలలో చేపట్టేందుకు రూ.377లక్షల పనులను అనుమతించాలని కోరారు. జలమండలి పనులపై మణికొండ సర్పంచి నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ మహేందర్‌గౌడ్ తదితరులు అసంతృప్తి వ్యక్తం చేశారు. నీటి సరఫరా విషయంలో మణికొండకు ప్రత్యేక శ్రద్ధతో ఉన్నామన్నామని జలమండలి అధికారి విజయకుమార్ తెలిపారు. కాళీమందిర్-హిమాయత్‌సాగర్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారిందని ఎంపీటీసీ వేణుగోపాల్ ఫిర్యాదు చేయగా, రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు ఈఎన్‌సీకి పంపినట్లు ఆర్అండ్‌బీ అధికారిణి వివరించారు. సన్‌సిటీ ప్రాథమిక పాఠశాల భవనం స్థలం విషయమై ఎంఈఓ భూపతిరావు ప్రస్తావించగా, ఎంపీటీసీ మహేందర్‌గౌడ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మీ శాఖకు సంబంధించిన పనులకు మీరే బాధ్యత వహించాలని ఆయన అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరమ్మ మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్, ఆయా ఉద్యోగాలకు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు ఆర్.నర్సింహా, సునీతరాజ్‌కుమార్, సంతోషిరెడ్డి, తమోదన్‌రావు, సాయిరాం, ఏఈ గీతాశ్రవంతి, వెంకటశివయ్య, వెంకటేశం, మనోహర్ పాల్గొన్నారు.

## 'దొరల చేతుల్లో తెలంగాణ బందీ అయ్యింది'


మాట్లాడుతున్న ఈఎస్‌ఎన్ రెడ్డి

**శంషాబాద్:** ప్రజలు ఆశించిన తెలంగాణ దొరల చేతుల్లోకి వెళ్లిందని, ప్రజల బాధలు సర్కారు పట్టించుకోవడం లేదని టీ-మాస్ ఫోరం జిల్లా కమిటీ సభ్యులు ఈఎస్ఎన్ రెడ్డి అన్నారు. శంషాబాద్‌లో శనివారం ఫోరం కార్యశాలకు విచ్చేసిన రెడ్డి మాట్లాడుతూ.. మేధావులు, ప్రజా సంఘాలు ఏకమై సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి సాధించుకోవాలన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు కావాలని కోరుకున్నామని అదే ఆశయంతో తెలంగాణ సాధించుకున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం వీటన్నింటిని పక్కన పెట్టిందన్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధే టీమాస్ లక్ష్యమన్నారు. ఎన్.మల్లేశ్, వెంకటేశ్, దేవేందర్, దర్శన్, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## తల్లి, ఇద్దరు పిల్లలు అదృశ్యం




అదృశ్యమైన మహేశ్వరి, ఈశ్వర్, దాసేశ్వర్

**రాజేంద్రనగర్:** ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యమైన సంఘటన రాజేంద్రనగర్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాములు తెలిపిన వివరాల మేరకు.. రాజేంద్రనగర్ మాణిక్యమ్మకాలనీకి చెందిన ఎన్.రమేష్, మహేశ్వరీ దంపతులు. వీరికి ఈశ్వర్(6), దాసేశ్వర్(4) కుమారులు. రమేష్ కూలీ పనిచేస్తుండగా, మహేశ్వరీ రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్డీపీఆర్ వసతిగృహంలో రోజువారి కూలీగా పనిచేస్తోంది. వసతిగృహంలో పనిచేయడంతో పాటు ఇంట్లో అందరికి వెట్టిచాకిరి చేయలేకపోతున్నాననే కారణంతో ఈ నెల 26న ఆమె బయటకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. తన ఇద్దరు కుమారులను వెంట తీసుకొని వెళ్లింది. కుటుంబ సభ్యులు సన్నిహితులు, బంధువుల దగ్గర వాకబు చేశారు. ఆచూకి తెలియకపోవడంతో శనివారం రాజేంద్రనగర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాములు తెలిపారు.

## విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం


జెండా ఎగురవేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

**శంషాబాద్, న్యూస్‌టుడే:** అధ్యయనం, పోరాటం ఇవే ఎస్ఎఫ్ఐ నినాదం అని రంగారెడ్డి జిల్లా ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు ఆనంద్ అన్నారు. శంషాబాద్‌లో శనివారం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవాలను పురస్కరించుకొని జెండా ఎగురవేసి భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై పోరాడే ఏకైక విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ అన్నారు. త్యాగమూర్తులను ఆదర్శంగా తీసుకొని విద్యార్థుల కోసం పనిచేస్తుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడుస్తున్నా దేశంలో ప్రాథమిక విద్యను అందించడంతో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ప్రణయ్, శివాని, ఆఫ్రిన్, ఉదయ్, హర్షిత్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు మంది పేకాటరాయుళ్లు అరెస్టు

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో పేకాట ఆడుతున్న ఆరుమందిని ఎస్‌వోటీ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్‌వోటీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ ఠాణా పరిధి నలందానగర్‌కాలనీలోని ఓ ఇంట్లో ఆరుమంది పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌వోటీ పోలీసులు శనివారం సాయంత్రం ఇంటిపై దాడిచేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మొత్తం రూ.49,190 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అగ్రవాల్‌వికాస్, రోహిత్ అగర్వాల్, కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, హితేష్‌అగర్వాల్, చేతన్‌శర్మలను అదుపులోకి తీసుకొని రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించినట్లు ఎస్‌వోటీ పోలీసులు తెలిపారు.

## తెరాసవి నూతన కమిటీ ఎన్నిక


ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో తెరాసవి నూతన కమిటీ సభ్యులు

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ సర్కిల్ తెరాసవి నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర తెరాసవి ఉపాధ్యక్షులు ముకేష్, హైదరాబాద్ అధ్యక్షులు కె.శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో కమిటీ ఎన్నిక జరిగింది. తెరాసవి రాజేంద్రనగర్ అధ్యక్షులుగా వి.దీపక్, ఉపాధ్యక్షులుగా ఆనంద్, కార్యదర్శిగా ఎండీ ఫజల్‌అలీ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా నరేష్ తదితరులను నియమించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు శనివారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను కలిశారు.

## చిన్నతనం నుంచే సేవా దృక్పథం అలవడాలి


శంషాబాద్ కన్జర్వ్ మిషన్‌లో రవీంద్రభారతి పాఠశాల విద్యార్థులు

**శంషాబాద్:** మండల కేంద్రంలోని క్రిస్టియన్ కన్జర్వ్‌మిషన్‌కు రవింద్రభారతి పాఠశాల విద్యార్థులు దుప్పట్లు, వంట సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు హర్షాసోలంకి మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులు వారు దాచుకున్న నగదుతో వంట సామాగ్రి, దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు పేదలకు సహాయం అందించడం చాలా గొప్ప విషయమన్నారు. సేవా దృక్పథం, నైతిక విలువలు చిన్నతనంలోనే అలవడాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### అనాథలకు విద్యార్థుల చేయూత

**రాజేంద్రనగర్:** అనాథ చిన్నారులకు విద్యార్థులు చేయూతనిచ్చారు. అత్తాపూర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో విద్యార్థులు విరాళాలు సేకరించి అందజేశారు. విద్యార్థులు సేకరించిన డబ్బులతో బహుదూర్‌పురాలోని ఓ అనాథాశ్రమంలో ఉంటున్న చిన్నారులకు దుస్తులు అందజేశారు. చిన్నారులకు సేవాగుణం అలవర్చాలనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పాఠశాల డీన్ అర్చనా సురేష్ తెలిపారు.

## ఆకట్టుకున్న 'యానివర్సరీ రిథమ్స్'



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

**నార్సింగి:** పుప్పాలగూడ గోల్డన్‌టెంపుల్ సమీపంలోని లిటిల్ కాటర్ పిల్లర్స్ చిన్నారులు శనివారం ఫస్ట్ యానివర్సరీ రిథమ్స్-2017 పేరిట నిర్వహించిన కార్యక్రమం ఆకట్టుకుంది. ప్రొ.వకుళాభరణం రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారులను అభినందించారు. ఈ సందర్భంగా స్కూలు విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రతినిధి శ్వేత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

## చైతన్యం తెచ్చేలా తెలుపురంగు దినోత్సవం


టిప్పుఖాన్ బ్రిడ్జి వద్ద ప్లకార్డులతో విద్యార్థులు

**నార్సింగి:** నార్సింగి విశ్వభారతి స్కూలు చిన్నారులు శనివారం ప్రపంచశాంతిని కాంక్షిస్తూ తెలుపురంగు దినోత్సవం జరిపారు. ఈ సందర్భంగా తెల్లని వస్త్రాలు ధరించి, తెల్లని బెలూన్లను, ప్లకార్డులను చేత పట్టుకుని టిప్పుఖాన్ బ్రిడ్జి ఫుట్‌పాత్‌పై కూర్చుని పలువురిని ఆకట్టుకున్నారు. రోడ్డు నిబంధనలు పాటించాలని, తలకు హెల్మెట్ ధరించాలని దారిన వెళ్లేవారికి అవగాహన కల్పించి వారిని చైతన్యం చేసేందుకు ప్రయత్నించారు. హెల్మెట్ ధరించిన వారికి గులాబి పువ్వు అందించి అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సందీప్ శ్రీవాత్సవ, అనిత, శ్రీలక్ష్మి, కవిత నౌషీన్ తదితరులు పాల్గొన్నారు.

# కట్న దాహం.. కబళించెను ప్రాణం

**అత్తింటి వేధింపులకు గర్భవతి బలవన్మరణం** **భర్తతో సహా అత్తింటివారి అరెస్టు**

**అమీర్‌పేట, న్యూస్‌టుడే:** గర్భవతి అన్న దయ మరిచారు. కట్నపు యావతో కాల్చుకుతిన్నారు. కట్నం కోసం భర్తతో సహా అత్తింటివారు పెట్టే ఆరళ్లకు తాళలేక ఓ గృహిణి తనువు చాలించింది. బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏసీపీ రంగారావు ఆ వివరాలు వెల్లడించారు. యాదాద్రి జిల్లా రాజపేట మండలం, పాముకుంటకు చెందిన కె.సత్తయ్య కుమార్తె రేవతి(21)ని బేగంపేట రసూల్‌పురాలోని ఇందిరమ్మనగర్‌కు చెందిన టీస్టాల్ నిర్వాహకుడు కుమార్(28)కు ఇచ్చి 2016 నవంబరు 17న పెళ్లి చేశారు. అదనపు కట్నం కోసం అత్తింటివారు కోడలిని వేధించేవారు. మూడు నెలల గర్భవతి అయిన ఆమెను తల్లి రాములమ్మ పుట్టింటికి తీసుకెళ్లింది. ఈనెల 21న రేవతి తన అమ్మమ్మ బాలమణితో కలిసి అత్తింటికి వచ్చింది. భర్త కుమార్, అత్తా, బావలు కలిసి కట్నం కోసం రేవతితో పాటు బాలమణిని నిలదీశారు. పరుష పదజాలంతో దూషించారు. బాలమణి వెళ్లిపోగానే కోడలిని వేధించడం తీవ్రతరం చేశారు. ఈనెల 29వ తేదీ తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకొని రేవతి ఆత్మహత్యకు పాల్పడింది. రేవతి ఆత్మహత్యకు అత్తింటివారే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపించారు. బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా భర్త కుమార్, బావ వీరయ్య, అత్త వెంకటమ్మలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.


అరెస్టయిన కుమార్, వీరయ్య, వెంకటమ్మ

# చర్లపల్లి ఇందిరమ్మ గృహాల్లో కట్టడి, ముట్టడి

**35 ద్విచక్ర వాహనాలు సీజ్.. అనుమానితుల అరెస్టు**

**చర్లపల్లి, న్యూస్‌టుడే :** నేరాలు చేసి తప్పించుకు తిరుగుతున్న నేరగాళ్లు ఎక్కువ కాలం తప్పించుకోలేరని మల్కాజ్‌గిరి డీసీపీ ఉమమహేశ్వరశర్మ హెచ్చరించారు. శనివారం చర్లపల్లి డివిజన్‌లోని ఇందిరమ్మ గృహకల్పలో తూర్పు జోన్ పోలీసుల ఆధ్వర్యంలో కట్టడి, ముట్టడి చేపట్టి తనిఖీలు నిర్వహించారు. అడిషనల్ డీసీపీ సలీమా, కుషాయిగూడ, మల్కాజ్‌గిరి ఏసీపీలు కృష్ణమూర్తి, సందీప్ నేతృత్వంలో పది మంది సీఐ, 42 మంది ఎస్సైలు, 30 మంది కానిస్టేబుళ్లు కట్టడి, ముట్టడిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో ఇతర రాష్ట్రాలలో నేరాలు చేసిన పలువురు నేరస్థులు నగర శివారు ప్రాంతాల్లో తలదాచుకుంటున్నట్లు నిఘా వర్గాల ద్వారా సమాచారం అందిందన్నారు. దీంతో చర్లపల్లి నగర శివారు ప్రాంతంలోని ఇందిరమ్మ గృహకల్పలోని ప్రతి ఇంటిలో తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 35 ద్విచక్ర వాహనాలతో పాటు మూడు ఆటోలను, రెండు కార్లకు స్వాధీనం చేసుకొని ఆయా వాహనదారులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. ఏడుగురు అనుమానితులతో పాటు మద్యం గొలుసు దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామన్నారు.


తనిఖీల్లో పాల్గొన్న డీసీపీ ఉమమహేశ్వరశర్మ


కాళ్లు విరగడంతో వీల్‌చైర్‌పై వస్తున్న చంద్రశేఖర్

## దివ్యాంగుడిగా తిరిగొచ్చిన గల్ఫ్ వలస కార్మికుడు

**శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే:** ఉపాధి కోసం దుబాయ్ వెళితే.. అక్కడ మోసపోయి.. ప్రమాదం బారిన పడి దివ్యాంగుడిగా తిరిగొచ్చాడు. బాధితుల కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా, సిరిసిల్లకు చెందిన చిలుమూరి చంద్రశేఖర్ ఉపాధి నిమిత్తం 2007లో దుబాయ్ వెళ్లడానికి అప్పు చేసి రూ.1.30లక్షలను ఏజెంట్ చేతిలో పోశాడు. వర్క్ వీసాతో పంపించాల్సిన ఏజెంట్ విజిట్ వీసాపై దుబాయ్ పంపించాడు. భాష రాని చంద్రశేఖర్ దుబాయ్‌లో అక్రమంగా ఉంటూ పదేళ్లు వెట్టి చాకిరి చేశాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 5న పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు భారీ నిచ్చెన మీద పడడంతో చంద్రశేఖర్ కాళ్లు విరిగిపోయాయి. ఆసుపత్రిలో పడేసి యజమాని జారుకోవడంతో నరక యాతన అనుభవించాడు. సమాచారం అందుకున్న మైగ్రేట్ రైట్ కౌన్సిల్ దుబాయ్ కన్వీనర్ జె.శ్రీనివాస్ చొరవ తీసుకొని భారత రాయబార కార్యాలయం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం ఖర్చులు భరించి అతన్ని పంపించడంతో శనివారం శంషాబాద్ విమానాశ్రయంలో దిగాడు. తాను స్వదేశానికి రావడానికి కృషి చేసిన గిరీష్, శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, నర్సింహానాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు.

## చికెన్ ధరలు

| | వెన్‌కాబ్ | సుగుణ |
|---|---|---|
| ఫాంరేటు | 96–00 | 96–00 |
| రిటైల్ | 111–00 | 116–00 |
| డ్రెస్డ్ | 155–00 | 168–00 |
| స్కిన్‌లెస్ | 183–00 | 197–00 |

వెన్‌కాబ్: 9849219870
సుగుణ: 9346589121



# విదేశీ కిక్కు.. నిఘాతో చిత్తు..

- నగరంలో ఖరీదైన మద్యానికి భారీగా డిమాండ్
- ఇంటికే తెచ్చి ఇస్తున్న సరఫరాదారులు
- తనిఖీల్లో పట్టుబడుతున్న రూ.లక్షల సరకు

**రాజేంద్రనగర్, న్యూస్‌టుడే:**

నయాసాల్ వేడుకలకు నగరం సిద్ధమవుతోంది. ఈ ఏడాది చివరి రోజంతా ఆనందంగా గడిపి.. కొత్త సంవత్సరాన్ని సంతోషంగా ఆహ్వానించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు.. ఇలా అందరితో కలిసి వేడుక చేసుకోవాలని ఇప్పటికే ప్రణాళికలు వేసుకుంటున్నారు. అయితే కొందరు ఇందుకు భిన్నం.. నయాసాల్ వేడుకలంటే వారికి కిక్కులో మునగడమే.. అదికూడా ఖరీదైన కిక్కు కావాలి.. అందుకు ఎంత ఖర్చయిన పర్వాలేదు.. సరిగ్గా ఇలాంటి వారినే కొంతమంది దళారులు క్యాష్ చేసుకోవాలనుకున్నారు. పెద్దమొత్తంలో నగరంలో విదేశీ మద్యాన్ని తెచ్చి సరఫరా చేస్తున్నారు.. సముద్ర మార్గంలో దేశంలోకి వస్తున్న విదేశీ మద్యాన్ని నగరంలోని కొత్తమంది అక్రమంగా తీసుకొచ్చి ఏకంగా ఇంటికే తెచ్చి ఇస్తున్నారు.. ఒక్కో మద్యం సీసా ధర రూ.15వేల పైగానే ఉంటుందని సమాచారం. రాజేంద్రనగర్ ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం ఓ వాహనాన్ని తనిఖీ చేయగా.. అందులో భారీగా విదేశీ మద్యం పట్టుబడింది.. విచారించి కూపీ లాగితే.. నగరంలో అక్కడక్కడ పదుల సంఖ్యలో విదేశీ మద్యం సీసాలు లభించాయి. వీటి విలువ రూ.లక్షల్లో ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితులను విచారించిన నేపథ్యంలో పోలీసులకు ఆసక్తికర విషయాలు తెలిసినట్లు ఓ అధికారి తెలిపారు. నయాసాల్ వేడుకలలో విదేశీ మద్యం కోసం నగరంలో చాలా డిమాండ్ ఉందని ప్రస్తుతం పట్టుబడిన మద్యం సీసాలను గుట్టుచప్పుడు కాకుండా నగరంలోని వివిధ ప్రాంతాలకు చేరవేయడానికి నిందితులు సిద్ధమైనట్లు తెలిసింది. చెన్నై నుంచి తెస్తున్న క్రమంలోనే వీరిని పట్టుకోవడంతో గుట్టురట్టయ్యింది. అయితే పోలీసులకు కారులో దొరికిన మద్యం బాటిళ్లు 18కాగా, నిందితుల ఇంటిపై దాడిచేస్తే మరో 56 సీసాలు లభ్యమయ్యాయి. అంటే ఇప్పటికే పెద్దఎత్తున 'సరకు'ను నగరానికి తెచ్చిన నిందితులు చాలామందికి సరఫరా చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. కొత్త సంవత్సర వేడుకలు నిర్వహించడానికి ఒక్కరోజు మాత్రమే మిగిలి ఉండటంతో ఈపాటికే పెద్దఎత్తున విదేశీ మద్యం నగరానికి చేరినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

***భారీగా ఆర్డర్లు..!***

విదేశీ మద్యానికి నగరంలో భారీ డిమాండ్ ఉన్నట్లుగా పోలీసుల విచారణలో వెల్లడయ్యింది. కొత్త సంవత్సరమే కాదు నగరంలో డబ్బున్న వారు ఎలాంటి పార్టీలు చేసినా ఇలాంటి మద్యానికి భారీ ఆర్డర్లు వస్తున్నట్లు మద్యం సరఫరాదారులు చెబుతున్నారు. వారం ముందే చెబితే.. అక్రమంగా మద్యం బాటిళ్లను తీసుకొచ్చి సరఫరా చేస్తున్నారు. గతంలో ఒకరిద్దరు బడాబాబులు మాత్రమే ఆర్డర్లు ఇచ్చేవారని.. ఇటీవల విదేశీ మద్యానికి డిమాండ్ పెరగడంతో కొందరు ఏకంగా దీన్ని వ్యాపారంగా మార్చుకున్నారని పోలీసుల విచారణలో వెల్లడయ్యింది. ఇలాంటి వారికి క్రమం తప్పకుండా సరఫరా చేస్తూ అక్రమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. తమకు నమ్మకమైన వారికి మాత్రమే ఇచ్చి.. విషయం బయటకు పొక్కకుండా వ్యాపారం నిర్వహిస్తున్నారు. ప్రతి నెల రూ.లక్షల్లోనే ఈ వ్యాపారం సాగుతోంది. ఈ కొత్తరకం దందాను గుర్తించడం పోలీసులకు కష్టతరంగానే మారింది. నయాసాల్ వంటి వేడుకల సమయంలో భారీగా డిమాండ్ ఉండటంతో పెద్ద ఎత్తున మద్యాన్ని తీసుకువస్తున్న నేపథ్యంలో పోలీసులకు పట్టుబడ్డారని.. సాధారణ రోజుల్లోనూ వీటి విక్రయాలు భారీగానే ఉన్నా.. సరఫరాదారులను గుర్తించి సరకును పట్టుకోవడం కష్టమేనని పోలీసులే అంటున్నారు.



## హోటల్‌పై నుంచి దూకి బాలుడి ఆత్మహత్య

**నారాయణగూడ, న్యూస్‌టుడే:** రాత్రి వేళ విధులు ముగించుకొని, తోటి కార్మికులు, బంధువులతో కలిసి సరదాగా కబుర్లు చెబుతూ.. వారంతా చూస్తుండగానే.. ఓ బాలుడు తాజ్‌మహల్ హోటల్ (నారాయణగూడ) ఐదో అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా వెలుగుచూసిన సంఘటన నారాయణగూడ పోలీసు ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ బి.రవీందర్, ఎస్సై దయాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన లాచయ్య పాత్ర (17) వారం రోజుల క్రితం హైదరాబాద్‌కు వచ్చాడు. తన బంధువులు, స్నేహితులు పని చేస్తున్న నారాయణగూడలోని తాజ్‌మహల్‌లో హోటల్‌లో టేబుళ్ల శుభ్రం చేసే పనిలో కుదిరాడు. శుక్రవారం ఒంట్లో నలతగా ఉందని, కాస్సేపు విశ్రాంతి తీసుకుంటున్నాని లాచయ్య హోటల్‌లోని ఐదో అంతస్తులో కార్మికుల కోసం కేటాయించిన వసతి గృహంలోకి వెళ్లాడు. సాయంత్రం విధులు ముగించుకొని వచ్చిన తన తోటి స్నేహితులు, బంధువులతో కలిసి సరదాగా కబుర్లు చెబుతూనే లేచి నెమ్మదిగా వెళ్లి.. ఆ తర్వాత ఒక్కసారిగా పరుగు అందుకుని హోటల్ అయిదంతస్తుల నుంచి దూకేశాడు. గాంధీ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. హోటల్ యజామాన్యం మాత్రం విషయాన్ని గోప్యంగా ఉంచింది. శుక్రవారం రాత్రి 3:30 గంటలకు (శనివారం తెల్లవారుజామున) నారాయణగూడ పోలీసులకు సమాచారం అందింది. కేసు విచారణ మొదలుపెట్టారు. ఇంటిపై బెంగ పెట్టుకుని ఇలా చేసి ఉంటాడని కార్మికులు, బంధువులు వివరించినట్లు ఎస్సై దయాకర్ రెడ్డి తెలిపారు. బాలున్ని పనిలో పెట్టుకున్న హోటల్‌పై విచారణ చేపట్టారు. హోటల్ యాజమాన్యం లాచయ్యకు 18ఏళ్లు అని చెబుతుండగా.. ఆధార్ కార్డుపై మాత్రం 17 ఏళ్లుగా ఉన్నట్లు తెలిసింది.

## అక్రమ నిర్మాణాలను మీరే ప్రోత్సహిస్తున్నారు


**జీహెచ్ఎంసీ అధికారుల తీరును ఆక్షేపించిన హైకోర్టు**

**ఈనాడు, హైదరాబాద్:** 'పొందిన అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారికి అనుకూలంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం సెక్షన్ 452 ప్రకారం నోటీసులిచ్చి చేతులు దులుపుకుంటున్నారు. నిర్మాణదారు సివిల్ కోర్టులను ఆశ్రయించి అనుకూలంగా ఉత్తర్వులు పొంది నిర్మాణ పనుల్ని యథావిధిగా కొనసాగిస్తున్నారు.' అని హైకోర్టు వ్యాఖ్యానించింది. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో సివిల్ కోర్టులను ఆశ్రయించి అలా ఉత్తర్వులు పొందిన కేసుల జాబితాను సమర్పించాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించింది. అక్రమ నిర్మాణాల నియంత్రణకు తీసుకోబోతున్న కార్యచరణ ప్రణాళికను న్యాయస్థానం ముందు ఉంచాలని కమిషనర్‌ను ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరామ్ ఈ మేరకు ఇటీవల మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. విచారణను జనవరి 3కు వాయిదా వేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఓ నిర్మాణ వివాదంపై హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. ఈ వ్యాజ్యం విచారణ సందర్భంగా అధికారులు నిర్మాణదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే విషయం న్యాయమూర్తి దృష్టికి వచ్చింది. దీనిపై న్యాయమూర్తి ఆగ్రహించారు. 'నిర్మాణ పనుల్లో అధికారులు జోక్యం చేసుకోరాదంటూ' రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోని సివిల్ కోర్టుల నుంచి ఉత్వర్వులు పొందిన ప్రైవేటు వ్యక్తుల జాబితాను తమ ముందు ఉంచాలని ఆదేశించారు.


నెహ్రూ జూపార్కులో సందర్శకుల కోసం అందుబాటులోకి తెచ్చిన బ్యాటరీ వాహనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. చిన్న మరమ్మతులు చేయలేక ఇలా మూలన పడేయడంతో అవి తుప్పు పట్టిపోతున్నాయి.

# ఎంఎన్‌జేలో సైబర్‌నైఫ్

- చిన్న కేన్సర్ కణుతులకు అత్యాధునిక చికిత్స
- ప్రత్యేకంగా ఏడు ఆపరేషన్ల థియేటర్లు
- రూ.30 కోట్ల కేంద్ర నిధులతో ఏర్పాటు


ఆధునిక సైబర్‌నైఫ్ యంత్రం

ఈనాడు, హైదరాబాద్

కేవలం కార్పొరేట్ ఆసుపత్రులకు మాత్రమే పరిమితమైన అత్యాధునిక కేన్సర్ వైద్యం కొత్త సంవత్సరంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎంఎన్‌జే కేన్సర్ ఇనిస్టిట్యూట్‌లో అందుబాటులోకి రానుంది. దాదాపు రూ.13 కోట్లతో ఈ రేడియన్ యంత్రం సమకూర్చుకోనున్నారు. దీనికి అనుసంధానంగా ప్రత్యేకంగా ఏడు ఆధునిక ఆపరేషన్ థియేటర్లు కూడా సిద్ధం చేయనున్నారు. కొత్త ఏడాదిలో పేద రోగులకు ఈ ఆధునాతన సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళిక సిద్ధమవుతోంది. కేన్సర్ చికిత్సలో రేడియన్ అనేది చాలా కీలకమైన ప్రక్రియ. కొన్నిసార్లు రేడియన్ దాటికి కేన్సర్ కణితి పక్కనే ఉన్న ఆరోగ్యవంతమైన కణాలు కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది. దీంతో అనేక రకాల ఇతర శారీరక రుగ్మతలు వచ్చే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో రేడియన్ చికిత్స కోసం ఆధునిక సాంకేతికత వినియోగిస్తుంటారు. ఇప్పటికే ట్రూబీమ్ యంత్రం ఎంఎన్‌జేకు సమకూరింది. దీంతో కేవలం కేన్సర్ కణుతులను మాత్రమే లక్ష్యంగా రేడియన్ చేసేందుకు వీలు ఏర్పడుతోంది. ఒకప్పుడు కేన్సర్‌కు 20-30 సిటింగ్‌ల్లో రేడియన్ చికిత్స చేసేవారు. ట్రూబీమ్ యంత్రం అందుబాటులోకి వచ్చిన తర్వాత ఆరేడు సిటింగ్స్ లోనే రేడియన్ ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. సాధారణంగా పేద కేన్సర్ రోగులు ఎక్కువ మంది ఎంఎన్‌జేకు వస్తుంటారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఒడిశా, బెంగాల్, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి ఇక్కడ చికిత్స కోసం విచ్చేస్తుంటారు. ఇలాంటి వారందరికీ ట్రూబీమ్ చికిత్స అందుబాటులో ఉంటుంది. పేదలకు ఉచితంగా చికిత్స చేస్తున్నారు. ఎలాంటి కార్డులు లేనివారికి నామమాత్రపు ఛార్జీలతో రేడియన్ థెరపీ అందిస్తున్నారు. ట్రూబీమ్ కోసం కార్పొరేట్ ఆసుపత్రులు ఒక్కో సిట్టింగ్‌కు రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నాయి. అదే ఎంఎన్‌జేలో కేవలం రూ.3-4 వేలకే అందిస్తున్నారు. ఇంతకంటే అనేక రెట్లు ఆధునిక చికిత్స అందించడంలో సైబర్‌నైఫ్ ముందుంటుంది. 2-3 సెంటీమీటర్లు ఉన్న కేన్సర్ కణుతులకు రేడియన్ ఇవ్వడం చాలా కష్టం. సైబర్‌నైఫ్ ద్వారా సులువుగానే ఈ చికిత్స చేయవచ్చు. ముఖ్యంగా మెదడులోని కణుతులకు ఈ సైబర్‌నైఫ్ సాంకేతికతతో చికిత్స అందవచ్చునని ఎంఎన్‌జే ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఎన్.జయలత తెలిపారు.


డాక్టర్ ఎన్.జయలత

### ఒక్కో అవయవానికి ఒక్కో థియేటర్...

సైబర్‌నైఫ్ చికిత్సకు అనుసంధానంగా ప్రత్యేక ఆపరేషన్ థియేటర్లు రానున్నాయి. గైనిక్, హెడ్అండ్‌నెక్, న్యూరాలజీ, ఆర్థోపెడిక్, ప్లాస్టిక్ సర్జన్, సర్జికల్ కేన్సర్లకు చికిత్స కోసం ఆధునిక థియేటర్లు సిద్ధం చేయనున్నారు. ఇలాంటి థియేటర్లు ఇప్పటి వరకు టాటా మెమోరియల్ కేన్సర్ ఇనిస్టిట్యూట్‌లో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో కేన్సర్ ఆసుపత్రిలో తొలిసారి అందుబాటులోకి రానున్నాయి. పేద కేన్సర్ రోగులకు వెసులుబాటు కలుగుతుంది. లక్షల విలువైన వైద్యం ఉచితంగా పేదలకు అందించడానికి మార్గం సుగమం కానుంది.

### రూ.12 కోట్లతో పెట్‌స్కాన్

కేన్సర్ కణుతులను గుర్తించడంలో ఆధునికత స్కానింగ్ యంత్రం కూడా కొత్త ఏడాదిలో ఎంఎన్‌జేలో ఏర్పాటు కానుంది. రూ.12 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో అందుబాటులోకి తేనున్నారు. ఇటీవలే అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు(ఏఈఆర్‌బీ) బృందం ఆసుపత్రిని పరిశీలించింది. కొన్ని మార్పులు సూచించింది. ఆ మేరకు రెండోసారి కూడా నివేదిక పంపామని డైరెక్టర్ డాక్టర్ జయలత చెప్పారు. త్వరలో ఏఈఆర్‌బీ ధ్రువీకరణ వచ్చే అవకాశం ఉందన్నారు. వెనువెంటనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అక్కడికి 2-3 నెలల్లో సేవలు అందించనున్నారు. ఆధునిక పెట్‌స్కాన్ ద్వారా రోజూ 20-30 స్కానింగ్‌లు చేయవచ్చు. శరీరంలో ఎక్కడ చిన్న సైజు కేన్సర్ కణుతులు ఉన్న తెలిసిపోతుంది. ఏఏ భాగాలు పాకిందో కూడా చెప్పవచ్చు. చికిత్స అనంతరం ఇంకా ఎక్కడైనా కేన్సర్ కణుతులు ఉన్నాయా? పూర్తిగా పోయాయా? అనే విషయం కూడా ఈ స్కాన్ ద్వారా ఇట్టే గుర్తించవచ్చునని డాక్టర్ జయలత చెప్పారు. కేవలం ఎంఎన్‌జేకు వచ్చే రోగులే కాదు... ఉస్మానియా, గాంధీ, నిలోఫర్‌కు వచ్చే రోగుల్లో అవసరమైన వారికి ఇక్కడ ఉచితంగా పెట్‌స్కాన్ చేయవచ్చు.



వంటకాన్ని రుచి చూస్తున్న సంజయ్ తుమ్మ, పోటీలో పాల్గొన్న మహిళ

## ఫుడ్ బజార్ వంటల పోటీలు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఫుడ్ బజార్ జెన్ నెక్స్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వంటల పోటీ కార్యక్రమం శనివారం పంజాగుట్టలోని హైదరాబాద్ సెంట్రల్‌లో జరిగింది. న్యాయనిర్ణేతగా 'వారెవ్వా' ఫేమ్ సంజయ్ తుమ్మ వ్యవహరించారు. ఘుమఘుమలాడే హైదరాబాదీ బిర్యానీ వండటంలో నైపుణ్యం ఉన్నవారి నుంచి దరఖాస్తులు స్వీకరించి 15 మందిని చివరి పోటీకి ఎంపిక చేశారు. ఫ్యూచర్ రిటైల్ లిమిటెడ్ మార్కెటింగ్ ప్రతినిధి దేబ్‌రూప్ చటర్జీ మాట్లాడుతూ.. ఫుడ్ బజార్ జెన్ నెక్స్ట్ ఎప్పుడూ వినియోగదారులు పాలుపంచుకునేలా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందని అన్నారు.

## డాక్టర్ రఘురాంకు సోషల్ సర్వీసు అవార్డు


అవార్డును స్వీకరిస్తున్న డాక్టర్ రఘురాం

ఈనాడు, హైదరాబాద్: వైద్య రంగంలో విశేష సేవలు అందించినందుకు ఉషాలక్ష్మి రొమ్ము క్యాన్సర్ ఫౌండేషన్ సీఈవో, డైరెక్టర్ డాక్టర్ పి.రఘురాంను 2017 సోషల్ సర్వీసు అవార్డు వరించింది. జైపూర్‌లోని బి.ఎం.బిర్లా సైన్స్ అండ్ టెక్నాలజీ సెంటర్‌లో జరిగిన 77వ భారతీయ శస్త్ర చికిత్స వైద్యుల సంఘం (అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా)లో రాజస్థాన్ ప్రధాన కార్యదర్శి అశోక్ జైన్ చేతుల మీదుగా ఈ అవార్డును స్వీకరించారు. రొమ్ము క్యాన్సర్ చికిత్సలో డాక్టర్ రఘురాం రెండు తెలుగు రాష్ట్రాల్లో విశేష సేవలు అందిస్తున్నారు.

## 7 నుంచి దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శన


మాట్లాడుతున్న శ్రీవత్సకోట

నాంపల్లి, న్యూస్‌టుడే: సికింద్రాబాద్‌లోని సెయింట్ ప్యాట్రిక్స్ హైస్కూల్‌లో 2018 జనవరి 7నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని హైదరాబాద్ జిల్లా స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ శ్రీవత్సకోట సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రదర్శన ఏర్పాట్లపై ఇంఛార్జి డి.ఇ.ఓ సత్యనారాయణ రెడ్డితో కలిసి శనివారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీవత్సకోట మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నగరంలో ఆరు రోజుల పాటు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి నుంచి దాదాపు 650 మంది విద్యార్థులు పాల్గొంటారని వివరించారు. జలమండలి జీఎం సుదర్శన్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ శైలజ, ఆర్అండ్‌బి డీఈ రవీంద్రమోహన్, విద్యుత్ శాఖ ఎస్ఈ మాధవరెడ్డి, ఆర్టీసీ మేనేజర్ కె.బి.వి.రెడ్డి, సమాచార శాఖ ఏడీ రమాదేవి, జిల్లా సైన్స్ అధికారి ప్రభాకర్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఆబీఐ ప్రతినిధి నరసింహా మూర్తి

## లొంగిపోయిన నేరస్థులకు వృత్తివిద్యల్లో శిక్షణ

ఆసిఫ్‌నగర్: మల్లేపల్లి, అఫ్జల్‌సాగర్, మాంగార్‌బస్తీల్లో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధి కేవీవీ నరసింహా మూర్తి, ఇతర అధికారులు పర్యటించారు. బస్తీకి చెందిన 40 మంది నేరస్థులు ఇటీవల పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరికి పునరావాసం కల్పించడంలో భాగంగా ఈ బృందం ఇక్కడ పర్యటించింది. ప్రజల ఆసక్తి మేరకు వృత్తి కోర్సుల్లో శిక్షణ ఇప్పించి, రుణాలు ఇచ్చే ఏర్పాట్లు చేస్తామని మూర్తి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో వసతుల కల్పన, కుర్చీలు, బెంచీలను ఏర్పాటు చేస్తానని లయన్స్ క్లబ్ ప్రతినిధి కమల్ కుమార్ తెలిపారు. హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ మధుకరస్వామి, లయన్స్ ప్రతినిధులు విద్యాభూషణ్, ఆనంద్‌రాణా, హరి తదితరులు పాల్గొన్నారు.

### కుల ధ్రువీకరణ పత్రాల పంపిణీ...

మాంగార్‌బస్తీ ప్రజలు ఎస్సీ జాబితాలోని మాంగోడి కులానికి చెందిన వారు. ఈ కులానికి చెందిన ధ్రువీకరణ పత్రాలను పొందేందుకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ మధుకర స్వామి, ఆర్డీవో చంద్రకళ, ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారం క్రితం దరఖాస్తులు చేయగా, విచారణ జరిపి 40 మందికి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. ఈ పత్రాలను పోలీసులు ప్రజలకు అందజేశారు.

## నిమ్స్‌కు రూ.10లక్షల విలువైన పరికరాల వితరణ

పంజాగుట్ట, న్యూస్‌టుడే: గుండె జబ్బుల్లో వినియోగించే క్యాథటర్స్ తదితర ఉపకరణాలను ప్రవాస భారతీయుడు, అమెరికన్ కార్డియోలజిస్ట్ డా.శ్రీకర్ వీరారెడ్డి శనివారం నిమ్స్ డైరెక్టర్ డా.మనోహర్‌కు అందజేశారు. రూ.10 లక్షల విలువైన పరికరాలు పేదల కోసం వినియోగించాలని కోరారు. వరంగల్ జిల్లాకు చెందిన చిన్నమాదూరు గ్రామవాసి డా.శ్రీకర్ వీరారెడ్డి డైరెక్టర్ మనోహర్ సమక్షంలో నిమ్స్ గుండె జబ్బుల విభాగాధిపతి డా.సాయి సతీష్ యూనిట్ సెకండ్ హెడ్ డా.శ్రీనివాస్ తదితరులకు అప్పగించారు. సొంత రాష్ట్రానికి సేవ చేయాలనే భావనతో విజయ ప్రాజెక్ట్ ద్వారా ఈ పరికరాలను అందచేసినట్లు శ్రీకర్ వీరారెడ్డి, అతని కుమారులు పూజవీరా రెడ్డి, అంజలి, అతని తండ్రి వీరారెడ్డి తెలిపారు. పరికరాలను అందించినందుకు నిమ్స్ డైరెక్టర్ డా.మనోహర్ కృతజ్ఞతలు తెలిపారు. నిమ్స్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అనుసంధాన అధికారి డా.మర్రి రమేష్, నిమ్స్ పరిపాలన విభాగాధికారి డా.కృష్ణారెడ్డి తదితరులు వీరారెడ్డిని అభినందించారు.



## ప్రపంచ నంబర్ వన్ లక్ష్యం

ఒలింపిక్స్‌లో మెరిసిన తెలుగుతేజం పి.వి.సింధు. పతక సాధనతో కోట్లాదిమంది యువతకు స్ఫూర్తిదాయకమైంది. జయాపజయాలకు అతీతంగా సాధన చేస్తే ఎవ్వరైనా విజేతలు కాగలరని నిరూపించిన అమ్మాయి సింధు. 2017లో రెండు సూపర్ సిరీస్‌లను సొంతం చేసుకున్నారు. మరో రెండింటిలో ఫైనల్ చేరగలిగారు. భారతదేశ ప్రతిష్ఠను మరింతగా పెంచారు. శ్రమ ఒక్కటే ఫలితాన్ని.. కాలాన్ని మార్చగలదని అంటున్నారు పి.వి.సింధు. బ్యాడ్మింటన్‌లో ప్రపంచ నంబర్‌వన్ కావడమే లక్ష్యంగా తాను సాధన చేస్తున్నట్లు చెప్పారు. కుటుంబ సభ్యులతో కలసి ఉండటమే ఆనందం అంటున్నారు. కొత్త ఏడాది సంబరాలను అందరి మధ్య చేసుకోవాలని.. అవకాశం చిక్కితే పదిమందికి సహాయపడే కార్యక్రమంలో పాల్గొనాలని అనుకుంటున్నట్లు వివరించారు.

## సప్తగిరి ఎల్‌ఎల్‌బీ.. మరచిపోలేనిది



నవ్వులు పండిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్న నటుడు సప్తగిరి. పలు సినిమాలలో తన నటనతో ప్రత్యేకతను చాటుకున్నారు. కథానాయకుడుగా మారి రెండు హిట్లు అందుకున్నారు. ఈ ఏడాది సప్తగిరి ఎల్‌ఎల్‌బీ విజయం జీవితాంతం గుర్తుంచుకునే జ్ఞాపకం అంటున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల జరిగే అనర్థాలను చెబుతూనే రైతుల గురించి ప్రస్తావించడం అందరి అభినందనలు అందుకునేలా చేసిందన్నారు. పార్లమెంట్ సభ్యులు మురళీమోహన్ స్వయంగా.. మంచి సినిమా తీశారు సప్తగిరి అని తనను ప్రశంసించడాన్ని గుర్తుచేసుకున్నారు. కష్టపడుతూ ముందుకెళితే వందశాతం ఫలితాలు వస్తాయని నమ్ముతానన్నారు. కొత్త ఏడాదిలోనూ అదే సూత్రాన్ని అమలు చేస్తామన్నారు. వచ్చే ఏడాది రెండు సినిమాలు తీయాలనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. నూతన సంవత్సరం ఆనందంగా ఉండాలని మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని సూచించారు.

## మారాలనుకుంటే సాధ్యమే

- డిసెంబరు 31 తీర్మానాలు పాటిద్దాం
- సర్వేలు చెబుతున్న వాస్తవాలు గమనించండి


ఈనాడు, హైదరాబాద్

నెలరోజుల ముందుగానే ప్రణాళిక.. సిట్టింగ్ ఎక్కడ.. ఎంత మోతాదులో తాగాలి.. అనంతరం ఇల్లు చేర్చే బాధ్యత ఎవరు స్వీకరించాలి.. ఇదీ కొందరు సగటు ఉద్యోగుల ఆలోచనలు. బ్రహ్మచారులైతే.. ఇంటి యజమాని లేని గదులు ఎంచుకుంటారు. ఉద్యోగులైతే.. భార్య పుట్టింటికి చేరిన సహచరుడి గూటికి చేరతారు. సరదారాయుళ్లు.. కుర్రకారు పబ్‌లు.. పార్టీల్లో మునిగి తేలేందుకు సిద్ధపడతారు. ఇదీ హైదరాబాద్ మహానగరంలో ఏటా డిసెంబరు 31 రాత్రి గడిపేందుకు ఎంచుకునే ప్రదేశాలు.. దిల్లీకి చెందిన మనస్తత్వ నిపుణుడు ఒకరు డిసెంబరు చివరిరోజు చెడు అలవాట్లు ఇకపై మానేస్తామంటూ తీసుకునే నిర్ణయాలపై కొన్ని నగరాల్లో సర్వే నిర్వహించారు. ఆ వివరాలు ఏంటంటే.. అర్ధరాత్రి పూటుగా చుక్కేసి... అతిగా తినేసి రేపటి నుంచి రోజూ వాకింగ్ చేద్దాం. మందు మానేద్దాం. సిగరెట్ జోలికి వెళ్లవద్దని నిర్ణయించుకుంటారు. మూడురోజులు ఏదోవిధంగా హమ్మయ్యా అంటూ నెట్టుకు వస్తారు. నాలుగోరోజు నుంచి మళ్లీ పాతదారిలోనే వెళతారంటూ సర్వే సారాంశం, బెంగళూరు, హైదరాబాద్, దిల్లీ, పుణె తదితర నగరాల్లో సుమారు 400-500 మంది గతేడాది డిసెంబరు 31 నిర్ణయాలు తీసుకున్న ఉద్యోగులు, వృత్తి నిపుణుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. వారినే మరో వారం తరువాత నిర్ణయాలకు కట్టుబడిన వారు ఎంతమంది ఉంటారని సంప్రదిస్తే కేవలం 10-15శాతం మాత్రమే అని నిర్ధారించారు. వీరిలో అధికశాతం చిరుద్యోగులే కావడం విశేషం. తిరిగి పాత అలవాట్లకు మళ్లడానికి ఆర్థిక ఇబ్బందులు, కుటుంబసమస్యలను కారణాలుగా వివరించడం గమనార్హం.



### గప్‌చుప్.. గోవా ట్రిప్

మజా ఆస్వాదించేందుకు ఇక్కడ ఎన్ని హంగులున్నా.. యువత, సంపన్నవర్గాలు, ఎగువ మధ్యతరగతి కుటుంబాలు నయాసాల్ వేడుకలకు ఇతర ప్రాంతాలకు చేరుతున్నారు. యువత తొలి ప్రాధాన్యం గోవా, కేరళకు ఇస్తున్నట్లు ట్రావెలింగ్ ఏజెన్సీ తెలిపింది. దిల్లీ, ముంబయి, కోల్‌కతా, బెంగళూరు, పుదుచ్చేరి, విశాఖపట్టణం తదితర ప్రాంతాలకు కూడా నగరం నుంచి భారీగా వెళ్తారని ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. శీతాకాలం మంచు కురిసే సమయంలో ప్రకృతి ఒడిలో ఆనందంగా గడిపేందుకు కశ్మీర్, కులుమనాలి వంటి ప్రాంతాలకు వెళ్లేవారి సంఖ్య రెండేళ్లుగా పెరిగినట్లు తేల్చారు. 6-7శాతం మలేషియా, సింగపూర్, దుబాయ్, హాంకాంగ్, మాల్దీవులు, శ్రీలంక తదితర దేశాలకు వెళ్తున్నట్లు ట్రావెల్ ఏజెంట్స్ పేర్కొన్నారు.




ఈనాడు, హైదరాబాద్

**బోలెడు జ్ఞాపకాలు.. ఎన్నో విజయాలు.. మరెన్నో పరాజయాలు.. మరచిపోలేని అనుభవాలు మిగిల్చిన 2017కు ప్రపంచం వీడ్కోలు చెప్పబోతోంది. కోటి ఆశలతో కలల తీరం చేర్చేందుకు రాబోతున్న 2018కు స్వాగతం పలకనుంది. ఏడాది తొలిరోజున ఆనందంగా గడిపేందుకు ఇప్పటికే యువత సిద్ధమైంది. కొత్త ఏడాదిలో తాము సాధించాల్సిన విజయాలు.. చేరాల్సిన లక్ష్యాలకు పదును పెడుతోంది. గత అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాలను మెట్లుగా మలుచుకుని ముందుకు సాగుదామనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పండుగ వాతావరణంలో సరదాలను ఆస్వాదిస్తూనే.. ఆనందాలను పంచుకుంటాం అంటున్నారు యువతీ యువకులు. మద్యం మత్తులో రోడ్లపైకి చేరి ఆడిపాడటమే సంతోషం కాదని.. చుట్టూ ఉన్నవారికి సాయం చేయడం కూడా ఉత్సవమే అంటున్నారు. గత ఏడాది తాము సాధించిన లక్ష్యాలు.. భవిష్యత్‌పై తమ నమ్మకాలకు.. కొత్త ఏడాది వేదిక కాబోతోందంటూ.. 'ఈనాడు' ఎదుట తమ అంతరంగాన్ని ఆవిష్కరించారు.**

### బిగ్‌స్టార్‌తో సినిమా

**- సందీప్‌రెడ్డి వంగా, సినీ దర్శకుడు**



పట్టుపట్టరాదు పట్టి విడువరాదనే తీరుతోనే తాను విజయాన్ని సాధించానంటారు సినీ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా. తొలి సినిమా అర్జున్‌రెడ్డితో బ్లాక్‌బస్టర్ సాధించారు. సహాయ దర్శకుడిగా వచ్చిన తనకు గెలుపు సాధించేందుకు ఏడేళ్లు పట్టిందన్నారు. సహనం ఆయుధంగా అవకాశం వచ్చేంత వరకూ ఎదురుచూడటం అలవాటు కావాలని యువతకు సూచిస్తున్నారు. ఈ ఏడాది అందుకున్న హిట్ మరచిపోలేని జ్ఞాపకంగా మిగిలిందన్నారు. సానుకూల ఆలోచనలతో సాగితే విజేతలు కాగలమని చెప్పారు. కొత్త ఏడాది పెద్ద ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నట్లు వివరించారు. కొన్ని కథాచర్చలు జరుగుతున్నాయని, పెద్ద హీరోతో సినిమా చేయబోవడం 2018 ప్రత్యేకతగా పేర్కొన్నారు.

### పట్టుదలతో మరిన్ని పతకాలు

**- లావణ్య, వెయిట్ లిఫ్టర్**



నిర్దేశిత ప్రణాళిక ప్రకారం జాతీయస్థాయి పోటీలలో పాల్గొని సత్తా చాటుతున్నాను. 2017లో పలు విజయాలను అందుకున్నా. స్ట్రాంగ్ ఉమన్ ఆఫ్ సౌత్ ఇండియా టైటిల్‌ను సొంతం చేసుకోగలిగాను. కొత్త సంవత్సరంలో మరిన్ని పతకాలను సాధించడానికి శాయశక్తులా కృషి చేస్తాను. కొత్త ఆశలతో నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తున్న అందరికీ శుభం కలగాలని కోరుకుంటున్నాను. గత ఏడాది మాదిరిగానే ఈసారి పట్టుదలతో ముందడుగు వేస్తాను. పేద క్రీడాకారులకు సర్కారు చేయూత ఇవ్వాలి.

-న్యూస్‌టుడే, యూసుఫ్‌గూడ

### స్పష్టమైన ఆలోచనతో ప్రయాణం

**- రష్మి గౌతమ్, బుల్లితెర వ్యాఖ్యాత, సినీనటి**

జీవితం, కెరీర్‌పై స్పష్టమైన ఆలోచనలు ఉన్నాయి. నిర్ణయాలు తీసుకుని వాటిని అమలు చేసేందుకు నిర్దిష్టంగా ఫలానా రోజు అంటూ తీసుకోను. ఏడాదికి సరిపడా ప్రణాళికను రూపొందించుకోవడం అంటూ ఏమీ ఉండదు. మంచి పనులు చేసేందుకు ముహూర్తాలతో పనిలేదని భావిస్తా. ఈ ఏడాది బాగుంది. వచ్చే ఏడాది ఇంకా బాగుంటుందని నా విశ్వాసం. సినిమాలు, ధారావాహికల ద్వారా కొత్త సంవత్సరంలో ప్రేక్షకులకు మరింత చేరువ కావాలని కోరుకుంటున్నా. జనవరి ఒకటిన స్నేహితులు, కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపడాన్ని ఆస్వాదిస్తా.




### విందుతోనే పార్టీ ఆస్వాదన



భారతీయులు భోజనప్రియులు. పండుగలు, ఉత్సవాలు ఏవి జరిగినా నాలుకకు నచ్చే రుచికే ఓటేస్తారు. డిసెంబరు 31 రాత్రి.. జనవరి 1వ తేదీ పార్టీలకు హాజరయ్యే వారి ఓటు దీనికేనట. ఓ ట్రావెలింగ్ ఏజెన్సీ నిర్వహించిన సర్వేలో.. కొత్త సంవత్సర వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లే వారిలో 60శాతం మంది రుచికరమైన ఆహార పదార్థాలు ఉన్న చోటుకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు గుర్తించారు. దీని కోసం అదనంగా ఎంతమొత్తం అయినా చెల్లించేందుకు సిద్ధపడుతున్నారు.

### జంటలు మాత్రమే



భార్యాభర్తలు, ప్రేమికులు మాత్రమే జంటగా రావాలంటూ కొన్నిచోట్ల ఈవెంట్స్ నిర్వాహకులు షరతు విధించారు. డ్రెస్ కోడ్, జంటగా వచ్చే వారి కోసం ప్రత్యేక సంగీత, నృత్య కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. పబ్‌లు, క్లబ్‌లలో ఏర్పాటుచేసిన ప్రైవేటు పార్టీలకు ఇప్పటికే బుకింగ్స్ పూర్తయినట్లు సమాచారం. గత ఏడాదితో పోల్చితే ప్రస్తుతం ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారంటూ ఓ ఈవెంట్ నిర్వాహకులు సన్నీ తెలిపారు. డీజే సంగీతం, మంచి ఆహారం ఈ రెండూ ఉంటేచాలని చాలా మంది అడుగుతున్నారని వివరించారు.

### సేవకు కదులుదాం

వేడుకలను సేవా కార్యక్రమానికి వారధిగా ఉపయోగిస్తామంటున్నారు రాబిన్‌హుడ్ ఆర్మీ ఫౌండేషన్ ప్రతినిధి ఉమా చిలకా. గతేడాది డిసెంబరు 31 రాత్రి బస్తీలో కొత్త సంవత్సర వేడుకలు నిర్వహించామన్నారు. అక్కడ పిల్లలతో కేక్ కోయించి వారి నోటిని తీపి చేశామన్నారు. నగరంలోని యువతీ,యువకులు పుట్టినరోజులు, తదితర వేడుకల వంటి కార్యక్రమాలకు ఖర్చు చేసే సొమ్మును విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాలల కోసం వెచ్చిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది తమ సేవా సైనికులు రెండ్రోజుల పాటు ప్రజాహిత కార్యక్రమాల్లోనే పాలుపంచుకుంటారని వివరించారు.

క్రిస్మస్ సందర్భంగా తాము స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. యంగిస్థాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోనూ పలు సేవా కార్యక్రమాలకు ఇప్పటికే సిద్ధమయ్యారు.

### ప్రభాస్‌తో నటించాలని ఉంది

**- ఆకాంక్ష సింగ్, సినీనటి**



బుల్లితెరపై నటించే నాకు వెండితెరపై అవకాశం దక్కింది. 2017లో వచ్చిన 'మళ్లీ రావా' సినిమా హిట్ కావటం మరింతగా సంతృప్తి ఇచ్చింది. ఈ నేపథ్యంలో మరిన్ని సినిమాలు వస్తాయని భావిస్తున్నా. టీవీ షోలతో ఇంతగా ప్రేక్షకులకు దగ్గర కాగలిగాను. మళ్లీ టీవీషోలలో నటించేందుకు సిద్ధంగా ఉన్నా. కొత్త సంవత్సరంలో ప్రభాస్ పక్కన నటించాలనే కోరిక తీరుతుందని భావిస్తున్నా. వేడుకలు ఇంట్లోనే జరుపుకొంటా. కొంతమంది పిల్లల చదువు కోసం సాయం అందించాలనే నిర్ణయం కొత్త ఏడాది నుంచి అమలు చేస్తాను.



## టీ20 ప్రపంచ కప్‌పై గురి

మిథాలీరాజ్ పరిచయం అక్కర్లేని పేరు. భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్‌గా ఎన్నో విజయాలు సాధించారు. అంతర్జాతీయ వేదికలపై మహిళా క్రికెట్‌కు ఇంతటి పేరు రావడంలో ఆమె పాత్ర మరువలేనిది. ప్రపంచకప్ బరిలో ఆమె చూపిన ప్రతిభ ఓటమిని కూడా చాలా చిన్నదిగా మార్చేసింది. ఈ ఏడాది చేదు తీపి అనుభవాలు చాలా నేర్పాయంటున్నారు. కొత్త ఏడాది తమ లక్ష్యం ప్రపంచ టీ20 కప్ అంటూ వివరించారు. కుటుంబంతో కలసి కొత్త సంవత్సర వేడుకలు జరుపుకోవాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. గెలుపోటములను తేలికగా తీసుకోగలిగేలా సాధన చేయాలి. ప్రతి ఏడాది మంచిచెడుల మేళవింపులు ఉంటాయి. విజయాన్ని ఆస్వాదించాలి.. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోవాలంటూ.. తన ఆత్మవిశ్వాసం వెనుక రహస్యాన్ని వివరించారు.

## మోడల్‌గా మెరిసాను



క్యాట్‌వాక్‌లలో.. ర్యాంప్‌పై తడబాట్లు సహజం అంటున్నారు మోడల్ సిమ్రాన్ గుప్త. తేలికగా కెరీర్ ముందుకు సాగదన్నారు. ఈ ఏడాది హైదరాబాద్, ముంబయి, బెంగళూరు వంటి పలు నగరాల్లో మోడల్‌గా నటించే అవకాశం వచ్చిందన్నారు. కష్టపడటం ఒక్కటే విజయానికి సోపానం అనే విషయాన్ని తన అనుభవంలో గ్రహించానని పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకలను స్నేహితులు, కుటుంబ సభ్యులతో జరుపుకొంటానని అన్నారు. మొదటి తారీఖున అనాథాశ్రమానికి వెళ్లి తన వంతు సాయం అందిస్తానన్నారు. వేడుకల పేరుతో డబ్బు వృథా చేసేకంటే అవసరం ఉన్న వారికి సాయం చేస్తే మంచిదనేది తన అభిప్రాయం అన్నారు. ఇప్పటి యువతలో చాలా మార్పు వచ్చిందని.. నయాసాల్ రోజు సరదాగా ఉంటూనే.. సమాజానికి ఎంతోకొంత మేలు చేయాలని ఆలోచిస్తున్నారని వివరించారు.. మోడలింగ్ రంగంలో మరింతగా పేరు సంపాదించాలనేది తన లక్ష్యం అన్నారు.




### నూతన సందడి అలరించే ఒరవడి

చార్మినార్ సమీపంలోని మదీనా సర్కిల్‌లో ఓ దుకాణదారు నూతన సంవత్సరవేళ కొనుగోలుదారులను ఆకర్షించేందుకు ఇలా ప్రపంచ సుందరి, ప్రముఖ క్రీడాకారిణుల ఫొటోలను బొమ్మలకు అతికించారు -న్యూస్‌టుడే, చార్మినార్






మియాపూర్ రిషి కళాశాలలో నూతన సంవత్సర ఆరంభ వేడుకల్లో భాగంగా శనివారం రంగవల్లులు దిద్దుతూ.. మరోవైపు నృత్య కార్యక్రమాలతో ఆకట్టుకున్న విద్యార్థినులు




వివేకానందనగర్ కాలనీలోని న్యూఎరా పాఠశాలలో సంబరాల్లో అలరించిన చిన్నారులు



శాలిబండ సమీపంలోని ఓ దుకాణంలో కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తున్న కేకులు





మణికొండ పంచవటి కాలనీలో ఈ రహదారిపై పాఠశాలల వ్యాన్లు, వాటర్ ట్యాంకులు, ప్రైవేట్ వాహనాలు వెళుతుంటాయి. ఇక్కడ కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. అక్కడ ఒక కారు ఇరుక్కుపోయిన దృశ్యాన్నీ ఈ చిత్రంలో చూడొచ్చు. ఒక బ్రిడ్జి నిర్మిస్తే ఈ ప్రాంతవాసులకు ఎంతో ప్రయోజనం.
–సామ్రాట్, పంచవటి కాలనీ

## పౌర పాత్రికేయం

మీ చేతిలో సెల్‌ఫోన్ ఉందా? ఎక్కువ మందిని ప్రభావితం చేస్తున్న అంశాలను, మానవీయమైన, చిత్రాలను క్లిక్ మనిపించారా? మీ పేరు, ప్రాంతం తదితర వివరాలతో వాటిని 'ఈనాడు'కు పంపొచ్చు.

వాట్సాప్ నంబరు: 8008001763

## స్పందించారు... తొలగించారు...







వనస్థలిపురంలో జాతీయ రహదారిపై పడేసిన వ్యర్థాలను తొలగించారు. డివైడర్లను శుభ్రం చేస్తూ... చెత్తాచెదారాన్ని రోడ్డుపైనే వేస్తున్న చిత్రం 'పౌరపాత్రికేయం'లో రావడంతో సంబంధిత అధికారులు స్పందించి చర్య తీసుకున్నారు. –హరిత ఇంద్రగంటి, వనస్థలిపురం



### కుప్పలు... ప్రయాణికులకు తిప్పలు...

కూకట్‌పల్లి బస్‌స్టాప్‌లో వేసిన మట్టి కుప్పలు. ప్రయాణికులకు ఎంత ఇబ్బంది? వేసేటప్పుడు ఆలోచించరా? –జి.ప్రవీణ్, జగద్గిరిగుట్ట

### కాలం తీరాయి... కాటేస్తున్నాయి...



నగరంలో కాలం తీరిన ఆటోల వల్ల కాలుష్యం గణనీయంగా పెరుగుతోంది. రైలు బండిలా పొగను విరజిమ్ముతూ కొత్తపేట వద్ద కనిపించిన ఆటో ఇది.
–టీజీ రావు, వనస్థలిపురం

### బోర్డు పెడితే ఆగినట్టేనా...!




గోల్కొండ క్రాస్ రోడ్ వద్ద ఓ బోర్డు పెట్టి వదిలేశారు. కానీ బస్సులే ఆగవు.. షెల్టర్ నిర్మిస్తే ప్రయాణికులకు ప్రయోజనం కదా?
–జె.రాజేంద్ర ప్రసాద్, గోల్కొండ ఏరియా




ప్రమాదాలు ఎప్పుడు ఎలా జరుగుతాయో చెప్పలేం.. కేపీహెచ్‌బీ కాలనీ వద్ద వాహనాలు వేగంగా వస్తుంటాయి. అదే సమయంలో వాటి మధ్య నుంచే పాదచారులు రహదారిని దాటుతున్నారు. కనీసం సిగ్నల్ పడేవరకు ఆగొచ్చు కదా? –కృష్ణంరాజు, భాగ్యనగర్ కాలనీ



### నడిరోడ్లపై ట్రా'ఫికర్'

బంజారాహిల్స్ రోడ్ నంబరు-3లో హోటళ్ల వద్ద ప్రధాన రహదారులపైనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీనివల్ల నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. –కిరణ్, బేగంపేట

### ఆర్బీఐ... గుండెలు బాదుకో...!




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు ఈ నోటీసు బోర్డును చూస్తే గుండెలు బాదుకోవాల్సిందే. జనవరి 1వ తేదీ నుంచి ప్రయాణికుల వద్ద రూ.10 నాణెలు తీసుకోవద్దని కండక్టర్లకు సూచిస్తూ మేడ్చల్ ఆర్టీసీ డిపోలో అక్కడి సహాయ మేనేజర్ సంతకం, స్టాంపుతో ఈ నోటీసు బోర్డు అంటించారు. అసలే ఇవి చెల్లవంటూ అక్కడక్కడా అపోహలు తలెత్తుతున్న నేపథ్యంలో ఆర్టీసీ అధికారుల చర్యలు మరింత ఆజ్యం పోసేవిగా తయారయ్యాయి. –సయ్యద్ అలీ అన్వర్, మేడ్చల్

## ముంబయి తరహా ఘటనలకు అవకాశం లేదు

**● అగ్నిమాపక శాఖ డీజీ రాజీవ్‌రతన్**

**ఈనాడు డిజిటల్, హైదరాబాద్:** ముంబయిలోని పబ్‌లో జరిగిన అగ్నిప్రమాద తరహా ఘటనలు హైదరాబాద్‌లో జరిగే అవకాశం లేదని తెలంగాణ అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ రాజీవ్‌రతన్ ధీమా వ్యక్తం చేశారు. ఈ ఏడాది అగ్నిమాపక శాఖ పనితీరును శనివారమిక్కడ విలేకర్ల సమావేశంలో వివరించారు. ఈఏడాది ఇప్పటివరకు 9,811 ప్రమాదాలు తమ దృష్టికి వచ్చాయని, తక్షణమే స్పందించి రూ.685.14కోట్ల నష్టాన్ని నివారించామని చెప్పారు. ద్విచక్ర వాహనాలు, సాంకేతిక పరిజ్ఞానంతో అనేక ప్రమాదాలను ఆదిలోనే నివారించామని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు 3,698 కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. అగ్నిప్రమాదం జరిగినప్పుడు తక్షణం నష్టనివారణకు గ్రీన్‌ఛానల్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. తద్వారా నిర్దేశిత ప్రదేశానికి అగ్నిమాపక వాహనం వేగంగా వెళ్లేందుకు ట్రాఫిక్, పోలీసు, నిరంతరం నీరందించేందుకు జలమండలి, విద్యుత్, వైద్యారోగ్య శాఖలతో సమన్వయం చేసుకుంటున్నట్లు వివరించారు. ఇందుకు కేంద్ర కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. శాఖాపరంగా ఇచ్చే దాదాపు 14రకాల అనుమతులను ఆన్‌లైన్‌లో జారీచేస్తున్నట్లు తెలిపారు.

## ఉగ్రదాడులు జరక్కుండా చర్యలు తీసుకోవాలి

**● భారతీయ జనతా యువమోర్చా**

**నాంపల్లి, న్యూస్‌టుడే:** నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో నగరంలోని పబ్‌ల్లో ముంబయి తరహా ఘటనలు చోటుచేసుకోకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని భారతీయ జనతా యువమోర్చా గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎ.వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం హైదర్‌గూడలోని న్యూస్‌సెంటర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముంబయి ఘటన బాధాకరమని, ఇలాంటి దుర్ఘటనలు నగరంలో చోటుచేసుకోకుండా పబ్‌ల్లో భద్రతా ప్రమాణాలను పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో అసాంఘిక చర్యలు చేపట్టకుండా పబ్‌లపై గట్టి నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో పబ్‌ల వద్ద భాజపా యువమోర్చా ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో యువమోర్చా నగర ప్రధాన కార్యదర్శులు లడ్డుయాదవ్, శివాజీ, గణేష్‌యాదవ్, దశరథ్, సుమిత్, యశ్వంత్ పాల్గొన్నారు.

## నగరంలో రేపటి నుంచి సిద్ధ సమాధి యోగ తరగతులు

**ఈనాడు, హైదరాబాద్:** జనవరి 1 నుంచి సిద్ధ సమాధి యోగ తరగతులు మొదలవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు పంజాగుట్ట ప్రాంతవాసులు 9849627594, కూకట్‌పల్లి ప్రాంతంలో ఉండేవారు 8555027839 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## సావిత్రీబాయి ఫూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలి

**కాచిగూడ, న్యూస్‌టుడే:** దేశంలో మొదటి మహిళా పాఠశాలను ఏర్పాటు చేసి మహిళల విద్యకు కృషి చేసిన సావిత్రీబాయి ఫూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలని భాజపా బీసీ మోర్చా నగర అధ్యక్షుడు సి.వినోద్‌యాదవ్ డిమాండ్ చేశారు. జనవరి 3న సావిత్రీబాయి ఫూలే జయంతిని అధికారికంగా నిర్వహిస్తేనే మహిళలకు సముచిత గౌరవం ఇచ్చినట్లు అవుతుందన్నారు. శనివారం కాచిగూడ చప్పల్‌బజార్‌లోని భాజపా బీసీ మోర్చా నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ మంత్రివర్గంలో ఒక్క మహిళా మంత్రి కూడా లేకపోవడం విచారకరమన్నారు. మహిళా సంక్షేమం పట్ల తెరాస ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. కార్యక్రమంలో బీసీ మోర్చా నగర ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌రావు వంజరి, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్‌గౌడ్, దశరథ లక్ష్మి, నరేందర్, కార్యదర్శులు మహేశ్, గోపి, మధు గౌడ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# బార్‌ల దగ్గర బారులు!

## జోరుగా మద్యం అమ్మకాలు



ఈనాడు, హైదరాబాద్

**నగరంలో మద్యం**
**దుకాణాలు: 183**
**పబ్‌లు: 25**
**బార్‌లు: 246**

రెండు మూడు రోజుల నుంచి గ్రేటర్ పరిధిలోని మద్యం దుకాణాలు, బార్‌లలో అమ్మకాలు రెట్టింపయ్యాయి. సాధారణ రోజుల్లో మద్యం అమ్మకాలు తక్కువగా ఉన్నా... శుక్ర, శని, ఆదివారాల్లో ఎక్కువ. ఏటా డిసెంబరు 31న అమ్మకాలు విస్తృతంగా సాగుతాయి. ఈ ఏడాది నాలుగు రోజుల ముందు నుంచే ఈ స్థాయిలో అమ్మకాలు సాగుతున్నట్లు పలువురు వ్యాపారులు వెల్లడిస్తున్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో మద్యం అమ్మకాలు భారీగా ఉన్నట్లు పలువురు వ్యాపారులు వివరిస్తున్నారు. ఇదేస్థాయి అమ్మకాలు డిసెంబరు 31 వరకు సాగుతాయని వారు అంచనా వేస్తున్నారు. రాత్రి దుకాణం మూసే సమయం అవుతున్నా మందుబాబుల రద్దీ కారణంగా మరో అరగంట వరకు అమ్మకాలు సాగించాల్సి వస్తోందని వారు పేర్కొంటున్నారు. మూసే సమయం అవుతున్నప్పుడు మరింత మంది వస్తున్నారని, దుకాణం మూసేస్తుంటే మందుబాబులు తీవ్ర స్థాయిలో వివాదాలకు దిగుతున్నారని దుకాణదారులు వివరిస్తున్నారు.

### *కలిసొచ్చిన గంట...*

తెలంగాణ వ్యాప్తంగా మద్యం దుకాణాలను ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అమ్ముకునే అవకాశాన్ని ఆబ్కారీ శాఖ కల్పించింది. నగరంలో అమ్మకాలు అన్నీ రాత్రి 9 గంటల నుంచి జోరుగా సాగుతాయని, రాత్రి 10 గంటలకే దుకాణాలు మూసేస్తే తీవ్ర నష్టాలను చవి చూడాల్సి వస్తుందని దుకాణదారులు.. ఆబ్కారీ శాఖ అధికారులకు విన్నవించుకున్నారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న ఆబ్కారీశాఖ... మద్యం దుకాణాలకు అనుమతులు ఇచ్చేటప్పుడు గ్రేటర్ పరిధిలోని దుకాణాలకు అదనంగా మరో గంట అంటే రాత్రి 11 గంటల వరకు అమ్ముకునే వెసులుబాటు కల్పించింది. గ్రేటర్ పరిధిలోని మద్యం దుకాణాలకు గంటపాటు అదనపు సమయం ఇచ్చిన నేపథ్యంలో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా మద్యం దుకాణాలు రాత్రి 10 గంటలకు మూసేస్తున్నా... గ్రేటర్ పరిధిలోని మద్యం దుకాణాలకు అదనంగా మరో గంటపాటు అమ్మకాలు సాగించుకొనే వెసులుబాటు దుకాణదారులకు బాగా కలిసొచ్చింది. ఈ అదనపు గంటలోనే అత్యధిక అమ్మకాలు సాగుతున్నట్లు పలువురు వ్యాపారులు వెల్లడిస్తున్నారు. పలువురు ఉద్యోగాలు, వ్యాపారాలతో పగలంతా పలు కార్యకలాపాలతో తలమునకలై రాత్రి సమయంలో మద్యం దుకాణలు, బార్‌ల దగ్గరకు చేరుతున్నారు. స్నేహితులతో కలిసి పార్టీలు చేసుకుంటూ రాత్రి 11 గంటల వరకు మద్యం దుకాణాల దగ్గరే గడిపేస్తున్నారు.

### *అదనపు గదులతో రద్దీ...*

మద్యం తాగాలంటే చాలామంది బార్‌లకు వెళ్లేవారు. ప్రస్తుతం మద్యం దుకాణం దగ్గర అనుబంధ గది అందుబాటులోకి రావడంతో దీనిని ఎక్కువ మంది వినియోగించుకుంటున్నారు.

**మద్యం అమ్మకాల జోరు ఇలా...**

| సంవత్సరం | ఐఎంఎఫ్‌ఎల్ (కేస్‌లు) | బీరు (కేస్‌లు) | విలువ రూ.కోట్లలో.. |
|---|---|---|---|
| 2015 | 3,29,863 | 3,43,837 | 187.36 |
| 2016 | 3,39,879 | 3,26,424 | 199.66 |
| 2017 | 3,29,409 | 3,44,419 | 199.9 |

(డిసెంబరు 29 వరకు)

మద్యం దుకాణాలు ప్రస్తుతం బార్‌లను తలపిస్తున్నాయి. బార్‌లు రాత్రి 12 గంటల వరకు తెరచి ఉంచటంతో వాటి దగ్గరకు ఎక్కువ మంది మందుబాబులు వెళుతున్నారు. మద్యం తాగేందుకు దుకాణాల దగ్గర అన్ని వసతులతో కూడిన అనుబంధ గదులు అందుబాటులోకి రావడంతో వాటినీ చాలామంది వినియోగించుకుంటున్నారు. కొందరు మందుబాబులు బార్‌ల దగ్గరకు వెళ్లకుండా మద్యం దుకాణం దగ్గర తాగేసి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. నగర ప్రధాన రహదారుల్లో పోలీసులు తనిఖీలు చేస్తున్న నేపథ్యంలో మందుబాబులు చిన్నచిన్న సందుల్లో నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. పోలీసుల కంట పడకుండా వాహనాలను నడుపుతూ ప్రయాణాలను సాగిస్తున్నారు.

### నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం పరిసరాల్లో..

## ట్రాఫిక్ ఆంక్షలు రేపటి నుంచి

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** అఖిల భారత పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన నేపథ్యంలో జనవరి 1 (రేపటి) నుంచి 15వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని నగర ట్రాఫిక్ సంయుక్త కమిషనర్ రవీందర్ తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు.

● పుత్లిబౌలి నుంచి నాంపల్లికి వెళ్లే వాహనాలు ఎంజేమార్కెట్, యూసుఫ్ అండ్ కం. అబిడ్స్ మీదుగా నాంపల్లి స్టేషన్ మీదుగా చేరుకోవాలి. అటు నుంచి ఏ1 సూచిక మీదుగా నాంపల్లి టీ జంక్షన్‌కు వెళ్లాలి.
● ట్రాఫిక్ కంట్రోల్ రూం, పబ్లిక్‌గార్డెన్ నుంచి అఫ్జల్‌గంజ్‌కు వెళ్లే వాహనాలు ఏఆర్ పెట్రోల్‌బంక్, బీజేఆర్ విగ్రహం మీదుగా గన్‌ఫౌండ్రీ ఎస్‌బీఐ బ్యాంకు దారి నుంచి తాజ్‌మహల్, అబిడ్స్ జీపీవో, ఎంజే మార్కెట్ మీదుగా వెళ్లాలి.
● ఎంజే వంతెన నుంచి నాంపల్లికి వెళ్లే వాహనాలు బేగంబజార్ ఛత్రి, అలస్కా, దారుస్సలాం, ఏక్‌మినార్, నాంపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకోవాలి.
● చాదర్‌ఘాట్ వంతెన నుంచి వచ్చే వాహనాలు కోఠి, సుల్తాన్‌బజార్, కింగ్‌కోఠి క్రాస్ రోడ్స్ మీదుగా నిజాం కళాశాల దారి నుంచి బషీర్‌బాగ్, సైఫాబాద్ నుంచి వెళ్లాలి.
● బహదూర్‌పుర నుంచి వచ్చే వాహనాలు పురానాపూల్, మంగళ్‌హాట్, ఆజంపుర, దారుస్సలాం, ఏక్‌మినార్, నాంపల్లి రైల్వేస్టేషన్ చేరుకోవాలి.
● సైఫాబాద్ నుంచి రాజేంద్రనగర్‌కు వెళ్లే వాహనాలు రవీంద్రభారతి, లక్డీకాపూల్, అయోధ్య, మాసాబ్‌ట్యాంక్ వంతెన, మోహిదీపట్నం. మొఘల్‌కా నాలా, అత్తాపూర్, రాజేంద్రనగర్‌కు చేరుకోవాలి.
● మదీనా (పాతబస్తీ) నుంచి వచ్చే వాహనాలు అఫ్జల్‌గంజ్, ఎంజే మార్కెట్, యూసుఫ్ కం. అబిడ్స్ జీపీవో, చిరాగ్ గల్లీ, చర్మాస్, బీజేఆర్ విగ్రహం మీదుగా వెళ్లాలి. ● మోహిదీపట్నం నుంచి చార్మినార్‌కు వెళ్లే వాహనాలు ఆసిఫ్‌నగర్ రహదారి మీదుగా బోయిగూడ కమాన్, మంగళ్‌హాట్, పురానాపూల్, మూసా బౌలి రోడ్, ఖిల్వత్ నుంచి సాగాలి.

## 'మహిళా రక్షణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం'



జీహెచ్‌ఎంసీ కార్యాలయం నుంచి ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



నిరసనలో పాల్గొన్న దత్తాత్రేయ, రాంచందర్‌రావు, రామచంద్రారెడ్డి

**బషీర్‌బాగ్:** రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమవుతోందని భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆరోపించింది. మహిళలపై దాడులను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని మండిపడింది. ఈ మేరకు భాజపా మహిళా మోర్చా ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు మౌన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద మహిళలు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై దాడులు జరుగుతున్నప్పటికీ మహిళా కమిషన్‌ను నియమించడం లేదన్నారు. భాజపా శాసనమండలి పక్ష నేత, నగర పార్టీ అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు మాట్లాడుతూ బాలికలపై సైతం అకృత్యాలు చోటు చేసుకోవడం ఆందోళనకరమన్నారు. మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఆకుల విజయ మాట్లాడుతూ మహిళలకు పూర్తి స్థాయిలో భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాజపా ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మహిళా మోర్చా నగర అధ్యక్షురాలు రాధిక, నేతలు చాయాదేవి, విజయలక్ష్మీ, ఉప్పల శారద తదితరులు పాల్గొన్నారు.

## మెట్రో రైల్ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి

**హైదరాబాద్:** నగరంలో కొనసాగుతున్న మెట్రో రైల్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ ఆదేశించారు. శనివారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో మెట్రో రైలు నిర్మాణ పనులపై సమీక్షించారు. పనుల్లో భాగంగా మరికొన్ని ఆస్తులను సేకరించాల్సి ఉందని, వీటిని వెంటనే స్వాధీనం చేసుకుని ఆయా మార్గాల్లో పనులు చేపట్టేలా మార్గం సుగమం చేయాలని మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, బల్దియా కమిషనర్ డా.బి.జనార్దన్‌రెడ్డిలను ఆదేశించారు.

### *అర్ధరాత్రి 2 గంటల వరకు మెట్రో రైళ్ల రాకపోకలు*

కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా డిసెంబరు 31న అర్ధరాత్రి 2 గంటల వరకు మెట్రో రైళ్లను నడపాలని మెట్రో అధికారులు నిర్ణయించారు. మియాపూర్ నుంచి అమీర్‌పేట, అమీర్‌పేట నుంచి నాగోల్ వరకు ఈ రైళ్లు రాకపోకలు సాగిస్తాయి.

## సీఆర్‌పీఎఫ్ సేవలు అమోఘం

**బార్కాస్, న్యూస్‌టుడే:** దేశ రక్షణలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు అందిస్తున్న సేవలు అమోఘమని సీఆర్‌పీఎఫ్ సౌత్‌వెస్ట్రన్ సెక్టార్ ఏడీజీ (అదనపు డైరెక్టర్ జనరల్) శైలేందర్‌కుమార్ అన్నారు. శనివారం పాతబస్తీ చాంద్రాయణగుట్ట సెగ్మంట్ బార్కాస్ సీఆర్‌పీఎఫ్ గ్రూప్‌సెంటర్‌లోని 2-సిగ్నల్ బెటాలియన్ వారు నిర్వహించిన ప్రత్యేక పరేడ్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జవాన్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఆర్‌పీఎఫ్ మహావృక్షం లాంటిదని, ఇక్కడ వివిధ విభాగాల్లో విధులు నిర్వహించే సిబ్బంది అనునిత్యం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా జవాన్లు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉన్నతాధికారులు డాక్టర్ దిగ్విజయ్ సింగ్, ఎస్కే మహంతి, ఎస్డీ పాండే, సందీప్‌యాదవ్, సి.టి.వేంకటేష్, ప్రభంజన్‌కుమార్, ఎస్కే కనోజీయా, అమిత్‌కుమార్‌సింగ్, సుందరం, పి.జోన్స్ తదితరులు పాల్గొన్నారు.

## మెట్రో వారి స'గౌరవ గృహం'




చూడచక్కని రంగులు.. వివిధ రకాల మొక్కలతో చూడగానే ఆకట్టుకుంటున్న ఇది సులభ్ కాంప్లెక్స్ అంటే నమ్ముతారా. మెట్రో రైలు అధికారులు భరత్‌నగర్ మార్కెట్ వద్ద దీన్ని నిర్మించి సుందరంగా తీర్చిదిద్దారు.

# పార్క్ హోటల్‌లో పెట్రోల్‌తో హల్‌చల్

## ఇద్దరి గాయాలు



సందీప్

**పంజాగుట్ట:** ఓ స్టార్ హోటల్‌లోని బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం తాగేందుకు వచ్చిన వ్యాపారికి సిబ్బందికి మధ్య ఘర్షణ చోటుచేసుకొంది. ఈ ఘటనలో పెట్రోల్‌తో దాడి చేసిన వ్యక్తి 60శాతం గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గాయపడ్డ బౌన్సర్ సైతం ఆసుపత్రి పాలయ్యాడు. పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ ఎస్.రవీందర్ వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లాకు చెందిన స్థిరాస్తి వ్యాపారి సందీప్ వర్మ అలియాస్ చోర్ బబ్లూ (35) తన స్నేహితులు నిజామాబాద్ వాసి రాజేందర్ (32), శాలిబండకు చెందిన జావీద్ (32), కైజర్ (35) తదితరులు మద్యం తాగేందుకు సోమాజిగూడ పార్క్ హోటల్‌లోని 24 గంటలు నడిచే బార్ అండ్ రెస్టారెంట్‌కు శుక్రవారం అర్ధరాత్రి వెళ్లారు. మద్యం తాగి స్నాక్స్‌కు ఆర్డర్ ఇచ్చారు. ఆర్డర్ ఆలస్యంగా వచ్చిందని సందీప్ అక్కడ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ సమయంలో సందీప్, అతని స్నేహితులకు సర్దిచెప్పి, బౌన్సర్ వారిని బయటకు పంపారు. సందీప్ అక్కడ నుంచి ఆగ్రహంతో తన ఖరీదైన కారులో జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్‌కు చేరుకొని అక్కడ క్యాన్‌లో పెట్రోల్ తీసుకొచ్చి వివాదమైన రెస్టారెంట్‌కు వెళ్లేందుకు పార్క్ హోటల్ గేట్ వద్దకు వచ్చాడు. గేట్ వద్ద క్యాన్ తెరిచి అక్కడ సిబ్బందిపై చల్లేందుకు యత్నించాడు. మద్యం మత్తులో తనపై పోసుకున్నాడు. లైటర్ తీసి సిబ్బందికి అంటించేందుకు ప్రయత్నించగా తనకూ మంటలు అంటుకున్నాయి. దీంతో 60శాతం గాయాలు అయ్యాయి. బౌన్సర్ మన్సూర్ అనే వ్యక్తికీ నిప్పంటుకోవడంతో చేతులు కాలిపోయాయి. సందీప్ స్నేహితులు మాత్రం తమకు ఘర్షణతో ఎలాంటి సంబంధం లేదని కేవలం సందీప్ మాత్రమే దాడికి దిగాడని వారు పంజాగుట్ట ఠాణాలో పోలీసులకు వివరించారు. వీరందరిపై కేసు నమోదుచేసినట్లు ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపారు. రెండు కారులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆ రెస్టారెంట్‌కు ప్రతినిధులకు స్థానిక డీసీపీ ఎ.వెంకటేశ్వరరావు పంజాగుట్ట ఠాణాలో కౌన్సెలింగ్ ఇచ్చారు. గతంలో సైతం ఇదే హోటల్‌లో ఘర్షణలో పంజాగుట్ట ఠాణాకు చెందిన ఇద్దరు ఎస్సైలపై అల్లరి మూకలు దాడులకు పాల్పడ్డారు. దీనిని దృష్టిలో పెట్టుకున్న పోలీసు అధికారులు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు సమాచారం.


నూజివీడుకు వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన గ్రీనరీ


ప్రుడెన్షియల్ బ్యాంకు కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం


గ్రామజ్యోతి కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

# గ్రామాల్లో ఘనం.. జిల్లాలో ప్రథమం

- జాతీయ స్థాయిలో కొంపల్లికి 19వ స్థానం
- మౌలిక వసతుల కల్పనపరంగా గుర్తింపు
- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆన్‌లైన్ సర్వే



**మౌలిక వసతుల కల్పనలో కొంపల్లి గ్రామ పంచాయతీ జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఇటీవల నిర్వహించిన ఆన్‌లైన్ సర్వేలో ఆ గ్రామానికి జాతీయ స్థాయిలో 19వ స్థానం దక్కడం విశేషం. రాష్ట్రంలో 12వ స్థానం, మేడ్చల్ జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. 41,617 గ్రామాల్లో ఈ సర్వే సాగింది.**

న్యూస్‌టుడే, పేట్‌బషీరాబాద్

కొంపల్లి ప్రస్తుత పంచాయతీ పాలకవర్గం 2014లో ఏర్పడింది. ఆవిర్భావం నుంచి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతోపాటు మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించింది. తద్వారా రాష్ట్ర ప్రభుత్వ దృష్టిని ఆకర్షించింది. ఇ-పంచాయతీగా మార్చి సేవలన్నీ ఆన్‌లైన్ చేశారు. 14 ఆర్థిక సంఘం, పంచాయతీ నిధులు సకాలంలో వినియోగించుకోవటంతో పాటు ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకొని అభివృద్ధి పనులకు వెచ్చించారు.

### స్వచ్ఛభారత్‌పై ప్రత్యేక శ్రద్ధ

ప్రతి శనివారం గ్రామంలో స్వచ్ఛభారత్ నిర్వహిస్తారు. ప్రజలను భాగస్వామ్యులను చేస్తున్నారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించారు. బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా తీర్చిదిద్దారు. చెత్తను జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకు తరలించటానికి జీహెచ్‌ఎంసీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇటీవల దిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ భారత్ సమావేశంలో దేశవ్యాప్తంగా సుమారు 2 వేల మంది సర్పంచులు పాల్గొనగా వారిలో కొంపల్లి గ్రామ సర్పంచి కూడా ఒకరు.

### డ్వాక్రా సంఘాలకు రూ.3 కోట్ల రుణాలు

గ్రామ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించటానికి సుమారు 170 స్వయం సహాయక బృందాలు(డ్వాక్రా) ఏర్పాటు చేశారు. సుమారు రూ. 3 కోట్లకు పైగా రుణాలు అందజేసి మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి కృషి చేస్తున్నారు.

### హరితహారానికి పెద్దపీట

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరిత హారం కార్యక్రమానికి పంచాయతీ పూర్తి సహకారం అందిస్తోంది. ఇందుకు పలువురు పారిశ్రామికవేత్తల సహాయ సహకారం తీసుకొంటోంది. నాటిన ప్రతి మొక్కను బతికించటానికి చర్యలు చేపట్టింది. మంత్రి కేటీఆర్ తన పుట్టిన రోజున ఇక్కడ మొక్క నాటి గ్రామస్థుల్లో స్ఫూర్తినింపారు. మంత్రి మహేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎంవీరెడ్డి, ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్‌డీ ప్రియాంక వర్గీస్ కూడ ఈ కార్యక్రమ విజయవంతానికి సహకారం అందిస్తున్నారు.



### గ్రామసభలో సంక్షేమ సంఘాలకు స్థానం

క్రమం తప్పకుండా ప్రతి మూడు నెలలకోసారి గ్రామసభ నిర్వహిస్తారు. గ్రామసభ తేదీపై బహిరంగ ప్రచారం చేయడంతోపాటు చరవాణి ద్వారా అన్ని సంక్షేమ సంఘాల నేతలకు ముందస్తు సమాచారం ఇస్తారు. గ్రామసభ ద్వారా వచ్చే విజ్ఞప్తులను పంచాయతీ పాలకవర్గంలో చర్చించి సమస్యల తీవ్రత ఆధారంగా పరిష్కరిస్తున్నారు. పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదుల పుస్తకం కూడ అందుబాటులో ఉంచారు.

### మరిన్ని మైలురాళ్లు

- కొంపల్లిలో పైవంతెన వల్ల వాహనదారులు పడుతున్న ఇబ్బందులను సర్పంచి జెమ్మి నాగమణి ఎంపీ మల్లారెడ్డి ద్వారా అప్పటి కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లడంతో రైల్వే అండర్ బ్రిడ్జికి నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.
- అమెరికాకు చెందిన స్టాన్‌ఫోర్డు యూనివర్సిటీ ప్రొఫెసర్లు కొంపల్లిని సందర్శించి ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రజల భాగస్వామ్యం బాగుందని కితాబిచ్చారు.

### మరింత అభివృద్ధి చేసేందుకు కృషి

*– జెమ్మి నాగమణి, సర్పంచి, కొంపల్లి*

జాతీయ స్థాయిలో కొంపల్లికి గుర్తింపు రావడం చాలా ఆనందంగా ఉంది. మంత్రి కేటీఆర్, ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్, జిల్లా కలెక్టర్ ఎంవీరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ పాలకవర్గం సహాయ సహకారాలతోనే గ్రామాభివృద్ధి సాధ్యమైంది. అందరి అండదండలతో గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తాం.


డైరీ విడుదల చేస్తున్న ప్రముఖులు

## సిటీ సివిల్ కోర్టు అడ్వకేట్స్ హౌసింగ్ సొసైటీ డైరీ ఆవిష్కరణ

గోల్నాక, న్యూస్‌టుడే: అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తాలోని తెలంగాణ మహేంద్ర సంఘం హాలులో హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు అడ్వకేట్స్ హౌసింగ్ సొసైటీ నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. శనివారం హైదరాబాద్ సిటీ సివిల్ కోర్డు అడ్వకేట్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు సభ్యుడు వలీ, రంగారెడ్డి జిల్లా అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణారెడ్డి, నాంపల్లి క్రిమినల్ కోర్టు హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు కొండారెడ్డి తదితరులు డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో హౌసింగ్ సొసైటీ ఛైర్మన్ మాణిక్ ప్రభుగౌడ్, ప్రధాన కార్యదర్శి తిరుమలరావు, శ్రీహరికుమార్, వేణుకుమార్, సురేశ్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.







సరూర్‌నగర్ స్టేడియంలో శనివారం జరిగిన బీసీల మహాసభకు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు తరలివచ్చారు. ఈ సందర్భంగా సినీ నటుడు సుమన్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో యువత సందడి చేశారు.


నుజ్జయిన కారు


చికిత్స పొందుతున్న శరత్‌రావు


వీణ


భవజ్ఞ

## విహార యాత్రలో విషాదం

- సికింద్రాబాద్‌కు చెందిన నలుగురికి తీవ్ర గాయాలు

ఆరిలోవ, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా అందాలు చూడటానికి వచ్చిన ఓ కుటుంబం అనుకోని సంఘటనతో గాయాలపాలైంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. సికింద్రాబాద్‌లో ఉండే రాచకొండ ఆదిబాబు శరత్‌రావు విశాఖ ఉత్సవ్, నగరంలోని పర్యాటక ప్రాంతాలు చూసేందుకు భార్య వీణ, కుమార్తె భవజ్ఞ, వ్యక్తిగత సహాయకుడు చరణ్‌తో కలసి గురువారం విశాఖ వచ్చారు. శనివారం సింహాచలం అప్పన్నను దర్శించుకుని తిరిగి వెళ్లాల్సి ఉంది. ఉదయం హోటల్ నుంచి ఇన్నోవా వాహనంలో సింహాచలం బయలు దేరారు. చినగదిలి నార్త్ షిర్డీసాయిబాబా ఆలయం కూడలి వద్దకు రాగానే పక్క రోడ్డులో ఎదురుగా వేగంగా వస్తున్న పారిశుద్ధ్య లారీ అదుపు తప్పి సిగ్నల్ స్తంభాన్ని ఢీకొని వీరి వాహనంపై తిరగబడింది. ఇన్నోవా నుజ్జయ్యింది. అందులో ప్రయాణిస్తున్న నలుగురికీ తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవింగ్ చేస్తున్న చరణ్ సీటులోనే ఇరుక్కున్నాడు. మిగిలిన ముగ్గురిని సమీపంలోని అపోలో ఆసుపత్రికి తరలించారు. స్థానికులు సమీపంలో ఉన్న ఓ పొక్లెయిన్‌ను సహాయంతో లారీని తప్పించడంతో చరణ్‌ను బయటకు తీశారు. అతనికి కాలు విరిగిపోయింది. శరత్‌రావుకు నుదిటిపై గాయమైంది. ఆయన భార్య వీణకు చేయి విరిగిపోయింది. కుమార్తె భవజ్ఞకు దవడ విరిగిపోయింది. ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్.ఐ. అప్పారావు దర్యాప్తు చేస్తున్నారు.

## రాంగ్ కాల్.. ఓ బాలిక జీవితాన్ని చిదిమేసింది


నిందితుడిని చూపుతున్న ఏసీపీ ఆనంద్

జహనుమా, న్యూస్‌టుడే: ఓ రాంగ్‌కాల్ వ్యవహారం బాలిక జీవితాన్ని చిదిమేసింది. ఫోన్ ద్వారా పరిచయం పెంచుకున్న యువకుడు తన మాయ మాటలతో ఆ బాలికను ఏడాదిపాటు నమ్మించి ఆపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శనివారం రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ బి.ఆనంద్ కేసు వివరాలు వెల్లడించారు. యాకుత్‌పురాలోని ఓ బస్తీకి చెందిన బాలిక(16) తల్లితోపాటు పనిలోకి వెళ్లేది. రియాస్‌నగర్ బస్తీకి చెందిన మహ్మద్ నసీర్‌బాబా(19) ఇంటర్ చదువుతున్నాడు. ఒక రోజు అతనికి రాంగ్ ఫోన్‌కాల్ ద్వారా బాలిక పరిచయమైంది. ఏడాది నుంచి తరచూ ఇరువురు మాట్లాడుకోవడం, వాట్సాప్ ద్వారా సందేశాలు ఇచ్చుకోవడం జరిగింది. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం బాలికను ఇంటి నుంచి తీసుకువెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసిన బాలిక తల్లి చుట్టుపక్కల వెతికి, రెయిన్‌బజార్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు గాలించి బాలికను పట్టుకుని ఆమె ఇచ్చిన సమాచారంతో నసీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతన్ని స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించగా బాలికపై అత్యాచారం చేసినట్లు అంగీకరించాడు.

## ఎగ్జిబిషన్‌కు ప్రత్యేక బస్సులు

ఈనాడు, హైదరాబాద్: జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 15 వరకు నాంపల్లిలో నిర్వహించనున్న ఎగ్జిబిషన్‌కు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ప్రకటించింది. మొత్తం 29 డిపోల నుంచి ప్రత్యేక బస్సులుంటాయని ఆర్టీసీ గ్రేటర్ జోన్ ఈడీ పురుషోత్తం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1 నుంచి 12వ తేదీ వరకు 125 బస్సులను నడుపుతామన్నారు. 13వ తేదీ నుంచి సాధారణ రోజుల్లో 180 ప్రత్యేక బస్సులు, వారాంతాల్లో 250 బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. ఎగ్జిబిషన్ మైదానం వద్ద సాయంత్రం 6 గంటల నుంచి బస్సుల గమనంపై పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. కాచిగూడ, మెహిదీపట్నం డిపో మేనేజర్లు అందుబాటులో ఉంటారని.. బస్సులకోసం సంబంధించిన సమాచారం, ఫిర్యాదుల కోసం నేరుగా, 9959226129, 9959226130, 9959226133 చరవాణి నంబర్ల ద్వారా వారి దృష్టికి తీసుకురావాలని ఈడీ ప్రయాణికులకు సూచించారు.

## రేపు అదనపు ఎంఎంటీఎస్ సర్వీసులు

ఈనాడు, హైదరాబాద్: కల్వరీ టెంపుల్‌కు వెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని.. లింగంపల్లి నుంచి ఫలక్‌నుమాకు, లింగంపల్లి నుంచి హైదరాబాద్‌కు అదనంగా రెండు ఎంఎంటీఎస్ సర్వీసులు నడుపుతున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో ఉమాశంకర్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ నడుస్తున్న 121 సర్వీసులకు అదనంగా వీటిని నడుపుతున్నట్లు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 1.30 గంటలకు లింగంపల్లి నుంచి ఫలక్‌నుమాకు, 1.35 గంటలకు లింగంపల్లి నుంచి హైదరాబాద్‌కు ఈ రైళ్లు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

హాయ్... నేస్తాలూ... బాగున్నారా... ప్చ్... 2017 ఇట్టే గడిచిపోయింది. హాయిగా ఆడుతూ పాడుతూ ఆనందంగా గడిపేశాం. సంవత్సరమంతా బోలెడు సంఘటనలు జరిగాయి. అందులో కొన్ని మనల్ని సంతోషపెడితే.. కొన్ని ఏడిపించేశాయి... మరికొన్ని మన ముఖాల్లో నవ్వులు పూయించి అలరించాయి. ఆశ్చర్యపరిచి... ఆటాడించి, మాయ చేసి... ఊరించి ఊరడించాయి ఇంకొన్ని. సరదాగా వీటికి అవార్డులు ప్రకటించేద్దామా... కొత్త ఏడాదిలో అడుగుపెట్టే ముందు... ఒక్కసారి మరొక్కసారి... ఆ ముచ్చట్లు గుర్తుకు చేసుకుందామా!

హాయ్! బుజ్జీ!!

# ఎన్నెన్నో గుర్తులు!



## హాలీవుడ్ హీరో...

ఆడుతూ పాడుతూ ఆడుకునే వయసులోనే మన నేస్తం హాలీవుడ్‌లో హీరో అయిపోయాడు. ఈ ఏడాది మెరిసిన చిన్నారిగా నిలిచాడు. ఎందుకంటే తను ఇంగ్లిష్ సినిమాలో పెద్ద పాత్రనే దక్కించుకున్నాడు. అవునూ! ఈ అబ్బాయి పేరు రోనీ ఆకురాతి. వీళ్ల సొంతూరు పశ్చిమ గోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం. అయితే వీళ్ల అమ్మా నాన్నాలతో కలిసి అమెరికాలోని ఇల్లినాయిస్‌లో ఉంటాడు. నటన మీద తనకున్న ఆసక్తిని గ్రహించిన వాళ్ల అమ్మ రోనీని యాక్టింగ్ స్కూల్లో చేర్పారు. అక్కడే తను నటన పాఠాలు నేర్చుకున్నాడు. చివరికి 'గ్రోయింగ్ అప్ స్మిత్' సినిమాలో హీరోగా నటించే అవకాశాన్ని దక్కించుకున్నాడు. అదీ అంత తేలికగా ఏం రాలేదు. ఆ పాత్ర కోసం వెయ్యి మందికి పైగా పిల్లలు పోటీపడ్డారు. అందరికంటే రోనీ హావభావాలు దర్శకుడికి బాగా నచ్చడంతో చిత్రంలో నటించే అవకాశం వచ్చింది.

మెరిశాడు!

## జీవి కొంచెం... ఆయువు ఘనం!



శాస్త్రవేత్తలు ఎప్పుడూ పరిశోధనలు చేసి కొత్త కొత్త సంగతులు బయటపెడుతుంటారుగా. అలా ఈ ఏడాది ఓ ఆసక్తికరమైన విషయం తెలుసుకున్నారు. అదేంటంటే... సముద్రపు లోతుల్లో ఉండే ట్యూబ్ వార్మ్ అనే జీవుల్లో ఒకటైన 'ఎస్కర్నియా లామినటా' గురించి. దేహమంతా గొట్టాల్లా ఉండే ఈ జీవి ఏకంగా 300 ఏళ్ల కన్నా ఎక్కువే జీవిస్తుందట. అందుకే ఇప్పుడున్న జీవరాశులన్నింటిలో అత్యధికంగా బతికే ప్రాణి ఇదే కావచ్చని అనుకుంటున్నారు పరిశోధకులు. ఎక్కువగా గల్ఫ్ ఆఫ్ మెక్సికో సముద్రం లోపల ఉండే ఈ జీవి ఆకారం చిన్నది, దానికి తోడు లోతుల్లో ఉండటం వల్ల ఇప్పటి వరకు దీని గురించి తెలియలేదట. ఏది ఏమైనా భలే జీవి కదూ!

ఆశ్చర్యపరిచింది!



## కొత్త కొత్త చాక్లెట్!



చాక్లెట్... ఈ పేరు వింటేనే నోరూరిపోతుంది. అయితే ఇప్పటి వరకు వీటిల్లో డార్క్, మిల్క్, వైట్ చాక్లెట్లే మనకు తెలుసు. కానీ ఈ ఏడాదిలో కొత్త రంగు కొత్త రుచితో ఓ చాక్లెట్ వచ్చి వాటి పక్కన చేరిపోయింది. పేరు రూబీ చాక్లెట్. ఎరుపు గులాబీ రంగులు కల గలిపి ఉంటుంది. ఇప్పటికే తినే ఉంటారుగా. 'అదేంటీ? చిన్న చిన్న చాక్లెట్ బిళ్లలు చాలా రంగుల్లోనే ఉంటాయే మరి దీని ప్రత్యేకత ఏంటో' అనే సందేహం వచ్చిందా? అసలు విషయం ఏమంటే.. వాటన్నింటిలో కృత్రిమ రంగులు కలుపుతారు. కానీ డార్క్, మిల్క్, వైట్, రూబీ చాక్లెట్ రంగులు మాత్రం సహజసిద్ధమైనవి. ఎలాంటి రంగులు కలపకుండా తయారుచేసినవన్నమాట. రూబీ కోకో బీన్స్‌తో తయారుచేశారీ రూబీ చాక్లెట్‌ని. తెలుపు రంగు చాక్లెట్ బార్ మార్కెట్లోకి వచ్చాక అంటే దాదాపు 80 సంవత్సరాల తర్వాత మొదటిసారిగా చాక్లెట్లలో కొత్తరంగు వచ్చింది ఈ ఏడాదిలోనే.

ఊరించింది!

## గిరగిరా తిప్పేసింది!



ఆటాడించింది!

ఈ ఏడాదిలో పిల్లల దగ్గర్నించి పెద్దల వరకు ఎవరి చేతిలో చూసినా ఆ వస్తువే ఎక్కువగా కనిపించింది. అందరితో తెగ ఆడేసుకుంది.. ఆటాడించింది. అదేనండీ... ఫిడ్జెట్ స్పిన్నర్. మీరూ కొనే ఉంటారుగా! 2017 మార్కెట్లోకి వచ్చిన బొమ్మలన్నింటిలో మొదటిస్థానం దీనిదే. ఆన్‌లైన్ వెబ్‌సైట్లలోనూ ఎక్కువగా కొనుగోలైంది ఇదే. ఈ బొమ్మతో ఎలా ఆడాలో చూపిస్తూ చేసిన వీడియోలను కోట్ల మంది వీక్షించారు. చేతిలో పట్టేంత పరిమాణంలో మూడు రెక్కలతో ఉండే ఈ చిన్న బొమ్మ పరికరం బేరింగుల సాయంతో బొంగరంలా తిరిగేస్తుంది. ఆట విడుపుకే కాకుండా ఈ బొమ్మ ఒత్తిడిని దూరం చేస్తుందని పేరు తెచ్చుకుంది. ఈ ఏడాదిలో ఆకట్టుకున్న ఈ స్పిన్నర్‌ని ఎప్పుడో 1993లోనే కనిపెట్టారు.

## ఆకు కాదిది జీవి..

ఈ ఏడాది శాస్త్రవేత్తలు గుర్తించిన ఓ రకం కీటకం అందరినీ మాయ చేసింది. ఎందుకంటే అచ్చం ఆకులాగే ఉంటుంది. ఈ జీవి కాట్యాడిడ్ పురుగుల జాతిలో కొత్తది. దాని శరీరం, కాళ్లు.. శరీరభాగాలన్నీ చిగురుటాకుల్లాగే ఉంటాయి. కనుమాయ చేసేలా ఉన్న ఇది శాస్త్రవేత్తల కళ్ల నుంచి ఇప్పటి వరకూ తప్పించుకుంది. చివరికి ఈ ఏడాదిలో మాత్రం దొరికిపోయింది. మలేసియాలో బోర్నియోలో ఈ వింత పురుగును గుర్తించారు. ఆకులు అలముల మధ్యలో ఉన్న దీన్ని పరిశీలనగా చూస్తే తప్ప ఇది జీవన్న విషయం ఎవ్వరికీ తెలియదు. వీటిల్లో ఆడకీటకాలు ఇలా గులాబీరంగులో నిగనిగలాడుతూ ఉంటాయి. మగవి ఆకుపచ్చ రంగులో ఆకులాగే ఉంటాయి.

మాయ చేసింది!



అలరించింది!



## ఎమోజీల సందడి..

ఈ ఏడాది వచ్చిన, పిల్లలకు ఎక్కువగా నచ్చిన.. యానిమేషన్ సినిమా 'ది ఎమోజీ'. ఫోను, మెసేజింగ్ యాప్‌ల్లో మనం ఎక్కువగా ఎమోజీల్ని వాడేస్తుంటాం. వాటికే నోరుంటే అవి మాట్లాడేస్తే ఎలాగుంటుంది? అదే ఈ సినిమాలో చూడొచ్చు. దీనిలో హీరో ఎమోజీ జీన్. తోటి ఎమోజీలన్నీ ఒక్కొక్క హావభావాన్నే పలికిస్తే తాను మాత్రం చాలా రకాల హావ భావాల్ని పలికిస్తుంది. అయితే అదే తన గొప్పదనం అని గుర్తించకుండా పక్కవాటిలా మారాలనుకుంటుంది. అందుకు కోడ్ కనిపెట్టడం, చివరికి తనలా ఉండటమే ప్రత్యేకత అని తెలుసుకోవడం కథ. అయితే ఎమోజీ బొమ్మలు మాట్లాడుకోవడం, వాటి హావభావాలు, వేషధారణ... చూస్తుంటే అన్నీ భలే గమ్మత్తుగా అనిపిస్తాయి. అందుకే ప్రపంచ దేశాలన్నీ ఈ సినిమాని ఆసక్తిగా చూశాయి. సోనీ పిక్చర్స్ తీసిన ఈ సినిమాలో వేషధారణలు తమాషాగా ఉన్నాయి. అలాంటివి ధరించి కొంత మంది వీధుల్లో ఒక్కచోట చేరారు. గిన్నిస్ రికార్డు కొట్టారు.

## పే...ద్ద ఫెర్రిస్ వీల్!



కిక్కిచ్చింది!

మనకు రైడ్లంటే భలే సరదా. వాటిల్లో ఎక్కాలన్నా... వాటి కబుర్లు వినాలన్నా మనకెంతో ఇష్టం మరి. అందుకే ప్రపంచంలో వింతైన భారీ రైడ్లు ఏర్పాటు చేస్తే ఆ సంగతులు వెంటనే చెప్పేసుకుంటాం. అలా ఈ ఏడాదిలో కొత్తగా వచ్చింది ఓ ఫెర్రిస్ వీల్. చైనాలోని వీఫాంగ్ నగరంలో ఏర్పాటు చేశారు దీన్ని. పెద్ద చక్రంలా ఉండి గుండ్రంగా రయ్యి రయ్యిమని తిప్పేసే ఫెర్రిస్ వీల్ తెలుసుగా. వాటిల్లోనే భిన్నమైందిది. ఆ ప్రత్యేకత ఏమిటంటే... చక్రం మధ్యలో చువ్వలు లేని ఏకైక ఫెర్రిస్ వీల్. పైగా ప్రపంచంలోని ఎత్తయిన వీల్స్‌లో ఒకటైన 'లండన్ ఐ' కన్నా ఇదే పెద్దది. 1,771 అడుగుల ఎత్తులో ఉన్న బైలాంగ్ రివర్ బ్రిడ్జ్‌పై కట్టిన ఈ జెయింట్ వీల్ ఎత్తు ఏకంగా 476 అడుగులు. మొత్తం 36 గదులతో భారీ ఉంగరంలా అందర్నీ ఆకర్షించింది. గిరగిరా తిరిగేస్తూ ఎక్కిన వారికి గుండె జారిపోయినట్టు గమ్మత్తయిన అనుభూతినిస్తోంది. తెగ ఆకట్టుకుంది.



## ఎంత పనిచేసింది!

ఈ ఏడాది కంప్యూటర్లు, ఫోన్లలో పిల్లల్ని భయభ్రాంతులకు గురిచేసిన గేమ్ బ్లూవేల్. బ్లూవేల్ ఛాలెంజ్ పేరుతో ఇది ఆటగాళ్లను ఆత్మహత్య చేసుకునేటట్లు ప్రేరేపించి వారి జీవితాల్ని బలితీసుకుంటుంది. నిజానికి ఈ బ్లూవేల్ డౌన్‌లోడ్ చేసుకుని ఆడే ఆట కాదు. సాఫ్ట్‌వేర్ కూడా కానే కాదు. ఇంటర్నెట్‌కు ఆకర్షితులైన పిల్లలకు ప్రత్యేక స్నేహితులుగా పరిచయం చేసుకుని రహస్యంగా ఆన్‌లైన్ ఛాలెంజ్‌లు ఇస్తుంది. బ్లేడుతో చేతిపై చిత్రాలు గీసుకోవడం లాంటి హింసతో కూడిన టాస్క్‌లతో ప్రాణాలు తీసేస్తుంది. ఈ ఏడాదే వచ్చిన ఈ ఆట కొంత మంది ప్రాణం తీసి వారి ఇంట్లో వారికి తీరని వేదనను మిగిల్చింది. తల్లిదండ్రుల్ని ఎక్కువ కలవర పెట్టిన ఈ గేమ్ ఈ ఏడాది మనల్ని చాలానే భయపెట్టేసింది. ఈ ఆటను నిషేధించే స్థాయికి తీసుకెళ్లింది.

భయపెట్టింది!

# ప్రతిభ

# 2017 క్రీడలు

**15 జులై**

వింబుల్డన్ మహిళల సింగిల్స్ విజేతగా గార్బైన్ ముగురుజ (స్పెయిన్) నిలిచింది. రన్నరప్ వీనస్ విలియమ్స్ (అమెరికా).



**29 అక్టోబరు**

ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ సిరీస్ బ్యాడ్మింటన్ టైటిల్‌ను ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్ నెగ్గాడు. తద్వారా ఒక ఏడాదిలో 4 సూపర్ సిరీస్ టైటిళ్లు సాధించిన ఏకైక భారత షట్లర్‌గా శ్రీకాంత్ రికార్డు సృష్టించాడు.



## పాలీ ఉమ్రిగర్ అవార్డు విజేత...?

### జనవరి

**8:** చెన్నై ఓపెన్ టెన్నిస్ టోర్నీ సింగిల్స్ టైటిల్‌ను రాబర్టో బౌటిస్టా అగట్ (స్పెయిన్) గెలుచుకున్నాడు.

**22:** భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ మలేసియా మాస్టర్స్ గ్రాండ్ ప్రి గోల్డ్ టైటిల్ నెగ్గింది. ఫైనల్లో చోచువాంగ్ (థాయ్‌లాండ్)ను ఓడించింది.

**28:** ఆస్ట్రేలియన్ ఓపెన్ - 2017 మహిళల సింగిల్స్ విజేతగా సెరెనా విలియమ్స్ (అమెరికా) నిలిచింది. ఫైనల్లో అక్క వీనస్ విలియమ్స్‌పై నెగ్గింది.

✪ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్) నెగ్గాడు. ఫైనల్లో రఫెల్ నాదల్ (స్పెయిన్)ను ఓడించాడు.

### ఫిబ్రవరి

**7:** జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను సౌరభ్‌వర్మ నెగ్గాడు. మహిళల సింగిల్స్ టైటిల్‌ను రితూపర్ణ దాస్ చేజిక్కించుకుంది.

**12:** భారత అంధుల క్రికెట్ జట్టు టీ20 ప్రపంచకప్ విజేతగా నిలిచింది. బెంగళూరులో జరిగిన ఫైనల్‌లో పాకిస్థాన్‌పై నెగ్గింది.

### మార్చి

**7:** మొబైల్ తయారీ సంస్థ ఒప్పో అయిదేళ్ల కాలానికి రూ. 1079 కోట్లు చెల్లించి టీమిండియా స్పాన్సర్‌షిప్ సొంతం చేసుకుంది.

### ఏప్రిల్

**2:** ఇండియా ఓపెన్ సూపర్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విజేతగా పీవీ సింధు నిలిచింది. రన్నరప్ కరోలినా మరిన్ (స్పెయిన్).

**23:** మాంటెకార్లో మాస్టర్స్ సిరీస్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను రఫెల్ నాదల్ (స్పెయిన్) నెగ్గాడు. ఈ టోర్నీ విజేతగా నిలవడం నాదల్‌కు ఇది పదోసారి కావడం విశేషం. దీంతో క్లే కోర్టులపై అత్యధికంగా 50 సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన క్రీడాకారుడిగా గుర్తింపు పొందాడు.

**30:** భారత స్క్వాష్ క్రీడాకారిణి జోష్న చిన్నప్ప ఆసియా స్క్వాష్ టైటిల్ గెలిచిన తొలి భారత ప్లేయర్‌గా నిలిచింది. చెన్నైలో జరిగిన ఫైనల్లో భారత్‌కే చెందిన దీపిక పల్లికల్‌పై నెగ్గింది.

### మే

**6:** అజ్లాన్‌షా హాకీ టోర్నీ విజేతగా బ్రిటన్ నిలిచింది. మలేసియాలోని ఇఫోలో జరిగిన టోర్నీలో ఆస్ట్రేలియా రన్నరప్‌గా, భారత్ మూడో స్థానంలో నిలిచాయి.

**21:** ఐపీఎల్ -2017 (సీజన్ 10) విజేతగా ముంబయి ఇండియన్స్ నిలిచింది. హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్లో రైజింగ్ పుణె సూపర్ జైంట్స్‌పై విజయం సాధించింది. మూడు ఐపీఎల్ టైటిళ్లు గెలిచిన తొలి జట్టుగా ముంబయి నిలిచింది.

**28:** దక్షిణ కొరియా జట్టు సుదిర్మన్ కప్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేతగా నిలిచింది. ఫైనల్లో చైనాపై నెగ్గింది.

### జూన్

**4:** తెలుగు తేజం భమిడిపాటి సాయి ప్రణీత్ థాయ్‌లాండ్ ఓపెన్ గ్రాండ్ ప్రి గోల్డ్ బ్యాడ్మింటన్ టైటిల్ నెగ్గాడు. సాయి కెరియర్‌లో ఇదే తొలి ప్రి గోల్డ్ టైటిల్.

**10:** ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ విజేతగా జెలెనా వోస్టాపెంకో (లాత్వియా) నిలిచింది. రన్నరప్ సిమోనా హలెప్ (రొమేనియా).

✪ పురుషుల సింగిల్స్ విజేతగా రఫెల్ నాదల్(స్పెయిన్) నిలిచాడు. రన్నరప్‌గా వావ్రింకా (స్విట్జర్లాండ్) నిలిచాడు.

**18:** ఇండోనేషియా ఓపెన్ సూపర్‌సిరీస్ ప్రీమియర్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేతగా తెలుగు తేజం కిదాంబి శ్రీకాంత్ నిలిచాడు. రన్నరప్ కజుమస సకాయ్ (జపాన్).

**10 ఫిబ్రవరి**

*హైదరాబాద్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి ద్విశతకం (204) నమోదు చేశాడు. తద్వారా వరుసగా 4 టెస్ట్ సిరీస్‌ల్లో డబుల్ సెంచరీలు సాధించిన ఏకైక బ్యాట్స్‌మన్‌గా రికార్డు సృష్టించాడు.*



**1 మార్చి**

*2015-16 సీజన్‌కు బీసీసీఐ వార్షిక అవార్డులను ప్రకటించింది. పాలీ ఉమ్రిగర్ అవార్డును విరాట్ కోహ్లికి ప్రకటించారు. 2011-12, 2014-15 లో కూడా ఈ అవార్డు గెలుచుకున్న కోహ్లి, మూడుసార్లు దీనికి ఎంపికైన తొలి భారత క్రికెటర్‌గా నిలిచాడు.*

### జులై

**9:** భువనేశ్వర్‌లో జరిగిన ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో భారత్ 29 (12 + 5 + 12) పతకాలతో అగ్రస్థానంలో నిలిచింది.

**15:** వింబుల్డన్ పురుషుల సింగిల్స్ విజేతగా రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్) నిలిచాడు. లండన్‌లో జరిగిన ఫైనలో మారిన్ సిలిచ్ (క్రొయేషియా)పై నెగ్గాడు.

**23:** మహిళల క్రికెట్ ప్రపంచకప్ విజేతగా ఇంగ్లండ్ నిలిచింది. లండన్‌లోని లార్డ్స్‌లో జరిగిన ఫైనల్లో 9 పరుగుల తేడాతో భారత్‌పై నెగ్గింది. భారత్ జట్టు కెప్టెన్‌గా మిథాలీ రాజ్ వ్యవహరించారు.

**24:** యూఎస్ ఓపెన్ గ్రాండ్ ప్రి గోల్డ్ టోర్నీ పురుషుల సింగిల్స్ టైటిల్ విజేతగా భారత్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ నిలిచాడు. రన్నరప్ - భారత క్రీడాకారుడు పారుపల్లి కశ్యప్.

### ఆగస్టు

**6:** లండన్‌లో జరిగిన ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల పరుగులో అమెరికా అథ్లెట్ జస్టిన్ గాట్లిన్ స్వర్ణం నెగ్గాడు. ఉసేన్ బోల్ట్ (జమైకా) తన చివరి రేసులో కాంస్యానికే పరిమితమయ్యాడు.

**17:** బల్గేరియా ఓపెన్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను భారత్‌కు చెందిన లక్ష్యసేన్ నెగ్గాడు.

**27:** ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను ఒకుహర (జపాన్) నెగ్గింది. రన్నరప్‌గా పీవీ సింధు నిలిచింది. పురుషుల సింగిల్స్ టైటిల్‌ను విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్) నెగ్గాడు.

### సెప్టెంబరు

**5:** వరల్డ్ రెజ్లింగ్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో పాల్గొన్న తొలి భారతీయురాలిగా హరియాణాకు చెందిన కవితాదేవి చరిత్ర సృష్టించింది.

**7:** కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో రాగాల వెంకట రాహుల్, రాగాల వరుణ్ స్వర్ణాలు నెగ్గారు.

**10:** యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను స్లోన్‌స్టీవెన్స్ (అమెరికా) గెలిచింది. ఫైనల్లో మాడిసన్ కీస్‌పై నెగ్గింది.

✪ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను రఫెల్ నాదల్ (స్పెయిన్) నెగ్గాడు. రన్నరప్ - కెవిన్ ఆండర్సన్ (దక్షిణాఫ్రికా).

**17:** కొరియా ఓపెన్ సూపర్ సిరీస్ విజేతగా పీవీ సింధు నిలిచింది. సియోల్‌లో జరిగిన ఫైనల్లో ఒకుహర (జపాన్)పై నెగ్గింది.

### అక్టోబరు

**22:** ఆసియాకప్ హాకీ టోర్నీ విజేతగా భారత్ నిలిచింది. ఢాకాలో జరిగిన ఫైనల్లో 2-1 తో మలేసియాపై నెగ్గింది.

✪ డెన్మార్క్ ఓపెన్ సూపర్ సిరీస్ విజేతగా కిదాంబి శ్రీకాంత్ నిలిచాడు. రన్నరప్ లీ హ్యున్ (దక్షిణ కొరియా).

**28:** భారత్ తొలిసారిగా ఆతిథ్యమిచ్చిన ఫిఫా అండర్ -17 ప్రపంచకప్ విజేతగా ఇంగ్లండ్ నిలిచింది. కోల్‌కతాలో జరిగిన ఫైనలో 5-2 గోల్స్‌తో స్పెయిన్‌ను ఓడించింది.

**30:** బ్రిటన్ రేసర్ లూయిస్ హామిల్టన్ ఫార్ములావన్ ప్రపంచ ఛాంపియన్ షిప్ టైటిల్ విజేతగా నిలిచాడు.

### నవంబరు

**5:** మహిళల ఆసియాకప్ హాకీ టోర్నీ విజేతగా భారత్ నిలిచింది. జపాన్‌లోని కకామిగహరలో జరిగిన ఫైనల్లో చైనాపై నెగ్గింది.

**8:** జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పురుషులు, మహిళల విభాగాల్లో హెచ్‌ఎస్ ప్రణయ్, సైనా నెహ్వాల్ విజేతలుగా నిలిచారు.

**27:** భారత స్టార్ పంకజ్ అడ్వాణీ ఐబీఎస్ఎఫ్ ప్రపంచ స్నూకర్ టైటిల్ విజేతగా నిలిచాడు. పంకజ్ కెరియర్‌లో ఇది 18 వ ప్రపంచ టైటిల్.

### డిసెంబరు

**8:** ప్రతిష్ఠాత్మక గోల్డెన్ బాల్ అవార్డును పోర్చుగల్ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రోనాల్డోకు పారిస్‌లో ప్రదానం చేశారు. రొనాల్డో ఈ అవార్డు గెలుచుకోవడం ఇది అయిదోసారి.

**27:** దక్షిణాఫ్రికాలోని పోర్ట్ ఎలిజబెత్‌లో ఐసీసీ ప్రయోగాత్మకంగా నిర్వహించిన మొట్టమొదటి నాలుగు రోజుల టెస్టు మ్యాచ్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ 120 పరుగుల తేడాతో జింబాబ్వేను ఓడించింది.

**28:** సౌదీ అరేబియాలోని రియాద్‌లో జరిగిన ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను విశ్వనాథన్ ఆనంద్ గెలుచుకున్నాడు.

# 2017 పర్యటనలు

### జనవరి

**7:** ఏడు రోజుల పర్యటన నిమిత్తం పోర్చుగల్ ప్రధానమంత్రి ఆంటోనియో కోస్టా దిల్లీ చేరుకున్నారు. ప్రధాని మోదీతో సమావేశమయ్యారు.

**11:** భారత పర్యటనలో భాగంగా కెన్యా అధ్యక్షుడు ఉహురు కెన్యాట్టా రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, ప్రధాని మోదీలతో దిల్లీలో సమావేశమయ్యారు.

### ఫిబ్రవరి

**21:** అమెరికా నుంచి వచ్చిన 26 మంది శాసనకర్తల బృందం ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమైంది. అమెరికాలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఈ బృందం రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

✪ భారత పర్యటనలో భాగంగా మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

### మార్చి

**6:** ఉపరాష్ట్రపతి మహ్మద్ హమీద్ అన్సారీ రెండు రోజుల పాటు జకార్తాలో పర్యటించారు. మొట్టమొదటి ఐఓఆర్ఏ (ఇండియన్ ఓషన్ రిమ్ అసోసియేషన్) నాయకత్వ సదస్సులో పాల్గొన్నారు.

**7:** ఉగాండా ప్రధానమంత్రి రుహాకనా రుగుండా అయిదు రోజులపాటు భారత్‌లో పర్యటించారు.

### ఏప్రిల్

**8:** బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

**10:** భారత్‌లో పర్యటిస్తున్న ఆస్ట్రేలియా ప్రధాని మాల్కమ్ టర్న్‌బుల్ మోదీతో సమావేశమయ్యారు.

**28:** సైప్రస్ అధ్యక్షుడు నికోస్ అనస్తాషియెస్ భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

### మే

**11:** ప్రధాని మోదీ రెండు రోజులపాటు శ్రీలంకలో పర్యటించారు. కొలంబోలో నిర్వహించిన అంతర్జాతీయ వేసక్ దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

**31:** ప్రధాని మోదీ స్పెయిన్ పర్యటనలో భాగంగా అధ్యక్షుడు మారియానో రజోయ్‌తో సమావేశమయ్యారు. ఏడు ఒప్పందాలపై సంతకాలు చేశారు.

### జూన్

**1:** మోదీ రష్యా పర్యటనలో భాగంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో సమావేశమయ్యారు. నాగ్‌పుర్-సికింద్రాబాద్ మధ్య అత్యంత వేగవంతమైన రైలు సర్వీసు ఏర్పాటుకు ఈ సందర్భంగా ఒప్పందం కుదిరింది.

**3:** ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో పారిస్‌లోని అధ్యక్ష భవనం ఎల్సీ ప్యాలెస్‌లో సమావేశమయ్యారు.

**9:** కజకిస్థాన్ రాజధాని ఆస్తానాలో జరిగిన షాంఘై సహకార సంస్థ వార్షిక సదస్సుకు ప్రధాని మోదీ హాజరయ్యారు.

**24:** ప్రధాని మోదీ పోర్చుగల్ పర్యటనలో భాగంగా పోర్చుగల్ ప్రధాని ఆంటోనియా కోస్తాతో సమావేశమయ్యారు.

**27:** మూడు రోజుల అమెరికా పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ వాషింగ్టన్‌లోని శ్వేతసౌధంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమయ్యారు. సీమాంతర ఉగ్రవాదంపై ఇరువురు నేతలు ప్రధానంగా చర్చించారు.

✪ అమెరికా పర్యటన తర్వాత మోదీ నెదర్లాండ్స్ చేరుకుని, ప్రధాని మార్క్ రూత్‌తో సమావేశమయ్యారు.

### జులై

అంబర్‌పేట నియోజకవర్గంలో తాగునీటి ఏటీఎంలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రజలకు స్వచ్ఛమైన, పరిశుద్ధమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో నగరంలో వాటర్ ఏటీఎంలకు శ్రీకారం చుట్టారు. నగరానికి వచ్చిన దేశ, విదేశీ పర్యాటకులు, పనుల నిమిత్తం ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారు, నగర ప్రజలకు తక్కువ ధరలో పరిశుభ్రమైన నీటిని అందించాలనే లక్ష్యంతో తాగునీటి ఏటీఎంలను ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా నగరానికి వచ్చే పర్యాటకులు, రాష్ట్ర, నగర ప్రజలకు అధిక ధరలకు మినరల్ వాటర్ సీసాలు కొనుగోలు చేసి తాగే ఆగత్యం తప్పుతుంది. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన తాగునీటి ఏటీఎంల ద్వారా నామమాత్ర ధరకే పరిశుభ్రమైన నీటిని కొనుగోలు చేసి తాగవచ్చు. గోల్నాక కబేళా వద్ద తాగునీటి ఏటీఎంను ఏర్పాటు చేస్తున్నారు. ఈ వాటర్ ఏటీఎం వినియోగంలోకి వస్తే జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వందలాది మందికి మేలు కలుగుతుంది.

### 200 ఏర్పాటు

నగరంలోని ప్రధాన రహదారులు, పార్కులు, క్రీడా మైదానాలు తదితర రద్దీ ప్రాంతాల్లో 200 లకుపైగా వాటర్ ఏటీఎంలను ఏర్పాటు చేసేందుకు జీహెచ్‌ఎంసీ సన్నాహాలు చేస్తోంది. మినరల్ వాటర్ సీసాలతో పోల్చితే వాటర్ ఏటీఎంలలో చాలా తక్కువ ధరకే పరిశుభ్రమైన నీరు లభిస్తుంది. లీటర్ పరిమాణంలో ఉండే బ్రాండెడ్ తాగునీటి సీసా కొనుగోలుకు రూ.15 నుంచి రూ.20 వరకు వెచ్చించాల్సి వస్తోంది. కేవలం రూ. 2లకే లీటర్ స్వచ్ఛమైన తాగునీటిని వాటర్ ఏటీఎంల ద్వారా ప్రజలకు అందించనున్నారు. అదే విధంగా 10 లీటర్లకు రూ.5, 20 లీటర్లకు రూ. 10 లకే వాటర్ ఏటీఎంల ద్వారా మినరల్ వాటర్ అందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. నగరంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి సంయుక్తంగా జోసబ్ ఇండియా అండ్ నేచర్ స్ప్రింగ్ ఇకో టాప్ సహకారంతో వాటర్ ఏటీఎంలను ఏర్పాటు చేస్తున్నారు. వాటి నిర్వహణను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.




వాటర్ ఏటీఎం

### ప్రయోగాత్మకంగా ఏర్పాటు

నియోజకవర్గంలో కాచిగూడ, నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, బాగ్అంబర్‌పేట తదితర మున్సిపల్ డివిజన్లు ఉన్నాయి. గోల్నాక డివిజన్‌లోని కబేళా వద్ద మొదటి వాటర్ ఏటీఎంను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేస్తున్నారు. తర్వాత మిగిలిన డివిజన్లకు తాగునీటి ఏటీఎంలను విస్తరించనున్నారు. జాతీయ తాగునీటి ప్రమాణాల ప్రకారం... వాటర్ ఏటీఎంలలో నీటి శుద్ధికి ఏడంచెల విధానాన్ని అనుసరిస్తున్నారు. నగరంలోని మొట్టమొదటి వాటర్ ఏటీఎంను ప్రజల రద్దీ అధికంగా ఉండే నల్గొండ చౌరస్తాలో ప్రారంభిస్తుండడం గమనార్హం. ప్రజలకు స్వచ్ఛమైన, శుద్ధి చేసిన తాగునీటిని అందించే ఏటీఎంను గోల్నాక కబేళా వద్ద ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఒకట్రెండు రోజుల్లో పనులు పూర్తికాగానే ప్రారంభించనున్నారు. ఈ వాటర్ ఏటీఎం ద్వారా నిత్యం వందలాది మంది దాహం తీరనుంది.

## దశలవారీగా ప్రజా సమస్యల పరిష్కారం



పాదయాత్ర చేస్తున్న కార్పొరేటర్ కాలేరు పద్మ

**గోల్నాక, న్యూస్‌టుడే:** దశలవారీగా ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని గోల్నాక కార్పొరేటర్ కాలేరు పద్మ అన్నారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. శనివారం తులసీనగర్ కాలనీలో ఆమె పాదయాత్ర చేశారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాత్రి ఎల్ఈడీ వీధి దీపాలు వెలిగేలా చూడాలని అధికారులను కోరారు. కాలనీలోని మున్సిపల్ పార్కును సక్రమంగా నిర్వహించాలన్నారు. రహదారులపై పారిశుద్ధ్యాన్ని మరింతగా మెరుగు పర్చాలన్నారు. కార్యక్రమంలో తులసీనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంతోశ్, డి.బాబు, రామారావు, ఇంద్రసేన్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పులిజగన్

**గోల్నాక, న్యూస్‌టుడే:** దెబ్బతిన్న రహదారులకు దశలవారీగా మరమ్మతులు చేపట్టినట్లు అంబర్‌పేట కార్పొరేటర్ పులిజగన్ అన్నారు. చాలా ప్రాంతాల్లో రహదారులపై గుంతలు పడి అధ్వానంగా మారాయన్నారు. శనివారం అలీకేఫ్ చౌరస్తాలో చేపట్టిన సిమెంట్ మరమ్మతు పనులను మున్సిపల్ ప్రాజెక్ట్ డివిజన్ ఏఈ రోహిత్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రహదారుల మరమ్మతులు పూర్తయితే వాహనదారులు, స్థానికుల ఇబ్బందులు తొలగుతాయన్నారు. కార్యక్రమంలో నేతలు సాధిక్, రవికుమార్, శ్రీనివాస్‌గుప్తా, విష్ణువర్ధన్, బాబుమియా, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు తడి, పొడి చెత్తపై అవగాహన

**గోల్నాక, న్యూస్‌టుడే:** పొదుపు సంఘాల మహిళలకు తడి, పొడి చెత్తపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనివారం గోల్నాక కమలానగర్ సామాజిక భవనంలో జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్-16 పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వావ్ బృందం ఇన్‌ఛార్జి రామకృష్ణ, స్థానిక కార్పొరేటర్ కాలేరు పద్మ మాట్లాడుతూ... మహిళలు క్రియాశీలంగా వ్యవహరిస్తేనే తడి, పొడి చెత్త కార్యక్రమం విజయవంతమవుతుందన్నారు. ఈ విషయంపై పొదుపు సంఘాల మహిళలు ఇంటింటికి వెళ్లి అవగాహనను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పొదుపు సంఘాల మహిళా నేతలు భారతి, లతశ్రీ, స్వరూప, ఉమారాణి, స్వప్న, రఘువీర్, పారిశుద్ధ్య సిబ్బంది తారకరాజు, శ్రీధర్, ప్రవీణ్, వార్డు సభ్యులు భరత్‌రాజ్, నరేశ్, ఉమ, పల్లవి, రాజ్యలక్ష్మి, జనార్దన్, ధనలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

## ఎస్సై శిక్షణకు వచ్చిన యువకుడి అదృశ్యం



గోపినాథ్ (పాతచిత్రం)

**గోల్నాక, న్యూస్‌టుడే:** ఎస్సై శిక్షణ కోసం నగరానికి వచ్చిన యువకుడు అదృశ్యమైన సంఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఆనంద్‌కుమార్ కథనం ప్రకారం... ఖమ్మం జిల్లా మునిగేపల్లి కూసుమంచి గ్రామానికి చెందిన కృష్ణ కుమారుడు గోపినాథ్ (22) ఎస్సై శిక్షణ నిమిత్తం నగరానికి వచ్చి అంబర్‌పేట సీపీఎల్ రోడ్డులోని తిరుమల హోటల్ వద్ద ఉంటున్నాడు. ఈ నెల 22 నుంచి గోపినాథ్ నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో కృష్ణ అంబర్‌పేటకు వచ్చి ఆరా తీశాడు. ఇంటిని ఖాళీ చేసి వెళ్లిపోయినట్లు పొరుగువారు చెప్పారు. బాధితుడి తండ్రి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై వీరయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## భాజపా మహిళా మోర్చా మౌన ప్రదర్శన

**గోల్నాక, న్యూస్‌టుడే:** భాజపా మహిళా మోర్చా ఆధ్వర్యంలో మౌన ప్రదర్శన నిర్వహించారు. ప్రేమోన్మాది కార్తీక్ సంధ్యారాణిపై పెట్రోల్‌ను పోసి కాల్చి హత్య చేసినందుకు నిరసనగా శనివారం అంబర్‌పేట పటేల్‌నగర్‌లో భాజపా మహిళా మోర్చా నగర కార్యదర్శి హారతి ఆధ్వర్యంలో మౌన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. దారుణానికి ఒడిగట్టిన కార్తీక్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా నేతలు హేమలత, రత్నప్రభ, ప్రమీల, కల్పన, మమత, జ్యోతి, కవిత, భారతమ్మ, లత తదితరులు పాల్గొన్నారు.



మౌన ప్రదర్శనలో హారతి తదితరులు

## గంగపుత్ర కేక గజ్వేల్ బహిరంగ సభకు నేతలు

**గోల్నాక, న్యూస్‌టుడే:** గంగపుత్ర కేక గజ్వేల్ బహిరంగ సభకు అంబర్‌పేట నుంచి గంగపుత్ర సంఘాల నేతలు ర్యాలీగా వెళ్లారు. శనివారం గోల్నాక నుంచి తెలంగాణ గంగపుత్ర సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎ.సుదర్శన్, అంబర్‌పేట నుంచి తెలంగాణ గంగపుత్ర సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఏకే స్వరూప ఆధ్వర్యంలో వేర్వేరుగా నేతలు బహిరంగ సభకు బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో



నినాదాలు చేస్తున్న ఏకే స్వరూప తదితరులు

కుంటలు, చెరువుల్లో చేపలను పట్టే విషయంలో గంగపుత్రులు, ముదిరాజ్‌ల మధ్య గొడవలకు కారణమవుతున్న జీవో: 6ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గాలవారీగా చేపల మార్కెట్లను నిర్మించి గంగపుత్ర యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు మల్లయ్య, కొమ్మూరి శ్రీనివాస్, సాయిప్రసాద్, వెంకటేశ్, రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీగా వెళుతున్న ఎ.సుదర్శన్ తదితరులు

### నల్లకుంట డివిజన్..

**నల్లకుంట:** అంబర్‌పేట నియోజకవర్గం నుంచి చలో గజ్వేల్ గంగపుత్రుల సభకు ఆ సంఘం ప్రతినిధులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. గంగపుత్ర సంఘం అంబర్‌పేట నియోజకవర్గం గంగపుత్రుల సంఘం ఆధ్వర్యంలో శనివారం సభకు నల్లకుంట డివిజన్‌లోని ఛేనంబరు నుంచి ర్యాలీగా బయలుదేరారు. ఆ సంఘం నియోజకవర్గం అధికార ప్రతినిధి గుండియాదగిరితో కలిసి నియోజకవర్గం అధ్యక్షుడు పాకచందర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో నేతలు పోచయ్య, బాలరాజు, రాములు, రాంచంద్రయ్య, నర్సింహ, మాదగిరి, దేవేందర్, భాస్కర్, శ్రీనివాస్, ధర్మేందర్, నర్సింగ్‌రావు, సతీస్, గిరి, లింగం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## డెంగీతో మృతి చెందినా.. సందర్శించని అధికారులు

**నల్లకుంట, న్యూస్‌టుడే:** ప్రజల ఆరోగ్యం పట్ల అధికారులు పట్టించుకోవడంలేదని నల్లకుంట ప్రజలు ఆరోపిస్తున్నారు. డెంగీ వ్యాధితో మృతి చెందినా.. ఆ ప్రాంతాన్ని సందర్శించలేదు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. నల్లకుంట డివిజన్ గోల్నాక మార్కెట్‌లోని హనుమాన్‌నగర్‌లో మహిళ(34)కు తీవ్ర జ్వరం రావడంతో పది రోజుల క్రితం కుటుంబ సభ్యులు ఫీవరాసుపత్రికి తీసుకెళ్లారు. జ్వరం తగ్గకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. ఈనెల 24న ఓ ప్రైవేటు ఆసుపత్రికి మళ్లీ తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు డెంగీ సోకినట్లు నిర్ధారించారు. ఈనెల 25న ఆమె మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, బస్తీ ప్రజలు తెలిపారు. ఆమె మృతి చెంది వారం రోజులవుతున్నప్పటికీ వైద్యాధికారులు బాధితురాలి ఇంటి పరిసరాలను పరిశీలించలేదని స్థానికులు మండిపడుతున్నారు. మలేరియా వ్యాధి వస్తేనే హంగామా చేసే అధికారులు డెంగీ సోకి మృతి చెందినా కూడా పట్టించుకోకపోవడం విచారకరమని పలువురు వాపోయారు

## నేడు సీసీ కెమెరాల ప్రారంభం

**విద్యానగర్:** బాగ్ అంబర్‌పేట డివిజన్ డీడీ కాలనీలోని అజీజ్‌బాగ్‌లో ఆదివారం ఉదయం సీసీ కెమెరాల ఎమ్మెల్యే జి.కిషన్‌రెడ్డి ప్రారంభిస్తారని శాసన సభ్యుని పీఆర్ఓ వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో అధికారులతో పర్యటిస్తారని చెప్పారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరిస్తారని ఆయన పేర్కొన్నారు.

# అంబర్‌పేట

## దళిత సంఘర్షణ సమితి కమిటీ

**గోల్నాక, న్యూస్‌టుడే:** దళిత సంఘర్షణ సమితి అంబర్‌పేట నియోజకవర్గం కమిటీ సభ్యులను సమితి జాతీయ సమన్వయకర్త నల్లా రాధాకృష్ణ ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా హరీశ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా తరుణ్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా సునీల్ నియమితులయ్యారు. ఈ మేరకు వారికి నియామక పత్రాలను అందజేశామని పేర్కొన్నారు.

# ఉదాసీనం..వృథా

## పైపులైన్ పగిలి రోడ్డు పాలవుతున్న మంచినీరు

న్యూస్‌టుడే, నల్లకుంట

ప్రజలు ఏటా వేసవిలో తాగునీటి కోసం తంటాలు పడుతుంటారు. ఇప్పుడు మాత్రం మంచినీటిని వృథాగా రోడ్డు పాలు చేస్తున్నారు. మంచినీటిని సంరక్షించుకోవడంలో, నీటి వృథాను అరికట్టడంలో జలమండలి అధికారులు విఫలమవుతున్నారు. భవిష్యత్తు నీటి అవసరాల కోసం ఇంకుడు గుంతల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కానీ ప్రస్తుతం జరుగుతున్న నీటి వృథాను అరికట్టలేకపోతున్నారు. సమస్య తెలిసి జలమండలి అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. స్థానిక ఇసుక వ్యాపారులు తమవంతు బాధ్యతగా అధికారులపై ఒత్తిడి పెంచి నీటి వృథాను అరికట్టలేకపోతున్నారు.

### పైపులైన్ పగిలి..

నల్లకుంట డివిజన్‌లోని కోరంటి బ్రిడ్జి పక్కనే మంచి నీటి పైపులైను పగిలింది. కొన్ని నెలలవుతున్నా మరమ్మతులు చేపట్టడం లేదు. దీంతో మంచినీరు వృథాగా పోతోంది. దీంతో వందల లీటర్ల నీరు రోడ్డు పాలవుతోంది. అక్కడే ఇసుక నిల్వలు కూడా ఉంటుండడంతో లీకేజీ అవుతున్న నీరు అందులోకి చేరుతోంది. దీంతో సమస్య తీవ్రత కనిపించడంలేదు.



ఇసుక, కంకర, పొడి మధ్య నిలిచిన మంచినీరు

### లారీలతోనే సమస్య...

నిత్యం వచ్చే భారీ వాహనాల రాకపోకల వల్ల పైపులైను పగిలిందని స్థానికులు పేర్కొన్నారు. పైపుపైనే వాహనాలను పార్కింగ్ చేసి ఇసుక, కంకర, ఇతర నిర్మాణ సామగ్రిని దింపుతుంటారు. టన్నుల బరువుండే వాహనాల బరువును తట్టుకోలేక మంచినీటి పైపులైను పగిలిపోయింది. దీంతో నీరు వృథాగా పోతోంది. ఈ విషయాన్ని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా వారు పట్టించుకోవడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం



రహదారిపై ప్రవహిస్తున్న నీరు

చేశారు. ఇసుక అడ్డా కారణంగా నిత్యం రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ఇసుక రోడ్డుపైకి వస్తుండటంతో వాహనాలు అదుపు ప్రమాదానికి గురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక అడ్డా కారణంగా ప్రజలు ఇబ్బందులు పడడంతోపాటు లారీల రాకపోకల వల్ల మంచినీటి పైపులైను పగిలిపోయి నీరు వృథా అవుతోంది.

### ఇసుకలో చేరుతున్న నీరు

మంచినీటి పైపులైను పగిలి లీకేజీ అవుతున్న నీరు ఇసుక, కంకర పొడిలో కలుస్తోంది. దీంతో సమస్య తీవ్రత కనిపించడంలేదు. చాలా వరకు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. నీటి గుంతలా మారింది. నీటి సరఫరా ఎక్కువ ఉన్న సమయంలో రోడ్డుపై ప్రవహిస్తుంది. బురదమయంగా మారుతోంది. కొన్ని నెలల సమస్య ఉన్నప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు



ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ ఎక్కాల చైతన్య

**కాచిగూడ:** బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దని కాచిగూడ కార్పొరేటర్ ఎక్కాల చైతన్య సూచించారు. రహదారులను పరిశుభ్రంగా ఉంచి స్వచ్ఛ సర్వేక్షణ్‌ను విజయవంతం చేయాలని కోరారు. శనివారం చప్పల్‌బజార్ తదితర ప్రాంతాల్లో తడి, పొడి చెత్తపై ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో కన్నా, ధాత్రిక్ నాగేందర్ బాబ్జి, ప్రకాశ్‌యాదవ్, అశోక్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, అంజయ్య, సునీత, ప్రియ, మంజు, భూమమ్మ, శేషు, కిట్టూ పాల్గొన్నారు.



## హక్కులను సాధించుకోవాలి



ఆనంద్‌కుమార్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నేతలు

**కాచిగూడ, న్యూస్‌టుడే:** రాష్ట్రంలోని మున్నూరు కాపులు సమైక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని తెలంగాణ మున్నూరు కాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాశెట్టి ఆనంద్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం కాచిగూడలోని మున్నూరు కాపు సంఘంలో సికింద్రాబాద్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు లింగిశెట్టి హన్మంత్‌రావు ఈ నెల 31న నిర్వహించనున్న సంఘం నూతన సంవత్సర కాలమానిని ఆవిష్కరణ ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో మున్నూరు కాపుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. మున్నూరు కాపులు సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్య, ఉద్యోగ రంగాల్లో మరింతగా రాణించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. హక్కుల సాధనకు నగరంలో త్వరలో మున్నూరు కాపుల సింహ గర్జన బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మహాసభ రాష్ట్ర కార్యదర్శి చామకూర ప్రదీప్, మాణిక్ ప్రభు, కోశాధికారి బండి శ్రీనివాస్‌రావు, జంగయ్య, సికింద్రాబాద్ సంఘం ప్రధాన కార్యదర్శి నరేందర్, సి. శ్రీనివాస్, దేవేశ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రావ్యంగా సినీసంగీతం

**వివేక్‌నగర్:** అగ్రేసర బహుభాషా సినీ నటి సావిత్రి వర్ధంతి సందర్భంగా మహతి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభ తోడ్పాటుతో శనివారం కళాలలితకళావేదికలో సినీసంగీత విభావరి నిర్వహించారు. సంస్థ అధ్యక్షురాలు ఓరుగంటి రాజ్యలక్ష్మి సారథ్యంలో సాగిన ఈ గాన కార్యక్రమంలో మోహన్, వేణుగోపాల్, ప్రసాద్, శశిరేఖ తదితరులు పాల్గొన్నారు. వారు సావిత్రిపై చిత్రీకరించిన పాటలతోపాటు ఘంటసాల పాడిన కొన్ని పాటలు కూడా మధురంగా ఆలపించారు. కళాజనార్దనమూర్తి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో సంగీత కళాకారులను అభినందించారు.

## బ్యాంకు ద్వారా పాన్‌కార్డు సేవలు

**బర్కత్‌పుర, న్యూస్‌టుడే**: రాజాధాని కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు శాఖల ద్వారా వినియోగదారులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు పాన్‌కార్డు సేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు బ్యాంకు ఛైర్మన్ వేమిరెడ్డి నర్సింహారెడ్డి తెలిపారు. శనివారం బర్కత్‌పురలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బ్యాంకు ఖాతా ప్రారంభించేందుకు పాన్‌కార్డును తప్పనిసరి చేసిందన్నారు. పాన్‌కార్డు పొందేందుకు తమ బ్యాంకు శాఖలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసిన 15 రోజుల్లో పాన్‌కార్డు జారీ అవుతుందన్నారు.

## నిధుల మంజూరుకు వినతి

**బర్కత్‌పుర, న్యూస్‌టుడే:** నల్లకుంట డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని డివిజన్ కార్పొరేటర్ గరిగంటి శ్రీదేవి మహానగర పాలక సంస్థ అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయంలో సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నిత్యానంద, డీఈ విజయ్‌భాస్కర్, ఏఈ ఉపేంద్రలతో సమావేశమయ్యారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలపై అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ డివిజన్‌లో ఇటీవల నిర్వహించిన పాదయాత్రల ద్వారా ప్రజా సమస్యలను గుర్తించినట్లు చెప్పారు. ఆర్థిక సంవత్సరంలోపు నిధులు మంజూరు చేసి త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు తెరాస నేతలు, వార్డు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న బచ్‌పన్ ఎక్స్‌పో

**విద్యానగర్:** బాగ్ అంబర్‌పేట డివిజన్ డీడీ కాలనీలోని బచ్‌పన్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన బచ్‌పన్ ఎక్స్ పో ఆకట్టుకుంది. బతుకమ్మ, సంక్రాతి పర్వదినోత్సవాల ప్రాముఖ్యతను ఏపీ, తెలంగాణ బచ్‌పన్ స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ కె.రూపారెడ్డి వివరించారు. విద్యార్థులు వివిధ వేషధారణతో ఆకట్టుకున్నారు. తెలుగు రాష్ట్రాల ప్రాంతీయ డైరెక్టర్ కె.శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## వాలీబాల్ టోర్నమెంటు నేడు

**ముషీరాబాద్:** నెహ్రూ యువ కేంద్రం హైదరాబాద్ శాఖ, యువసేన యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 31న ముషీరాబాద్ మున్సిపల్ క్రీడా మైదానంలో వాలీబాల్ టోర్నమెంటు నిర్వహించనున్నట్లు యువసేన యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు పానుగంటి మహేశ్ తెలిపారు. పాల్గొనదలచిన జట్లు ఫోన్ నంబరు 8143812371 ను సంప్రదించాలని సూచించారు. పోటీలను ఆదివారం ఉదయం 9.30గంటలకు ముషీరాబాద్ ఎమ్మెల్యే డా. కె.లక్ష్మణ్ ప్రారంభిస్తారని చెప్పారు.

# బహదూర్‌పుర

## రాష్ట్రపతిని కలిసిన కాంగ్రెస్ పార్టీ నేతలు

**చార్మినార్:** ఇటీవల నగరానికి వచ్చిన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను తెలంగాణ పీసీసీ లింగ్విస్టిక్ మైనార్టీ సెల్ నేతలు కలిసి సత్కరించారు. సెల్ యువజన కాంగ్రెస్ మైనార్టీ విభాగం ఛైర్మన్ మురళీమోహన్ అశోక్‌సింగ్, నేతలు రంజిత్‌సింగ్, సంజీవ్‌కుమార్, రాజ్‌కుమార్ సింగ్ లోధ్, ఎస్.మనోహర్ తదితరులున్నారు.

# పాతనగరం మారుతోంది..

**చాంద్రాయణగుట్ట, చార్మినార్, న్యూస్‌టుడే:** చారిత్రక పాతనగరం క్రమంగా మారుతోంది. ఉద్రిక్తతలు, అభద్రతా భావం నుంచి బయటపడి శాంతి వైపు పయనిస్తోంది. మతపరంగా సున్నిత ప్రాంతమైన పాతనగరంలో ఒకప్పుడు తరచుగా గొడవలు, ఉద్రిక్తతలు చోటు చేసుకునేవి. నేరాల సంఖ్య కూడా అధికంగా ఉండేది. ప్రజలు అభద్రతా భావంతో కాలం వెళ్లదీసేవారు. పోలీసులకు సైతం శాంతిభద్రతల పరిరక్షణ సవాలుగా మారేది. అయితే ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రజల్లో వచ్చిన చైతన్యంతోపాటు పోలీసులు తీసుకుంటున్న చర్యలు పాతబస్తీలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడానికి కారణమని చెప్పవచ్చు. పోలీసులు తరచుగా కార్డన్ సెర్చ్‌లు, ఆపరేషన్ చబుత్రా

**శాంతి, సామరస్యాలను కోరుకుంటున్న ప్రజలు**
**గణనీయంగా తగ్గిన నేరాలు**

వంటి కార్యక్రమాలతోపాటు అడుగడుగునా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రౌడీలు, గూండాలు, సంఘ విద్రోహుల పట్ల కఠిన వైఖరి అవలంబిస్తున్నారు. ఫలితంగా పాతబస్తీలో నేరాల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పడుతోంది. గత యేడాదితో పోలిస్తే హత్యలు, చోరీలు, మోసాలు, అపహరణ కేసులు గణనీయంగా తగ్గాయి. దక్షిణ మండలంలో గత మూడేళ్లుగా జరుగుతున్న నేరాల సరళిని చూస్తే పాతనగరంలో క్రమంగా నేరాలు తగ్గుతున్నాయనే విషయం అర్థమవుతుంది.

### తగ్గుతున్న నేరాలు..

దక్షిణ మండలంలో 2016లో 3,545 కేసులు నమోదయ్యాయి. అయితే 2017లో నమోదైన కేసుల సంఖ్య 2509కు పడిపోయింది. గత యేడాది మొత్తంలో రెండు సార్లు మాత్రమే అల్లర్లు చోటుచేసుకున్నాయి. అవి కూడా స్వల్ప సంఘటనలే. 2015లో 30 హత్యలు జరగగా, 2016లో 21 హత్యలు, 2017లో 12 హత్యలు జరిగాయి. 2015లో 504 దొంగతనాలు జరగగా, 2016లో 436, 2017లో 345 చోరీలు జరిగాయి.

★ గత యేడాది రూ.4,07,29,164 విలువైన సొత్తు చోరీకి గురికాగా.. 57 శాతం రికవరీ చేశారు. ఈ యేడాది 2017లో రూ.2,46,64,201 విలువైన సొత్తు చోరీకి గురికాగా రూ.1,34,19,544 విలువైన సొత్తు రికవరీ చేశారు.

### కట్టడి-ముట్టడితో నేరాలకు కట్టడి..

దక్షిణ మండలం డీసీపీగా వి.సత్యనారాయణ 2014 నవంబరులో బాధ్యతలు స్వీకరించిన తరువాత పాతబస్తీలో కట్టడి-ముట్టడి( కార్డన్‌సెర్చ్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బస్తీలను లక్ష్యంగా చేసుకుని పోలీసులు సిబ్బంది విస్తృతంగా ఇంటింటి తని



ఖీలు నిర్వహించి, సంఘ విద్రోహులను గుర్తించడం.. రౌడీల కార్యకలాపాలపై నిఘా పెంచడం.. డాక్యుమెంట్లు లేని వాహనాలను స్వాధీనం చేసుకోవడం.. ఇళ్లలో ఉన్న మారణాయుధాలను స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలు చేపట్టడంతో నేరాలకు అడ్డుకట్ట పడింది. ఆపరేషన్ చబుత్రా పేరిట రాత్రి పూట బస్తీల్లో తిరిగి పనిపాట లేని యువకులను అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. బైకు రేసులకు, స్ట్రీట్‌ఫైట్‌లకు అడ్డుకట్ట వేశారు. కార్ఖానాల్లో ప్రత్యేక సోదాలు నిర్వహించి బాలకార్మికులకు విముక్తి కలిగించారు. గత మూడేళ్ల కాలంలో పాతబస్తీలో 31 సార్లు కట్టడి-ముట్టడి కార్యక్రమాలు చేపట్టారు. 2017లోనే 10 సార్లు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. రౌడీలు, గుండాలను కట్టడి చేయడానికి వారిపై పీడీ యాక్టు ప్రయోగించారు. గత మూడేళ్లలో 81 మందిపై పీడీ యాక్టు ప్రయోగించినట్లు డీసీపీ సత్యనారాయణ వెల్లడించారు. పాతబస్తీలో సుమారు 50 వేల సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి, అడుగడుగునా నిఘా పెంచారు. దక్షిణ మండలం పోలీసులు ప్రజామిత్ర పోలీసింగ్‌లో భాగంగా ఉద్యోగమేళాలు నిర్వహించి, పలువురు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. కానిస్టేబుల్ అభ్యర్థులకు శిక్షణ ఇప్పించారు. దీంతో పలువురు యువకులకు పోలీసుశాఖలో ఉద్యోగాలు లభించాయి. ఉచిత వైద్య శిబిరాలు, క్రీడా పోటీలు, 5కె రన్ వంటి కార్యక్రమాలను నిర్వహించి, పోలీసులు ప్రజలకు చేరువయ్యారు. 2017లో పాతబస్తీలో అరబ్‌షేక్‌ల ఆగడాలకు సైతం అడ్డుకట్ట వేశారు. పాతబస్తీ యువతులను, బాలికలను నిఖా పేరిట మోసగిస్తున్న అరబ్‌షేక్‌లపై కేసులు నమోదు చేశారు. నాలుగు కేసుల్లో 32 మంది నిందితులను అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో ఖాజీలు, షేక్‌లు ఉండడంతో అరబ్‌షేక్‌ల ఆగడాలకు కళ్లెం పడింది.

### విద్య, ఉపాధి వైపు యువత దృష్టి..

గతానికి భిన్నంగా పాతనగరంలో యువత విద్య, ఉపాధిపై దృష్టి సారిస్తున్నారు. ఉన్నత విద్య అభ్యసించడానికి ఆసక్తి చూపుతున్నారు. యువత ఆలోచనా ధోరణిలో మార్పు వచ్చింది. గతంలో గొడవలు, కేసులతో విసిగిపోయిన వారు సైతం యువతకు హితబోధ చేస్తుండటం.. యువత ఆలోచనా ధోరణిలో మార్పు రావడం.. మారిన పోలీసింగ్ తదితర అంశాలు పాతనగరంలో నేరాల సంఖ్య తగ్గడానికి కారణమవుతున్నాయి. చారిత్రక పాతనగరం శాంతిబాట పట్టడం హర్షణీయం.

**గత మూడేళ్లలో జరిగిన నేరాల వివరాలు**

| నేరం స్వభావం | 2015 | 2016 | 2017 |
|---|---|---|---|
| డెకాయిటీ | 0 | 4 | 01 |
| హత్యలు | 30 | 21 | 12 |
| అల్లర్లు | 14 | 0 | 2 |
| అత్యాచారాలు | 34 | 49 | 39 |
| దొంగతనాలు | 504 | 436 | 345 |
| దోపిడీ | 19 | 27 | 14 |
| మోసాలు | 300 | 358 | 294 |
| హత్యాయత్నాలు | 32 | 42 | 27 |
| నైట్‌హౌస్ బ్రేకింగ్స్ | 117 | 105 | 39 |
| అపహరణలు | 57 | 52 | 85 |

## కనుల పండువగా కలశయాత్ర



కలశయాత్రలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ విద్యాధర్ అగర్వాల్, ఇన్‌స్పెక్టర్ కె.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

**చార్మినార్, న్యూస్‌టుడే:** ఘాన్సీబజార్‌లోని రాణి సతీమందిరం నుంచి శనివారం సంప్రదాయ కలశయాత్ర కనుల పండువగా సాగింది. ఘాన్సీబజార్, చక్రమంఅడ్డా, మామజుమ్లాపాటక్, హైకోర్టు రోడ్డు, రికాబ్‌గంజ్ నుంచి తిరిగి కలశయాత్ర రాణిసతీమందిరం చేరుకుంది. ఈ కలశయాత్రను తొలుత రాణిసతీమందరిం వద్ద గుల్జార్‌హౌజ్ మాజీ కార్పొరేటర్ విద్యాధర్‌అగర్వాల్ చార్మినార్ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కలశయాత్ర సాఫీగా సాగేలా చార్మినార్ పోలీసలు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## భక్తిప్రపత్తులతో పరమపద మహోత్సవం



చార్మినార్ వెంకటేశ్వరస్వామి మందిరంలో ఎమ్మెల్యే జి.కిషన్‌రెడ్డి

**చార్మినార్, న్యూస్‌టుడే:** చార్మినార్ చౌక్‌మైదాన్‌ఖాన్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నమ్మాళ్వార్ పరమపద మహోత్సవాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. పరమపద మహోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు.. స్వామివారి పల్లకిసేవ, ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా శ్రీవెంకటేశ్వర ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే జి.కిషన్‌రెడ్డి, బహదూర్‌పురా తహసీల్దార్ నవీన్, చార్మినార్ భాగ్యలక్ష్మి మందిరం ట్రస్టీ శశికళ, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి చార్మినార్ కన్వీనర్ ప్యారసాని వెంకటేశ్ తదితదిరులు పాల్గొన్నారు. సాయంత్రం వెంకటేశ్వరస్వామి మందిరంలో ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రధాన అర్చకులు శృంగారం రమణాచార్యులు, ఆత్రేయాచార్యులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహించారు.

## మహిళ అదృశ్యం



సామియాబేగం

**దూద్‌బౌలి, న్యూస్‌టుడే:** కాలాపత్తర్ బిలాల్‌నగర్‌కు చెందిన ఓ మహిళ కూరగాయలు కొనేందుకు మార్కెట్‌కు వెళ్లి అదృశ్యమైంది. ఆమె కోసం అంతటా వెతికినా ఫలితం లేకపోవడంతో ఆమె భర్త కాలాపత్తర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బిలాల్‌నగర్‌కు చెందిన వెల్డింగ్ వృత్తి నిర్వహించే మహ్మద్ సిద్దిక్(34) భార్య సామియాబేగం(24) కూరగాయలు కొనేందుకు సమీపంలోని మార్కెట్‌కు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## అక్రమంగా తొలగించిన వారి పేర్లు ఓటరు జాబితాలో చేర్చాలి



ఓటర్లను కలిసి వివరాలు తెలుసుకుంటున్న భాజపా నేతలు

**చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే:** జంగమ్మెట్ డివిజన్‌లో సర్వే పేరుతో అక్రమంగా తొలగించిన వారి పేర్లను ఓటరు జాబితాలో తిరిగి చేర్చాలని భాజపా నగర అధికార ప్రతినిధి కౌడి మహేందర్ డిమాండ్ చేశారు. భాజపా చాంద్రాయణగుట్ట నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ మామిడి అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం జంగమ్మెట్ బస్తీలో భాజపా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కౌడి మహేందర్ పాల్గొని మాట్లాడుతూ... తూతూ మంత్రంగా సర్వే నిర్వహించి జంగమ్మెట్ డివిజన్‌లో ఆరు వేల ఓట్లను అక్రమంగా తొలగించారని ఆరోపించారు. బతికి ఉన్న వాళ్లను చనిపోయినట్లుగా చూపించి ఓటర్ల జాబితాలో పేర్లు తొలగించారని పేర్కొన్నారు. ఇంట్లోనే నివసిస్తున్నా ఇల్లు మారినట్లు చూపి వేలాది ఓట్లను తొలగించారని ఆరోపించారు. మజ్లిస్ పార్టీ నేతల కనుసన్నల్లో సర్వే జరిగిందని ఆరోపించారు. సర్వే పేరిట హిందువుల ఓట్లను భారీగా తొలగించారని తెలిపారు. అక్రమంగా తొలగించిన ఓట్లను జాబితాలో తిరిగి చేర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భాజపా ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని మహేందర్ హెచ్చరించారు. తాను బతికి ఉన్నప్పటికి చనిపోయినట్లు చూపించి, తన పేరును తొలగించారని పోచమ్మ అనే వృద్ధురాలు భాజపా నాయకుల ముందు వాపోయింది. ఈ సందర్భంగా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ఓటర్ల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో భాజపా నాయకులు మామిడి అంజన్‌కుమార్, చిరంజీవి, వై.విజయ్‌కుమార్, సి.విజయ్‌కుమార్, ప్రభాకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం

**చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే:** పాతనగర మున్నూరుకాపు సంఘం మహిళా మండలి నూతన కార్యవర్గం ఎన్నికలు బేలాలోని గీతా స్కూల్‌లో జరిగాయి. మహిళా మండలి అధ్యక్షురాలిగా పొన్న సునీత, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి మహేశ్వరి, కోశాధికారిగా ఎస్.వరలక్ష్మీలను ఎన్నుకున్నారు. పాతనగర మున్నూరుకాపు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆకుల శ్రీరాములు, అధ్యక్షుడు పొన్న సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తిరుపతి శివకుమార్ పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా అధ్యక్షురాలు పొన్న సునీత మాట్లాడుతూ.. సభ్యుల సహకారంతో మహిళా మండలిని పటిష్ఠం చేయడంతోపాటు, మహిళా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాతనగర మున్నూరుకాపు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుల శ్రీరాములు మాట్లాడుతూ సంఘం మహిళల సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి చుక్కా అశోక్‌కుమార్, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

# చాంద్రాయణగుట్ట

## రాత్రికి రాత్రి బస్‌షెల్టర్ మాయం


బస్‌షెల్టర్ తొలగించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మజ్లిస్ నేత మహ్మద్ సాబేర్

**కేశవగిరి:** రాత్రికి రాత్రి ప్రధాన రహదారిపై ఉన్న బస్ షెల్టర్ మాయమైంది. గుర్తుతెలియని వ్యక్తులు గ్యాస్ కట్టర్‌తో షెల్టర్ ఇనుప స్తంభాలను కత్తిరించి సమూలంగా తొలగించారు. శనివారం ఉదయం బస్ షెల్టర్ కనిపించకపోవడంతో స్థానికులు అవాక్కయ్యారు. ఈ సంఘటన చాంద్రాయణగుట్ట చౌరస్తాకు సమీపంలోని డీఎల్‌ఆర్‌ఎల్ ప్రధాన రహదారిపై జరిగింది. చాంద్రాయణగుట్ట చౌరస్తా నుంచి సంతోష్‌నగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో డీఎల్‌ఆర్‌ఎల్ రక్షణ సంస్థ ఎదురుగా ఉన్న రోడ్డు పక్కన బస్ షెల్టర్ ఉండేది. శనివారం షెల్టర్ సమూలంగా మాయమై అందులో ఏర్పాటు చేసిన టైల్స్ మాత్రమే రోడ్డుపై కనిపించాయి. దీంతో స్థానికులు ఆశ్చర్యపోయారు. విషయం తెలుసుకున్న నర్కిపూల్‌బాగ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధి, మజ్లిస్ నేత మహ్మద్ సాబేర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానికంగా వాకబు చేయగా శుక్రవారం అర్ధరాత్రి ఎవరో వ్యక్తులు గ్యాస్ కట్టర్‌తో షెల్టర్‌ను తొలగించి వాహనంలో తీసుకుపోయారని చెప్పారు. దీంతో షెల్టర్‌ను తొలగించిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని మహ్మద్ సాబేర్ జీహెచ్‌ఎంసీ కమిషనర్, బల్దియా ప్రచార విభాగం, చాంద్రాయణగుట్ట పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఫలక్‌నుమా ట్రాఫిక్ పోలీసులను సంప్రదించగా షెల్టర్ తొలగించిన విషయం తమకు తెలియదన్నారు. దీనిపై జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

## వివాహిత అదృశ్యం

**కంచన్‌బాగ్:** ఇంట్లో ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన కంచన్‌బాగ్ పోలీస్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్ట డివిజన్ పరిధి హాఫిజ్‌బాబా నగర్‌లోని ఒమర్ కాలనీలో గులాం హుస్సేన్ కుటుంబంతోసహా నివసిస్తున్నాడు. ఇతనికి వివాహమైంది. మహబూబ్‌నగర్ ప్రాంతానికి చెందిన శిల్పా అలియాస్ సనా ఫాతిమా (26)ను ప్రేమించి రెండో వివాహం చేసుకున్నాడు. నాలుగేళ్లుగా ఇద్దరు భార్యలతో ఉంటున్నాడు. ఈనెల 16న సనా ఫాతిమా ఇంట్లో ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అదృశ్యమైంది. గతంలోనూ అదృశ్యమై తిరిగి ఇంటికి చేరుకుంది. రెండో దఫా వెళ్లిన ఆమె తిరిగి వస్తుందని కుటుంబ సభ్యులు అనుకున్నారు. ఎంతకీ రాకపోవడంతో శనివారం ఈ మేరకు ఆమె భర్త ఠాణాలో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## సామాజిక న్యాయం కోసం ఐక్యంగా పోరాడాలి


సమావేశంలో పాల్గొన్న నాయకులు

**చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే:** సామాజిక న్యాయం కోసం, తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రజలు ఐక్యంగా పోరాడాలని టీమాస్ ప్రతినిధులు పేర్కొన్నారు. తెలంగాణ సామాజిక ప్రజాసంఘాల ఐక్యవేదిక(టీమాస్) జంగమ్మెట్ డివిజన్ సమావేశం ఫలక్‌నుమా పోతలింగన్నస్వామి దేవాలయంలో శనివారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశంలో టీమాస్ హైదరాబాద్ సౌత్ జిల్లా కన్వీనర్ బి.కనకయ్య, బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు సోమయ్య తదితరులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా తెరాస పాలన సాగుతోందని విమర్శించారు. హామీల అమలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ప్రశ్నిస్తున్న గొంతులను ప్రభుత్వం నొక్కేస్తోందని ఆరోపించారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళల సంక్షేమం పట్ల తెరాసకు చిత్తశుద్ధి లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను అమలు చేయాలని, బీసీ, మైనార్టీ సబ్‌ప్లాన్ చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న టీమాస్‌కు కులసంఘాలు, యువజన సంఘాలు, బస్తీ సంఘాలు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు ఎం.లక్ష్మమ్మ, కృష్ణానాయక్, శేఖర్‌యాదవ్, గణేశ్‌రాథోడ్, బాలు తదితరులు పాల్గొన్నారు.




## రాష్ట్రపతిని కలిసిన కాంగ్రెస్ పార్టీ నేతలు

**చార్మినార్:** ఇటీవల నగరానికి వచ్చిన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను తెలంగాణ పీసీసీ లింగ్విస్టిక్ మైనార్టీ సెల్ నేతలు కలిసి సత్కరించారు. సెల్ యువజన కాంగ్రెస్ మైనార్టీ విభాగం ఛైర్మన్ మురళీమోహన్ అశోక్‌సింగ్, నేతలు రంజిత్‌సింగ్, సంజీవ్‌కుమార్, రాజ్‌కుమార్ సింగ్ లోధ్, ఎస్.మనోహర్ తదితరులున్నారు.

# పాతనగరం మారుతోంది..

**శాంతి, సామరస్యాలను కోరుకుంటున్న ప్రజలు**

**గణనీయంగా తగ్గిన నేరాలు**

**చాంద్రాయణగుట్ట, చార్మినార్, న్యూస్‌టుడే:** చారిత్రక పాతనగరం క్రమంగా మారుతోంది. ఉద్రిక్తతలు, అభద్రతా భావం నుంచి బయటపడి శాంతి వైపు పయనిస్తోంది. మతపరంగా సున్నిత ప్రాంతమైన పాతనగరంలో ఒకప్పుడు తరచుగా గొడవలు, ఉద్రిక్తతలు చోటు చేసుకునేవి. నేరాల సంఖ్య కూడా అధికంగా ఉండేది. ప్రజలు అభద్రతా భావంతో కాలం వెళ్లదీసేవారు. పోలీసులకు సైతం శాంతిభద్రతల పరిరక్షణ సవాలుగా మారేది. అయితే ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రజల్లో వచ్చిన చైతన్యంతోపాటు పోలీసులు తీసుకుంటున్న చర్యలు పాతబస్తీలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడానికి కారణమని చెప్పవచ్చు. పోలీసులు తరచుగా కార్డన్ సెర్చ్‌లు, ఆపరేషన్ చబుత్రా వంటి కార్యక్రమాలతోపాటు అడుగడుగునా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రౌడీలు, గూండాలు, సంఘ విద్రోహుల పట్ల కఠిన వైఖరి అవలంబిస్తున్నారు. ఫలితంగా పాతబస్తీలో నేరాల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పడుతోంది. గత యేడాదితో పోలిస్తే హత్యలు, చోరీలు, మోసాలు, అపహరణ కేసులు గణనీయంగా తగ్గాయి. దక్షిణ మండలంలో గత మూడేళ్లుగా జరుగుతున్న నేరాల సరళిని చూస్తే పాతనగరంలో క్రమంగా నేరాలు తగ్గుతున్నాయనే విషయం అర్థమవుతుంది.

### తగ్గుతున్న నేరాలు..

దక్షిణ మండలంలో 2016లో 3,545 కేసులు నమోదయ్యాయి. అయితే 2017లో నమోదైన కేసుల సంఖ్య 2509కు పడిపోయింది. గత యేడాది మొత్తంలో రెండు సార్లు మాత్రమే అల్లర్లు చోటుచేసుకున్నాయి. అవి కూడా స్వల్ప సంఘటనలే. 2015లో 30 హత్యలు జరగగా, 2016లో 21 హత్యలు, 2017లో 12 హత్యలు జరిగాయి. 2015లో 504 దొంగతనాలు జరగగా, 2016లో 436, 2017లో 345 చోరీలు జరిగాయి.

★ గత యేడాది రూ.4,07,29,164 విలువైన సొత్తు చోరీకి గురికాగా.. 57 శాతం రికవరీ చేశారు. ఈ యేడాది 2017లో రూ.2,46,64,201 విలువైన సొత్తు చోరీకి గురికాగా రూ.1,34,19,544 విలువైన సొత్తు రికవరీ చేశారు.

### కట్టడి-ముట్టడితో నేరాలకు కట్టడి..

దక్షిణ మండలం డీసీపీగా వి.సత్యనారాయణ 2014 నవంబరులో బాధ్యతలు స్వీకరించిన తరువాత పాతబస్తీలో కట్టడి-ముట్టడి( కార్డన్‌సెర్చ్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బస్తీలను లక్ష్యంగా చేసుకుని పోలీసులు సిబ్బంది విస్తృతంగా ఇంటింటి తనిఖీలు నిర్వహించి, సంఘ విద్రోహులను గుర్తించడం.. రౌడీల కార్యకలాపాలపై నిఘా పెంచడం.. డాక్యుమెంట్లు లేని వాహనాలను స్వాధీనం చేసుకోవడం.. ఇళ్లలో ఉన్న మారణాయుధాలను స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలు చేపట్టడంతో నేరాలకు అడ్డుకట్ట పడింది. ఆపరేషన్ చబుత్రా పేరిట రాత్రి పూట బస్తీల్లో తిరిగి పనిపాట లేని యువకులను అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. బైకు రేసులకు, స్ట్రీట్‌ఫైట్‌లకు అడ్డుకట్ట వేశారు. కార్ఖానాల్లో ప్రత్యేక సోదాలు నిర్వహించి బాలకార్మికులకు విముక్తి కలిగించారు. గత మూడేళ్ల కాలంలో పాతబస్తీలో 31 సార్లు కట్టడి-ముట్టడి కార్యక్రమాలు చేపట్టారు. 2017లోనే 10 సార్లు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. రౌడీలు, గుండాలను కట్టడి చేయడానికి వారిపై పీడీయాక్టు ప్రయోగించారు. గత మూడేళ్లలో 81 మందిపై పీడీ యాక్టు ప్రయోగించినట్లు డీసీపీ సత్యనారాయణ వెల్లడించారు. పాతబస్తీలో సుమారు 50 వేల సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి, అడుగడుగునా నిఘా పెంచారు. దక్షిణ మండలం పోలీసులు ప్రజామిత్ర పోలీసింగ్‌లో భాగంగా ఉద్యోగమేళాలు నిర్వహించి, పలువురు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. కానిస్టేబుల్ అభ్యర్థులకు శిక్షణ ఇప్పించారు. దీంతో పలువురు యువకులకు పోలీసుశాఖలో ఉద్యోగాలు లభించాయి. ఉచిత వైద్య శిబిరాలు, క్రీడా పోటీలు, 5కె రన్ వంటి కార్యక్రమాలను నిర్వహించి, పోలీసులు ప్రజలకు చేరువయ్యారు. 2017లో పాతబస్తీలో అరబ్‌షేక్‌ల ఆగడాలకు సైతం అడ్డుకట్ట వేశారు. పాతబస్తీ యువతులను, బాలికలను నిఖా పేరిట మోసగిస్తున్న అరబ్‌షేక్‌లపై కేసులు నమోదు చేశారు. నాలుగు కేసుల్లో 32 మంది నిందితులను అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో ఖాజీలు, షేక్‌లు ఉండడంతో అరబ్‌షేక్‌ల ఆగడాలకు కళ్లెం పడింది.



### విద్య, ఉపాధి వైపు యువత దృష్టి..

గతానికి భిన్నంగా పాతనగరంలో యువత విద్య, ఉపాధిపై దృష్టి సారిస్తున్నారు. ఉన్నత విద్య అభ్యసించడానికి ఆసక్తి చూపుతున్నారు. యువత ఆలోచనా ధోరణిలో మార్పు వచ్చింది. గతంలో గొడవలు, కేసులతో విసిగిపోయిన వారు సైతం యువతకు హితబోధ చేస్తుండటం.. యువత ఆలోచనా ధోరణిలో మార్పు రావడం.. మారిన పోలీసింగ్ తదితర అంశాలు పాతనగరంలో నేరాల సంఖ్య తగ్గడానికి కారణమవుతున్నాయి. చారిత్రక పాతనగరం శాంతిబాట పట్టడం హర్షణీయం.

**గత మూడేళ్లలో జరిగిన నేరాల వివరాలు**

| నేరం స్వభావం | 2015 | 2016 | 2017 |
|---|---|---|---|
| డెకాయిటీ | 0 | 4 | 01 |
| హత్యలు | 30 | 21 | 12 |
| అల్లర్లు | 14 | 0 | 2 |
| అత్యాచారాలు | 34 | 49 | 39 |
| దొంగతనాలు | 504 | 436 | 345 |
| దోపిడీ | 19 | 27 | 14 |
| మోసాలు | 300 | 358 | 294 |
| హత్యాయత్నాలు | 32 | 42 | 27 |
| నైట్‌హౌస్ బ్రేకింగ్స్ | 117 | 105 | 39 |
| అపహరణలు | 57 | 52 | 85 |

## అక్రమంగా తొలగించిన వారి పేర్లు ఓటరు జాబితాలో చేర్చాలి


ఓటర్లను కలిసి వివరాలు తెలుసుకుంటున్న భాజపా నేతలు

**చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే:** జంగమ్మెట్ డివిజన్‌లో సర్వే పేరుతో అక్రమంగా తొలగించిన వారి పేర్లను ఓటరు జాబితాలో తిరిగి చేర్చాలని భాజపా నగర అధికార ప్రతినిధి కౌడి మహేందర్ డిమాండ్ చేశారు. భాజపా చాంద్రాయణగుట్ట నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ మామిడి అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం జంగమ్మెట్ బస్తీలో భాజపా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కౌడి మహేందర్ పాల్గొని మాట్లాడుతూ... తూతూమంత్రంగా సర్వే నిర్వహించి జంగమ్మెట్ డివిజన్‌లో ఆరు వేల ఓట్లను అక్రమంగా తొలగించారని ఆరోపించారు. బతికి ఉన్న వాళ్లను చనిపోయినట్లుగా చూపించి ఓటర్ల జాబితాలో పేర్లు తొలగించారని పేర్కొన్నారు. ఇంట్లోనే నివసిస్తున్నా ఇల్లు మారినట్లు చూపి వేలాది ఓట్లను తొలగించారని ఆరోపించారు. మజ్లిస్ పార్టీ నేతల కనుసన్నల్లో సర్వే జరిగిందని ఆరోపించారు. సర్వే పేరిట హిందువుల ఓట్లను భారీగా తొలగించారని తెలిపారు. అక్రమంగా తొలగించిన ఓట్లను జాబితాలో తిరిగి చేర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భాజపా ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని మహేందర్ హెచ్చరించారు. తాను బతికి ఉన్నప్పటికి చనిపోయినట్లు చూపించి, తన పేరును తొలగించారని పోచమ్మ అనే వృద్ధురాలు భాజపా నాయకుల ముందు వాపోయింది. ఈ సందర్భంగా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ఓటర్ల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో భాజపా నాయకులు మామిడి అంజన్‌కుమార్, చిరంజీవి, వై.విజయ్‌కుమార్, సి.విజయ్‌కుమార్, ప్రభాకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గం

**చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే:** పాతనగర మున్నూరుకాపు సంఘం మహిళా మండలి నూతన కార్యవర్గం ఎన్నికలు బేలాలోని గీతా స్కూల్‌లో జరిగాయి. మహిళా మండలి అధ్యక్షురాలిగా పొన్న సునీత, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి మహేశ్వరి, కోశాధికారిగా ఎస్.వరలక్ష్మీలను ఎన్నుకున్నారు. పాతనగర మున్నూరుకాపు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆకుల శ్రీరాములు, అధ్యక్షుడు పొన్న సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తిరుపతి శివకుమార్ పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా అధ్యక్షురాలు పొన్న సునీత మాట్లాడుతూ.. సభ్యుల సహకారంతో మహిళా మండలిని పటిష్ఠం చేయడంతోపాటు, మహిళా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాతనగర మున్నూరుకాపు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుల శ్రీరాములు మాట్లాడుతూ సంఘం మహిళల సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి చుక్కా అశోక్‌కుమార్, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

# చార్మినార్

## రాష్ట్రపతిని కలిసిన కాంగ్రెస్ పార్టీ నేతలు

**చార్మినార్:** ఇటీవల నగరానికి వచ్చిన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను తెలంగాణ పీసీసీ లింగ్విస్టిక్ మైనార్టీ సెల్ నేతలు కలిసి సత్కరించారు. సెల్ యువజన కాంగ్రెస్ మైనార్టీ విభాగం ఛైర్మన్ మురళీమోహన్ అశోక్‌సింగ్, నేతలు రంజిత్‌సింగ్, సంజీవ్‌కుమార్, రాజ్‌కుమార్ సింగ్ లోధ్, ఎస్.మనోహర్ తదితరులున్నారు.

# పాతనగరం మారుతోంది..

**చాంద్రాయణగుట్ట, చార్మినార్, న్యూస్‌టుడే:** చారిత్రక పాతనగరం క్రమంగా మారుతోంది. ఉద్రిక్తతలు, అభద్రతా భావం నుంచి బయటపడి శాంతి వైపు పయనిస్తోంది. మతపరంగా సున్నిత ప్రాంతమైన పాతనగరంలో ఒకప్పుడు తరచుగా గొడవలు, ఉద్రిక్తతలు చోటు చేసుకునేవి. నేరాల సంఖ్య కూడా అధికంగా ఉండేది. ప్రజలు అభద్రతా భావంతో కాలం వెళ్లదీసేవారు. పోలీసులకు సైతం శాంతిభద్రతల పరిరక్షణ సవాలుగా మారేది. అయితే ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రజల్లో వచ్చిన చైతన్యంతోపాటు పోలీసులు తీసుకుంటున్న చర్యలు పాతబస్తీలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడానికి కారణమని చెప్పవచ్చు. పోలీసులు తరచుగా కార్డన్ సెర్చ్‌లు, ఆపరేషన్ చబుత్రా

**శాంతి, సామరస్యాలను కోరుకుంటున్న ప్రజలు**

**గణనీయంగా తగ్గిన నేరాలు**

వంటి కార్యక్రమాలతోపాటు అడుగడుగునా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రౌడీలు, గూండాలు, సంఘ విద్రోహుల పట్ల కఠిన వైఖరి అవలంబిస్తున్నారు. ఫలితంగా పాతబస్తీలో నేరాల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పడుతోంది. గత యేడాదితో పోలిస్తే హత్యలు, చోరీలు, మోసాలు, అపహరణ కేసులు గణనీయంగా తగ్గాయి. దక్షిణ మండలంలో గత మూడేళ్లుగా జరుగుతున్న నేరాల సరళిని చూస్తే పాతనగరంలో క్రమంగా నేరాలు తగ్గుతున్నాయనే విషయం అర్థమవుతుంది.

### తగ్గుతున్న నేరాలు..

దక్షిణ మండలంలో 2016లో 3,545 కేసులు నమోదయ్యాయి. అయితే 2017లో నమోదైన కేసుల సంఖ్య 2509కు పడిపోయింది. గత యేడాది మొత్తంలో రెండు సార్లు మాత్రమే అల్లర్లు చోటుచేసుకున్నాయి. అవి కూడా స్వల్ప సంఘటనలే. 2015లో 30 హత్యలు జరగగా, 2016లో 21 హత్యలు, 2017లో 12 హత్యలు జరిగాయి. 2015లో 504 దొంగతనాలు జరగగా, 2016లో 436, 2017లో 345 చోరీలు జరిగాయి.

★ గత యేడాది రూ.4,07,29,164 విలువైన సొత్తు చోరీకి గురికాగా.. 57 శాతం రికవరీ చేశారు. ఈ యేడాది 2017లో రూ.2,46,64,201 విలువైన సొత్తు చోరీకి గురికాగా రూ.1,34,19,544 విలువైన సొత్తు రికవరీ చేశారు.

### కట్టడి-ముట్టడితో నేరాలకు కట్టడి..

దక్షిణ మండలం డీసీపీగా వి.సత్యనారాయణ 2014 నవంబరులో బాధ్యతలు స్వీకరించిన తరువాత పాతబస్తీలో కట్టడి-ముట్టడి( కార్డన్‌సెర్చ్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బస్తీలను లక్ష్యంగా చేసుకుని పోలీసులు సిబ్బంది విస్తృతంగా ఇంటింటి తని



ఖీలు నిర్వహించి, సంఘ విద్రోహులను గుర్తించడం.. రౌడీల కార్యకలాపాలపై నిఘా పెంచడం.. డాక్యుమెంట్లు లేని వాహనాలను స్వాధీనం చేసుకోవడం.. ఇళ్లలో ఉన్న మారణాయుధాలను స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలు చేపట్టడంతో నేరాలకు అడ్డుకట్ట పడింది. ఆపరేషన్ చబుత్రా పేరిట రాత్రి పూట బస్తీల్లో తిరిగి పని పాట లేని యువకులను అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. బైకు రేసులకు, స్ట్రీట్‌ఫైట్‌లకు అడ్డుకట్ట వేశారు. కార్ఖానాల్లో ప్రత్యేక సోదాలు నిర్వహించి బాలకార్మికులకు విముక్తి కలిగించారు. గత మూడేళ్ల కాలంలో పాతబస్తీలో 31 సార్లు కట్టడి-ముట్టడి కార్యక్రమాలు చేపట్టారు. 2017లోనే 10 సార్లు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. రౌడీలు, గుండాలను కట్టడి చేయడానికి వారిపై పీడీ యాక్టు ప్రయోగించారు. గత మూడేళ్లలో 81 మందిపై పీడీ యాక్టు ప్రయోగించినట్లు డీసీపీ సత్యనారాయణ వెల్లడించారు. పాతబస్తీలో సుమారు 50 వేల సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి, అడుగడుగునా నిఘా పెంచారు. దక్షిణ మండలం పోలీసులు ప్రజామిత్ర పోలీసింగ్‌లో భాగంగా ఉద్యోగమేళాలు నిర్వహించి, పలువురు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. కానిస్టేబుల్ అభ్యర్థులకు శిక్షణ ఇప్పించారు. దీంతో పలువురు యువకులకు పోలీసుశాఖలో ఉద్యోగాలు లభించాయి. ఉచిత వైద్య శిబిరాలు, క్రీడా పోటీలు, 5కె రన్ వంటి కార్యక్రమాలను నిర్వహించి, పోలీసులు ప్రజలకు చేరువయ్యారు. 2017లో పాతబస్తీలో అరబ్‌షేక్‌ల ఆగడాలకు సైతం అడ్డుకట్ట వేశారు. పాతబస్తీ యువతులను, బాలికలను నిఖా పేరిట మోసగిస్తున్న అరబ్‌షేక్‌లపై కేసులు నమోదు చేశారు. నాలుగు కేసుల్లో 32 మంది నిందితులను అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో ఖాజీలు, షేక్‌లు ఉండడంతో అరబ్‌షేక్‌ల ఆగడాలకు కళ్లెం పడింది.

### విద్య, ఉపాధి వైపు యువత దృష్టి..

గతానికి భిన్నంగా పాతనగరంలో యువత విద్య, ఉపాధిపై దృష్టి సారిస్తున్నారు. ఉన్నత విద్య అభ్యసించడానికి ఆసక్తి చూపుతున్నారు. యువత ఆలోచనా ధోరణిలో మార్పు వచ్చింది. గతంలో గొడవలు, కేసులతో విసిగిపోయిన వారు సైతం యువతకు హితబోధ చేస్తుండటం.. యువత ఆలోచనా ధోరణిలో మార్పు రావడం.. మారిన పోలీసింగ్ తదితర అంశాలు పాతనగరంలో నేరాల సంఖ్య తగ్గడానికి కారణమవుతున్నాయి. చారిత్రక పాతనగరం శాంతిబాట పట్టడం హర్షణీయం.

**గత మూడేళ్లలో జరిగిన నేరాల వివరాలు**

| నేరం స్వభావం | 2015 | 2016 | 2017 |
|---|---|---|---|
| డెకాయిటీ | 0 | 4 | 01 |
| హత్యలు | 30 | 21 | 12 |
| అల్లర్లు | 14 | 0 | 2 |
| అత్యాచారాలు | 34 | 49 | 39 |
| దొంగతనాలు | 504 | 436 | 345 |
| దోపిడీ | 19 | 27 | 14 |
| మోసాలు | 300 | 358 | 294 |
| హత్యాయత్నాలు | 32 | 42 | 27 |
| నైట్‌హౌస్ బ్రేకింగ్స్ | 117 | 105 | 39 |
| అపహరణలు | 57 | 52 | 85 |

## కనుల పండువగా కలశయాత్ర



కలశయాత్రలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ విద్యాధర్ అగర్వాల్, ఇన్‌స్పెక్టర్ కె.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

**చార్మినార్, న్యూస్‌టుడే:** ఘాన్సీబజార్‌లోని రాణి సతీమందిరం నుంచి శనివారం సంప్రదాయ కలశయాత్ర కనుల పండువగా సాగింది. ఘాన్సీబజార్, చక్రమంఅడ్డా, మామజుమ్లాపాటక్, హైకోర్టు రోడ్డు, రికాబ్‌గంజ్ నుంచి తిరిగి కలశయాత్ర రాణిసతీమందిరం చేరుకుంది. ఈ కలశయాత్రను తొలుత రాణిసతీమందరిం వద్ద గుల్జార్‌హౌజ్ మాజీ కార్పొరేటర్ విద్యాధర్‌అగర్వాల్ చార్మినార్ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కలశయాత్ర సాపీగా సాగేలా చార్మినార్ పోలీసలు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## భక్తిప్రపత్తులతో పరమపద మహోత్సవం



చార్మినార్ వెంకటేశ్వరస్వామి మందిరంలో ఎమ్మెల్యే జి.కిషన్‌రెడ్డి

**చార్మినార్, న్యూస్‌టుడే:** చార్మినార్ చౌక్‌మైదాన్‌ఖాన్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నమ్మాళ్‌వార్ పరమపద మహోత్సవాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. పరమపద మహోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు.. స్వామివారి పల్లకిసేవ, ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా శ్రీవెంకటేశ్వర ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే జి.కిషన్‌రెడ్డి, బహదూర్‌పురా తహసీల్దార్ నవీన్, చార్మినార్ భాగ్యలక్ష్మి మందిరం ట్రస్టీ శశికళ, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి చార్మినార్ కన్వీనర్ ప్యారసాని వెంకటేశ్ తదితదిరులు పాల్గొన్నారు. సాయంత్రం వెంకటేశ్వరస్వామి మందిరంలో ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రధాన అర్చకులు శృంగారం రమణాచార్యులు, ఆత్రేయాచార్యులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహించారు.

## మహిళ అదృశ్యం



సామియాబేగం

**దూద్‌బౌలి, న్యూస్‌టుడే:** కాలాపత్తర్ బిలాల్‌నగర్‌కు చెందిన ఓ మహిళ కూరగాయలు కొనేందుకు మార్కెట్‌కు వెళ్లి అదృశ్యమైంది. ఆమె కోసం అంతటా వెతికినా ఫలితం లేకపోవడంతో ఆమె భర్త కాలాపత్తర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బిలాల్‌నగర్‌కు చెందిన వెల్డింగ్ వృత్తి నిర్వహించే మహ్మద్ సిద్దిక్(34) భార్య సామియాబేగం(24) కూరగాయలు కొనేందుకు సమీపంలోని మార్కెట్‌కు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## అక్రమంగా తొలగించిన వారి పేర్లు ఓటరు జాబితాలో చేర్చాలి



ఓటర్లను కలిసి వివరాలు తెలుసుకుంటున్న భాజపా నేతలు

**చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే:** జంగమ్మెట్ డివిజన్‌లో సర్వే పేరుతో అక్రమంగా తొలగించిన వారి పేర్లను ఓటరు జాబితాలో తిరిగి చేర్చాలని భాజపా నగర అధికార ప్రతినిధి కౌడి మహేందర్ డిమాండ్ చేశారు. భాజపా చాంద్రాయణగుట్ట నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ మామిడి అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం జంగమ్మెట్ బస్తీలో భాజపా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కౌడి మహేందర్ పాల్గొని మాట్లాడుతూ... తూతూ మంత్రంగా సర్వే నిర్వహించి జంగమ్మెట్ డివిజన్‌లో ఆరు వేల ఓట్లను అక్రమంగా తొలగించారని ఆరోపించారు. బతికి ఉన్న వాళ్లను చనిపోయినట్లుగా చూపించి ఓటర్ల జాబితాలో పేర్లు తొలగించారని పేర్కొన్నారు. ఇంట్లోనే నివసిస్తున్నా ఇల్లు మారినట్లు చూపి వేలాది ఓట్లను తొలగించారని ఆరోపించారు. మజ్లిస్ పార్టీ నేతల కనుసన్నల్లో సర్వే జరిగిందని ఆరోపించారు. సర్వే పేరిట హిందువుల ఓట్లను భారీగా తొలగించారని తెలిపారు. అక్రమంగా తొలగించిన ఓట్లను జాబితాలో తిరిగి చేర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భాజపా ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని మహేందర్ హెచ్చరించారు. తాను బతికి ఉన్నప్పటికి చనిపోయినట్లు చూపించి, తన పేరును తొలగించారని పోచమ్మ అనే వృద్ధురాలు భాజపా నాయకుల ముందు వాపోయింది. ఈ సందర్భంగా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ఓటర్ల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో భాజపా నాయకులు మామిడి అంజన్‌కుమార్, చిరంజీవి, వై.విజయ్‌కుమార్, సి.విజయ్‌కుమార్, ప్రభాకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం

**చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే:** పాతనగర మున్నూరుకాపు సంఘం మహిళా మండలి నూతన కార్యవర్గం ఎన్నికలు బేలాలోని గీతా స్కూల్‌లో జరిగాయి. మహిళా మండలి అధ్యక్షురాలిగా పొన్న సునీత, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి మహేశ్వరి, కోశాధికారిగా ఎస్.వరలక్ష్మిలను ఎన్నుకున్నారు. పాతనగర మున్నూరుకాపు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆకుల శ్రీరాములు, అధ్యక్షుడు పొన్న సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తిరుపతి శివకుమార్ పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా అధ్యక్షురాలు పొన్న సునీత మాట్లాడుతూ.. సభ్యుల సహకారంతో మహిళా మండలిని పటిష్ఠం చేయడంతోపాటు, మహిళా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాతనగర మున్నూరుకాపు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుల శ్రీరాములు మాట్లాడుతూ సంఘం మహిళల సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి చుక్కా అశోక్‌కుమార్, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్

## మోండా మార్కెట్‌లో కూరగాయల ధరలు

**రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే:** టమాట 8, వంకాయ 20, బెండ 40, పచ్చిమిర్చి 30, క్యాలీఫ్లవర్ 25, క్యాబేజి 20, క్యారెట్ 40, దొండ 30, ఆలు 16, ఉల్లి 40, సొరకాయ 20, బీన్స్ 30, చిక్కుడు 40, దోస 25, బీర 40, కాకరకాయ 40, బీట్‌రూట్ 30, చామగడ్డ 40, కీరా 20, క్యాప్సికం 40, మునగకాయ 15, నిమ్మకాయ 20, అల్లం 60, వెల్లుల్లి 80.





కంటోన్మెంట్, బోయిన్‌పల్లి – 8008573361
మారేడుపల్లి – 8008573365
రెజిమెంటల్‌బజార్–8008573363
రసూల్‌పురా కార్ఖానా – 8008902816

మారేడుపల్లి, కంటోన్మెంట్: న్యూస్‌టుడే:

★ **సమస్య:** వెస్ట్‌మారేడుపల్లి నెహ్రూనగర్ పార్కు పరిసరాలు చెత్త మట్టికుప్పలతో పేరుకొన్నాయి. వెంటనే మట్టికుప్పలను తొలగించాలి.

**- ప్రవీణ్, మారేడుపల్లి**

☞ **సమాధానం:** సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందిని పంపించి మట్టికుప్పలు ఎత్తివేయిస్తాం.

**- వెంకటరమణ, ఆరోగ్యాధికారి**

★ **సమస్య:** తాడుబండ్ చౌరస్తానుంచి న్యూ బోయిన్‌పల్లి చౌరస్తా వైపునకు వెళ్లే ప్రధాన రహదారిలో పలు వీధి దీపాలు వెలగడంలేదు.

**- నర్సింహ, తాడుబండ్**

☞ **సమాధానం:** తాడుబండ్ నుంచి న్యూ బోయిన్‌పల్లి చౌరస్తాకు వెళ్లే రహదారిలోని దీపాలను పరిశీలించి, వెంటనే మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

**- సావన్, వీధి దీపాల నిర్వహణాధికారి**

# అసలే ఆలస్యం.. ఆపై అసంపూర్ణం

**కృష్ణానగర్ బస్తీలో నేటికి మట్టిరోడ్లు**

**మధ్యలోనే నిలిచిన నల్లా కనెక్షన్ పనులు**

రసూల్‌పురా, న్యూస్‌టుడే:

కంటోన్మెంట్ రెండోవార్డులోని కృష్ణానగర్ బస్తీ వాసులకు అభివృద్ధి పనులకు సంబంధించి గ్రహణం పూర్తిస్థాయిలో వీడడం లేదు. ఏళ్ల తరబడి ఇక్కడి బస్తీ ప్రజలు పలు రకాల సమస్యలతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. నేటికి గుంతల మయంగా మారిన మట్టిరోడ్లు, సగానికిపైగా నివాసాలకు చేరని ఇంటింటికి నల్లా కనెక్షన్‌లు, ఇళ్లపై నుంచి ప్రమాదకరంగా వేలాడే విద్యుత్ తీగలతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళన మధ్య రోజులు గడుపుతున్నారు. నేతలు, అధికారుల మారుతున్నా ఇక్కడి ప్రజల సమస్యలు మాత్రం తీరడం లేదు.



బస్తీలో రోడ్డు దుస్థితి..



ఇటీవల కొన్ని నివాసాలకు ఏర్పాటు చేసిన నల్లా కనెక్షన్‌లు

### ఏళ్ల నుంచి అవే మట్టిరోడ్లు..

కృష్ణానగర్ బస్తీలో ఇక్కడి ప్రజలు ఏళ్ల తరబడి మట్టిరోడ్లతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. నాలుగేళ్ల క్రితం ఇక్కడ సీసీ రోడ్లు ఏర్పాటు చేయడానికి కంటోన్మెంట్ బోర్డు రూ.25 లక్షలను కేటాయించింది. ఈ మేరకు స్థానిక బోర్డు సభ్యుడు స్థానికులతో కలిసి అప్పట్లో భూమిపూజ సైతం చేశారు. కానీ పనులు మాత్రం నేటికి ప్రారంభంకాలేదు. దీంతో బస్తీ ప్రజలు ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే సాయన్న దృష్టికి తీసుకొచ్చారు. ఆయన ఆరు నెలల క్రితం రూ.15 లక్షలను కేటాయించారు. ఇంటింటికి నల్లా కనెక్షన్‌ల అనంతరం పనులను చేపడతామని ఈ పనులను వాయిదా వేశారు. ఇటీవల నల్లా కనెక్షన్ పనులను ప్రారంభించి 400 పైగా నివాసాలు ఉండగా కేవలం 100నివాసాలకు పైగా కనెక్షన్‌లను అందించారు. తదనంతరం వాటర్ ఫ్లష్‌అవుట్ పేరుతో నెలరోజులుగా కాలయాపన చేస్తున్నారు. దీంతో సుమారు 300 నివాసాల ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇక్కడ బస్తీలో భూగర్భ విద్యుత్ కేబుళ్లను ఏర్పాటు చేయిస్తామని ఇళ్ల ముందు నుంచి తీగలను ప్రమాదకరంగా ఏర్పాటు చేశారు. దీంతో ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది.

### త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తాం..

**- సాదాకేశవరెడ్డి బోర్డు సభ్యుడు**

కృష్ణానగర్ బస్తీలో మంచినీటి పైప్‌లైన్ పనులను సగం వరకు పూర్తి చేయించాం. మిగతా కనెక్షన్‌లకు సంబంధించి ఇటీవల కొత్త పైప్‌లైన్‌లను ఏర్పాటు చేయించాం. వీటికి సంబంధించి ఒకసారి వాటర్ ఫ్లషఅవుట్ చేయాల్సి ఉంది. దీని తర్వాత మిగతా కనెక్షన్‌లను పూర్తి చేస్తాం. అనంతరం ఎమ్మెల్యే మంజూరు చేసిన నిధులతో సీసీ రోడ్లు వేయిస్తాం. కొన్ని సాంకేతిక కారణాలతో తప్పని సరిపరిస్థితిలో ఇక్కడ విద్యుత్ తీగలు ఇళ్ల పక్క నుంచి వేయాల్సి వచ్చింది. మరికొన్ని రోజుల్లో పనులన్నీ పూర్తి చేసి బస్తీలో సమస్యలు లేకుండా చూస్తాం.



సికింద్రాబాద్‌లోని పలు ప్రాంతాల్లోని హోటళ్లు, వ్యాపార సముదాయాల్లో అక్రమంగా వినియోగిస్తున్న రాయితీ గ్యాస్ సిలిండర్లను పౌరసరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం సికింద్రాబాద్ స్టేషన్ ప్రాంతాల్లోని హోటళ్లు, చిరువ్యాపారాలు, తోపుడు బండ్ల నిర్వాహకులు ఇళ్లల్లో వినియోగించాల్సిన సిలిండర్లను ఉపయోగిస్తుండటంతో దాడులు నిర్వహించి సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.

–న్యూస్‌టుడే, రెజిమెంటల్‌బజార్

## కెమెరాలను మారుస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

**కంటోన్మెంట్, న్యూస్‌టుడే:** గుర్తుతెలియని వ్యక్తులు సీసీ కెమెరాకు అనుసంధానంగా ఉన్న విద్యుత్తు తీగలను తొలగించారని ఓల్డ్ వాసవీనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి ఐ.లక్ష్మినారాయణ పేర్కొన్నారు. ఈ విషయమై శనివారం కాలనీలోని కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాలనీలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించామన్నారు. అయితే కొంతకాలం క్రితం గుర్తుతెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తొలగించారని ఆరోపించారు. ఈ మేరకు కార్ఖానా పోలీసులకు ఫిర్యాదు చేశామని, నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

## పారుఖ్ మరణంపై విచారణ జరిపించాలి

**ఉస్మానియా యూనివర్సిటీ, న్యూస్‌టుడే:** మతోన్మాదుల దాడిలో చనిపోయిన పారుఖ్ మరణంపై న్యాయ విచారణ జరిపించాలని ఓయూలోని పలు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం ఎంఎస్‌వో, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, డీబీఎస్‌ఏ, పీడీఎస్‌యూ, టీవీవీ, డీఎస్‌యూ, టీవీఎస్, డీఎంఎస్‌ఏ తదితర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఏపీ సీఎం చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు మాట్లాడుతూ రాజమండ్రిలో పారుఖ్‌ను హత్య చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలన్నారు. దాడిపై ఏపీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## కులవృత్తులకు మరింత ప్రోత్సాహం: మంత్రి



కాలమానిని ఆవిష్కరిస్తున్న మంత్రి తలసాని

**రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే:** కులవృత్తులకు మరింత ప్రోత్సాహం అందించడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం ఆయన తన నివాసంలో సికింద్రాబాద్ మేరు సంఘం 2018 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కుల వృత్తుల్లో ఉన్న వారికి ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టి అభివృద్ధి పథంలో నడిపించనున్నట్లు తెలిపారు. మేరు కులస్థుల సంక్షేమ కోసం కృషి చేస్తామని హామి ఇచ్చారు. తెలంగాణ మేరు సంఘం ఉపాధ్యక్షులు ఓదెల సత్యనారాయణ, సికింద్రాబాద్ జోన్-3 అధ్యక్షులు ఓదెల అజయ్, యూత్ ప్రతినిధులు శ్యామ్, రాజ్‌కుమార్, వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వేడుకలు ప్రశాంతంగా జరుపుకోండి : కావేటి



సమావేశంలో పాల్గొన్న అదనపు ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు


**సికింద్రాబాద్, న్యూస్‌టుడే:** కొత్త ఏడాదికి స్వాగతం పలికే క్రమంలో ఇతరులకు ఇబ్బంది కలగకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని చిలకలగూడ అదనపు ఇన్‌స్పెక్టర్ కావేటి శ్రీనివాసులు తెలిపారు. శనివారం సాయంత్రం ఠాణాలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మద్యం దుకాణాలు, బార్లు నిర్ణీత సమయం లోగా మూసివేయాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని చెప్పారు. డీజేలపై నిషేధం ఉన్నందున ఎవరైనా వాటిని వినియోగిస్తే కఠిన చర్యలుంటాయని తెలిపారు. యువత మద్యం సేవించి వాహనాలు నడపరాదని, పరిమితికి మించి ప్రయాణించరాదన్నారు

### అదనపు పోలీసులతో భారీ బందోబస్తు

డిసెంబరు 31 రాత్రి, జనవరి1ని పురస్కరించుకుని చిలకలగూడ ఠాణా పరిధిలో భారీ బందోబస్తును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్టేషను పరిధిలో ఎనిమిది పికెటింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌ను చేపడతామని, బ్లూకోట్స్, పెట్రోలింగ్ వాహనాల ద్వారా గస్తీ నిర్వహిస్తామన్నారు. ఎస్సైలు వీరబాబు, సుధాకర్, వెంకట్‌రెడ్డి, వరుణ్‌రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ ఆలయంలో నిఘా నేత్రాల ఏర్పాటు

**కంటోన్మెంట్, న్యూస్‌టుడే:** నేరాలను నియంత్రించేందుకు పౌరులు, సంఘాలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటుండడం శుభసూచికమని కంటోన్మెంట్ బోర్డు ఉపాధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. అయిదో వార్డు పరిధి కాకాగూడలోని హనుమాన్ దేవాలయ ఆవరణలో స్థానికంగా నివసించే దాత డీసీ నాగేందర్ రూ.25వేల తన సొంత ఖర్చుతో కొత్తగా మూడు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా శనివారం దేవాలయాన్ని సందర్శించిన రామకృష్ణ కెమెరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో నరేందర్, భిక్షపతి, యాదగిరి, పర్వు, శంకు తదితరులు పాల్గొన్నారు.



కెమెరాలను ప్రారంభిస్తున్న రామకృష్ణ

# కంటోన్మెంట్

## అల్వాల్ రైతు బజార్‌లో కూరగాయల ధరలు

**అల్వాల్, న్యూస్‌టుడే:** (శనివారంనాటివి.. కిలో రూ.లలో) టమాటా 10, వంకాయలు 13, బెండకాయలు 38, పచ్చిమిర్చి 23, కాలీఫ్లవర్ 31, క్యాబేజీ 15, క్యారెట్ 48, దొండకాయలు 23, ఆలు 16, ఉల్లి 38, సొరకాయ 15, పొట్లకాయ 19, బీన్స్ 25, గోరుచిక్కుడు 40, చిక్కుడు 38, దోసకాయ 18, బీరకాయ 35, కాకరకాయ 25, చామగడ్డ 40, కీర 11, క్యాప్సికం 40, బీట్‌రూట్ 23, కందగడ్డ 28.

## విఠలేశ్వర స్వామి ఆలయంలో అన్నదానం


అన్నదానంలో ఎమ్మెల్యే సాయన్న, కార్పొరేటర్ రూప

**రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే:** సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజార్‌లోని శ్రీ పాండురంగ విఠలేశ్వర వెంకటాద్రి స్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తుల సందడి నెలకొంది. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే సాయన్న, స్థానిక కార్పొరేటర్ ఆకుల రూప పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఛైర్మన్ దాసరి కర్ణకుమార్, ఈవో సురేందర్‌కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు రఘు, పద్మజ, చిత్రలేఖ, బాలాజీసింగ్, కిరణ్‌కుమార్, నర్సింగ్‌రావు, రాజగోపాల చార్యులు ఏర్పాట్లను పరిశీలించారు.

# నేరాల నివారణలో ముందడుగు

## చట్టాలపై ప్రజలకు అవగాహన శిబిరాలు ● మహిళలు, యువకుల, విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు

**కంటోన్మెంట్, న్యూస్‌టుడే/రెజిమెంటల్‌బజార్:**

ఓ వైపు నేరాల నియంత్రణ... మరోవైపు చట్టాలపై అవగాహన...ఇంకోవైపు పౌరుల సంక్షేమార్థం స్వచ్ఛంద కార్యక్రమాల నిర్వహణ...ఉత్తర మండలం పోలీసులు 2017లో మండలం పరిధిలో శాంతిభద్రతలను నెలకొల్పడంలో చాలావరకు విజయం సాధించారనే చెప్పాలి. 2017లో ఉత్తర మండలం పరిధిలో శాంతిభద్రతలను నెలకొల్పడానికి నేరాలను నియంత్రిస్తూనే, ప్రజలకు చట్టాలపై అవగాహనకు కల్పించడానికి, మహిళలు, యువకులు, పిల్లల సంక్షేమార్థం పలు ఎన్జీవో సంస్థలతో కలిసి స్వచ్ఛంద కార్యక్రమాలను సైతం నిర్వహించినట్లు డీసీపీ సుమతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పౌరులు, వివిధ సంఘాలు పండుగలు, సమావేశాలు, ర్యాలీలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకునేందుకు భారీ బందోబస్తు కల్పించారు. ముఖ్యంగా వివిధ సందర్భాల్లో రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్, ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నగర పర్యటనలో ఉన్నప్పుడు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు సుమతి పేర్కొన్నారు. అంతేకాకుండా సెప్టెంబరులో ఎడతెరిపిలేకుండా కురిసిన భారీ వర్షాల్లో ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. 'హరితహారం' కార్యక్రమంలో భాగంగా మండలం పరిధిలోని వివిధ ఠాణాల్లో 4,800 మొక్కలను నాటించామని సుమతి పేర్కొనడం విశేషం.

### మహిళలు, పిల్లల సంక్షేమార్థం..

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌తోపాటు ఆ పరిసరాలలో వ్యభిచారాన్ని నియంత్రించేందుకుగాను 'ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ' సహకారంతో రైల్వే స్టేషన్‌లో 'వికల్ప కౌన్సెలింగ్ సెంటర్'ను ఏర్పాటు చేశారు. తద్వారా 276మంది వ్యభిచార వృత్తిలో కొనసాగుతున్న మహిళలకు కౌన్సెలింగ్ నిర్వహించి 58మందిని ఎన్జీవో హోమ్‌లకు తరలించడమేకాకుండా 234 మంది విటులపై చట్టరీత్యా చర్యలు తీసుకున్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఏప్రిల్ 1న అడ్డగుట్టలో నిర్వహించిన 'షీ ఆజ్ సబల' కార్యక్రమాన్ని ప్రస్తుత డీజీపీ మహేందర్‌రెడ్డి ప్రారంభించగా ఈ కార్యక్రమాన్ని తిరుమలగిరి, బొల్లారం, బేగంపేట్ ఠాణాల పరిధిల్లో నిర్వహించి యువతులు, మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించడం విశేషం. కాగా, ప్రభుత్వ, కార్పొరేట్ పాఠశాలల్లోని తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించేందుకుగాను 'కిడ్స్ అండ్ కాప్స్' పేరిట హరిహర కళాభవన్‌లో సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా 1500మంది విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు.



సబల కార్యక్రమంలో మాట్లాడుతున్న డీసీపీ సుమతి (పాత)

**2017లో నేరాలు, నివారణ వివరాలు ఇలా..**

| సంఘటన | 2016 | 2017 | తగ్గిన శాతం |
|---|---|---|---|
| హత్యలు | 16 | 08 | 50 |
| సీరియస్/గ్రేవ్ క్రైమ్స్ | 187 | 148 | 20 |
| ఆస్తి తగాదాలు | 698 | 611 | 13 |
| గొలుసు చోరీలు | 14 | 06 | 57 |

### యువతకు ఉద్యోగావకాశాలు, శిక్షణ...

నిరుద్యోగ యువతి, యువకులకు ఉద్యోగావకాశాలను కల్పించేందుకుగాను ఉత్తర మండలం పోలీసులు వివిధ సంస్థలతో కలిసి 'చేయూత' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 1551మంది నిరుద్యోగులు పాల్గొనగా, అందులో 316మందికి అప్పటికప్పుడు ఉద్యోగాలు లభించగా, 650మంది తదుపరి ఇంటర్వ్యూల కోసం ఎంపిక కావడం విశేషం. ఉత్తర మండలం పోలీసులు నిర్వహించిన 'ప్రీ రిక్రూట్‌మెంట్ పోలీస్ కానిస్టేబుల్ ట్రైనింగ్'కు 1500మంది అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోగా, 1200మందిని అర్హులుగా గుర్తించి, 'భాగ్యకిరణ్ ఇన్‌స్టిట్యూషన్'కు చెందిన నిష్ణాతులతో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. అంతేకాకుండా 'యాంటీ డ్రగ్ క్యాంపెయిన్'లో భాగంగా 'నార్కొటిక్ కంట్రోల్ బ్యూరో'తో కలిసి క్లాక్‌టవర్, స్వీకార్ ఉప్‌కార్, ప్యారడైజ్, తిరుమలగిరి తదితర ప్రధాన చౌరస్తాలలో వైవిధ్యభరితంగా 'సే నో టు డ్రగ్స్' కార్యక్రమాలను నిర్వహించారు.

### సీసీ కెమెరాల ఏర్పాటులోను అదే జోరు...

హైదరాబాద్ సిటీ పోలీసులు 'నేను సైతం' కార్యక్రమం ద్వారా నగరంలో 1,70,065 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించగా, అందులో ఒక్క ఉత్తర మండలం పరిధిలోని 2017లో 33,100 సీసీలను ఏర్పాటు చేయించడంలో ఇక్కడి పోలీసులు సఫలీకృతమయ్యారు. మండలం పరిధిలో జరిగిన 68వివిధ కేసులకు సంబంధించి 62 కేసులకు సంబంధించిన నిందితులను సీసీల ద్వారానే గుర్తించినట్లు సుమతి పేర్కొన్నారు. తుకారాంగేట్, గోపాలపురం పోలీస్‌స్టేషన్ల పరిధిల్లోని వివిధ ప్రాంతాల్లో రెండుమార్లు 'కట్టడి ముట్టడి' కార్యక్రమాన్ని నిర్వహించి 26మంది అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణను చేపట్టారు. 2017లో మొత్తం 7,545 ఈ-పెట్టీ కేసులను నమోదు చేయగా, అందులో 6,713 కేసులకు సంబంధించి న్యాయస్థానం తీర్పును వెలువరించింది. అందులో 575 మందికి జైలు శిక్ష విధించగా 6,043 మందికి జరిమానా, మిగిలిన 95మందికి జైలు శిక్షతోపాటు జరిమానాను విధించినట్లు తెలిపారు. 2016లో 53మందిపై పీడీ చట్టాన్ని ప్రయోగించగా, 2017లో ఇద్దరిపై పీడీ చట్టాన్ని ప్రయోగించారు. ప్రతి నెలా మేళాను నిర్వహించి ఇక్కడి వివిధ ఠాణాల పరిధిల్లో నమోదైన కేసుల పురోగతిపై చర్చలు జరపడం ద్వారా 50శాతం కేసులను తగ్గించగలిగామని, గత సంవత్సరంతో పోల్చుకుంటే మొత్తంమీద 13శాతం నేరాల సంఖ్యను తగ్గించగలిగామని డీసీపీ తెలిపారు. కాగా, విధి నిర్వహణలో ప్రతిభను కనబరిచిన 612 మంది వివిధ హోదాల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి రివార్డులను అందజేసినట్లు డీసీపీ సుమతి పేర్కొన్నారు.



## విద్యార్థులకు ప్రిన్సిపల్ అభినందన

**అడ్డగుట్ట, న్యూస్‌టుడే:** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈస్ట్‌మారేడుపల్లి శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ హరికృష్ణ అన్నారు. 2017 నవంబర్ 28వ తేదిన జాతీయస్థాయిలో నిర్వహించిన క్యాట్ మొదటి దశ పరీక్షలో తమ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ఆయన తెలిపారు. 2018 ఫిబ్రవరి18న నిర్వహించనున్న రెండవ దశ పరీక్షకు అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ హరికృష్ణ, అకడమిక్ ఇన్‌ఛార్జి ప్రవీణ్, వేణు తదితరులు వారిని అభినందించారు.

## టిఫిన్ సెంటర్‌లో రూ.2.8 లక్షలు చోరీ

**సికింద్రాబాద్:** టిఫిన్ సెంటర్‌లో చోరీ జరిగి రూ.2.8లక్షల నగదు మాయమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... చిలకలగూడ గాంధీచౌక్ సమీపంలో రాఘవేంద్ర టిఫిన్ సెంటర్‌ను జి.ప్రశాంత్ నిర్వహిస్తున్నారు. రోజువారీలాగే శుక్రవారం రాత్రి 11గంటలకు హోటల్‌ను మూసివేశారు. శనివారం ఉదయం అల్మారా తెరిచి ఉండటం గమనించిన ప్రశాంత్ రూ. 2.8లక్షలు పోయాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. హోటల్‌లో పనిచేస్తున్న సురేష్ కనిపించకపోవడంతో అతనిపై అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సురేష్ కోసం ప్రత్యేక బృందాలను పంపించారు. సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

## ముందస్తుగా వాహనాల తనిఖీలు


బోయిన్‌పల్లి చెక్‌పోస్టు సమీపంలో తనిఖీలు

**కంటోన్మెంట్, న్యూస్‌టుడే:** నూతన సంవత్సర వేడుకల దృష్ట్యా బోయిన్‌పల్లి పోలీసులు శనివారం ఠాణా పరిధిలోని పలు ప్రధాన చౌరస్తాల్లో వాహనాల తనిఖీలను చేపట్టారు. డీఐ సుధీర్‌కుమార్, ఎస్సై నరేశ్‌ల నేతృత్వంలో హస్మత్‌పేట్, ప్రియదర్శిని చౌరస్తాల్లో తనిఖీలను నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్సులు లేని ఏడుగురు మైనర్లను అదుపులోకి తీసుకొని తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసులకు సమాచారాన్ని అందించారు. ట్రాఫిక్ ఎస్సై సురేశ్ వీరిపై కేసులు నమోదు చేశారు.

## యువతి అదృశ్యం

**ఉస్మానియా యూనివర్సిటీ, న్యూస్‌టుడే:** హబ్సిగూడలోని ఓ వైద్యుడి ఇంట్లో పనిచేసే యువతి అదృశ్యమైన సంఘటన ఉస్మానియా వర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నాచారంలోని రవీంద్రనగర్‌లో నివాసం ఉంటున్న కవిత (22) హబ్సిగూడలోని ఓ వైద్యుడి ఇంట్లో పనిచేస్తున్నారు. శుక్రవారం పనికి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆమె బావ అనిల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు వారు తెలిపారు.

## హద్దులు మీరితే చర్య తప్పదు

**లాలాపేట, న్యూస్‌టుడే:** నూతన సంవత్సరం వేడుకల పేరుతో ఇతరులకు ఇబ్బందులు కల్పించేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని లాలాగూడ ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు శనివారం సాయంత్రం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని, డిసెంబరు 31న ఎవరైనా హద్దులు మీరి ప్రవర్తిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బైక్‌రేసులు, వేధింపులు వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు వెళ్లకుండా స్నేహపూర్వక వాతావరణంలో వేడుకలు నిర్వహించుకోవాలని పేర్కొన్నారు.

# గోషామహల్



## రాష్ట్రపతిని కలిసిన కాంగ్రెస్ పార్టీ నేతలు

**చార్మినార్:** ఇటీవల నగరానికి వచ్చిన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను తెలంగాణ పీసీసీ లింగ్విస్టిక్ మైనార్టీ సెల్ నేతలు కలిసి సత్కరించారు. సెల్ యువజన కాంగ్రెస్ మైనార్టీ విభాగం ఛైర్మన్ మురళీమోహన్ అశోక్‌సింగ్, నేతలు రంజిత్‌సింగ్, సంజీవ్‌కుమార్, రాజ్‌కుమార్ సింగ్ లోధ్, ఎస్.మనోహర్ తదితరులున్నారు.

## శ్రీరంగనాథుడి దర్శనార్థం
# రెండో రోజూ బారులు

**జియాగూడ, న్యూస్‌టుడే:** జియాగూడలోని చరిత్రాత్మక రంగనాథ స్వామి దేవస్థానంలో స్వామివారి వైకుంఠ ద్వార దర్శనానికి శనివారం రెండో రోజూ భక్తజనం పోటెత్తారు. ఆలయ ముఖద్వారానికి ఎదురుగా అభయాంజనేయస్వామి భారీ విగ్రహం.. ఆలయంలో.. వెలుపల దేశ విదేశాల నుంచి తెప్పించిన రకరకాల పుష్పాలు, పండ్లతో అలంకరించిన విధానం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. రంగనాథస్వామి దేవస్థానం వ్యవస్థాపక ట్రస్టీ ఎస్.టి.చారి, శృంగారం శేషాచార్యులు, అర్చకులు రాజగోపాలాచార్యులు, బద్రీచార్యులు, శ్రీనివాసాచార్యులు నేతృత్వంలో పూజలు నిర్వహిస్తున్నారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, తెరాస కార్వాన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి టి.జీవన్‌సింగ్, తెరాస కార్పొరేటర్ మిత్రకృష్ణ, కార్వాన్ కార్పొరేటర్ ఎం.రాజేందర్ యాదవ్, తెరాస జియాగూడ ఇన్‌ఛార్జి డి.వి.ఎస్.రాజు, మాజీ కార్పొరేటర్ దేవర కరుణాకర్, సందీప్‌యాదవ్ తదితరులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు శ్రీరంగనాథుడి సేవలో తరించారు. నూతన సంవత్సర వేడుకలు సమీపించడంతో భక్తుల సౌకర్యార్థం వైకుంఠ ద్వార దర్శన కార్యక్రమాన్ని 2018 జనవరి 2వ తేదీ వరకూ నిర్విరామంగా కొనసాగించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ట్రస్టీలు తెలిపారు. రద్దీ కారణంగా శుక్రవారం స్వామివారి దర్శనం చేసుకోలేని భక్తులు ఆది, సోమ, మంగళ వారాల్లో కూడా స్వామివారిని దర్శించుకోవచ్చని వారు సూచించారు.


గరుడవాహనంపై ఆసీనుడైన శ్రీరంగనాథుడు


క్షీరసాగరంలో శేషతల్పంపై పవళించిన శ్రీమన్నారాయణుడి దివ్యరూపం

## సూర్యచంద్ర పురస్కారాల ప్రదానోత్సవం

**బషీర్‌బాగ్, న్యూస్‌టుడే:** సూర్యచంద్ర సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ పాత్రికేయుల పురస్కారం, రత్నశ్రీ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో శనివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో వివిధ టీవీ ఛానెళ్లలో పని చేస్తున్న పాత్రికేయులతోపాటు వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి పురస్కారాలు అందచేశారు. సాహితీవేత్త డాక్టర్ ద్వా.నా.శాస్త్రి, డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి కాకతీయ కళా పరిషత్ కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ ఎ.విజయ్‌కుమార్ అతిథులుగా హాజరై పురస్కారాలు అందచేశారు. సామాజిక సేవా రంగంలో పని చేస్తున్న రాధా ప్రశాంతి, డాక్టర్ కాచం సత్యనారాయణ, జి.జగన్నాథ్ దాస్, పొడూరి శ్రీనివాస్‌రావు, బి.రమేశ్, ఎన్.రవికుమార్, రామలక్ష్మి, మధుసూదన్ మూర్తి, రాములు, డి.రమేశ్, బి.మౌనికశ్రీతోపాటు పలు టీవీ ఛానెళ్లలో పని చేస్తున్న పాత్రికేయులకు పురస్కారాలు అందచేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. యమగూచి కరాటే విద్యార్థులు పలు విన్యాసాలు చేసి అలరించారు. కార్యక్రమంలో సూర్యచంద్ర సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు పల్లె మోహనచంద్ర, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు చింతమల్ల యశ్పాల్ తదితరులు పాల్గొన్నారు


పురస్కారం అందచేస్తున్న ద్వా.నా.శాస్త్రి, డాక్టర్ విజయ్‌కుమార్

## తపాలా శాఖ పింఛనుదారులకు సత్కారం

**అబిడ్స్:** ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొని సత్కారం పొందిన తపాలా శాఖ పింఛనుదారుల్ని అబిడ్స్‌లోని జీపీవోలో తపాలా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ప్రముఖ కవి డాక్టర్ వడ్డేపల్లితో పాటు హన్మంత్‌రెడ్డి సాహిత్య సమావేశాల్లో పాల్గొని సన్మానాలు పొందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అబిడ్స్‌లోని డాక్ సదన్‌లో తపాలా శాఖ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో వీరిని ఘనంగా సత్కరించారు. సంఘం అధ్యక్షులు, కార్యదర్శి లక్ష్మీనారాయణ, కొండల్‌రావు నేతృత్వంలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తూ తపాలా శాఖలోని పింఛనుదారులను సత్కరిస్తున్నారు. ఇందులో భాగంగానే శనివారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తెలుగు మహాసభల్లో సన్మానం పొందిన తపాలా శాఖ పింఛనుదారులతోపాటు పలువురు ప్రముఖులను సత్కరించారు. ప్రత్యేకించి తపాలా శాఖలో సీనియర్ అయిన మాజీ అధికారి, 91 ఏళ్ల కురు వృద్ధుడు సత్యనారాయణరావును ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ పింఛనుదారులు పలువురు పాల్గొన్నారు.



సత్యనారాయణరావును సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

## అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలి

**అబిడ్స్:** గన్‌ఫౌండ్రి డివిజన్‌లో పైపులైన్ల ఆధునికీకరణ కోసం అవసరమైన నిధులను విడుదల చేయాలని కోరుతూ జలమండలి ఎండీ దానకిషోర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు కార్పొరేటర్ మమతాగుప్త తెలిపారు. ఈ మేరకు అబిడ్స్‌లోని తన కార్యాలయంలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గన్‌ఫౌండ్రి డివిజన్‌లో రూ.5 కోట్లకు పైగా విలువ చేసే పనులకు సంబంధించిన ప్రతిపాదనలతో కూడిన వినతిపత్రాన్ని జలమండలి ఎండీ దానకిషోర్‌కు అందజేసినట్లు వివరించారు. త్వరలోనే ఆయా పనులకు సంబంధించి నిధులు విడుదల చేసేందుకు ఎండీ అంగీకరించారని చెప్పారు. దీంతో తన డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పలువురు పాల్గొన్నారు.


జలమండలి ఎండీకి వినతి పత్రం అందజేస్తున్న మమతాగుప్త

## అయ్యప్పస్వామి మహాపడి పూజ

**బేగంబజార్, న్యూస్‌టుడే:** గౌలిగూడలో శుక్రవారం రాత్రి శ్రీఅయ్యప్పస్వామి మహాపడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకూ కొనసాగిన ఈ పూజల్లో అనేక మంది భక్తులు పాల్గొన్నారు. అయ్యప్ప మాల ధరించిన భక్తులు భజన గీతాలు ఆలపించడంతో పాటు పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయన్ను శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాఘవన్, జ్ఞానేశ్వర్‌రావు, వెంకటేశ్వరరావు, డి.శ్రీను, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న బండారు దత్తాత్రేయ, భక్తులు

## తెదేపా విజయకేతనం ఎగురవేయడం ఖాయం

**అబిడ్స్:** తెదేపా పార్టీ ఆవిర్భావం నుంచి తమ పార్టీకి కంచుకోటగా నిలిచిన గోషామహల్ సెగ్మెంట్‌లో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేసి తీరుతామని తెదేపా నగర అధ్యక్షులు ఎంఎన్ శ్రీనివాస్ అన్నారు. గోషామహల్ సెగ్మెంట్ తెదేపా ఇన్‌ఛార్జి భజరంగ్ శర్మ జన్మదిన వేడుకల్ని శనివారం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కోసి పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో తెదేపా గ్రేటర్‌లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడం ఖాయమని పేర్కొన్నారు. భజరంగ్‌శర్మ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో తెదేపాకు పూర్వవైభవాన్ని తీసుకువస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నేతలు వనం రమేశ్, షఖీలారెడ్డి, భద్రీనాథ్, పవన్, పీఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కేక్ కోస్తున్న ఎమ్మెన్ శ్రీనివాస్, చిత్రంలో భజరంగ్‌శర్మ తదితరులు

## కళ్యాణలక్ష్మీ చెక్కుల అందజేత

**గోషామహల్:** కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు విశేషరీతిలో ఆదరణ లభిస్తోందని ఎంఐఎం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ అన్నారు. శనివారం నాంపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో గోషామహల్ కార్పొరేటర్ ముఖేశ్‌సింగ్‌తో కలిసి 33 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకం పేద ప్రజలకు వరం లాంటిదన్నారు. తెరాస గోషామహల్ కార్పొరేటర్ ముఖేశ్‌సింగ్ మాట్లాడుతూ.. తన డివిజన్ పరిధిలోని 20 మందికిపైగా లబ్ధిదారులకు చెక్కులను అందజేయడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రేమలతతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

## భాగ్యలక్ష్మీ ఆలయంలో పూజలు

**గోషామహల్:** జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, మంగళ్‌హాట్ డివిజన్ తెరాస కార్పొరేటర్ పరమేశ్వరీసింగ్ శనివారం చార్మినార్‌లోని భాగ్యలక్ష్మీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతబస్తీ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామని, అమ్మవారి ఆశీస్సులు ఎంతో అవసరమని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. భాగ్యలక్ష్మీ ఆలయంలో జరిపిన ప్రత్యేక పూజల్లో పరమేశ్వరీసింగ్‌తోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆమెను ఘనంగా సత్కరించింది.


పూజల్లో పాల్గొన్న పరమేశ్వరీసింగ్

## ఐటీఐ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

**విజయనగర్ కాలనీ, న్యూస్‌టుడే:** ఐటీఐల్ని మరింత బలోపేతం చేసి మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర బేవరేజెస్ విభాగం ఛైర్మన్ దేవీప్రసాద్ అన్నారు. శనివారం మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐలో తెలంగాణ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఈటీఈఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన 2018 నూతన సంవత్సర కాలమానిని ఆవిష్కరణలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధి శిక్షణా శాఖ సంచాలకులు కేవై నాయక్, బి.రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్

## ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

**అమీర్‌పేట:** (ఇవి శనివారం నాటి ధరలు) టమోట 10, నల్ల వంకాయ 13, పొడుగు వంకాయ 15, బెండ 38, పచ్చిమిర్చి 28, బజ్జి మిర్చి 31, క్యాప్సికం 40, పచ్చకాకర 25, తెల్ల కాకర 13, పందిరిబీర 35, బీర 25, క్యాబేజి 15, క్యారెట్ 48, దొండ 23, గుండుబీన్స్ 25, గింజ చిక్కుడు 38, చిక్కుడు 13, గోకరకాయ 40, కీర 11, దోస 18, బీట్‌రూట్ 23, పొట్లకాయ 19, నిమ్మకాయలు(కేజీ) 20, అల్లం(కోహిర్) 40, అల్లం(తెల్లది) 40, వెల్లుల్లి 60.

# పేదల బస్తీ అభివృద్ధికి కృషి


మురుగు నీరు వెళ్లేందుకు ప్రత్యేకంగా నిర్మించిన స్లాబ్

**రహ్మత్‌నగర్, న్యూస్‌టుడే:** దశాబ్దాల క్రితం ఏర్పడిన పేదల బస్తీల్లో మహానగర పాలక సంస్థ చేపట్టిన అభివృద్ధి పనులతో సదుపాయల కల్పన వేగంగా సాగుతుంది.. పేద, మధ్యతరగతి ప్రజలు అధికంగా ఉండే రహ్మత్‌నగర్ డివిజన్‌లో 34 బస్తీల్లో వేలాది మంది నివాసముంటున్నారు. పలు ప్రాంతాల్లో మురుగునీటి పైపులైన్ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో తరచూ లీకేజీ ఏర్పడి లోతట్టు ప్రాంతాల వాసులకు సమస్యగా మారుతోంది. సమస్యలను కట్టడి చేసేందుకు నగర పాలక సంస్థ వరద కాలువను ఆధునికీకరించే పనులను చేపట్టింది. వరద కాలువల్లో చెత్త వేయకుండా పలు ఏర్పాట్లు చేసిన ఫలితాలు లేకపోవడంతో బహిరంగంగా ప్రవహించే వరద కాలువపై స్లాబ్ నిర్మాణాన్ని చేపట్టారు. రహ్మత్‌నగర్ బస్తీలోని పలు వీధుల మీదుగా వెళ్లే వరద, మురుగు కాలువపై స్లాబ్ నిర్మించడంతో స్థానికంగా వెలువడే దుర్వాసన తగ్గింది. డివిజన్‌లోని పలు బస్తీల్లో వరద కాలువల ఆధునికీకరణ కోట్లాది రూపాయలు వ్యయం చేశారు.


కార్మికనగర్ మలుపులో ప్రవహిస్తున్న మురుగునీరు (పాతచిత్రం)

### వంతెనల నిర్మాణంతో సౌలభ్యం..

కార్మికనగర్ క్రాస్‌రోడ్డు నుంచి బస్తీకి వచ్చే ప్రధాన రహదారిలో అడ్డంగా ప్రవహించే వరదకాలువపై గతంలో లో లెవల్ వంతెన ఉండడంతో తరుచూ మురుగు నీరు నిలిచి సమస్యగా ఉండేది. గతేడాది ఈ వంతెనను తొలగించి అవసరాలకు వీలుగా వంతెనను అభివృద్ధి పర్చడంతో వాహనదారులు వెళ్లేందుకు సౌలభ్యంగా మారింది. బ్రహ్మశంకర్‌నగర్ నుంచి సంతోషిగిరి మలుపు వద్ద వరదకాలువలో చేరే మురుగు నీటి వ్యవస్థ తరుచూ లీకేజీ అవుతుండడంతో ఇటీవల వరదకాలువను పొడగించి సమస్యను పరిష్కరించారు.

### సీసీ రోడ్ల నిర్మాణం...

ఎస్పీఆర్‌హిల్స్ ఆరోగ్యనగర్ కూడలి, వినాయకనగర్ ప్రధాన రహదారి తదితర ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలలో సిమెంట్ రహదారుల నిర్మాణానికి నగర పాలక సంస్థ అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం జరిగితే వాహనదారులకు మరింత సౌలభ్యంగా మారనుంది. ఆరోగ్యనగర్ కూడలిని అభివృద్ధి చేసి బోరబండ హైటెక్స్ హోటల్ వరకు ఆర్టీసీ సర్వీసులను ఇక్కడి వరకు కొనసాగించేలా చర్యలు చేపట్టాలని ఎస్పీఆర్‌హిల్స్ బస్తీ వాసులు కోరుతున్నారు.

**అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు :** ఎంఏ షఫీ, కార్పొరేటర్

హెచ్ఎఫ్‌నగర్ సమీపంలోని క్వారీ స్థలాలలో సామాజిక కల్యాణ మండపం, ఉద్యానవనం నిర్మాణానికి ప్రతిపాదనలు చేయించాం. డివిజన్‌లోని పేదల బస్తీల్లో సామాజిక అవసరాలకు వీలుగా నిధులు వ్యయం చేస్తున్నాం. బ్రహ్మశంకర్‌నగర్‌లోని సామాజిక భవనం స్థలంలో అధునాతన భవన సముదాయం నిర్మాణానికి ప్రతిపాదనలు జరిపిస్తున్నాం. సీసీ రోడ్లు, తాగు, మురుగునీటి పైపులైన్ వ్యవస్థలను ఆధునికీకరించేందుకు అవసరమైన పనులు చేపడుతున్నాం.

## వేటూరి పురస్కారాల ప్రదానం



పాటలు పాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

**శ్రీనగర్‌కాలనీ:** ప్రముఖ గాయకులు ఎస్.సి.బాలసుబ్రహ్మణ్యం, వర్ధమాన గాయకులు తమ పాటలతో శ్రోతలను మంత్రముగ్ధుల్ని చేశారు. ఇందుకు శ్రీనగర్‌కాలనీలోని శ్రీసత్యసాయి నిగమాగమం వేదికయ్యింది. సేఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీనగర్‌కాలనీలోని శ్రీసత్యసాయి నిగమాగమంలో శనివారం రాత్రి వేటూరి పురస్కారాలను ప్రదానం చేశారు. వేటూరి జీవిత సాఫల్య పురస్కారం సంగీత దర్శకద్వయం రాజన్-నాగేంద్రలో రాజన్‌కు, ప్రతిభా పురస్కారాన్ని తెలంగాణా ప్రజాకవి గోరటి వెంకన్నకు, ప్రశంసా పురస్కారాన్ని వేటూరి సాహిత్యంపై పరిశోధన చేసిన డా.జయంతి చక్రవర్తికి నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా చేసిన సంగీత విభావరిలో ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం పాటలను ఆలపించారు. డా.పరుచూరి గోపాలకృష్ణ,సంగీత దర్శకులు ఆర్.పి.పట్నాయక్, మాధవపెద్ది సురేష్, చిత్రపరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

**యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే:** యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ వద్ద గల పోలీస్ మైదానంలో జూబ్లీహిల్స్‌లోని నారాయణ ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు శనివారం ఆటపాటలతో సందడి చేశారు. విద్యార్థులకు క్రికెట్, ఖోఖో, పరుగు పందెం, కబడ్డీ తదితర అంశాలలో పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రతినిధులు శేఖర్, మధు సుధన్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు స్వాగత ద్వారం ప్రారంభం

**వెంగళ్‌రావునగర్:** అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తోన్న రాజీవ్‌నగర్ సంక్షేమ సంఘం కాలనీవాసుల సహకారంతో పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించుకొని జీహెచ్ఎంసీ నుంచి స్వచ్ఛకాలనీ అవార్డు అందుకున్న విషయం అందరికీ తెలిసిన విషయమే. కాలనీ అభివృద్ధిలో భాగంగా నివాసితుల నుంచి సేకరించిన విరాళాలతో రాజీవ్‌నగర్ సంక్షేమ సంఘం పేరిట కాలనీ ప్రవేశ మార్గంలో స్వాగత ద్వారం ఏర్పాటు చేశారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ నూతనంగా ఏర్పాటు చేసిన రాజీవ్‌నగర్ సంక్షేమ సంఘం స్వాగత ద్వారాన్ని ప్రారంభించనున్నట్లు కాలనీ అధ్యక్షులు కృష్ణశర్మ, కార్యదర్శి ప్రసాదరావులు తెలిపారు. స్వాగత ద్వారం ప్రారంభ కార్యక్రమంలో రాజీవ్‌నగర్ కాలనీ వాసులు హాజరు కావాలని సంక్షేమ సంఘం కార్యవర్గ కమిటీ పేర్కొంది.

## క్రమశిక్షణతో ఉన్నత స్థానాలు

**పంజాగుట్ట, న్యూస్‌టుడే:** చదువుతో పాటు క్రమశిక్షణతో ఉన్నత స్థానాలకు ఎదగవచ్చు అని అందుకు తన తండ్రి వెంకటస్వామి(కాకా) ఉదాహరణ అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జి.వివేక్ అన్నారు. శనివారం రాత్రి ఆనంద్‌నగర్ సామాజిక భవనంలో ప్రకాశం విద్యానికేతన్ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధికి అవసరమైన సాయాన్ని తమ ట్రస్టు నుంచి సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గద్వాల్ విజయలక్ష్మీ విద్యా వలంటీర్ల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కరస్పాడెంట్ ప్రకాశం విద్యానికేతన్ సేవలను అవసరమైన అంశాలను వివరించారు. న్యాయవాది విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన


ఆవిష్కరణను వివరిస్తున్న విద్యార్థులు


నమూనా గురించి వివరిస్తున్న చిన్నారులు

**షేక్‌పేట:** ఇంజినీరింగ్, వైద్యులు వంటి వృత్తి విద్యలోనేకాక విద్యార్థులను శాస్త్రవేత్తలుగా ఎదిగేలా పాఠశాల స్థాయి నుంచే అవగాహన కల్పించాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ శాస్త్రవేత్త డా.లింగయ్య నాగారపు పేర్కొన్నారు. టోలిచౌకి సూర్యానగర్ కాలనీ రవీంద్ర భారతి స్కూల్‌లో శనివారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. సృజనాత్మకంగా ఆలోలించేలా విద్యార్థులను ప్రోత్సహించాలని అన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వి.శంకరన్, మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ సైన్స్ (జంతు, రసాయన శాస్త్రం)డీన్ ప్రొ.ఫజల్ రహ్మాన్ ప్రదర్శనను తిలకించి విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. పాఠశాల డీన్ ప్రియా మనీష్, ప్రిన్సిపల్ లుబ్నా అమూది తదితరులు పాల్గొన్నారు.

**వెంగళ్‌రావునగర్:** వెంగళ్‌రావునగర్ డివిజన్ మధురానగర్‌లోని అమెరికిడ్స్ ప్లేస్కూల్లో శనివారం సుందరమైన భారతదేశం(బ్యూటీఫుల్ ఇండియా కంట్రీ) పేరిట ఏర్పాటు చేసిన ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. దేశంలోని రాష్ట్రాలు, ఆయా రాష్ట్రాల్లో పేరొందిన వ్యక్తులు, పర్యాటక ప్రాంతాలు, వేషధారణ, ఆహార అలవాట్లు ఏవిధంగా ఉంటాయో తెలియజేసేలా చిన్నారులు ఏర్పాటు చేసిన నమూనాలు అబ్బురపరిచాయి. ప్రదర్శనలను తిలకించేందుకు వచ్చిన కాలనీవాసులు, తల్లిదండ్రులకు నమూనాల ప్రాధాన్యతను వివరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల డైరక్టర్ అజయ్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి


కాలనీ పర్యటిస్తున్న కార్పొరేటర్ మనోహర్

**వెంగళ్‌రావునగర్:** డివిజన్‌లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తునమని కార్పొరేటర్ కిలారి మనోహర్ అన్నారు. వెంగళ్‌రావునగర్ డివిజన్ షాలీమార్‌నగర్‌లో శనివారం ఉదయం కాఫీ విత్ కార్పొరేటర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మంచి నీరు సరఫరాలో ప్రెషర్ తక్కువగా వస్తుందని తెలిపారు. కాలనీవీధుల్లో పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడమే కాకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని కోరారు. ఈ విషయంపై స్పందించిన కార్పొరేటర్ మనోహర్ తాగు నీటి సమస్యను పరిష్కరించాలని జలమండలి అధికారులను ఆదేశించారు. అనంతరం కృష్ణకాంత్‌పార్కులో ఓపెన్ జిమ్ చుట్టూ ఏర్పాటు చేస్తున్న ఫెన్సింగ్, ఇసుక నింపే పనులను శనివారం కార్పొరేటర్ మనోహర్, జీహెచ్ఎంసీ ఏఈ జమీల్ పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు కమిటీ సభ్యులు శంకర్‌ముదిరాజ్, హరీష్‌చౌదరి, నాయకులు సాయియాదవ్, సత్యనారాయణ, శివశంకర్, నిరీక్షణరావు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్

## ఆస్తి పన్ను నేడూ చెల్లించొచ్చు

**ఖైరతాబాద్:** జీహెచ్ఎంసీ పరిధిలో ఆస్తి పన్ను చెల్లింపుదారుల కోసం ఈనెల 31న (ఆదివారం) బల్దియా కార్యాలయంలోని పౌర సేవా కేంద్రాలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. 2017-18 ఆర్థిక సంవత్సరానికి రెండో అర్ధ సంవత్సరం (సెప్టెంబరు - ఫిబ్రవరి)లో చెల్లించాల్సిన ఆస్తి పన్ను అపరాధ రుసుము లేకుండా చెల్లించేందుకు 31న ఖైరతాబాద్‌లోని బల్దియా కార్యాలయంలో ప్రత్యేక సదుపాయం కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



# రోడ్ల మరమ్మతులకు చర్యలు

## ఈనాడు కథనానికి స్పందించిన ఎమ్మెల్యే

## - మాగంటి గోపీనాథ్


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మాగంటి

**యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే:** నియోజకవర్గం పరిధిలోని ప్రతీ సమస్య పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే గోపినాథ్ జీహెచ్ఎంసీ ఈఈ కృష్ణ చైతన్యతో కలిసి శ్రీనగర్‌కాలనీ పరిధిలోని శాలివాహననగర్ కాలనీలో పర్యటించారు. స్థానికంగా గల ఓపెన్ నాలా వలన ఇబ్బందులు పడుతున్నామని, దుర్వాసన భరించలేకుండా ఉందని స్థానిక విష్ణు అపార్టమెంట్ నివాసితులు సమస్యను ఎమ్మెల్యే గోపీనాథ్ దృష్టికి తీసుకువచ్చారు. అపార్టమెంట్ గేటు వద్ద ప్రధాన రహదారి గోతుల మయంగా మారడం.. ఈనెల 24న 'దారులు చూస్తే... కళ్ల వెంట నీటి ధారలే' అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో రోడ్డును పరిశీలించిన గోపినాథ్ వెంటనే మరమ్మతులు చేపట్టాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అపార్టమెంట్ అసోసియేషన్ నాయకులు సురేందర్‌నాథ్, మురళీకృష్ణ, రమ్య, మోహన్‌రెడ్డి, తెరాస నాయకులు జహీర్, నరేందర్‌యాదవ్, కలీం, అనితా తదితరులు పాల్గొన్నారు.

### మురుగునీటి పరిష్కారానికి చర్యలు...

**షేక్‌పేట:** షేక్‌పేటలో మురుగునీటి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పేర్కొన్నారు. ఎర్రకుంట చెరువును ఆయన జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి శనివారం సందర్శించారు. అనంతరం ఆయన బస్తీలోని రాజీవ్‌గాంధీ సామాజిక భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ కాలనీ సంఘాల నేతలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. షేక్‌పేట నాలా ఆదిత్య అపార్టమెంట్ ఎదుట వరద ముంపు సమస్య పరిష్కారానికి, గండిపేట కాండ్యూట్ కింది నుంచి ప్రత్యేక వరద నీటి కాలువ నిర్మాణం కోసం రూ.1.15 కోట్లు, షేక్‌పేట ఎర్రకుంట చెరువులో మురుగు చేరకుండా రూ.13.30 లక్షలతో మురుగునీటి పైపులైన్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అంతేకాక షేక్‌పేట శ్మశాన వాటికలో వసతులు, అభివృద్ధి పనులకు రూ.18.50లక్షలు మంజూరు చేయించామని, త్వరలోనే శంకుస్థాపన ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సర్కిల్-10 ఉప కమిషనర్ సత్యనారాయణ, ఈఈ చిన్నారెడ్డి, డీఈ హరేరాం, ఏఎంఓహెచ్ రవికాంత్, డిప్యూటీ తహసిల్దార్ సుధాకర్, జలమండలి జీఎం స్వామి, డీజీఎం ఖాజాజవహర్‌లలీ, సహాయ ఎంటమాలజిస్టు భాస్కర్, తెరాస నేతలు పాల్గొన్నారు.

## చిన్నారుల ఆటలకు ప్రాధాన్యం

**న్యూస్‌టుడే:** చిన్నారులు ఆడుకునేందుకు ప్రత్యేక పార్కుల ఆవశ్యకత ఎంతైనా ఉందని జూబ్లీహిల్స్ నియోజకవర్గం శాసనసభ్యుడు మాగంటి గోపీనాథ్, ఉపమేయర్ ఎం.డి.బాబా ఫసియుద్దీన్ పేర్కొన్నారు. బోరబండ డివిజన్ సైట్-4, సైట్-5 కూడలిలో రూ.9.50లక్షల వ్యయంతో నిర్మించిన పిల్లల పార్కును శనివారం లాంఛనంగా ప్రారంభించారు. కాలనీల్లో నీటివసతి కోసం నిర్మించిన ట్యాంకు స్థలంలో పార్కును ఏర్పాటు చేశామని తెలిపారు. విలువైన ఖాళీ స్థలాలు కబ్జాకు గురికాకుండా ప్రజోపయోకర పనులకోసం వినియోగిస్తున్నామన్నారు. ఇటీవలే బాబా సైలానీనగర్‌లోని 400 గజాల ఖాళీస్థలంలో గ్రేటర్‌లోనే తొలి మహిళా భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు వారు వెల్లడించారు. అంతకుముందు బంజారానగర్‌లో రూ.6.5లక్షలతో వేయనున్న తాగునీటి పైపులైను పనులు, సైట్-2 కాలనీలో సీసీరోడ్డు పునరుద్ధరణ పనులను ఎమ్మెల్యే, ఉపమేయర్ ప్రారంభించారు. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో పాటు బోరబండ డివిజన్ తెరాస అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమోహన్, జి.ముత్యాలు, పార్టీ కార్యకర్తలు, వివిధబస్తీలు, కాలనీల అధ్యక్షులు పాల్గొన్నారు.


పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోపీనాథ్, ఉపమేయర్ బాబాఫసియుద్దీన్

## డివిజన్‌లో కార్పొరేటర్ పర్యటన


స్థానికులతో మాట్లాడుతున్న సంజయ్‌గౌడ్

**యూసుఫ్‌గూడ:** స్థానికులకు ఇబ్బందులు లేకుండా మెట్రో పనులు పూర్తిచేయాలని కార్పొరేటర్ సంజయ్‌గౌడ్ హెచ్ఎంఆర్ సిబ్బందికి సూచించారు. శనివారం యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ వద్ద హెచ్ఎంఆర్ సిబ్బందితో కలిసి డివిజన్‌లో పర్యటించారు. ప్రభుత్వ పాఠశాల వద్ద ఫుట్‌పాత్ పనులు వెంటనే చేపట్టాలని సిబ్బందిని కోరారు. అనంతరం శ్రీకృష్ణానగర్ బి-బ్లాక్‌లో వెంకటగిరి సెక్షన్ జలమండలి మేనేజర్ నారాయణతో కలిసి పర్యటించిన సంజయ్‌గౌడ్ సీవరేజీ పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బస్వరాజ్, పెరుక రవి, గీతాగౌడ్, బాబీ, తదితరులు పాల్గొన్నారు.

## కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే:** అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని నగర మైనార్టీ మోర్చా నాయకులు శనివారం పౌర సరఫరా శాఖ కమీషనర్ సీవీ.ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. పేదలకు రేషన్ కార్డులు లేక ఇబ్బందులు పడుతున్నారని, కొత్త రేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో మోనార్టీ మోర్చా నగర అధ్యక్షులు దియానత్‌అలీ ఖాన్, కార్యదర్శి షేక్ ఫరీద్, అబ్దుల్ హమీద్, సయ్యద్ నిసార్, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కవిత

**యూసుఫ్‌గూడ:** శ్రీనగర్‌కాలనీలో కొనసాగుతున్న వరద నీటి కాలువ పనులను వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. పనులను వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ రమేష్, ఏఈ వినీల్, కాలనీ సంక్షేమసంఘం నాయకులు సుదర్శన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బసవరాజు సేవలు చిరస్మరణీయం

**పంజాగుట్ట న్యూస్‌టుడే:** ఐఈఐ మాజీ ఛైర్మన్ ఐ.బసవరాజు జయంతి విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో ఆయనచిత్రపటానికి వాటర్‌వర్క్స్ జీఎం భుజంగరావు నివాళులు అర్పించి, స్మారక ప్రసంగం చేశారు. ఐఈఐ మాజీ ఛైర్మన్ నారాయణ, కార్యదర్శి రామేశ్వరరావు తదితరుల అధ్యక్షతన జీఎం భుజంగరావు మాట్లాడుతూ.. ఇందుకు ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి నీటిని తరలించేటప్పుడు ఎలాంటి చర్యలుచేపట్టాలి, ఎంత నీటిని సరఫరా చేయాలి, నాణ్యతగలిగిన మోటార్లు, వాల్వులను వినియోగించాలి అనే అంశాలు వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐఈఐ మాజీ ప్రతినిధులు నందకుమార్, సుబ్బిరెడ్డి బసవరాజు సేవలను కొనియాడారు.

# పర్యాటక ప్రదేశాల్లో బందోబస్తు

**ఖైరతాబాద్, న్యూస్‌టుడే:** నూతన సంవత్సరాదిని ఆహ్వానిస్తూ డిసెంబరు 31న పర్యాటక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఉత్సవాలు చేసుకునే తరుణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు. హుస్సేన్‌సాగర్ పరిసరాల్లోని వాహనాలపై యువత అధికంగా తరలివచ్చే అవకాశం ఉండటంతో తెలుగు తల్లి ఫ్లైఓవర్, నెక్లెస్ రోడ్డులోని రోటరీ నుంచి పీపుల్స్ ప్లాజా - జలవిహార్, సంజీవయ్యపార్కు మీదుగా నల్లగుట్ట దాకా రాత్రివేళ రోడ్డుపై రాకపోకలు నిలిపివేస్తున్నారు. సైఫాబాద్ డివిజన్ ఏసీపీ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలో సైఫాబాద్, రాంగోపాల్‌పేట, నాంపల్లి పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. అందులో జనం రద్దీ ఉండే ప్రదేశాలను గుర్తించి పోలీస్ పికెట్లను ఏర్పాటుచేశామన్నారు.



❐ సైఫాబాద్ పరిధిలో నెక్లెస్ రోటరీ, ఐమ్యాక్స్ థియేటర్, తెలుగుతల్లి కూడలి, ఎన్టీఆర్ మార్గ్, సచివాలయం, ఏఆర్ పెట్రోల్ పంప్, రవీంద్రభారతి కూడళ్లలో ప్రత్యేక బందోబస్తు ఉంటుంది. ఈ ఠాణా పరిధిలోని తెలుగు తల్లి వంతెనపై రాత్రి 11.30 తర్వాత మరుసటి మంగళవారం ఉదయం వరకు వాహనాల రాకపోకలకు అనుమతి లేదు.

❐ రాంగోపాల్‌పేట పరిధిలో నెక్లెస్ రోటరీ, సీటీఓ కూడలి, ప్యారడైజ్ కూడలి, రాణిగంజ్ కూడలి, రసూల్‌పుర కూడలిలో బందోబస్తు ఉంటుంది. ఈ ఠాణా పరిధిలో నెక్లెస్ రోటరీ (ఇందిరాగాంధీ విగ్రహం) నుంచి నెక్లెస్ రోడ్డు పొడవునా నల్లగుట్ట వరకు గల రోడ్డులో రాత్రి వాహనాలకు అనుమతి లేదు.

❐ నాంపల్లి ఠాణా పరిధిలో మల్లేపల్లి ఐటీఐ కూడలి, గోకుల్‌నగర్ కూడలి, బజార్‌ఘాట్ కూడలి, ఏక్‌మినార్ కూడలి, అయోధ్య కూడలిలో బందోబస్తు ఉంటుంది. మూడు పోలీస్ స్టేషన్ల పరిధితో ఆయా ఠాణాల ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఇతర కానిస్టేబుళ్లతో పాటు అదనంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఫోర్స్ 43 ప్లాటూన్లను వినియోగిస్తున్నట్లు తెలిపారు.

### బంజారాహిల్స్ పోలీసుల అలర్ట్

**ఫిలినగర్:** కొత్త సంవత్సర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయం ఘటనలు జరగకుండా ఉండేందుకు బంజారాహిల్స్ పోలీసులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ర్యాష్ డ్రైవింగ్ పైన ఆంక్షలు విధించారు. అధిక వేగంతో వెళితే వాహనాలు సీజ్ చేయనున్నారు. 31వ తేదీ అర్ధరాత్రి వరకే వేడుకలకు అనుమతి ఉంది. స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ కొనసాగుతోంది. బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్ బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. జూబ్లీహిల్స్‌లోని క్లబ్బులు, పబ్బుల ప్రతినిధులతో జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్ శనివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పోలీసు నిబంధనలకు అనుగుణంగా వేడుకలను నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు.




# కార్వాన్

## విద్యుత్ బిల్లులు నేడూ చెల్లించవచ్చు

**కార్వాన్, న్యూస్‌టుడే:** విద్యుత్ బకాయిదారుల సౌకర్యార్థం ఆదివారం తమ పరిధిలోని వివిధ సెక్షన్లలోని కౌంటర్లను తెరచి ఉంచుతున్నట్లు ట్రాన్స్‌కో సీతారామ్‌బాగ్ డివిజన్ ఏడీఈ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఉదయం గం.9:30 నుంచి సాయంత్రం గం.3:30 వరకు చెల్లింపులు చేయవచ్చన్నారు. తమ పరిధిలోని కార్వాన్, దత్తాత్రేయగుట్ట, మంగళ్‌హాట్ ట్రాన్స్‌కో సెక్షన్లలో బకాయిలు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ ఖాతాదారులు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

## శ్రీరంగనాథుడి దర్శనార్థం
# రెండో రోజూ బారులు


క్షీరసాగరంలో శేషతల్పంపై పవళించిన శ్రీమన్నారాయణుడి దివ్యరూపం

**జియాగూడ, న్యూస్‌టుడే:** జియాగూడలోని చరిత్రాత్మక రంగనాథ స్వామి దేవస్థానంలో స్వామివారి వైకుంఠ ద్వార దర్శనానికి శనివారం రెండో రోజూ భక్తజనం పోటెత్తారు. ఆలయ ముఖద్వారానికి ఎదురుగా అభయాంజనేయస్వామి భారీ విగ్రహం.. ఆలయంలో.. వెలుపల దేశ విదేశాల నుంచి తెప్పించిన రకరకాల పుష్పాలు, పండ్లతో అలంకరించిన విధానం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. రంగనాథస్వామి దేవస్థానం వ్యవస్థాపక ట్రస్టీ ఎస్.టి.చారి, శృంగారం శేషాచార్యులు, అర్చకులు రాజగోపాలాచార్యులు, బద్రీచార్యులు, శ్రీనివాసాచార్యులు నేతృత్వంలో పూజలు నిర్వహిస్తున్నారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, తెరాస కార్వాన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి టి.జీవన్‌సింగ్, తెరాస కార్పొరేటర్ మిత్రకృష్ణ, కార్వాన్ కార్పొరేటర్ ఎం.రాజేందర్ యాదవ్, తెరాస జియాగూడ ఇన్‌ఛార్జి డి.వి.ఎస్.రాజు, మాజీ కార్పొరేటర్ దేవర కరుణాకర్, సందీప్‌యాదవ్ తదితరులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు శ్రీరంగనాథుడి సేవలో తరించారు. నూతన సంవత్సర వేడుకలు సమీపించడంతో భక్తుల సౌకర్యార్థం వైకుంఠ ద్వార దర్శన కార్యక్రమాన్ని 2018 జనవరి 2వ తేదీ వరకూ నిర్విరామంగా కొనసాగించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ట్రస్టీలు తెలిపారు. రద్దీ కారణంగా శుక్రవారం స్వామివారి దర్శనం చేసుకోలేని భక్తులు ఆది, సోమ, మంగళ వారాల్లో కూడా స్వామివారిని దర్శించుకోవచ్చని వారు సూచించారు.


గరుడవాహనంపై ఆసీనుడైన శ్రీరంగనాథుడు

## అభివృద్ధి పనులకు అనుమతులు మంజూరు


బల్దియా సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్‌సింగ్‌తో కలిసి హాకీంపేటలో పర్యటిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ నజీరుద్దీన్

**గోల్కొండ, న్యూస్‌టుడే:** నానల్‌నగర్ డివిజన్‌లోని హాకీంపేటలో రూ.10 లక్షలు విలువ చేసే పనులకు అనుమతులు లభించాయని నానల్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ నజీరుద్దీన్ అన్నారు. బల్దియా ఇటీవల ప్రవేశపెట్టిన నూతన నిబంధనల ప్రకారం ఈ అనుమతులు వచ్చాయన్నారు. శనివారం ఉదయం కార్పొరేటర్ బల్దియా సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్‌సింగ్, డిప్యూటీ ఈఈ రఘులతో కలిసి హాకీంపేటలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు అక్కడి సమస్యలను కార్పొరేటర్, ఎస్ఈ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా సీసీరోడ్లకు సంబంధించిన 5 పనులకు రూ.10 లక్షలు ఎస్ఈ మంజూరు చేశారు.

## సంత్ కేశవస్వామి మహారాజ్ పుణ్యతిథి నేడు


కేశవస్వామీజీ మహారాజ్ చిత్రపటం

**జియాగూడ, న్యూస్‌టుడే:** ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సంత్ కేశవస్వామీజీ మహారాజ్ పుణ్యతిథి కార్యక్రమాన్ని ఈ నెల 31న నిర్వహించనున్నట్లు కేశవస్వామీజీ సమాధి మందిరం నిర్వాహకులు మఠాధిపతి దండే మహారాజ్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 8గంటల నుంచే జియాగూడ కేశవస్వామినగర్‌లోని స్వామీజీ సజీవ సమాధి మందిరంలో పుణ్యతిథి శ్రద్ధాభిషేకం, హారతి, హోమం, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. సంత్ రామదాసుకు సమకాలీకులైన కేశవస్వామీజీ తన ఆధ్యాత్మిక బోధనలు, కీర్తనల ద్వారా ప్రజల్లో భక్తిభావం పట్ల చైతన్యపర్చారని చరిత్రకారులు చెబుతుంటారు. కేశవస్వామీజీ జియాగూడలోని మూసీనది తీరాన ప్రశాంత ప్రదేశంలో సజీవ సమాధి అయినట్లు భక్తుల నమ్మకం. ఆ ప్రాంతంలోనే ఆయన శిష్యులు, భక్తులు కలిసి ఆయన పేరిటే కేశవస్వామి సమాధి మందిరాన్ని నిర్మించారు. ఆ ప్రాంతానికి కేశవస్వామినగర్ అనే నామకరణం చేశారు. కేశవస్వామీజీ సమాధి అయిన మందిరం నేడు ఓ ఆధ్యాత్మిక మందిరంగా కొనసాగుతోంది. కేశవస్వామీజీ సమాధి అయిన రోజునే పుణ్యతిథి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు.

## రాష్ట్రపతిని కలిసిన కాంగ్రెస్ పార్టీ నేతలు


రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో కాంగ్రెస్ నేతలు

**గన్‌ఫౌండ్రి:** ఇటీవల నగరానికి విచ్చేసిన భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను తెలంగాణ పీసీసీ లింగ్విస్టిక్ మైనార్టీ సెల్ నేతలు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ మేరకు సెల్ యువజన కాంగ్రెస్ మైనార్టీ విభాగం ఛైర్మన్ మురళీ మోహన్ అశోక్‌సింగ్ తదితరుల బృందం రాష్ట్రపతి భవన్‌లో ఆయన్ను కలిసి శాలువా, పుష్పగుచ్ఛాలతో సన్మానించినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో లింగ్విస్టిక్ మైనార్టీ సెల్ నేతలు టి.రంజిత్‌సింగ్, టి.సంజీవ్‌కుమార్, రాజ్‌కుమార్ సింగ్ లోధ్, ఎస్.మనోహర్ పాల్గొన్నారు.

## ఐటీఐ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

**విజయనగర్ కాలనీ, న్యూస్‌టుడే:** ఐటీఐల్ని మరింత బలోపేతం చేసి మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర బేవరేజెస్ విభాగం ఛైర్మన్ దేవీప్రసాద్ అన్నారు. శనివారం మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐలో తెలంగాణ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (టీఈటీఈఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన 2018 నూతన సంవత్సర కాలమానిని ఆవిష్కరణలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవీప్రసాద్ మాట్లాడుతూ పారిశ్రామిక రంగాభివృద్ధికి ఊతమిచ్చేలా ఐటీఐల విద్యార్థులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత శిక్షణాధికారులపై ఉందన్నారు. వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందుతున్న ఐటీఐల విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఢోకా లేదని పేర్కొన్నారు. ఉపాధి శిక్షణా శాఖ సంచాలకులు కేవై నాయక్ మాట్లాడుతూ సాంకేతిక సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఐటీఐల్ని, పరీక్షా విధానాలను ఆధునికీకరిస్తున్నామని పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ శాఖాభివృద్ధి, ఉద్యోగుల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన ధ్యేయమన్నారు. విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చేందుకు మరిన్ని వాహనాలను సమకూర్చాలని కోరారు.

# నూతన ఏడాది ముందస్తు వేడుకలు


నూతన సంవత్సర కేక్ కోస్తున్న పాఠశాల ఛైర్మన్ బిట్ల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు

**జియాగూడ, న్యూస్‌టుడే:** జియాగూడలోని శ్లోక స్కూల్‌లో శనివారం రెండు రోజుల ముందుగానే 2018 నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్లోక విద్యాసంస్థల ఛైర్మన్ బిట్ల శ్రీనివాసరెడ్డి 2018 నూతన సంవత్సర కేక్ కోశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ చింతల సంఘమేశ్వర్ గుప్తా, డైరెక్టర్లు శైలజ, వీణ, ప్రిన్సిపల్ చంద్రయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### నూతన ఏడాదికి స్వాగతం పలికేందుకు..

**కార్వాన్:** 2018కి స్వాగతం పలికేందుకు కార్వాన్‌వాసులు సిద్ధమవుతున్నారు. ఈ సంవత్సరం మిగిల్చిన చేదు జ్ఞాపకాలను, అనుభవాలను మరచి కొత్త ఆశలతో నూతన సంవత్సరానికి స్వాగతం చెప్పేందుకు యువత, విద్యార్థులతో పాటు అన్ని వర్గాల వారూ ఉవ్విళ్లూరుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి వరకూ మెలకువగా ఉండి నూతన ఏడాది ప్రారంభ ఘడియల్ని ఆస్వాదించేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. మరోవైపు సంబరాలు శృతి మించకుండా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. తాగి వాహనాలను నడపటం, అపరిచిత వ్యక్తుల్ని ఇబ్బంది పెట్టేలా శుభాకాంక్షలు తెలపటం లాంటి చర్యలకు పాల్పడవద్దని టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్ సీహెచ్.చంద్రశేఖర్ పేర్కొన్నారు. క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్య కూడళ్లు, సమస్యాత్మక ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

# కాలమానినిల ఆవిష్కరణ


కాలమానిని ఆవిష్కరిస్తున్న కృష్ణవేణి స్కూల్ అధ్యక్షులు ఎస్.రాజు


తాళ్లగడ్డలోని మల్లన్న ఆలయంలో కాలమానిని ఆవిష్కరణ

**జియాగూడ, న్యూస్‌టుడే:** కృష్ణవేణి స్కూల్ 2018 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కృష్ణవేణి విద్యాసంస్థల అధ్యక్షులు ఎస్.రాజు ఆవిష్కరించారు. జియాగూడలోని కృష్ణవేణి స్కూల్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ స్కూల్ వ్యవస్థాపక డైరెక్టర్ పి.జైపాల్‌రెడ్డి, కృష్ణవేణి జియాగూడ స్కూల్ ప్రిన్సిపల్స్ బి.వెంకట్‌రెడ్డి, రహీంపురా శాఖ ప్రిన్సిపాల్ నాగేశ్, భీమ్‌నగర్ స్కూల్ ప్రిన్సిపల్ ఫ్లోరెన్స్, వైస్ ప్రిన్సిపల్స్ అమిత, వికాస్‌చంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణవేణి పాఠశాలల డైరెక్టర్ ఎస్.రాజు మాట్లాడుతూ రాబోయే 2018 నూతన సంవత్సరంలో విద్యార్థులు విద్యలో చక్కగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

**కార్వాన్:** దిక్సూచిలా పనిచేసే కాలమానినితో అనేక ప్రయోజనాలున్నాయని తాళ్లగడ్డలోని మల్లన్నస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్.శంకర్‌యాదవ్ తెలిపారు. శనివారం ఆలయంలో 2018 నూతన సంవత్సర కాలమానిని కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ఆలయ సేవకు ప్రతి ఒక్కరూ సమయం కేటాయించాలని సూచించారు. త్వరలో నిర్వహించే పండగలు, ఉత్సవాలు, భవిష్య కార్యాచరణపై చర్చించారు. స్థానిక పెద్దలు ఆలయ ప్రతినిధులు మధుసూదన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి మహాపడి పూజ

**బేగంబజార్, న్యూస్‌టుడే:** గౌలిగూడలో శుక్రవారం రాత్రి శ్రీఅయ్యప్పస్వామి మహాపడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకూ కొనసాగిన ఈ పూజల్లో అనేక మంది భక్తులు పాల్గొన్నారు. అయ్యప్పమాల ధరించిన భక్తులు భజన గీతాలు ఆలపించడంతో పాటు పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయన్ను శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాఘవన్, జ్ఞానేశ్వర్‌రావు, వెంకటేశ్వరరావు, డి.శ్రీను, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న బండారు దత్తాత్రేయ, భక్తులు

# కూకట్‌పల్లి



నియామకపత్రం అందిస్తున్న బాలనాథం

## నియామకం

**కూకట్‌పల్లి, న్యూస్‌టుడే:** మాలల ఐక్యవేదిక గ్రేటర్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా కూకట్‌పల్లి దయార్ గూడకు చెందిన మేకల రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల బాలనాథం చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.

# పునఃపరిశీలన.. తూతూమంత్రం

**కొన్నిచోట్ల బీఎల్‌వోలు కనిపించని పరిస్థితి ● కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఓటరు జాబితా సవరణ జరుగుతున్న తీరిది..**

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే

ప్రతిపాదిత తొలగింపు ఓటర్ల జాబితా పునఃపరిశీలన తూతూమంత్రంగా జరుగుతోంది. బీఎల్‌వోలు సరిగా తిరగకుండానే తమకిష్టమొచ్చినట్లు నివేదికలు సమర్పిస్తున్నారు. అసలు కొన్నిచోట్ల పరిశీలన జరగడం లేదని అధికారులు సైతం గుర్తించారు. దీనిపై తీవ్రస్థాయిలో మండిపడటమే కాకుండా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఇప్పటికే ముగిసిన ఇంటింటి ఓటరు సర్వేలో తప్పిదాలు జరిగాయని, పూర్తిస్థాయిలో పరిశీలన జరగలేదన్నది వాస్తవం. కొన్ని ఇళ్లకు బీఎల్‌వోలు రాలేదన్నది నగ్నసత్యం. దీంతో కొందరు తమ పేర్లు లేవంటూ ఇప్పటికే కొత్తగా మళ్లీ నమోదు చేసుకుంటున్నారు. కొన్ని కాలనీలవాసులు ఈ పనిలో నిమగ్నమవ్వడమే కాకుండా ఓటర్లను కూడా అప్రమత్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తొలగింపు ఓటరు జాబితాను పునఃపరిశీలించేందుకు ఇటీవల ఏర్పాట్లు చేశారు. అయితే ఇందులోనూ బీఎల్‌వోలు ఇష్టానుసారం వ్యవహరిస్తుండటం అధికారులకు తలనొప్పిగా మారింది. వాస్తవంగా తొలగింపు ప్రతిపాదిత ఓటర్ల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ సరిగా చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కూకట్‌పల్లి నియోజకవర్గంలో తొలగించిన ఓటర్ల పునఃపరిశీలన తీరుపై న్యూస్‌టుడే కథనం..

నియోజకవర్గంలోని 8 డివిజన్లలో 1,39,000 కు పైగా ఓటర్ల తొలగింపునకు ప్రతిపాదించిన విషయం తెలిసిందే. ఇటీవల ముగిసిన ఇంటింటి సర్వే తర్వాత వీరంతా ఆయా చిరునామాల్లో లేరని వీరి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించవచ్చని బీఎల్‌వోలు, వారికి సహాయంగా ట్యాబులు ఇచ్చి నియమించిన సిబ్బంది ప్రతిపాదించారు.



బీఎల్‌వోలకు సూచనలిస్తున్న అధికారి నాగరాజు

దీనిపై మల్లగుల్లాలు పడిన ఎన్నికల నిర్వహణ అధికారులు తొలగింపునకు ముందు సమీక్షించారు. అధికారుల వివరణ కూడా తీసుకున్నప్పటికీ తుది ఓటరు జాబితా ప్రచురణకు ముందు మరోసారి పునఃపరిశీలించాలన్న ఆలోచనకు వచ్చారు. ఇందులో భాగంగానే కొద్దిరోజులుగా బీఎల్‌వోలను మళ్లీ రంగంలోకి దించారు. దాదాపుగా నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీకాలనీ, బాలాజీనగర్, అల్లాపూర్, ఫతేనగర్, మూసాపేట, ఓల్డ్‌బోయిన్‌పల్లి, బాలానగర్, కూకట్‌పల్లి డివిజన్లలో తొలగింపు ఓటర్లు ఉన్నారు. దీంతో బీఎల్‌వోలంతా మరోసారి ఇంటింటికి తిరగాల్సిన అవసరం ఏర్పడింది.

### తిరగకుండానే లెక్కలు

అయితే బీఎల్‌వోలంతా సరిగా తిరగడంలేదన్నది వాస్తవం. ఈ విషయాన్ని ఇప్పటికే నియోజకవర్గ సహాయ ఎన్నికల నిర్వహణ అధికారి నాగరాజు గుర్తించారు. ఆకస్మికంగా తనిఖీ చేసిన సమయంలో కూకట్‌పల్లిలో ఒక్క బీఎల్‌వో కూడా లేకపోవడాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఆయన కలెక్టర్ ఎంవీ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఇప్పటికే పునఃపరిశీలించిన తర్వాత 70 వేలకు పైగా ఉన్న ఓటర్లలో దాదాపు వెయ్యి మంది ఆయా చిరునామాల్లో ఉన్నట్లు తెలిసింది. ఈ లెక్కలపై అధికారులు గోప్యతను ప్రదర్శిస్తున్నారు. ఒక్కొక్కరి నోట ఒక్కో లెక్క వినిపిస్తోంది. ఇదే అనుమానాలకు తావిస్తోంది. మొత్తం మీద పునఃపరిశీలన కూడా సరిగా జరగకపోవడంతో అధికారులు అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇప్పటికే సర్వే పూర్తికావాల్సి ఉన్నప్పటికీ జాప్యం జరుగుతూ వస్తోంది.

### పక్కాగా చేయించాల్సిన బాధ్యత అధికారులదే..

వాస్తవంగా ఎప్పుడు ఇంటింటి ఓటరు సర్వే జరిగినా తప్పకుండా కొన్ని తప్పిదాలు దొర్లుతూనే ఉన్నాయి. కొందరు ఇంటికి వెళ్లకుండానే తొలగింపుల నిర్ణయం తీసుకుంటూ వస్తున్నారు. ప్రతిసారి దీనిపై అభ్యంతరాలు రావడం.. మళ్లీ వాటిని అధికారులు సరిచేయడం జరుగుతూనే ఉంది. ఈసారి కూడా కొన్ని ఇళ్లకు వెళ్లకుండానే తొలగింపుల నిర్ణయం తీసుకున్నారనే విషయాన్ని వెలుగుచూస్తున్న నిజాలే చెబుతున్నాయి. శనివారం నాటికి పునఃపరిశీలన పూర్తిచేయాల్సి ఉండగా.. ఇంకా 60 వేలకు పైగా ఓటర్ల పరిశీలన జరగాల్సి ఉంది. కనీసం వచ్చేనెల 12వ తేదీ నాటికైనా తుది జాబితా ప్రచురణ పూర్తిచేయాలన్న ఆలోచనలో ఉన్నారు.

## ఘనంగా అయ్యప్ప దేవాలయ వార్షికోత్సవాలు



కలశాల ప్రదర్శన

**కూకట్‌పల్లి:** కూకట్‌పల్లిలోని అయ్యప్పస్వామి దేవాలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ కమిటీ నిర్వాహకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు యోగీశ్వరశర్మ పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున లక్ష్మీ గణపతి హోమం, గోపూజ, అష్టోత్తర కలశాభిషేకం, భజన కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం స్వామివారి ఊరేగింపు కనుల పండువగా సాగింది. అడుగడుగునా భక్తులు స్వామివారికి ఘనంగా స్వాగతం పలికారు. పూజలు ఆదివారం కూడా కొనసాగుతాయని ఆలయ ఇన్‌ఛార్జి అయినేని సుదర్శనరావు తెలిపారు. రెండోరోజు పంచామృతాభిషేకం, 18 కలశములతో మహా పడిపూజ, పుష్పాభిషేకం, అర్ధరాత్రి 12 గంటలకు స్వామివారి ప్రత్యేక దర్శన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

### భక్తిశ్రద్ధలతో ఊరేగింపు



అయ్యప్పస్వామి ఊరేగింపులో పండాల సతీష్‌గౌడ్

**ఫతేనగర్:** అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఫతేనగర్‌లో అయ్యప్పస్వామి వార్షిక పడిపూజ, ఊరేగింపు కార్యక్రమం కనుల పండువగా జరిగింది. కేరళ సంఘం పర్యవేక్షణలో అత్యంత భక్తి, శ్రద్ధల మధ్య పూజలు నిర్వహించారు. ఊరేగింపులో కేరళ సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడింది. దీపాలు, పిల్లల నృత్యాలు, ప్రత్యేక వాయిద్యాల ప్రదర్శన ఆహుతులను అలరించింది. కార్యక్రమంలో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సాగర్‌రావు, జగన్, బద్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పరిశోధన నైపుణ్యాన్ని సాధించాలి: ప్రిన్సిపల్



మాట్లాడుతున్న విద్యార్థులు

**కూకట్‌పల్లి, న్యూస్‌టుడే:** విద్యార్థులు పరిశోధన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్.ప్రసాద్ అన్నారు. కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థి స్టడీ ప్రాజెక్టు పేరుతో జిల్లాస్థాయి జిజ్ఞాస పోటీలు ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి, మల్కాజిగిరి కళాశాలల విద్యార్థులు తమలోని జిజ్ఞాస అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.



ఆహార ఉత్పత్తులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కావ్యారెడ్డి

## నోరూరించిన ఆహార ఉత్పత్తుల ప్రదర్శన

**కూకట్‌పల్లి:** కేపీహెచ్‌బీకాలనీ మూడోఫేజ్‌లోని భాష్యం స్కూల్‌లో శనివారం ఆహారోత్సవం జరిగింది. విద్యార్థులు తయారు చేసిన ఆహార ఉత్పత్తులను ప్రదర్శించారు. కార్పొరేటర్ పన్నాల కావ్యారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రదర్శనను తిలకించారు. పాఠశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# అలరించిన సంస్కృతి వేడుకలు

**కూకట్‌పల్లి, న్యూస్‌టుడే:** కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీకాలనీ నారాయణ పాఠశాలల వార్షికోత్సవం శనివారం రాత్రి కూకట్‌పల్లి నైనాగార్డెన్స్‌లో సంస్కృతి పేరుతో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తెలంగాణ సంస్కృతి, పండుగల ప్రాధాన్యం చాటిచెబుతూ నిర్వహించిన జానపద, బతుకమ్మ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు పలు అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైద్యులు విశ్వనాథ్, శ్రీనివాసరావు, పాఠశాలల నిర్వాహకులు అనిత, హరికృష్ణ, వైజయంతి, ప్రిన్సిపల్ జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనలో విద్యార్థినులు



జానపద నృత్య ప్రదర్శన

## ‘మద్యం దుకాణాలు సమయపాలన పాటించాలి’

**బాలానగర్, న్యూస్‌టుడే:** మద్యం దుకాణాలు నూతన సంవత్సరం సందర్భంగా సమయపాలన పాటించాలని మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ అధికారి గణేష్ అన్నారు. శనివారం జిల్లా పరిధిలోని ఎక్సైజ్ ఠాణాల వారితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 21ఏళ్ల లోపు వారికి మద్యం విక్రయించడానికి వీలు లేదన్నారు. కొత్త ఏడాది వేడుకల్లో డ్రగ్స్ వాడినట్లు గుర్తిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇందుకోసం అప్పటికప్పుడు తనిఖీ చేసి చర్యలు తీసుకునేందుకు సీఐలకు పరికరాలను అందజేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, డ్రగ్స్ వాడుతున్నట్లు సమాచారం ఉంటే 9440902317, 9440902322 చరవాణి సంఖ్యలలో సమాచారం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ జిల్లా అధికారి గణేష్

## ఘనంగా పింక్‌డే వేడుకలు



పింక్‌డే వేడుకల్లో చిన్నారులు

**వెంగళ్‌రావునగర్ (అల్లాపూర్):** స్నేహపురికాలనీలోని బచ్‌పన్ ప్లేస్కూల్లో శనివారం పింక్ కలర్‌డే, నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులంతా పింక్ కలర్ దుస్తులు ధరించి వేడుకలకు హాజరయ్యారు. పాఠశాల ఆవరణంతా పింక్ కలర్ బెలూన్స్‌తో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ ముంతాజ్‌బేగం కేక్‌కోసి పిల్లలకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. డైరెక్టర్ సంపత్, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అనాథ ఆశ్రమానికి నిత్యావసరాల పంపిణీ

**కూకట్‌పల్లి, న్యూస్‌టుడే:** రవీంద్రభారతి హైదర్‌నగర్ బ్రాంచి విద్యార్థులు సేవా తత్పరతను చాటారు. డబ్బులు సేకరించి పాఠశాల నిర్వాహకులతో కలిసి మియాపూర్‌లోని మారుతి అనాథ ఆశ్రమానికి కావాల్సిన సామగ్రి, నిత్యావసరాలను అందజేశారు. సామాజిక సేవలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో కేక్ కోసి అందరికి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి

## 'నాలా విస్తరణ పనులు చేపట్టాలి'

**వెంగళ్‌రావునగర్(అల్లాపూర్):** అల్లాపూర్ కార్పొరేటర్ సబిహాబేగం శనివారం పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ మల్లిఖార్జునరావుని కలిసి డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన నాలా విస్తరణ పనులు గురించి మాట్లాడారు. సబ్దర్‌నగర్‌లో నాలా విస్తరణ పనులు మొదలుపెట్టాలని కార్పొరేటర్ ఏసీపీని కోరారు.

## విలువలతో కూడిన విద్య అవసరం: ఎంపీ

**కూకట్‌పల్లి, న్యూస్‌టుడే:** విలువలతో కూడిన విద్య ప్రస్తుత సమాజంలో చాలా అవసరమని చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం జేఎన్‌టీయూ ఆడిటోరియంలో జేఎన్‌టీయూ యూఐఐసీ, తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ యువ నిర్మాణ్-2017 ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. విలువలు లేకుంటే ఎంత విద్యను సాధించినా ప్రయోజనం ఉండదన్నారు. మారుతున్న పరిస్థితులు, పరిజ్ఞానాన్ని విద్యార్థులు ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఉదయం కార్యక్రమం ప్రారంభోత్సవానికి జేఎన్‌టీయూ యూనివర్సిటీ ఇండస్ట్రీ ఇంటరాక్షన్ సెంటర్ డైరెక్టర్ సి. హెచ్. వెంకటరమణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా నైపుణ్యాభివృద్ధి, ఇంటర్వ్యూను ఎదుర్కొనడం, వ్యక్తిత్వ వికాసం తదితరాలపై సమీక్షించారు. కార్యక్రమంలో వాటర్ రీసోర్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ వి. ప్రకాశ రావు, టీటా ప్రతినిధులు ఎం. సందీప్, రాణాప్రతాప్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న వెంకటరమణరెడ్డి

## పీఆర్‌టీయూ కాలమానిని ఆవిష్కరణ

**కూకట్‌పల్లి, న్యూస్‌టుడే:** పీఆర్‌టీయూ కూకట్‌పల్లి మండల కమిటీ నూతన సంవత్సర కాలమానిని శనివారం డీఈవో రోహిణి ఆవిష్కరించారు. కూకట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె కాలమానిని విడుదల చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నేతలు నరేందర్‌గౌడ్, వెంకటేష్, పద్మావతి, శివరాజ్, సుభాష్, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.



కాలమానిని ఆవిష్కరిస్తున్న డీఈవో రోహిణి

## కుంగ్‌ఫూలో పతకాలు సాధించిన చిన్నారులు

**కూకట్‌పల్లి, న్యూస్‌టుడే:** కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ట్వింకిల్ స్టార్స్ పాఠశాలలో శనివారం జరిగిన కుంగ్‌ఫూ పోటీల్లో చిన్నారులు సత్తా చాటారు. ప్రతిభ చూపిన పిల్లలకు నిర్వాహకులు పతకాలు, ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గోకుల్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాంటెండెంట్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ధ్రువపత్రాలు, పతకాలతో చిన్నారులు

## 'ఒంటరి వృద్ధులకు ఆసరాగా ఉంటా'

**కూకట్‌పల్లి, న్యూస్‌టుడే:** ఒంటరి, అనాథ వృద్ధులకు అండగా నిలవాలన్న ఆలోచనకు కొత్త ఏడాదిలో కార్యరూపం ఇవ్వనున్నామని బాలానగర్ సర్కిల్ సహాయ పౌరసరఫరా అధికారి శ్రీనాథ్ అన్నారు. ఇందుకోసం స్నేహితులతో కలిసి కార్యాచరణ సిద్ధం చేసుకున్నామని తెలిపారు. పిల్లలు విదేశాల్లో ఉండడంతో ఒంటరిగా ఉంటున్న, పిల్లలు లేకుండా అనాథలుగా ఉంటున్నవారికి చక్కని వాతావరణంతో కూడిన ఆసరాను అందించాలనుకుంటున్నామని పేర్కొన్నారు. ఒక ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి అక్కడ వారికి తోడునీడగా నిలిచే ఏర్పాట్లు చేయాలనుకుంటున్నామని వివరించారు. కొందరు స్నేహితులు కూడా ఇందుకోసం ముందుకొస్తున్నట్లు తెలిపారు. కొన్నిమాసాలుగా ఈ ఆలోచనపై సమాలోచనలు జరుగుతుండగా. . కొత్త ఏడాదిలో కార్యరూపం దాల్చునున్నట్లు పేర్కొన్నారు. పౌర సరఫరా సర్కిల్ అధికారిగా కూడా సాధ్యమైనంతవరకు పేదలకు సాయంగా నిలవాలన్న లక్ష్యం పెట్టుకున్నట్లు ఆయన వివరించారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత

**బాలానగర్, న్యూస్‌టుడే:** ఫిరోజ్‌గూడలో లబ్ధిదారులకు కార్పొరేటర్ కాండూరి నరేందర్ ఆచార్య శనివారం కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. వారి ఇంటికెళ్లి ఆయన చెక్కులు అందించారు. కార్యక్రమంలో తెరాస నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

**ఫతేనగర్:** ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరాగాంధీపురంలో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు ఇంటికెళ్లి ఒక్కొక్కరికి రూ. 75,116 చెక్కులు అందించారు. కార్యక్రమంలో తెరాస నేతలు అఫ్జల్, గౌస్, ఇమ్రాన్, రాజేష్, రాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సమాచారం

**కూకట్‌పల్లి, న్యూస్‌టుడే:** ఇండేన్ గ్యాస్ ఆన్‌లైన్ ఫోన్ నంబర్: 98488 24365 హెచ్‌పీ గ్యాస్ ఆన్‌లైన్ నంబర్: 966602 3456.

## రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు దుర్మరణం

### ముగ్గురు ఉపాధ్యాయినులకు తీవ్రగాయాలు

**వెంకటేశ్వరనగర్ (మాల్), చింతపల్లి, న్యూస్‌టుడే:** వారంత ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు.... మరో అర్ధగంటలో బడికి వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధించే వారే. ఇంతలోనే జరిగిన రోడ్డు ప్రమాదం ఒకరిని బలికొనగా.. ముగ్గురు ఉపాధ్యాయినులను గాయాలపాల్జేసింది. ఈ ఘటన శనివారం నల్గొండ జిల్లా చింతపల్లి మండలంలోని పోలేపల్లిరాంనగర్ సమీంపలో చోటు చేసుకుంది. చింతపల్లి ఎస్సై నాగభూషణ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని గాయత్రినగర్‌లో నివసించే వెంపటి శ్రీరాంరమేష్(32) మండలంలోని మల్లారెడ్డి గ్రామపంచాయతీలోని బోత్యతండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. రోజు మాదిరిగానే కారులో ఉపాధ్యాయులు సుమతి(దేన్యాతండా ప్రాథమిక పాఠశాల), రాధారాణి (వర్కాల ప్రాథమిక), సుమలత(తక్కళపల్లి ప్రాథమికోన్నత పాఠశాల)లు విధులు వస్తున్నారు. కుర్మేడ్ వైపు కారులో వస్తుండగా.. మాల్ వైపు వెళ్తున్న ట్రాక్టర్ పోలేపల్లిరాంనగర్ సమీపంలో ఎదురెదురుగా ఢీకొంది. తీవ్రంగా గాయపడిన శ్రీరాంరమేష్‌తోపాటు ముగ్గు ఉపాధ్యాయినులను చికిత్స నిమిత్తం 108లో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా.. శ్రీరాంరమేష్ మృతి చెందారు. సుమతి, రాధారాణి కాళ్లు విరిగాయి. సుమలతకు తీవ్ర గాయాలయ్యాయి. చింతపల్లి ఎస్సై నాగభూషణ్‌రావు ఘటన స్థలానికి చేరుకొని విచారించారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



**PUBLIC NOTICE**

The General Public are hereby informed that my client Sri. Dr. M. Sampath Rao S/o Madhava Rao purchased property bearing M.No. 5-5-35/158 admeasuring 3304 sq.yards, in S.No. 404, KukatpallyVillage (Near Y Junction, Opp: Telangana RTC Complex) and Mandal, Medchal/ Malkajgiri Dist. from its owner M/s Prajay Velocity Developers (P) Ltd. under two separate Registered Sale Deeds bearing No. 10249/2017 and 10250/2017 dated 20-12-2017 bounded by: North: Owner's land: South: 150' Main Road, East: 40' Common Road and West: Owners land, by paying the sale consideration and inducted into possession. If any Public have any objection in respect of the above sale transaction, can raise their objections within one week from today and approach the below mentioned advocate with cogent documentary evidence. If no Objections received from anybody as stated above, the transaction will be treated genuine and afterwards no objections will be entertained.

Sd/- B. RAVISHANKAR, Advocate
Office No. 305-C, Pancom Business Centre,
Ameerpet X Roads, Hyd-500073.
Cell No. 9849131453.

# ఎల్.బి.నగర్

## పారిశుద్ధ్య కార్మికులను క్రమబద్ధీకరించాలి



మహాసభలకు సంబంధించి గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధి మద్దిలేటి

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికులను క్రమబద్ధీకరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఎం మద్దిలేటి అన్నారు. సంఘం రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని హస్తినాపురం డివిజన్ పరిధి టీకేఆర్ రోడ్డులోని నందనవనంలో శనివారం పారిశుద్ధ్య కార్మికుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పిన తెరాస గద్దెనెక్కిన తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ఈ సందర్భంగా మహాసభలకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. యాదమ్మ, పద్మమ్మ, అరుణ, అనసూయ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

## శ్లోక పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు

హయత్‌నగర్, న్యూస్‌టుడే: హయత్‌నగర్‌లోని శ్లోక పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. విద్యార్థులతో కలిసి పాఠశాల ఛైర్మన్ బిట్ల శ్రీనివాస్‌రెడ్డి కేకును కోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో కొత్త లక్ష్యాలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డైరెక్టర్ శైలజారెడ్డి, జోనల్ ఇన్‌ఛార్జి చిరంజీవి, ప్రిన్సిపల్ సంతోషిరాణి, అదనపు పర్యవేక్షకులు ప్రమోద్‌రెడ్డి, ఇంఛార్జీలు పల్లవి, శ్రీవాణి, శైలజ, రీటా పాల్గొన్నారు.



## సరూర్‌నగర్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

బాలాపూర్, న్యూస్‌టుడే: శనివారం నాటి కూరగాయల ధరలు, కిలో రూ. టమోటా (10), వంకాయ (15), బెండకాయ (38), పచ్చిమిర్చి (23), కాకరకాయ (25), బీరకాయ (25), క్యాబేజీ (15), బీన్స్ (25), క్యారెట్ (48), గోబీ (35), దొండకాయ (23), చిక్కుడుకాయ (40), గోకరకాయ (40), బీట్‌రూట్ (23), క్యాప్సికం (40), ఆలుగడ్డ (16), కీర (23), దోసకాయ (18) సొరకాయ (15), పొట్లకాయ (19), చామగడ్డ (40), కంద (28), ఉల్లిగడ్డ (35).

# నిఘా పెరిగి.. చోరీలు తగ్గి

- అన్ని ఠాణాల్లోనూ తగ్గిన కేసులు
- గతంలో పోలిస్తే రికవరీలో వెనుకబాటు

**నియోజకవర్గంలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు.. నేరస్థులపై ఉక్కుపాదం మోపడం.. ప్రజలకు అవగాహన కల్పించడం వంటి చర్యలతో 2017లో నేరాలు తగ్గుముఖం పట్టాయి. ముఖ్యంగా గొలుసు చోరీలు గణనీయంగా తగ్గాయి. ఇళ్లలో చోరీల సంఖ్య సైతం తగ్గినప్పటికీ సొత్తు రికవరీలో అన్ని ఠాణాలు గతేడాదితో పోల్చితే వెనుకబడ్డాయి. ఈ ఏడాది నియోజకవర్గంలోని ఐదు ఠాణాల్లో నమోదైన కేసుల వివరాలతో నేరావలోకం..**

## పెరిగిన బందోబస్తు బాధ్యతలు

నాగోలు, న్యూస్‌టుడే: 2011లో ఉమ్మడి రాష్ట్రంలోనే అత్యధిక కేసులు(2124) నమోదైన ఠాణాగా రికార్డులకెక్కిన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో క్రమంగా కేసుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. గతేడాది 1463 కేసులు నమోదవగా ఈ ఏడాది ఆ సంఖ్య 1384(శనివారం వరకు)కు చేరింది. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఈ ఏడాది సీసీ కెమెరాలు ప్రధాన పాత్రపోషించాయి. గత రెండేళ్లకు సంబంధించిన మిస్సింగ్ కేసులను ఈ ఏడాది ప్రత్యేక దృష్టిసారించి పరిష్కరించేందుకు కృషిచేశారు. ముఖ్యంగా మైనర్లను ప్రేమపేరుతో అపహరించి లైంగికంగా వేధించిన వారిపై పోస్కో వంటి చట్టాలతో నిందితులను కఠినంగా శిక్షించారు. ప్రభుత్వ ఉద్యోగాలిప్పిస్తామంటూ మోసంచేసే అనేక ముఠాలను కటకటాల వెనక్కి నెట్టారు. చైన్‌స్నాచింగ్‌లు గణనీయంగా తగ్గించగలిగారు. వనస్థలిపురం ఠాణా పరిధినుంచి ట్రాన్స్‌ఫర్ అయివచ్చిన 2 కేసులు మినహా ఈ ఏడాది ఎల్బీనగర్‌లో హత్యకేసులు లేవు. నగరంలో సంచలనం సృష్టించిన నైజీరియన్ డ్రగ్ ముఠాలను ఎస్‌వోటీ బృందం సహాయంతో ఎల్బీనగర్ పోలీసులు అరెస్టుచేశారు. వీఐపీల బందోబస్తులకు తోడు అనేక మహాసభల బందోబస్తులో ఇక్కడి పోలీసులు తలమునకలయ్యారు. ఈ ఏడాది 10 దోపిడీ కేసుల్లో 7 ఛేదించారు. తాళంవేసిన ఇళ్లలో 47 చోరీలు జరగ్గా 24 పరిష్కరించారు. 78 ద్విచక్రవాహనాలు పోతే 33 స్వాధీనం చేసుకున్నారు. 152 మిస్సింగ్ కేసుల్లో 133 మందిని తిరిగి సొంతగూటికి చేర్చారు. ఈ ఏడాది 193 రోడ్డుప్రమాదాలు చోటుచేసుకోగా 22 సంఘటనల్లో ప్రజల ప్రాణాలు పోయాయి. చోరీల్లో రూ.1,25,04,740/- విలువైన ఆస్తులను ప్రజలు కోల్పోగా... పోలీసులు నిందితులను పట్టుకుని రూ.56,17,500/- విలువైన ఆస్తుల(46శాతం)ను స్వాధీనం చేసుకుని తిరిగి ప్రజలకు అప్పగించారు. ఈ ఏడాది.. ఓఎల్ఎక్స్ ఫోన్లు అమ్ముతామంటూ మోసం చేసిన నిందితులను అరెస్టు చేసిన పోలీసులు... సీసీ కెమెరాల సహాయంతో నాగోలు వద్ద ఓ మహిళ చేతిసంచిలోని బ్యాగుతో ఉడాయించిన నిందితున్ని, ద్విచక్రవాహనంపై వెళ్తూ స్నాచింగ్‌లతోపాటు దోపిడీలకు పాల్పడుతున్న కరడుగట్టిన దుండగులను అరెస్టు చేశారు. బస్టాపుల్లో నిల్చున్న ప్రయాణికుల నుంచి నగలు, నగదు చోరీ చేసే ముగ్గురు మహిళల ముఠాను అరెస్టు చేసి 80వేలు స్వాధీనం చేసుకున్నారు.

## 47 శాతం మాత్రమే..



సరూర్‌నగర్ ఠాణా

దిల్‌సుఖ్‌నగర్: ఠాణాలకు ఆధునిక హంగులు, సిబ్బంది తిరగడానికి ఆధునిక వాహనాలు అందజేయడంతో గతేడాదితో పోలిస్తే నేరాల సంఖ్య ఈ సంవత్సరం తగ్గినా నేరస్థుల నుంచి రికవరీ మాత్రం గణనీయంగా తగ్గింది. సరూర్‌నగర్ ఠాణా పరిధిలో డిసెంబరు 25 నాటికి 930 కేసులు నమోదుకాగా రూ.94,85,587 మేర సొమ్ము చోరీ జరగ్గా రూ.44,51,000 మాత్రం రికవరీ చేయగలిగారు. ఇది 47శాతం మాత్రమే. గతేడాది డిసెంబర్ చివరి నాటికి 930 కేసులు నమోదయ్యాయి. రూ.78,31,927 ఆస్తునలు కోల్పోగా రూ.61,12,920 రికవరీ చేయగలిగారు. అంటే 79శాతం రికవరీ చేశారు.

## స్వల్పంగా పెరుగుదల

చైతన్యపురి: చైతన్యపురి ఠాణాలో గతంతో పోలిస్తే కేసుల సంఖ్య స్వల్పంగా పెరిగింది. రికవరీ ఇక్కడ కూడా తగ్గింది. 2017 డిసెంబర్ 25 వరకు 757 కేసులు నమోదయ్యాయి. రూ.1,26,47,910 ఆస్తి కోల్పోయారు. రూ.63,41,000 అంటే సుమారు 50 శాతం మాత్రమే రికవరీ జరిగింది. 2016లో 701 కేసులు నమోదు కాగా రూ.87,35,380 సొత్తు కోల్పోయారు. అందులో రూ.51,46,380 విలువైన సొత్తు రికవరీ చేశారు. అంటే 59శాతం.



చైతన్యపురి ఠాణా

## మార్పు లేదు..



వనస్థలిపురం పోలీస్‌స్టేషన్

వనస్థలిపురం: వనస్థలిపురం ఠాణా పరిధిలో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది నేరాల సంఖ్య తగ్గింది. ముఖ్యంగా గొలుసు చోరీలతో ఎక్కువగా వార్తల్లో నిలిచే ఠాణాలో ఈ ఏడాది అవి సగం తగ్గాయి. గతేడాది 22 నమోదవ్వగా ఈ ఏడాది 11కు తగ్గింది. రోడ్డు ప్రమాదాల సంఖ్య కొంత తగ్గినా గతేడాదితో పోల్చితే గణనీయమైన మార్పు లేదు. గత ఏడాది 174 రోడ్డు ప్రమాదాల్లో 36 మంది మృత్యువాతపడగా 145 మందికి గాయాలయ్యాయి. ఈ ఏడాది 138 ప్రమాదాల్లో 34 మంది మృతిచెందగా 125 మందికి గాయాలయ్యాయి. దొంగతనాలలో గతేడాది 37 నమోదవగా ఈ ఏడాది 39 జరిగాయి. ఓ బారు యజమాని ఆత్మహత్యకు ముందు వీడియో తీసుకున్న ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ సంఘటనలో అతని మృతికి కారణమైన పలువురిని పోలీసులు అరెస్టుచేశారు. ఈ ఏడాది 128 మంది అదృశ్యమవగా గతేడాది ఈ సంఖ్య 134గా ఉంది. రెండు హత్య కేసులతోపాటు ఈ ఏడాది 7 కిడ్నాప్ కేసులు నమోదవగా గతేడాది రెండు హత్యలు, 4 కిడ్నాప్ కేసులు నమోదయ్యాయి. గతేడాది డిసెంబర్ 25 వరకు మొత్తం 970 నమోదు కాగా ఈ ఏడాది ఈ సంఖ్య 949గా ఉంది. 11 గొలుసు చోరీల్లో 7 చోరీల సొమ్ము రికవరీ చేశారు.

## గొలుసు చోరీలు తగ్గుముఖం

హయత్‌నగర్: హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో భాగంగా ఉన్న బాహ్యవలయ రహదారి వెలుపలి గ్రామాలతో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ ఏర్పడడంతో ఈ ఏడాది హయత్‌నగర్‌లో కేసుల సంఖ్య కొంతమేర తగ్గింది. అయితే... కీలకమైన సంచలనాత్మకమైన కేసులకు ఈసారి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ వేదికగా మారింది. ముఖ్యంగా బాలీవుడ్ నిర్మాత కరీంమొరానీపై అత్యాచార ఆరోపణలకు సంబంధించిన కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న హయత్‌నగర్ పోలీసులు అతన్ని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించడం సంచలనం రేపింది. భూదాన భూముల విక్రయాలకు సంబంధించి బోర్డు మాజీ ఛైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి అరెస్టుతో పాటు కోహెడలో 120 ప్లాట్లను నకిలీ పత్రాలు సృష్టించి విక్రయించిన కేసులో నిందితుడు రాఘవేందర్‌రెడ్డి అరెస్టు సైతం పోలీసుల మెరుగైన పనితీరుకు నిదర్శనంగా చెప్పవచ్చు. ఇక పెద్దఅంబర్‌పేట బాహ్యవలయ రహదారి సమీపంలో రూ.4కోట్ల విలువైన సిగరెట్ లోడ్ అపహరణలో మధ్యప్రదేశ్ దేవాస్ ప్రాంతానికి చెందిన కంజర గ్యాంగ్ నిందితుల అరెస్టుతో హయత్‌నగర్ పోలీసులకు, రాచకొండ కమిషనరేట్‌కు మంచిపేరు వచ్చింది.(ప్రస్తుతం కంజర గ్యాంగ్ కేసును చౌటుప్పల్‌కు బదిలీచేశారు.)

- 2016లో మొత్తం 1218 కేసులు నమోదయ్యాయి. అందులో 263 రోడ్డు ప్రమాదాలకు సంబంధించి 90 మంది మృతిచెందారు. 193 మంది గాయాలపాలయ్యారు. 181 దొంగతనాల కేసులు నమోదు కాగా రూ.93,16,195 విలువైన సొత్తు అపహరణకు గురైంది. అందులో 63 శాతంతో రూ.58,56,000 సత్తు రికవరీ అయ్యింది. 112 మిస్సింగ్ కేసులు, 5 హత్యకేసులు నమోదయ్యాయి.
- 2017లో డిసెంబరు 25వరకు 815 కేసులు నమోదయ్యాయి. అందులో 142 రోడ్డుప్రమాదాలు జరగ్గా... 37 మంది మృతిచెందారు. 128 మంది గాయాలపాలయ్యారు. 135 దొంగతనాల కేసులు నమోదుకాగా రూ.1,07,41,800 విలువైన సొత్తు అపహరణకు గురైంది. అందులో 63 శాతంతో రూ.67,86,800 సొత్తు రికవరీ జరిగింది. 110 మిస్సింగ్ కేసులు, 2 హత్యకేసులు నమోదయ్యాయి. ఏడాదిమొత్తంలో కేవలం ఒకేఒక స్నాచింగ్ కేసు నమోదవడం విశేషం.




హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ బోర్డు

# ఎల్.బి.నగర్

## నియామకం

ఎల్బీనగర్: తెరాస నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శిగా కె.నర్సింహ నియమితులయ్యారు. ఈ మేరకు ఎల్బీనగర్ తెరాస ఇన్‌ఛార్జి రామ్మోహన్‌గౌడ్ నియామక ఉత్తర్వులు జారీ చేస్తూ తన నివాసంలో నియామకపత్రం శనివారం అందించారు. కార్యక్రమంలో రాములు, రాంకోటి తదితరులున్నారు.

## డివిజన్‌లో పార్కుల అభివృద్ధికి కృషి

వనస్థలిపురం, న్యూస్‌టుడే: డివిజన్‌లో పార్కుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని వనస్థలిపురం కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం వనస్థలిపురంలోని కాంప్లెక్స్ సమీపంలోని రూ.12.5 లక్షలతో హుడా పార్కు అభివృద్ధి పనుల్లో భాగంగా బోర్‌వెల్ పాయింట్ పనులకు ఆయన శంకుస్థాపన స్థాపన చేశారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, ఆలేటి రవి, చంద్రశేఖర్, గణేశ్, నాగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, సంతోశ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సేవా భావాన్ని అలవర్చుకోవాలి



గ్రేసియస్ పారడైజ్ అనాథాశ్రమం విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న రవీంద్రభారతి పాఠశాల విద్యార్థులు

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: చిన్ననాటి నుంచే విద్యార్థులు సేవా భావాన్ని అలవర్చుకోవాలని రవీంద్రభారతి ప్రిన్సిపాల్ ఫణిమాధవి అన్నారు. కర్నూల్ రోడ్డు కర్మన్‌ఘాట్‌లోని ఆ పాఠశాల విద్యార్థులు సేకరించిన వంట సామగ్రితోపాటు నిర్వాహకులు చేయించిన బెంచీలను సైదాబాద్‌లోని వైదేహీ అనాథ బాలికల ఆశ్రమానికి శనివారం అందజేశారు.

● అనాథ విద్యార్థులకు అండగా నిలుద్దామని హస్తినాపురం రవీంద్రభారతి ప్రిన్సిపాల్ సూర్యనారాయణ అన్నారు. విద్యార్థులతోపాటు నిర్వాహకులు సేకరించిన రూ.50 వేల విలువజేసే నాలుగు లాకర్లు, రెండు తాగునీటి ఫిల్టర్లు, మంచాలను హస్తినాపురం డివిజన్ జడ్పీరోడ్డులోని కీర్తన ఫౌండేషన్‌కు శనివారం అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, ఫౌండేషన్ డైరెక్టర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

**వనస్థలిపురం:** వనస్థలిపురం రవీంద్రభారతి పాఠశాల విద్యార్థులు, సిబ్బంది సేకరించిన విరాళాలతో సచివాలయనగర్‌లోని సిరియా అనాథాశ్రమానికి, వనస్థలిపురంలోని సిరియా అనాథాశ్రమానికి వంటకు ఉపయోగపడే వెట్ గ్రైండర్, డీఫ ఫ్రిజ్‌లతో పాటు వంట సామగ్రి అందజేశారు. పాఠశాల డీన్ కృష్ణమోహన్, డీఐ క్రాంతి కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ ముఖ్తార్ అహ్మద్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**హయత్‌నగర్:** హయత్‌నగర్‌లోని రవింద్రభారతి పాఠశాల విద్యార్థులు నూతన సంవత్సర వేడకలను శనివారం కర్టసీ ఫౌండేషన్‌లో అనాథ విద్యార్థులతో కలిసి జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల అందించిన డబ్బుతో కర్టసీ ఫౌండేషన్‌కు గ్రైండర్, మిక్సీ, ఫ్యాన్లు, పుస్తకాలను వితరణగా అందించారు. పాఠశాల ప్రిన్సిపల్ వరలక్ష్మి డీన్ కృష్ణమోహన్, డివిజన్ ఇన్‌ఛార్జి క్రాంతికుమార్, ఫౌండేషన్ ఇన్‌ఛార్జి మల్కన్న పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



పతకాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం, అతిథులు

వనస్థలిపురం, న్యూస్‌టుడే: పాఠశాల యాజమాన్యాలు చదువుతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని వనస్థలిపురం కార్పొరేటర్ జిట్టారాజశేఖర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురంలోని ఫేజ్4 లోని మైదానంలో వనస్థలిపురం లోటస్ ల్యాప్ స్కూల్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనస్థలిపురంలో విద్యార్థులు ఆడుకోవడానికి మైదానాలు ఉన్నాయని, వాటిని మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. స్పోర్ట్స్ మీట్‌లో న్యూచైతన్య స్కూల్, క్యాండర్ ఫ్రైన్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్, నారాయణ స్కూల్ సహా పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, మంజుల, కరూర్ వైశ్య బ్యాంకు మేనేజరు టి.రమణ, అసోసియేషన్ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## గుట్కా విక్రేతల అరెస్టు

నాగోలు, న్యూస్‌టుడే: నిషేధిత గుట్కా సరఫరా చేస్తున్న ముఠాలోని ముగ్గురు సభ్యులను రాచకొండ కమిషనరేట్‌లోని చైతన్యపురి పోలీసులు అరెస్టుచేశారు. శనివారం ఎల్బీనగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ వేంకటేశ్వర్‌రావు నిందితుల వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం మహబూబాబాద్‌కు చెందిన వ్యాపారి వెంకటరమణ(41), నగరంలోని కొత్తపేట మారుతీనగర్‌కు చెందిన బండ ప్రసాద్‌రెడ్డి(34), సూర్యానగర్‌కాలనీకి చెందిన ఆలకుంట్ల నవీన్(21)లు ఓ ముఠాగా ఏర్పడ్డారు. కర్ణాటకలోని బీదర్ పారిశ్రామిక ప్రాంతం నుంచి శ్రీనుబాయ్, శర్మ అనే వ్యక్తుల నుంచి గుట్కా ప్యాకెట్లు కొనుగోలు చేసి నగరంలోని ఎల్బీనగర్‌కు చెందిన శ్రీనివాస్‌కు అమ్ముతున్నారు. సమాచారం అందుకున్న చైతన్యపురి పోలీసులు వెంకటరమణ, ప్రసాద్‌రెడ్డి, నవీన్‌లను అరెస్టుచేశారు

# మలక్‌పేట

## సరూర్‌నగర్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

బాలాపూర్, న్యూస్‌టుడే: శనివారం నాటి కూరగాయల ధరలు, కిలో రూ.టమోటా (10), వంకాయ (15), బెండకాయ (38), పచ్చిమిర్చి (23), కాకరకాయ (25), బీరకాయ (25), క్యాబేజీ (15), బీన్స్ (25), క్యారెట్ (48), గోబీ (35), దొండకాయ (23), చిక్కుడుకాయ (40), గోకరకాయ (40), బీట్‌రూట్ (23), క్యాప్సికం (40), ఆలుగడ్డ (16), కీర (23), దోసకాయ (18) సొరకాయ (15), పొట్లకాయ (19), చామగడ్డ (40), కంద (28), ఉల్లిగడ్డ (35).

# నేర నియంత్రణ చర్యలతో చోరుల్లో దడ

● సత్ఫలితాలిస్తున్న సీసీ కెమెరాల ఏర్పాటు ● పోలీసు ఠాణాల వార్షిక ప్రగతి

సైదాబాద్, న్యూస్‌టుడే:

పోలీసు వ్యవస్థలో పలు మార్పులకు సర్కార్ తోడ్పాటు అందించడంతో మలక్‌పేట నియోజకవర్గ పరిధుల్లోని సైదాబాద్, మలక్‌పేట, చాదర్‌ఘాట్ పోలీస్ ఠాణాల్లో శాంతి భద్రతల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. పలు నేరాల నియంత్రణ కోసం అందుబాటులో ఉన్న సాంకేతిక అంశాలపై ప్రధాన దృష్టి కేంద్రీకరించారు. తద్వారా నేరస్థుల్లో దడ పుట్టించారు. సాంకేతిక అస్త్రం అందుబాటులో ఉండటంతో పలు కాలనీలు, బస్తీల్లో సీసీకెమెరాలు ఏర్పాటయ్యాయి. 2015, 2016, 2017 సంవత్సరాల మధ్య కేసుల నమోదు, చోరీలు, సొత్తు రికవరీల్లోనూ పలు వ్యత్యాసాల కనిపించాయి. హత్యలు, రాత్రిపూట దొంగతనాలు, సాధారణ దొంగతనాలు, సాధారణ వేధింపులు తగ్గుముఖం పట్టాయి. రహదారి ప్రమాదాల సంఖ్యలో హెచ్చుతగ్గుదల కనిపించాయి. ఇరు ఠాణాల్లో పాత నేరస్థుల కదలికలపై నిఘా కేంద్రీకరించారు. రెండేళ్లలో మలక్‌పేట ఠాణాలో 25 మందిపై, సైదాబాద్ ఠాణాలో 12 మందిపై పీడీ అస్త్రాన్ని ప్రయోగించారు. ప్రజామిత్ర పోలీసింగ్‌తోపాటుగా కాలనీల భద్రత కోసం సీసీటీవీ కెమెరాల ఏర్పాటు సత్ఫలితాలిచ్చాయి. అదేవిధంగా 'నేనుసైతం' కార్యక్రమం ద్వారా పలు ప్రాంతాల్లో స్వచ్ఛందంగా ప్రజలు సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు ముందుకొచ్చారు. మలక్‌పేట ఠాణాలో 84 కెమెరాలను కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా, ఎంపీ, ఎమ్మెల్యే నిధుల నుంచి 16 కెమెరాలు ఏర్పాటయ్యాయి. అదేవిధంగా 3932 కెమెరాలు కాలనీలవాసులు స్వంతంగా ఏర్పాటు చేసుకున్నారు. ప్రతీనెలా చేపడుతున్న యూఐ మేళాలలో ప్రస్తుతం మలక్‌పేటలో 75 కేసులు, సైదాబాద్‌లో 91 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇరు ఠాణాల్లోనూ ఈ ఏడాది కల్తీ వస్తువుల తయారు, అమ్మకాల నిరోధానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నారు.



నేర నియంత్రణ చేసిన పద్ధతులు వివరిస్తున్న పోలీసులు(దాచిన చిత్రం)

● సైదాబాద్/మలక్‌పేట ఠాణాల పరిధుల్లో నేరాలకు సంబంధించిన వివరాలు..

| చోటుచేసుకున్న నేరాలు | 2016 | 2017 |
|---|---|---|
| హత్యలు | 02 / 00 | 02 / 01 |
| రాత్రిపూట దొంగతనాలు | 12 / 04 | 06 / 05 |
| పగటిపూట దొంగతనాలు | 02 / 01 | 00 / 00 |
| సాధారణ దొంగతనాలు | 56 / 33 | 37 / 25 |
| అపహరణలు | 08 / 08 | 09 / 12 |
| మోసాలు | 26 / 20 | 27 / 51 |
| అత్యాచారాలు | 05 / 03 | 02 / 03 |
| రహదారి ప్రమాదాలు | 56 / 26 | 55 / 26 |
| రహదారి ప్రమాదాల్లో మృతులు | 06 / 07 | 09 / 05 |

● సైదాబాద్‌లో గతేడాది రూ.40,88,300 సొత్తు చోరీకి గురికాగా రూ.18,47,900 రికవరీ(46%) చేశారు. ఈ ఏడాది రూ.38,78,142 సొత్తు చోరీకి గురికాగా రూ.20,62,932 రికవరీ(50%) చేశారు. మలక్‌పేటలో గతేడాది రూ.44,92,500 విలువైన ఆస్తి చోరులపాలవగా రూ.35,83,500 రికవరీ(80%) చేశారు. ఈ ఏడాది రూ.41,88,200 సొత్తు చోరీ చేస్తే రూ.29,74,000 రికవరీ(71%) చేశారు.

## గొలుసు చోరీలు శూన్యం

చాదర్‌ఘాట్(క్రైం): చాదర్‌ఘాట్ ఠాణా పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయడంలో పోలీసులు సఫలీకృతం కావడంతో కేసుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వచ్చింది. 2015లో 608 కేసులు నమోదు కాగా 2016లో 464, 2017లో ఇప్పటి వరకు 374 నమోదయ్యాయి. గత ఏడాది గొలుసు చోరీ కేసులతో పోలీసుల్లో కొంత ఆందోళన మొదలైనా ఈ ఏడాదిలో ఒక్క కేసు నమోదు కాలేదు. పోలీస్ స్టేషన్ పరిధిలోని చాలా ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఏర్పాటు చేయడం, సెల్‌ఫోన్ టెక్నాలజీతో పాటు సాంకేతికతను జోడిస్తూ నేరస్తులను సులువుగా పట్టుకోవడం, వరస నేరాలకు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్టులు పెడుతుండడంతో నేరాల సంఖ్య తగ్గుతూ వచ్చింది. 2015లో 608 కేసులు నమోదు కాగా రూ.52.99 లక్షల విలువ గల సొత్తు చోరీకి గురైంది. 2016లో 464 కేసులు నమోదు కాగా చోరీ సొత్తు విలువ రూ.37.53 లక్షలు, ఇందులో రూ.31.76 లక్షల సొత్తును పోలీసులు రికవరీ చేశారు. ఇక 2017లో రూ. 27.53 లక్షల విలువగల సొత్తు చోరీకి గురికాగా ఇందులో రూ.14.53 లక్షల సొత్తును రికవరీ చేశారు. 53 శాతం మేరకు సొత్తును రికవరీ చేయగా నమోదైన కేసుల్లో 56 శాతం మేరకు పరిష్కరించగలిగారు.




చాదర్‌ఘాట్ పోలీస్ ఠాణా

## ప్రకృతి ధర్మాలు మరవకూడదు

వనస్థలిపురం, న్యూస్‌టుడే: అత్యాశ, వ్యామోహం దుఖానికి దారితీస్తాయని, ప్రకృతి ధర్మాలు మరవకూడదని శ్రీ త్రిదండి కృష్ణ దేశికతి జీయర్ స్వామి ప్రవచించారు. శనివారం బీఎన్‌రెడ్డినగర్‌లోని ఎస్‌కేడీనగర్‌లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో 15వ రోజు ధనుర్మాస తిరుప్పావై ప్రత్యేక పూజల్లో పాల్గొన్న స్వామి భక్తులను ఉద్దేశించి ప్రవచించారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో స్వామి పాల్గొన్నారు. అతిథిగా పాల్గొన్న శ్రీరంగ స్వామి ఆలయం శ్రీరంగం ఆస్థానాచార్యులు శ్రీ లక్ష్మీ నరసింహబట్టర్‌స్వామి మాట్లాడుతూ ఇతరులకు హాని తలపెట్టకూడదని, సాత్విక ఆహారం స్వీకరించాలన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

వనస్థలిపురం, న్యూస్‌టుడే: పాఠశాల యాజమాన్యాలు చదువుతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని వనస్థలిపురం కార్పొరేటర్ జిట్టారాజశేఖర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురంలోని ఫేజ్4లోని మైదానంలో వనస్థలిపురం లోటస్ ల్యాప్ స్కూల్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనస్థలిపురంలో విద్యార్థులు ఆడుకోవడానికి మైదానాలు ఉన్నాయని, వాటిని మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు.

## అంధ బాలికలకు చేయూత



బ్రెయిలీ లిపిలోని పుస్తకాలు అందజేస్తున్న ప్రతినిధులు

సైదాబాద్, న్యూస్‌టుడే: ఆంధ్రాబ్యాంక్ ఉన్నతాధికారుల సతీమణుల ఆధ్వర్యంలో 'సంకల్ప్' సేవా సంస్థ ఏర్పడింది. ఈ సంస్థ పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టింది. అందులో భాగంగా మలక్‌పేట ప్రభుత్వ అంధ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం చేయూత అందించారు. 'సంకల్ప్' ప్రతినిధులు హర్షిత్ పటేల్, నిబేది తారథ్, కల్పనా జైన్ సహా పది మంది జనరల్ మేనేజర్ల సతీమణుల బృందం పాఠశాలను సందర్శించింది. ప్రధానోపాధ్యాయురాలు పద్మావతిదేవి ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. సుమారు రూ.60 వేల విలువైన వస్తువులు సంకల్ప్ ప్రతినిధులు అందజేశారు. బాలికలు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చక్కటి ప్రతిభను కనబరుస్తున్న బాలికలకు భవిష్యత్తులోనూ ఆంధ్రాబ్యాంక్ అండగా ఉంటుందని సంకల్ప్ ప్రతినిధులు భరోసా కల్పించారు. ఆంధ్రాబ్యాంక్ హైదరాబాద్ సర్కిల్ పీఆర్వో వీఎస్సార్ మూర్తి కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు.

## సంక్షేమసంఘ భవనాలు కాలనీ వాసులకు అవసరం

వనస్థలిపురం: సాంస్కృతిక కార్యక్రమాలు, పండగల సమయంలో వేడుకలు నిర్వహించుకోవడానికి కాలనీల్లో సంక్షేమ సంఘ భవనాలు అవసరం అని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న అన్నారు. శనివారం బీఎన్‌రెడ్డినగర్‌లో రూ.15 లక్షలతో నూతనంగా నిర్మించిన కాలనీ సంక్షేమ సంఘ భవనాన్ని ఆమె కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీలో అందరూ కలిసి మెలిసి ఉండాలని అప్పుడే కాలనీ అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు ఒ.వి.ఆర్. కుమార్, రూపేందర్ రెడ్డి, రాజ్‌గోపాల్, మల్లారెడ్డి, తెరాస ఎల్బీనగర్ ఇన్‌ఛార్జి రామ్మోహన్‌గౌడ్, వార్డు కమిటీ సభ్యులు అమరేందర్‌రెడ్డి, శివశంకర్, వరలక్ష్మీ, నాగమణి, నిర్మల, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్

నాగోలు, న్యూస్‌టుడే: సహజీవనం చేస్తున్న మహిళను హత్య చేసిన నిందితుడ్ని మహేశ్వరం పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం ఎల్బీనగర్‌లోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ వేంకటేశ్వర్‌రావు సంఘటన వివరాలు వెల్లడించారు. కర్నూలుజిల్లా బుధవారిపేటకు చెందిన జయమ్మ(40) భర్తను, పిల్లల్ని వదిలేసి నగరానికి వచ్చేసింది. డబీర్‌పురా రైల్వేస్టేషన్లో తలదాచుకుంటూ కూలిపనిచేసుకుంటూ జీవిస్తోంది. వనపర్తిజిల్లా పెబ్బేరు మండలంలోని షాగాపురానికి చెందిన మోదల రాజు(48) సైతం తన భార్యా, పిల్లల్ని వదిలి నగరంలోని డబీల్‌పురా రైల్వేస్టేషన్లోనే తలదాచుకుంటూ భవననిర్మాణ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. వీరిద్దరి మధ్య పరిచయం పెరిగి ఏడాదికాలంగా సహజీవనం చేయసాగారు. రెండునెలలక్రితం శంషాబాద్ సమీపంలోని మహేశ్వరం మండలం దుబ్బరచర్లలో పంచాయతీ కార్యాలయం నిర్మాణంలో పనిచేసేందుకు ఓ కాంట్రాక్టరు వద్ద వీరు పనికి కుదిరారు. నిర్మాణంలో ఉన్న భవనం పక్కనే పెంకుటింట్లో తలదాచుకుంటున్నారు. ఈ నెల 21న బజారుకు వెళ్లిన వీరిద్దరూ మద్యంతాగి, చికెన్ తీసుకుని ఇంటికి వచ్చారు. సాయంత్రం 5గంటల సమయంలో తాను తన సోదరిని చూసేందుకు ఇంటికి వెళతాననీ అడుగుతున్న జయమ్మపై ఆగ్రహం వ్యక్తంచేసిన రాజు.. బయటికి వెళ్లి.. తిరిగి 7గంటలకు ఇంటికి వచ్చాడు. అప్పటికీ ఆమె చికెన్ వండకపోవడంతో ఆగ్రహోదగ్రుడయ్యాడు. తనను వదిలి వెళ్తానంటున్న జయమ్మ తలను గట్టిగా గోడకేసి బాదాడు. ఆపై కర్రతో ఆమెను తీవ్రంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఇంటిముందున్న పశువుల పెంటలో ఆమెను పాతిపెట్టి.. పరారయ్యాడు. కుళ్లిపోయిన ఆమె శవం చేయి మూడు రోజుల తర్వాత బయటికి కనిపించడంతో స్థానికులు గ్రామసర్పంచికి.. అక్కడినుంచి పోలీసులకు సమచారం అందించారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వారంరోజుల్లోనే నిందితున్ని అరెస్టుచేసి కటకటాల వెనక్కినెట్టారు.

## గుట్కా సరఫరా చేస్తున్న ముగ్గురి అరెస్టు

నాగోలు, న్యూస్‌టుడే: నిషేధిత గుట్కా సరఫరా చేస్తున్న ముఠాలోని ముగ్గురు సభ్యులను రాచకొండ కమిషనరేట్‌లోని చైతన్యపురి పోలీసులు అరెస్టుచేశారు. శనివారం ఎల్బీనగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ వేంకటేశ్వర్‌రావు నిందితుల వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం మహబూబాబాద్‌కు చెందిన వ్యాపారి వెంకటరమణ(41), నగరంలోని కొత్తపేట మారుతీనగర్‌కు చెందిన బండ ప్రసాద్‌రెడ్డి(34), సూర్యానగర్‌కాలనీకి చెందిన ఆలకుంట్ల నవీన్(21)లు ఓ ముఠాగా ఏర్పడ్డారు. కర్ణాటకలోని బీదర్ పారిశ్రామిక ప్రాంతం నుంచి శ్రీనుబాయ్, శర్మ అనే వ్యక్తుల నుంచి గుట్కా ప్యాకెట్లు కొనుగోలుచేసి నగరంలోని ఎల్బీనగర్‌కు చెందిన శ్రీనివాస్‌కు అమ్ముతున్నారు. అతను గుట్టుచప్పుడు కాకుండా ఎక్కువధరకు ఇతరులకు విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న చైతన్యపురి పోలీసులు వెంకటరమణ, ప్రసాద్‌రెడ్డి, నవీన్‌లను అరెస్టుచేశారు. ఓ వాహనంలో తరలిస్తున్న రూ.4లక్షలు విలువచేసే గుట్కాప్యాకెట్లను సహా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో శ్రీనుభాయ్, శర్మ, శ్రీనివాస్‌లు పరారీలో ఉన్నారు.

## హోలియదాసరి కులస్థుల అభ్యున్నతికి కృషి

చంపాపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని హోలియదాసరి కులస్థుల అభ్యున్నతికి కృషిచేస్తానని ఎమ్మెల్యే ఆర్. కృష్ణయ్య అన్నారు. చంపాపేట హోలియదాసరి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కార్పొరేటర్లు సామ రమణారెడ్డి, ముద్రబోయిన శ్రీనివాసరావు, స్వప్న సుందర్‌రెడ్డితో కలిసి ఆయన శుక్రవారం రాత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే, చదువుతోనే సాధ్యపడుతుందని అన్నారు. తమ పిల్లలను ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చేర్పించి ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. స్వయం ఉపాధి, కుల వృత్తులపై ఆధార పడిన వారు, కాలానుగుణంగా మార్పు చెంది ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వీరేశం, వ్యవస్థాపక అధ్యక్షుడు జి.దాసు, చంపాపేట అధ్యక్షుడు ఎ.జంగయ్య, ఉపాధ్యక్షుడు రంగనాథం, ప్రధాన కార్యదర్శి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# మలక్‌పేట

## మహిళ అదృశ్యం

**దూద్‌బౌలి:** కాలాపత్తర్ బిలాల్‌నగర్‌కు చెందిన ఓ మహిళ కూరగాయలు కొనేందుకు మార్కెట్‌కు వెళ్లి అదృశ్యమైంది. ఆమె కోసం అంతటా వెతికినా ఫలితం లేకపోవడంతో ఆమె భర్త కాలాపత్తర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బిలాల్‌నగర్‌కు చెందిన వెల్డింగ్ వృత్తి నిర్వహించే మహ్మద్ సిద్దిక్(34) భార్య సామియాబేగం(24) కూరగాయలు కొనేందుకు సమీపంలోని మార్కెట్‌కు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ముందస్తు నూతన సంవత్సర వేడుకలు



అమ్మఫౌండేషన్ విద్యార్థులకు వస్తువులు అందిస్తున్న రవీంద్రభారతి పాఠశాల విద్యార్థులు

**అక్బర్‌బాగ్, న్యూస్‌టుడే:** దిల్‌సుఖ్‌నగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. విద్యార్థులు తమ ఆట, పాటలతో 2018వ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి ఆకట్టుకున్నారు. నూతన సంవత్సరపు కానుకగా సామాజిక సేవా దృక్పథంతో మానవతా విలువలకు అద్దంపట్టేట్లుగా విద్యార్థులు తాము దాచుకున్న కొంత డబ్బును సేకరించి సరూర్‌నగర్‌లోని అమ్మఫౌండేషన్ అనాథలకు నిత్యం ఉపయోగ పడే వస్తువులైన అల్మారా, స్టౌ, కుక్కర్స్, కుర్చీలు, దుప్పట్లు, ఇతర వస్తువులను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్స్ శిరీషా, వీరయ్యలు పాల్గొన్నారు.

## ముగిసిన 'మహాభాగవత ప్రవచనామృతం'

**సైదాబాద్, న్యూస్‌టుడే:** సైదాబాద్ డివిజన్ ఎస్బీహెచ్-బీ కాలనీలోని కోదండరామాలయం ఉద్యానంలో ఈ నెల 26 నుంచి కొనసాగుతున్న 'మహాభాగవత ప్రవచనామృతం' శనివారం రాత్రి ముగిసింది. ఐదు రోజులపాటు దశమ స్కందంపై ప్రాచార్య రఘునాథశర్మ (రాజమహేంద్రవరం) ప్రవచించారు. కోదండరామాలయం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలకు ఎస్బీహెచ్ పంచ (ఏ, బీ, సీ, జీఏ-1, జీఏ-2) కాలనీవాసులతోపాటు సమీప కాలనీవాసులు తరలివచ్చారు. ముగింపు సందర్భంగా ప్రాచార్య రఘునాథశర్మ దంపతులను పలువురు కాలనీవాసులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు యుగంధర్, ప్రభు, కిష్టయ్య, సత్యనారాయణ, కృష్ణమురళి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నేరాల అదుపునకు సీసీ కెమెరాలు



చక్రవర్తికి పుష్పగుచ్ఛం ఇస్తున్న స్థానికుడు

**అక్బర్‌బాగ్, న్యూస్‌టుడే:** కాలనీలు, బస్తీల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేయడం ద్వారా నేరాల అదుపునకు ఎంతగానో దోహదపడుతాయని సుల్తాన్‌బజార్ ఏసీపీ చక్రవర్తి అన్నారు. నేను సైతం కార్యక్రమంలో భాగంగా శనివారం అక్బర్‌బాగ్‌లోని ఆడమ్ స్కూల్ లేనులో స్థానికులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను ఏసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా ప్రజల్ని చైతన్య వంతుల్ని చేయడంలో పోలీసులు విజయవంతం సాధిస్తున్నారన్నారు. సీసీ కెమెరాలతో కలిగే ఉపయోగాలను కాలనీ వాసులకు వివరించారు. క్షేత్ర స్థాయిలో సీసీ కెమెరాలతో కలిగే ఉపయోగాలను ప్రజలకు వివరించడంతో చాలామంది సొంత ఖర్చులతో కెమెరాలను ఏర్పాటు చేసుకోవటానికి ముందుకు వచ్చి పోలీసులకు సహకరించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ సత్తయ్య, ఎస్సైలు చంద్రశేఖర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## త్రివేణి పాఠశాలలో విద్యోత్సవాలు

**ఐ.ఎస్.సదన్:** చంపాపేటలోని శ్రీ త్రివేణి పాఠశాలలో శనివారం నిర్వహించిన విద్యోత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు విద్యా సంవత్సరంలో నేర్చుకున్న పాఠ్యాంశాలను కళ్లకు కట్టినట్లుగా నాటిక రూపంలో ప్రదర్శించి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అబ్బురపరిచారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాలల హక్కుల సంఘం అధ్యక్షులు అచ్యుతరావు, విద్యావేత్త వేణుగోపాల్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ గోవర్ధన్‌రెడ్డి హాజరై బాలబాలికలు ప్రదర్శించిన 200పైగా ప్రాజెక్టులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## 'పేదలపై పోలీసుల ప్రతాపం సరికాదు'



పిలిగుడిసెలబస్తీని సందర్శించిన రాములు, చంద్రకళ

**సైదాబాద్, న్యూస్‌టుడే:** ఇరవై నాలుగు రోజుల క్రితం మలక్‌పేట పోలీసుల అత్యుత్సాహం కారణంగా నిరాశ్రయులైన పిల్లిగుడిసెలబస్తీ బాధితులను జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు ఎ. రాములు శనివారం సందర్శించి పరామర్శించారు. ఆయనతోపాటు హైదరాబాద్ ఆర్డీఓ చంద్రకళ, సైదాబాద్ మండల తహసీల్దార్ కౌకుంట్ల జానకి, సైదాబాద్ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలత, భాజపా మలక్‌పేట నియోజకవర్గం కన్వీనర్ సంరెడ్డి సురేందర్‌రెడ్డి ఉన్నారు. సుమారు 23 మంది కుటుంబాలను పరామర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సైదాబాద్ మండల పరిధి గడ్డిఅన్నారంలోని ఈ బస్తీలో 23 కుటుంబాలు 575 గజాల ప్రభుత్వ స్థలంలో దీర్ఘకాలికంగా గుడిసెలు వేసుకుని బతుకుతున్నారన్నారు. కొందరు భూకబ్జాదారులు చట్టాలను అతిక్రమించి పోలీసుల సహకారంతో ఈనెల 7న రోడ్డున పడేశారని ఆందోళన వ్యక్తం చేశారు. రెవెన్యూ యంత్రాంగంతో చర్చించకుండానే మలక్‌పేట పోలీసులు ఏకపక్షంగా బాధితులపై చూపిన ప్రతాపంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. జనవరి 10న హైదరాబాద్ కలెక్టర్ సమక్షంలో చర్చించేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు జరగనుందని, జనవరి 2న న్యాయస్థానం తీర్పు వెలువడనున్నందున బాధితులు సంయమనం పాటించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. తీర్పు బాధితులకు అనుకూలంగా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 575 గజాల ప్రభుత్వ స్థలంలోనే బాధితులకు రెండు పడకల గదుల ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా దృష్టిసారిస్తానంటూ భరోసా కల్పించారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర కమిటీ సభ్యులు సుభాష్ చందర్జీ, అశోక్‌రెడ్డి, నగర కమిటీ కార్యదర్శి దేవేందర్, మాజీ కార్యదర్శి నర్సింహా, దళిత మోర్చా నగర ఉపాధ్యక్షుడు విజయకాంత్, భాజపా నాయకులు ఎ.గజానంద్‌గౌడ్, ఎం. శ్రీకాంత్ రెడ్డి, కె.గోపి పాల్గొన్నారు.

## ప్రశాంతంగా 'కట్టడి ముట్టడి'



పత్రాలు పరిశీలిస్తున్న డీఐ గుజ్జ రమేష్

**సైదాబాద్, న్యూస్‌టుడే:** తూర్పు మండలం డీసీపీ సి. శశిధర్‌రాజు నేతృత్వంలో సైదాబాద్ పోలీస్ ఠాణా పరిధిలో సింగరేణి కాలనీ గుడిసెల ప్రాంతాల్లో శనివారం రాత్రి కట్టడి ముట్టడి ప్రశాంతంగా కొనసాగింది. సుమారు 250 మంది పోలీసులు దాదాపు రెండు గంటలపాటు సోదాలు నిర్వహించారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ముందు జాగ్రత్తగా అనుమానాస్పద ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. 52 వాహనాలు స్వాధీనం చేసుకుని ఠాణాకు తరలించారు. వాటిలో ధ్రువీకరణ పత్రాలు లేనివీ 39 ద్విచక్ర, 1 నాలుగు చక్రాల వాహనం, 12 ఆటోలను స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ కాట్న సత్తయ్య తెలిపారు. 8 వంట గ్యాస్ సిలిండర్లు, 30 మద్యం క్వార్టర్ సీసాలు, 90 బీర్ సీసాలు సైతం స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. జియో ట్యాగింగ్ ద్వారా నలుగురు అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో అదనపు డీసీపీ గోవింద్‌రాజు, మలక్‌పేట ఏసీపీ శివభాస్కర్, తూర్పు మండలం పరిధిలో ఉన్న 15 మంది ఇన్‌స్పెక్టర్లు, 30 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, 200 కానిస్టేబుళ్లు కట్టడి ముట్టడిలో భాగస్వాములయ్యారు.

## వివాహానికి సాయం పెంచడం హర్షణీయం: డ్యాబ్

**అక్బర్‌బాగ్, న్యూస్‌టుడే:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులను సకలాంగులు వివాహం చేసుకున్నట్లయితే ప్రస్తుతం ఇస్తున్న రూ.50వేలకు బదులుగా రూ.లక్ష పెంచడం పట్ల డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ద బ్లైండ్(డ్యాబ్) తెలంగాణ రాష్ట్రం ప్రధాన కార్యదర్శి పి.చొక్కారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మలక్‌పేటలోని దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో చదువుకున్నవాళ్లు వెయ్యిమంది వరకు ఉన్నారని వారందరికి ఉపాధి చూపించాలన్నారు. బడి ఈడు అంధబాలికనందరిని పాఠశాలలో ఉండేటట్లుగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి, రంగారావు, ఎన్. లక్ష్మారెడ్డి, కె.శ్రీనివాస్, పరమేశ్‌లు పాల్గొన్నారు.

## 'నా కూతురును కాపాడండి'

**చంచల్‌గూడ:** సౌదీకి వెళ్లి తిరిగి స్వదేశానికి రాలేక ఇబ్బందులు పడుతున్న మహిళను ఆదుకోవాలని ఎంబీటీ అధికార ప్రతినిధి అమ్జదుల్లాఖాన్ కోరారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన సఫోరాబేగం 2017 జూన్‌లో సౌదీ, దమ్మాం వెళ్లింది. ల్యాబ్‌టెక్నిషియన్ ఉద్యోగమని చెప్పిన ఏజెంట్లు అక్కడ పని మనిషిగా కుదిర్చారు. రెండు నెలల తర్వాత యజమాని తన సోదరుడి ఇంటికి పంపించాడు. వేతనం సరిగా ఇవ్వకుండా, వసతి, ఆహారం సరిగా ఇవ్వకుండా ఇష్టానుసారంగా కొడుతూ నరకం చూపిస్తున్నారు. బాధలకు భరించలేక ఆమె పారిపోయి ఇండియన్ ఎంబసీ శరణార్థుల శిబిరానికి చేరుకుంది. తన ఇంట్లో పని చేయకపోతే ఆమెపై దొంగతనం నేరం మోపి జైలుకు పంపుతానంటూ యజమాని ఆమెను, ఆమె కుటుంబ సభ్యులను బెదిరిస్తున్నాడు. ఈ మేరకు ఆమె తల్లి రయీసాబేగం భారత విదేశాంగ శాఖ మంత్రి సుష్మాస్వరాజ్‌కు రాసిన లేఖలో తన కూతురును కాపాడాలని మొరపెట్టుకొంది. ఇండియన్ ఎంబసీ శరణార్థుల శిబిరంలో ఆమెకు రక్షణ కలిపించి త్వరగా ఇండియాకు తిరిగి వచ్చేందుకు సహాయపడాలని రయీసాబేగం కోరినట్లు ఎంబీటీ అధికార ప్రతినిధి అమ్జదుల్లా ఖాన్ వివరించాడు.

## ఆటోడ్రైవర్ అరెస్టు

**జహనుమా:** బస్తీల్లోని ప్రజల్ని ఇబ్బందికి గురి చేస్తున్న యువకుడ్ని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించిన సంఘటన రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. స్టేషన్ సెక్టార్ ఎస్సై యుగేందర్ కథనం ప్రకారం యాకుత్‌పురా సెగ్మెంట్ బడాబజార్ గంగానగర్ నాలా బస్తీకి చెందిన షేక్ వాజీద్ అలియాస్ అబ్బు(26) ఆటోడ్రైవర్. శుక్రవారం రాత్రి బస్తీలోకి ఆటోను తీసుకుని వచ్చి మహ్మద్ అఫ్రోజ్ ఇంటి ముందు ఆపి పెద్ద శబ్దంతో పాటలు వింటున్నాడు. అఫ్రోజ్ సౌండ్ తగ్గించాలని చెప్పినా వినలేదు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అఫ్రోజ్‌పై షేక్ వాజీద్ చేయి చేసుకున్నాడు. అతడు రెయిన్ బజార్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం ఆటోడ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.



## సన్‌షైన్ కాలనీలో కార్పొరేటర్ పర్యటన



పనులు పరిశీలిస్తున్న స్వర్ణలత, అజీజ్ తదితరులు

**సైదాబాద్, న్యూస్‌టుడే:** సైదాబాద్ డివిజన్ శంకేశ్వర్‌బజార్ పరిధి సన్‌షైన్ కాలనీలో నెలకొన్న పలు సమస్యల పరిశీలన కోసం కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలత శనివారం పర్యటించారు. ఆమెతో పాటు కాలనీవాసుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ అజీజ్ ఉన్నారు. గతంలో కాలనీ నుంచి సాయిరాంనగర్ ప్రాంతానికి వెళ్లే తాగునీటి పైపులైన్ ధ్వంసమైంది. తాగునీటి లీకేజీ కారణంగా ప్రాంతవాసులకు తక్కువ ఒత్తిడితో నీటి సరఫరా కొనసాగుతోంది. ఈ విషయాన్ని సన్‌షైన్ కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. జలమండలి ఆస్మాన్‌గఢ్ విభాగం వర్క్ ఇన్‌స్పెక్టర్ బి. మనోహర్ సిబ్బందిని పిలిపించి లీకేజీ నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. పైపులు తొలగించి ప్రత్యేక మార్గం ద్వారా సాయిరాంనగర్‌కు మళ్లించాలని కాలనీవాసుల సంక్షేమ సంఘం ప్రతినిధులు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. పరిశీలించి చర్యలు తీసుకుంటానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సైదాబాద్ వార్డు కమిటీ సభ్యుడు ఎడవెల్లి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## అల్వాల్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

**అల్వాల్, న్యూస్‌టుడే:** (శనివారం నాటి ధరలు ) టమోట 10, వంకాయలు 13, బెండకాయలు 38, పచ్చిమిర్చి 23, కాలీఫ్లవర్ 31, క్యాబేజీ 15, క్యారెట్ 48, దొండకాయలు 23, ఆలు 16, ఉల్లి 38, సొరకాయ 15, పొట్లకాయ 19, బీన్స్ 25, గోరుచిక్కుడు 40, చిక్కుడు 38, దోసకాయ 18, బీరకాయ 35, కాకరకాయ 25, చామగడ్డ 40, కీర 11, క్యాప్సికం 40, బీట్‌రూట్ 23, కందగడ్డ 28.

# సమస్యలతో సతమతం..!

- దృష్టి పెట్టని యంత్రాంగం
- అవస్థలు పడుతున్న జనం

మల్కాజిగిరి, న్యూస్‌టుడే

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని ఆరు డివిజన్లలో సమస్యలను గుర్తించి పరిష్కరించడంతో అధికారులు విఫలమవుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేటీఆర్‌కు ట్వీట్ చేస్తేనో.. జీహెచ్ఎంసీ యాప్‌కు సమస్యల చిత్రం పంపిస్తేనో.. ఉన్నతాధికారుల పర్యాటల్లో వారు సమస్యలు గుర్తించి అక్షింతలు వేస్తేనో తప్ప ప్రజా సమస్యలు పరిష్కారమవడం లేదు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు సర్కిల్ కార్యాలయంలో అనేక విభాగాలున్నాయి. అవసరమైన సిబ్బంది సైతం ఉన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన నిధులకు కూడా కొరత లేదు. అయినా అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్పొరేటర్లు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసేందుకు వస్తే తప్ప అధికారులు క్షేత్ర స్థాయికి రావడం లేదన్న ఆరోపణలున్నాయి. వివిధ కార్యాలయాలలో ఏర్పాటు చేసే సమీక్షలు, సమావేశాలతోనే సరిపెడుతున్నారని పలువురు వాపోతున్నారు. అయినా తమ పరిధిలో సమస్యలు ఏమున్నాయి.. వాటిని ఎలా పరిష్కరించవచ్చు.. సమస్యకు కారణాలేమిటి అన్న అంశాలపై అధికారులు దృష్టి పెట్టడం లేదని కాలనీల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి నగరంలో సమస్యల పరిష్కారానికి ఆకస్మిక పర్యటనలు తరచూ చేపడుతున్నా.. ఆయన స్ఫూర్తిని క్షేత్ర స్థాయి అధికారులు అందిపుచ్చుకోవడం లేదన్న వాదనలు వినిపిస్తున్నారు. దీంతో మల్కాజిగిరి ప్రాంతంలో అనేక బస్తీలు, కాలనీల్లో సమస్యలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా వారానికి మూడు రోజుల పాట ప్రతి అధికారి సమస్యల పరిష్కారానికి సమయం కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.



పోలీస్‌స్టేషన్ వద్ద అసంపూరి పనులతో ఇలా..



గౌతంనగర్‌లో రోడ్డుకు అడ్డంగా తవ్వకాలు

### ఇంకెన్నాళ్లు ఇలా..

◆ మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ ఎదుట ఓపెన్ డ్రైయిన్‌ను భూగర్భ మురుగు కాలువగా మార్చే పనులు చేపట్టి మూడు నెలలవుతోంది. ఇప్పటికీ సగం పని కూడా పూర్తి కాలేదు. ఈ పనుల కారణంగా మురుగు పారుదల నిలిచిపోయి ఓపెన్ డ్రైయిన్‌లో చెత్తా చెదారం చేరి దుర్గంధం వ్యాపిస్తోంది. అధికారులు దృష్టి సారిస్తే పరిస్థితులు ఇలా ఉండవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

◆ కాలుష్య సాగరంగా మారిపోయిన బండ చెరువును బాగుచేయడంలో విఫలమైన అధికారులు ఇక్కడకు వచ్చే వారికి కనీస సదుపాయాలను కల్పించడంలోనూ నిర్లక్ష్యం చూపుతున్నాఉ. తూర్పు ఆనంద్‌బాగ్ వైపు ఉన్న చెరువు కట్టపై ఏళ్ల క్రితం నడక మార్గం ఏర్పాటు చేశారు. ఈ మార్గమంతా గుంతలమయంగా మారింది. రోజూ ఇక్కడికి నడకకోసం వచ్చే వారు నానా అవస్థలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు.

◆ గౌతంనగర్ డివిజన్ పరిధిలోని రిజర్వాయర్ సమీపంలోని రహదారిలో జలమండలి వారు పనులు చేపట్టి రోడ్డులో పెద్ద గుంతలు తవ్వారు. ఈ పనులు చేసి మూడు నెలలు దాటుతోంది. రోడ్డును మూసేసి పనులు చేపట్టడంతో స్థానికులు రాకపోకలు సాగించే అవకాశం లేక ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళల్లో కొత్తవారు ఈ మార్గంలోకి వస్తే ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు దృష్టి సారించి తక్షణం పనులు పూర్తి చేసేలా చర్యలు చేపడితే ఈ దుస్థితి ఉండేది కాదని స్థానికులు పేర్కొంటున్నారు.

◆ మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో బహిరంగ మూత్ర విసర్జన సమస్య లేకుండా పలు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే క్షేత్ర స్థాయిలో మాత్రం మీర్జాలగూడ రహదారిలోని ఓ బహుళ అంతస్తుల భవనం వద్ద శిథిలావస్థకు చేరిన నిర్మాణం ప్రాంతంలో మూత్ర విసర్జన చేస్తుండటంతో ఈ ప్రాంతమంతా దుర్వాసనలతో అధ్వానంగా మారింది. చౌరస్తాలోని మూత్ర శాల వద్ద ఇటీవల ముగ్గులు వేసి అందంగా తీర్చిదిద్దారు. బహిరంగ మూత్ర విసర్జన జరిగే ప్రాంతాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం.. బాటసారులు, వాహనదారులు మూత్ర శాలలు వినియోగించేలా అవగాహన కల్పించడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం కనిపిస్తోంది.

◆ మల్కాజిగిరి చౌరస్తాలో ఆరు నెలల క్రితం రహదారి పనులు చేశారు. ఈ కారణంగా ఇక్కడి తాగు నీటి పైపు లైన్లు దెబ్బతిని లీకేజీ సమస్యలు పెరిగాయి. ఇప్పటి వరకు లీకేజీల నివారణకు మరమ్మతులు చేపట్టలేదు. ఇటు సర్కిల్, అటు జలమండలి అధికారులు సమస్యల పరిష్కా



కాలమానిని ఆవిష్కరిస్తున్న ఎంపీ నంది ఎల్లయ్య

## కాలమానిని ఆవిష్కరణ

**మల్కాజిగిరి, న్యూస్‌టుడే:** శ్రీశైలం దేవస్థానం 2018 ఏడాదికి ప్రచురించిన కాలమానినిని శనివారం ఎంపీ నంది ఎల్లయ్య ఆవిష్కరించారు. దేవస్థానం మాజీ సభ్యుడు, మల్కాజిగిరికి చెందిన బి.సురేష్‌యాదవ్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప పడిపూజ



జ్యోతి వెలిగిస్తున్న రేణుకా శ్రీనివాస్ దంపతులు

**నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే:** మాజీ కౌన్సిలర్, తెరాస నాయకులు పిట్టల రేణుకాశ్రీనివాస్ నివాసంలో శనివారం అయ్యప్ప పడిపూజ ఘనంగా జరిగింది. ఉదయం గణపతి, సుబ్రహ్మణ్యం, అయ్యప్ప చిత్ర పటాల అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, తెరాస రాష్ట్ర సహాక కార్యదర్శి వీకే మహేష్, గ్రేటర్ అడ్‌హక్ కమిటీ నాయకులు మురుగేష్, తెరాస మాజీ రాష్ట్ర కార్యదర్శి బద్దం పరశురాంరెడ్డి, తెదేపా నియోజకవర్గ బాధ్యులు మండలి రాధాకృష్ణయాదవ్, పలువురు తెరాస నాయకులు పాల్గొన్నారు.

### రేపు అయ్యప్పస్వామి మహాపడి పూజ

**మల్కాజిగిరి:** గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున్ నగర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆవరణలో సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి అయ్యప్పస్వామి మహాపడి పూజ, లక్ష కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మణిద్వీపం ఛారిటబుల్ ట్రస్టు, శ్రీ సుమధుర ఆర్ట్స్ అకాడమీ, అఖిల భాతర అయ్యప్ప దీక్షా ప్రచార సమితి, మల్లికార్జున్ నగర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పూజలు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## జాతీయ స్థాయి పోటీలకు సాయిప్రసన్న ఎంపిక



సాయి ప్రసన్నను అభినందిస్తున్న శ్రీనివాస్

**మల్కాజిగిరి, న్యూస్‌టుడే:** యుద్ధ క్రీడల్లో రాణిస్తూ జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపికైంది. తూర్పు ఆనంద్‌బాగ్ డివిజన్ ప్రశాంత్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సాయి ప్రసన్న యుద్ధ క్రీడ (మార్షల్ ఆర్ట్స్)కు చెందిన సిలబం రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొని ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. జనవరి 2 నుంచి 10వ తేదీ వరకు న్యూదిల్లీలో జరిగే 63వ జాతీయ పాఠశాలల క్రీడా పోటీలలో అండర్ 17 విభాగంలో పోటీ పడేందుకు ఆమెకు అవకాశం లభించింది. సాయిప్రసన్న జాతీయ స్థాయి పోటీలలోనూ ప్రతిభ చాటాలని ఆకాంక్షిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, వ్యాయమ ఉపాధ్యాయుడు సత్యనారాయణ సాయిప్రసన్నను అభినందించారు.

## కనుల పండువగా పాఠశాల వార్షికోత్సవం




విద్యార్థికి బహుమతులు అందిస్తున్న ఎంపీ మల్లారెడ్డి

**మల్కాజిగిరి, న్యూస్‌టుడే:** గౌతంనగర్ డివిజన్ మధుసూదన్ నగర్‌లోని సెయింట్ మార్టిన్ హైస్కూల్ 18వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. సంప్రదాయ, ఆధునిక నృత్యాలతో ఆహుతుల ప్రశంసలు అందుకున్నారు. పలు గీతాలు ఆలపించి అలరించారు. పలు అంశాలపై అనర్గళంగా ప్రసంగించారు. నాటికలు ప్రదర్శించారు. క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా అంశాల్లో విజేతలుగా నిలిచిన వారికి మల్కాజిగిరి ఎంపీ సీహెచ్ మల్లారెడ్డి బహుమతులు అందజేశారు. విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ జోన్ కస్టమ్స్ శాఖ అధికారిణి ఎన్.ప్రియాంక, ఐపీఎస్ అధికారి విద్యాసాగర్ నాయుడు తదితరులు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ప్రతిభావంతులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడు దుర్గయ్య యాదవ్, కార్యదర్శి సీహెచ్ మహేందర్‌రెడ్డి, కోశాధికారి నర్సింహయాదవ్, పాఠశాల ప్రిన్స్‌పల్ మాల షెనాయి పర్కాల్ తదితరులు పాల్గొన్నారు.



యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ముంతాజ్ ఫతిమా

## మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

**మౌలాలి, న్యూస్‌టుడే :** మౌలాలి డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో రూ.15లక్షల వ్యయంతో భూగర్భ మురుగు పారుదల పనులకు స్థానిక కార్పొరేటర్ ముంతాజ్ ఫాతిమా శనివారం శంకుస్థాపన చేశారు. వెంకటేశ్వరనగర్‌లో రూ.8లక్షల వ్యయంతో, వెంకటేశ్వరనగర్ ఎక్స్‌టెన్షన్ వద్ద రూ.7లక్షల వ్యయంతో ఈ పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సకాలంలో పనులు పూర్తి చేసి స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ సృజన, వార్డు సభ్యులు వింధ్యారాణి, గాయత్రి, జోగు శ్రీనివాస్, మసూద్, తెరాస డివిజన్ అధ్యక్షుడు భాగ్యనందరావు, ఉపాధ్యక్షుడు ఎస్‌కేబాబా తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

**అల్వాల్, న్యూస్‌టుడే:** కానాజిగూడలోని సత్యసాయి కాలనీలో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు శనివారం మల్కాజిగిరి ఎమ్మెల్యే కనకారెడ్డి, వెంకటాపురం కార్పొరేటర్ సబిత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సరిహద్దుల వివాదంతోనే కాలనీలో మురుగు సమస్య తలెత్తు తోందన్నారు. ప్రస్తుతం వివాదం కొలిక్కి రావడంతో ఏళ్లుగా ప్రజలకు ఇబ్బందికరంగా మారిన సమస్య పరిష్కారమవుతోందన్నారు. కార్యక్రమంలో డీఈ మహేశ్, తెరాస డివిజన్ అధ్యక్షుడు అనిల్‌కిశోర్, వార్డు కమిటీ సభ్యులు శివ, ప్రభాకర్, ముత్యాలు, కాలనీ నేత నర్సయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజిగిరి



## 'అభివృద్ధి పనుల్లో అలసత్వం తగదు'

**డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే:** నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి యాప్రాల్ బాగిరెడ్డి కాలనీలో శనివారం అధికారులతో కలసి అభివృద్ధి పనులను కార్పొరేటర్ శ్రీదేవి పరిశీలించారు. సీసీ రోడ్డు పనుల్లో జరుగుతున్న జాప్యంపై స్పందిస్తూ.. అభివృద్ధి పనుల్లో అలసత్వం తగదని, వెంటనే పనులు పూర్తి చేయాలని సూచించారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ ప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి బాబురావు, వార్డు సభ్యులు గోకుల్, శ్రీనివాస్‌యాదవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కె.శ్రీదేవి తదితరులు

## ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన


ప్రదర్శనలో నమూనాలను తిలకిస్తున్న అతిథులు


వివిధ వేషధారణల్లో ఆకట్టుకున్న చిన్నారులు

**నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే:** విద్యార్థులు అద్భుత ప్రతిభతో రూపొందించిన వివిధ నమూనాలు ఆకట్టుకున్నాయి. కాగితపు యంత్రాలను రూపొందించి ఆహుతులతో ఔరా అనిపించుకున్నారు. రకరకాల ఆకృతులను రూపొందించి ఆకట్టుకున్నారు. దీన్‌దయాళ్‌నగర్‌లోని పాషా పబ్లిక్ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక పదర్శన ఆకట్టుకుంది. కాలుష్య నివారణ.. నీటి పొదుపు, పచ్చదనంతో ఉపయోగం, ప్రాజెక్టులు, మనిషి అవయవాల పనితీరు, రోడ్డు రవాణా వ్యవస్థ తదితర నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సీసీఎంబీ శాస్త్రజ్ఞులు విజయభాస్కర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రదర్శనను ప్రారంభించారు. తెరాస నాయకులు బద్ధం పరశురాం రెడ్డి పాల్గొని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పాఠశాల ఛైర్మన్ అసదుల్లా, వైస్ ప్రిన్సిపల్ నిరీక్షణ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## లోక్‌సత్తా పార్టీ డివిజన్ కమిటీల ఏర్పాటు


నూతనంగా ఎన్నికైన డివిజన్ కమిటీ నేతలు

**మల్కాజిగిరి, న్యూస్‌టుడే:** లోక్‌సత్తా పార్టీ తూర్పు ఆనంద్‌బాగ్, వినాయక్ నగర్ డివిజన్ కమిటీలను ఏర్పాటు చేశామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రవికాంత్ తెలిపారు. తూర్పు ఆనంద్‌బాగ్ డివిజన్ అధ్యక్షుడిగా సిద్ధప్ప, ఉపాధ్యక్షుడిగా రవికిరణ్, ప్రధాన కార్యదర్శిగా ఆనంద్, వినాయక్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా మహేందర్ లను నియమించినట్లు తెలిపారు. పార్టీని బలోపేతం చేసి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలతో కలిసి పోరాడాలని నూతన కమిటీ ప్రతినిధులకు సూచించారు.

## సామాజిక సేవలో ఆనందం


స్ట్రీట్ కాజ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు

**డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే:** భవన్స్ డిగ్రీ కళాశాల, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎరోనాటికల్ కళాశాల సౌజన్యంతో స్ట్రీట్ కాజ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు శనివారం హెలెన్ కెల్లర్స్ బధిరుల పాఠశాలలో నీటి శుద్ధి యంత్రాలను, గ్రీన్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. సామాజిక కార్యక్రమాల ద్వారా ఎంతో సంతోషం దక్కుతుందన్నారు. స్ట్రీట్‌కాజ్ స్వచ్ఛంద సంస్థలో వివిధ కళాశాలకు చెందిన 18 వేల మంది విద్యార్థులు సభ్యులుగా ఉన్నారన్నారు. అంతకు ముందు వారు పాఠశాలకు చెందిన విద్యార్థులతో కలసి ఆడిపాడి సందడి చేశారు. కార్యక్రమంలో ఛైర్మన్ ఉమర్‌ఖాన్, ప్రిన్సిపల్ పద్మావతి, సంస్థ ప్రతినిధులు మనీష్, భావన, మౌనిక, మధు, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా సాగిన ముగ్గుల పోటీలు


ముగ్గులను పరిశీలిస్తున్న సంఘం సభ్యులు

**డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే:** ముచ్చట గొలిపే ముగ్గులతో నేరేడ్‌మెట్ డివిజన్ రేణుకానగర్ వీధులు సుందరంగా మారాయి. సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని బ్రహ్మణ సేవా సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం కాలనీకి చెందిన మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సుమారు 70 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేశారు. మహిళలు కాలనీలోని తమ తమ ఇళ్ల ముందు చక్కటి ముగ్గులు వేసి అందంగా అలంకరించారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ చూపిన వారికి సంఘం జిల్లా అధ్యక్షురాలు నాగకుమారి చీరలను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు జ్యోతి, డాక్టర్ బి.టి ప్రసాద్, వార్డు సభ్యులు నారాయణరెడ్డి, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



## నేడు దళిత చైతన్య సదస్సు

**అల్వాల్, న్యూస్‌టుడే:** అంబేడ్కర్ విద్యానికేతన్ ట్రస్టు, శబ్దం కళాకారులు, రచయితల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం వెంకటాపురంలోని మహాబోధి విద్యాలయంలో దళిత చైతన్య సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా అణగారిణ హక్కుల పోరాట కమిటీ అధ్యక్షుడు జేబీ రాజుతో పాటు ప్రజా గాయకుడు గద్దర్, విమలక్క భీమ్ బుద్ధ పీఠాధిపతి బోధినాథ్ తదితరులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం డాక్టర్ జీవీ చంద్రకిరణ్ 14వ వర్ధంతిని నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు సీఎల్ యాదగిరి తెలిపారు.

## స్వయం ఉపాధితో ఉన్నత స్థానాలకు చేరాలి


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న వేణుగోపాలాచారి తదితరులు

**మల్కాజిగిరి:** యువత, మహిళలు స్వయం ఉపాధితో ఎదిగేందుకు కృషి చేయాలని మాజీ మంత్రి, తెరాస నేత వేణుగోపాచారి కోరారు. బ్రాహ్మణ ఆర్గనైజేషన్ ఫర్ యూత్ అధ్వర్యంలో శనివారం మల్కాజిగిరి డివిజన్ ఆనంద్‌బాగ్ బృందావన్ గార్డెన్స్‌లో వివిధ రకాల స్వయం ఉపాధి పథకాలతో యువకులు, మహిళలు కలిసి ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. బ్రాహ్మణులను అని విధాలుగా ఆదుకొనేందుకు, అభివృద్ధి చేసేందుకు బ్రాహ్మణ సేవా పరిషత్ కృషి చేస్తుందన్నారు. ప్రదర్శనలో అనేక స్టాళ్లను సందర్శించి నిర్వాహకులను ఆయన అభినందించారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి సేవలందించారు. సాయంత్రం విష్ణు, లలిత సహస్రనామ పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మల్లాది చంద్రమౌళి, బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కమిటీ అధ్యక్షురాలు నాగకుమారి, బ్రాహ్మణ సేవా పరిషత్ సభ్యురాలు డాక్టర్ సులోచన తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత నైపుణ్య శిక్షణలకు దరఖాస్తుల ఆహ్వానం

**అల్వాల్, న్యూస్‌టుడే:** అల్వాల్‌లోని ప్రధాన మంత్రి కౌశల్ కేంద్రం ద్వారా అందించనున్న ఉచిత నైపుణ్య శిక్షణ తగరతులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీయువకులు దరఖాస్తులు చేయడానికి అర్హులు. హార్డ్‌వేర్ నెట్‌వర్కింగ్, సోలార్, బీపీఓ, డేటా ఎంట్రీ, లాజిస్టిక్స్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ సేవ కూడలిలోని సింక్రో సర్వ్ గ్లోబల్ సోల్యూషన్స్ సంస్థలో దరఖాస్తులు సమర్పించాలని కేంద్రం నిర్వాహకులు ఇనుకొండ కృష్ణారెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు చరవాణి నం. 99493 33844 లో సంప్రదించాలని సూచించారు.



## యువత సన్మార్గంలో పయనించాలి

**అల్వాల్, న్యూస్‌టుడే :** యువత సన్మార్గంలో నడిచేలా అవగాహన కల్పించేందుకు సికింద్రాబాద్‌లోని యశోధ ఫౌండేషన్ ముందుకు వచ్చింది. ఫౌండేషన్ సభ్యురాలు వసుంధర ఆధ్వర్యంలోని బృందం కానాజిగూడ, సుభాష్‌నగర్ బస్తీ ప్రాంతాల్లో పర్యటించి యువకులతో సమావేశాలు నిర్వహించారు. యువత సామాజిక బాధ్యతలను గుర్తించాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. వక్ర మార్గాల వైపు వెళ్లి తల్లిదండ్రులతో పాటు, సమాజానికి తలవంపులు తేవద్దని సూచించారు. మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని యువతను ప్రోత్సహిస్తున్నట్లు వసుంధర వివరించారు.


యువకులకు అవగాహన కల్పిస్తున్న యశోధ ఫౌండేషన్ సభ్యురాలు

## అక్రమ నిర్మాణం కూల్చివేత



నిర్మాణం కూల్చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

**నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే:** నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాన్ని మున్సిపల్ అధికారులు శనివారం కూల్చివేశారు. చంద్రగిరికాలనీలో ఓ మల్గీని నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై వరకు నిర్మించడంతో గుర్తించిన అధికారులు దానిని తొలగించారు. అదే భవనంలోని పై అంతస్తులో అనుమతి లేకుండా నిర్మించిన గదులను కూల్చేశారు. అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టడంతో తొలగించాలమని టీపీఎస్ శ్రీదేవి తెలిపారు. అయితే సదరు ఫ్లాట్ యజమాని క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నామని అయినా అధికారులు నిర్మాణం తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు.

# ముషీరాబాద్

## ఆయేషా కేసులో అసలు హంతకులను శిక్షించాలి

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: ఆయేషా కేసులో అసలు హంతకులను కఠినంగా శిక్షించాలని ఆయేషా మీరా న్యాయ పోరాట కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఆ కేసును పునర్ విచారించాలని విజ్ఞప్తి చేసింది. శనివారం రాత్రి సుందరయ్య కళానిలయంలో ఆయేషా మీరా న్యాయ పోరాట కమిటీ, భారత ప్రజా న్యాయవాద సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆయేషా హత్య ఘటనకు వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు


మాట్లాడుతున్న మాధవన్

న్యాయవాది మాధవన్ మాట్లాడుతూ.. ఆయేషా మీరా హత్య జరిగి పదేళ్లు గడిచినా ప్రభుత్వం, పోలీసులు అసలు నేరస్థులను పట్టుకోకుండా, ఘటనకు సంబంధంలేని వారిని చిత్రహింసలకు గురిచేయడం దుర్మార్గమన్నారు. కేసుతో సంబంధం లేని సత్యంబాబును పోలీసులు అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేశారన్నారు. కేసుతో తనకు ఎలాంటి సంబంధంలేదని సత్యంబాబు కోర్టులో కేసు వేసి నిర్దోషిగా నిరూపించుకున్నారని చెప్పారు. సామాజిక కార్యకర్త సజయ మాట్లాడుతూ.. ఆయేషా కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో న్యాయవాదులు చిక్కుడు ప్రభాకర్, బల్లా రవీంద్ర, భారత ప్రజా న్యాయవాదుల సంఘం సంయుక్త కార్యదర్శి సురేష్‌కుమార్, దశరథ్, లింగన్న, కుమార్‌బాబు, శ్రీనివాస్, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగం ప్రకారమే ఎస్టీ జాబితాలో లంబాడీలు


మాట్లాడుతున్న అమర్‌సింగ్ తిలావత్

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: రాజ్యాంగ ప్రకారమే ఎస్టీ జాబితాలో లంబాడీలు ఉన్నారని మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్ అన్నారు. లంబాడీలపై ఏకపక్షంగా జరుగుతున్న దాడులు, కుట్రలు, ఏజెన్సీలో ఉన్న పరిస్థితులపై శనివారం రాత్రి సుందరయ్య కళానిలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన గోండులు, కోయలు చేస్తున్న వాదనల్లో పస లేదన్నారు. ఏ గిరిజన తెగ వెనుకబాటుకు ఇంకో గిరిజన తెగ కారణం కాదని స్పష్టం చేశారు. విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో లంబాడీలు తమ వాటాను సక్రమంగా పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ రవీంద్రనాయక్ మాట్లాడుతూ.. ఆదివాసీలు, గిరిజనుల మధ్య ప్రభుత్వమే చిచ్చు పెట్టిందని ఆరోపించారు. లంబాడి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక, జాతీయ అధ్యక్షుడు తేజావత్ బెల్లయ్యనాయక్ మాట్లాడుతూ.. గిరిజనులకు అన్యాయం జరిగితే సహించమన్నారు. సదస్సులో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోట్యనాయక్, అశోక్‌నాయక్, భద్దునాయక్, బాలాజీనాయక్, హరినాయక్, భూక్యా భంగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కీర్తి పురస్కారాల ప్రదానోత్సవం



పురస్కార గ్రహీతలతో మాజీ గవర్నర్ రోశయ్య

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: భారతీయ కళలు, సంస్కృతి ఎంతో గొప్పవని తమిళనాడు మాజీ గవర్నర్ రోశయ్య అన్నారు. శనివారం సుందరయ్య కళానిలయంలో శిల్ప ఆర్ట్ క్రియేషన్స్ సంస్థ ఆధ్వర్యంలో కీర్తి పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రోశయ్య వివిధ రంగాల్లో సేవలందించిన వారికి కీర్తి పురస్కారాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవలతో కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయన్నారు. ఆయా రంగాల్లో సేవలందించిన వారిని గుర్తించి కీర్తి అవార్డులను ప్రదానం చేస్తున్న సంస్థ కృషి అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులకు నిర్వాహకులు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పి.వెంకటేశ్వర్లు, కొండ చంద్రశేఖర్‌గుప్తా, ఆనంద్‌మోహన్, సంతోషశోభన్, మధుసూదన్‌శర్మ, ఆర్.జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ హైదరాబాద్ సాకారానికి కృషి: ఎమ్మెల్యే


గౌరవ నిలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మణ్

ముషీరాబాద్, న్యూస్‌టుడే: స్వచ్ఛ భారత్, స్వచ్ఛ హైదరాబాద్ సాకారానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, ముషీరాబాద్ ఎమ్మెల్యే డా. కె.లక్ష్మణ్ అన్నారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్ గాంధీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ పార్కు పక్కన రూ.5 లక్షలతో జీహెచ్‌ఎంసీ నిర్మించిన గౌరవ నిలయం(పబ్లిక్ టాయిలెట్ల)ను ఆయన స్థానిక కార్పొరేటర్ అఖిల్ అహ్మద్, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్యక్రమం దేశమంతటా కొనసాగుతోందన్నారు. ప్రధాని మోదీ కల సాకారం చేసేందుకు స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా ప్రజల సౌకర్యార్థం వేగంగా మరుగుదొడ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. నగరంలో విస్తృతంగా పబ్లిక్ టాయిలెట్లు, మహిళల కోసం ప్రత్యేకంగా షీ టాయిలెట్ల నిర్మాణం జరుగుతోందన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.12 వేలు అందజేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్-15వ ఉప కమిషనర్ బి.కృష్ణశేఖర్, ఈఈ లక్ష్మీనారాయణ, డీఈఈ నామ్యానాయక్, ఏఈ తిరుపతి, భాజపా నేతలు సీకే శంకర్, చంద్రమోహన్, నందగిరి నర్సింహ, డివిజన్ భాజపా అధ్యక్షుడు మహేశ్, నాయకులు రేగుల రవి, మశ్చేందర్ తదితరులు పాల్గొన్నారు.

### ఫిర్యాదులు అందగానే పరిష్కరించాలి

రాంనగర్: ప్రజల నుంచి ఫిర్యాదులు అందగానే వెంటనే స్పందించి పరిష్కరించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే డా. కె. లక్ష్మణ్ అధికారులకు సూచించారు. శనివారం అడిక్‌మెట్ డివిజన్ గణేశ్‌నగర్, బాలాజీనగర్, ముషీరాబాద్ డివిజన్ రామాలయం ఎదురువీధిలో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. చిన్నచిన్న సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బస్తీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గణేశ్‌నగర్, బాలాజీనగర్‌లలో మంచినీటి సరఫరా తక్కువ ప్రెషర్‌తో రావడం, కొన్నిచోట్ల సరిపడా నీళ్లు రాకపోవడంతో నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందని మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జలమండలి డీజీఎం శ్రీధర్‌రెడ్డిని పిలిచి మంచినీటి సమస్యను పరిష్కరించాలని సూచించారు. బాలాజీనగర్‌లో రెండేళ్ల నుంచి మంచినీటి సమస్య ఉందని ఎట్టకేలకు పైపులైన్ పనుల కోసం రూ.16 లక్షలు మంజూరైనా సాంకేతిక కారణాలతో పనులు ప్రారంభం కాలేదని విశ్రాంత ఉద్యోగి రాంచంద్రయ్య ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల నిర్మించిన రోడ్డు ఎత్తుగా ఉండటంతో ఎగువ నుంచి వర్షంనీరు దిగువనున్న తమ గల్లీలోకి వచ్చి ఇళ్లలోకి నీరు చేరుతుందని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. దిగువకు నీళ్లు వెళ్లకుండా చూడాలన్నారు. మాదవ్, విన్నుముదిరాజ్, సాయికృష్ణ యాదవ్, దీన్‌దయాల్‌రెడ్డి, రామస్వామి, శ్రీధర్‌రెడ్డి, హకీం, డీఎంసీ కృష్ణశేఖర్, ఈఈ లక్ష్మీనారాయణ, డీఈ నామ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కవాడిగూడ గ్రంథాలయాన్ని అభివృద్ధి చేస్తాం


పాఠకులతో చర్చిస్తున్న కె.ప్రసన్న

కవాడిగూడ, న్యూస్‌టుడే: కవాడిగూడ గ్రంథాలయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని నగర గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ కె.ప్రసన్న అన్నారు. శనివారం కవాడిగూడ గ్రంథాలయాన్ని సందర్శించారు. మహానగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సభ్యుడు వి.శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉప మేయర్ గోల్కొండ రాజ్‌కుమార్, గ్రంథాలయం పునర్ నిర్మాణం సందర్భంగా కోర్టు కేసులను ఎదుర్కొంటున్న ఎనిమిది మంది స్థానికులు, పాఠకులతో ఆమె మాట్లాడారు. మరుగుదొడ్లకు వెంటనే పైపులైన్ కనెక్షన్ వేయాలని, మొదటి అంతస్తులో మరుగుదొడ్లు నిర్మించాలని గుత్తేదారుకు సూచించారు. కుప్పలుగా ఉన్న పుస్తకాలను క్రమ పద్ధతిలో రాక్‌లలో అమర్చాలని గ్రంథపాలకురాలు స్వర్ణలతకు చెప్పారు. అందుకోసం అదనంగా నలుగురు సిబ్బందిని కేటాయిస్తామన్నారు. ప్రధాన రోడ్డువైపు ఖాళీగా ఉన్న స్థలంలో సిమెంట్ ఫ్లోరింగ్ చేయిస్తామని పాఠకులకు హామీ ఇచ్చారు. రెండో అంతస్తు నిర్మించి కంప్యూటర్లు ఏర్పాటుచేసేందుకు కృషిచేస్తానన్నారు. రాక్‌లు, పుస్తకాలను మంజూరు చేయిస్తామని పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు వి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధికి తనవంతు చేయూత అందిస్తానన్నారు. మాజీ ఉపమేయర్ గోల్కొండ రాజ్‌కుమార్ మాట్లాడుతూ 70 ఏళ్ల క్రితం నిర్మించిన కవాడిగూడ గ్రంథాలయం శిథిలం కావడంతో తాను స్థానిక కార్పొరేటర్‌గా, ఉపమేయర్‌గా ఉన్న సమయంలో ఎంపీ అంజన్‌కుమార్ నిధులు మంజూరు చేయించి పునర్ నిర్మాణం చేపట్టిన వివరాలను చెప్పారు. కవాడిగూడ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిబాబా, అరవింద్, వెంకటేశ్, శ్రీనివాస్, శేఖర్, కవాడిగూడ తెరాస అధ్యక్షుడు జుగెందర్, లావణ్య, నర్సింగ్‌రావులు గ్రంథాలయం చరిత్రను వివరించారు. కార్యక్రమంలో తెరాస నాయకులు రామూర్తి, కల్వ గోపి, కాటారం దినేశ్, అన్నం సతీష్, శ్రీనివాస్, రమేశ్, లక్ష్మణ్, ధర్మేందర్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సింగాడికుంటలో నగరపాలకసంస్థ ఏర్పాటు చేసిన ఈ-లైబ్రరి పనితీరును పరిశీలించారు. సగర సంఘం నాయకులు అంజయ్య, దశమంతరావు, రాందాసు, సుధాకర్ స్థానిక సమస్యలను వివరించారు.

## తిరుపతిరావు కమిటీ నివేదిక ప్రైవేటు విద్యాసంస్థలకు అనుకూలం



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం నియమించిన తిరుపతిరావు కమిటీ నివేదిక ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు అనుకూలంగా ఉందని, దాన్ని వ్యతిరేకిస్తూ శనివారం ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య పార్కు చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి జావెద్ మాట్లాడుతూ. . తిరుపతిరావు కమిటీ నివేదిక పూర్తిగా కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలకు అనుకూలంగా ఉందన్నారు. ఈ నివేదికలో విద్యాహక్కు చట్టం అమలుకు చర్యలు లేవన్నారు. కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజుల నియంత్రణకు చర్యలు లేవని ఆరోపించారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో డొనేషన్లు, అడ్మిషన్ల ఫీజు వసూళ్లపై స్పష్టత లేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు అశోక్, విద్యార్థి సంఘం నేతలు విజయ్‌కుమార్, అష్మీబాబు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాగితాల్లోనే దళితులు, గిరిజనుల అభివృద్ధి



మాట్లాడుతున్న ఆంజనేయులు

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: దళితులు, గిరిజనుల అభివృద్ధి కాగితాల్లోనే కనిపిస్తుందని, ఆచరణలో అమలు కావడం లేదని ఆక్షన్ ఎయిడ్ సంస్థ ఆర్ఎం ఆంజనేయులు ఆరోపించారు. శనివారం సుందరయ్య కళానిలయంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలుపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సంస్థ పక్షాన ఇటీవల రాష్ట్రంలో 17 జిల్లాల్లోని 29 మండలాల్లో ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక అమలు తీరుపై సర్వే చేశామన్నారు. 42 గ్రామాల్లో ఉప ప్రణాళిక నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయలేదని తేలిందన్నారు. దళితులకు మూడెకరాల భూ పంపిణీలో కొండలు, రాళ్లు, రప్పల్లో ఉన్న భూమిని కట్టబెట్టారని ఆరోపించారు. దళితులకు భూ పంపిణీ చేసిన తర్వాత పంటల సాగుకు విత్తనాలు, ఎరువులు, సాగు ఖర్చులు ప్రభుత్వం అందించడంలేదన్నారు. ఇలాగైతే దళితులు ఎలా బాగుపడుతాయని ఆయన ప్రశ్నించారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మూడు లక్షల మంది దళితులకు భూమి లేదన్నారు. మూడేళ్లలో ప్రభుత్వం 4596 కుటుంబాలకు 11968.13 ఎకరాలను మాత్రమే పంపిణీ చేసిందన్నారు. కొన్ని జిల్లాల్లో మూడెకరాల భూ పంపిణీ కాలేదన్నారు. సమావేశంలో నేతలు శ్రీరాంనాయక్, సైకిలాబ్‌బాబు, సీహెచ్ రవికుమార్, మేరి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో


విద్యార్థులను వివరాలను అడిగి తెలుసుకుంటున్న రూపారెడ్డి.

గాంధీనగర్, న్యూస్‌టుడే: గాంధీనగర్‌లోని బచ్‌పన్ ప్లే స్కూల్‌లో శనివారం జరిగిన సైన్స్ ఎక్స్‌పో ఆకట్టుకుంది. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు పలు అంశాలపై తయారు చేసిన వాటిని ప్రదర్శించి వాటి గురించి వివరించారు. విద్యార్థులు పోలీసు, వైద్యుల వేషధారణలో అలరించారు. సంక్రాంతి ముగ్గులు వేసి దృశ్యరూపకం ప్రదర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులు బతుకమ్మను ఏర్పాటు చేసి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో బచ్‌పన్‌ప్లేస్కూల్ రీజనల్ డైరెక్టర్ రూపారెడ్డి, జలగం హారిక, ఉపాధ్యాయులు నికిత, మౌనిక, హేమలత, రేఖ తదితరులు పాల్గొన్నారు.

## మహ్మద్ ఫారూఖ్ కుటుంబాన్ని ఆదుకోవాలి


మాట్లాడుతున్న ముక్తార్‌హుస్సేన్.

రాంనగర్, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మజీద్‌లో నిద్రిస్తున్న మౌజన్(చిన్నగురువు) మహ్మద్ ఫారూఖ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేయడం దారుణమని తెదేపా గ్రేటర్ హైదరాబాద్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముక్తార్ హుస్సేన్ అన్నారు. శనివారం రాంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పందించి మృతి చెందిన ఆ వ్యక్తి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జహిరుద్దీన్ సమర్, ఇలాం హుస్సేన్, సయ్యద్ షబీర్ తదితరులు పాల్గొన్నారు.

# ముషీరాబాద్



## వాలీబాల్ టోర్నమెంటు నేడు

**ముషీరాబాద్, న్యూస్‌టుడే:** నెహ్రూ యువ కేంద్రం హైదరాబాద్ శాఖ, యువ సేన యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 31న ముషీరాబాద్ మున్సిపల్ క్రీడా మైదానంలో వాలీబాల్ టోర్నమెంటు నిర్వహించనున్నట్లు యువసేన యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు పానుగంటి మహేశ్ తెలిపారు. పాల్గొనదలచిన జట్లు ఫోన్ నంబరు 8143812371 ను సంప్రదించాలని సూచించారు.

## కళలు, కళాకారులను ప్రోత్సహించాలి: జస్టిస్ శేషసాయి



విజేతలతో శేషసాయి, పార్వతీశం, జనార్దనమూర్తి తదితరులు

**వివేక్‌నగర్:** భారతదేశం కళలకు కాణాచి అని, ఇక్కడున్న 64 కళలు మరెక్కడా లేవని తెలుగు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి అన్నారు. ఆధునికత పేరిట కళలను దూరం చేసుకోవడం అవివేకమన్నారు. కళలు, కళాకారులను ప్రోత్సహించాలన్నారు. ప్రసిద్ధ శాస్త్రీయ సంగీత నృత్యశిక్షణ ప్రదర్శన సంస్థ ఎస్ఎస్ మ్యూజిక్ అకాడమీ 20వ వార్షికోత్సవ రెండో రోజు కార్యక్రమంలో జస్టిస్ శేషసాయి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. త్యాగరాయగానసభలో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి అకాడమీ స్థాపక సంచాలకులు జీవీ ప్రభాకర్ అధ్యక్షత వహించారు. అతిథులుగా జయజయశంకర్ టీవీ ఛానల్ సీఈఓ డా.ఓలేటి పార్వతీశం, దిల్లీ తెలుగు అకాడమీ ప్రధాన కార్యదర్శి నాగరాజు, గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి హాజరయ్యారు. వారు అకాడమీ నిర్వాహకులు ప్రభాకర్, లలిత కృషి,సేవలను అభినందించారు. వార్షికోత్సవ సాంస్కృతిక కార్యక్రమంగా అకాడమీ విద్యార్థులు శాస్త్రీయ, లలిత, గాత్ర సంగీతం,కూచిపూడి, నృత్యాలను ప్రదర్శించారు.

## కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వ కృషి



క్యాలండర్ విడుదల చేస్తున్న నాయిని తదితరులు

**ముషీరాబాద్, న్యూస్‌టుడే:** కార్మికుల సంక్షేమాని ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. హింద్ మజ్దూర్ సభ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కాలమానిని శనివారం మంత్రి నాయిని నర్సింహారెడ్డి, హెచ్ఎంఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రెబ్బరామారావుతో కలిసి హెచ్ఎంఎస్ నగర కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నాయిని మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా ఉంటూ హెచ్ఎంస్‌ను మరింత బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రెబ్బ రామారావు మాట్లాడుతూ... నగరంలో హెచ్ఎంఎస్ కార్మిక సంఘం బలమైన శక్తిగా ఎదుగుతోందన్నారు. కార్మిక సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు హెచ్ఎంఎస్ కృషిచేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంస్ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ప్రధాన కార్యదర్శి అంజద్, కోశాధికారి శేఖర్, మహిళా కమిటీ అధ్యక్షురాలు భాగ్యవతి, నాయకులు నర్సయ్య, మహేశ్, శేఖర్, నర్సింగ్‌రావు, సాయి పాల్గొన్నారు.

**ముషీరాబాద్, న్యూస్‌టుడే:** గౌడ సంఘం జమిస్తాన్‌పూర్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కాలమానిని శనివారం ఎక్సైజ్ శాఖ మంత్రి పద్మారావు తన నివాసంలో ఆవిష్కరించారు. అనంతరం ముషీరాబాద్ డివిజన్ పార్శిగుట్టలోని సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు సి.ప్రకాష్‌గౌడ్ మాట్లాడారు. గౌడ సంఘం అభ్యున్నతికి తమ సంఘం తరుపున కృషి చేస్తున్నట్లు తెలిపారు. నూతన సంవత్సర కాలమానిని సంఘ సభ్యులందరికీ అందజేస్తామని చెప్పారు కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి జె. హరిగౌడ్, కోశాధికారి లక్ష్మణ్‌గౌడ్, సలహాదారులు ఎం.అంజయ్యగౌడ్, టి.వెంకటేష్‌గౌడ్, నర్సింహాగౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి పి.వేణుబాబుగౌడ్, సంయుక్త కార్యదర్శులు ఎం.శ్రీనివాస్‌గౌడ్, రాజుగౌడ్, ఉపాధ్యక్షులు బాలమల్లేష్‌గౌడ్, దయానంద్, జంగయ్య, ట్రస్టు మెంబర్ పరకాల లక్ష్మణ్‌గౌడ్, రాముగౌడ్ పాల్గొన్నారు.



కాలమానిని ఆవిష్కరిస్తున్న మంత్రి పద్మారావు తదితరులు

**బాగ్‌లింగంపల్లి:** హైదరాబాద్ జిందాబాద్ (సీపీఎం) అనుబంధం ఆధ్వర్యంలో కల్చరల్ ఫెస్ట్ 2018ను నిర్వహించనున్న సందర్భంగా దానికి సంబంధించిన గోడపత్రికను శనివారం సుందరయ్య కళానిలయంలో ఆవిష్కరించారు. ఆ సంఘం ఉపాధ్యక్షుడు వి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈనెల 4లోపు పాఠశాలల్లో విద్యార్థులకు కాలుష్యంపై చిత్రలేఖనం, హైదరాబాద్ వివిధ సంస్కృతులు సమ్మేళనంపై వ్యాసరచన, 70 ఏళ్ల స్వాతంత్ర్యంపై ఉపన్యాస పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 5న సుందరయ్య కళానిలయంలో విజేతలను ఎంపిక చేస్తామని, 7న రవీంద్రభారతిలో విజేతలకు బహుమతులను అందజేస్తామన్నారు.

## అలరించిన హాస్య కదంబం

**వివేక్‌నగర్, న్యూస్‌టుడే:** ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ సమర్పణలో త్యాగరాయగానసభ సౌజన్యంతో శనివారం కళాదీక్షితులు కళావేదికలో క్లబ్ ఐదో వార్షికోత్సవ కార్యక్రమంగా వినోదాల విందు పేరిట హాస్యకదంబ కార్యక్రమాన్ని నిర్వహించారు. పశువుల కాపరి, బ్యాంకు లోను, రైల్వేట్రాక్, విడాకులు కావాలి తదితర ప్రహేళికలను ప్రదర్శించారు. వీటిలో హాస్య నటులు సుబ్రహ్మణ్యం, మోహనకృష్ణ, నరసింహం, కామేశ్వర్‌రావు, పద్మావతి, భవాని, ప్రసాద్, రాజా, చంద్రపాల్, తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ నవల, సినీ సంభాషణల రచయిత శంకరమంచి పార్థసారథి, నంది అవార్డు గ్రహీత తల్లావర్ఝుల సుందరంనకు సన్మానాలు చేశారు. నిర్వహణ సంస్థ వ్యవస్థాపకులు సుబ్రహ్మణ్యం పర్యవేక్షణ చేశారు. కార్యక్రమంలో కళాజనార్దనమూర్తి, రామారావు పాల్గొన్నారు.



## డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

**గాంధీనగర్, న్యూస్‌టుడే:** డివిజన్ సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని టీమాస్ ఫోరం స్టీరింగ్ కమిటీ సభ్యులు ప్రొ.పీఎల్ విశ్వేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రెండు పడక గదుల పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. శనివారం రాత్రి డివిజన్‌లోని అరుంధతీనగర్‌లో జరిగిన టీమాస్ ఫోరం గాంధీనగర్ డివిజన్ ఆవిర్భావ సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో బస్తీలు, కాలనీలు ముంపునకు గురికాకుండా కాలువలు నిర్మించాలన్నారు. సమావేశంలో నేతలు నరేష్, మేరుగు శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.



## సినీసంగీతం

**వివేక్‌నగర్,న్యూస్‌టుడే:** అగ్రేసర బహుభాషా సినీనటి సావిత్రి వర్ధంతి సందర్భంగా మహతి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభ తోడ్పాటుతో శనివారం కళాలలితకళావేదికలో సినీసంగీత విభావరి నిర్వహించారు. సంస్థ అధ్యక్షురాలు ఓరుగంటి రాజ్యలక్ష్మి సారథ్యంలో సాగిన ఈ గాన కార్యక్రమంలో మోహన్, వేణుగోపాల్, ప్రసాద్, శశిరేఖ పాల్గొన్నారు. వారు సావిత్రిపై చిత్రీకరించిన పాటలతోపాటు ఘంటసాల పాడిన కొన్ని పాటలను ఆలపించారు.

## బాపు జయంతి



బాచికి జ్ఞాపిక అందజేస్తున్న అతిథి

**వివేక్‌నగర్:** సంగీతం ప్రక్రియల ప్రోత్సాహక సంస్థ హాసం క్లబ్ 166వ నెల కార్యక్రమాన్ని శనివారం కళాసుబ్బారావు కళావేదికలో నిర్వహించారు. సినీ దర్శకుడు బాపు 85వ జయంతిని పురస్కరించుకొని ప్రసిద్ధ వ్యంగ్య చిత్రకారుడు బాచికి ఆత్మీయ సత్కారం చేశారు. సుప్రసిద్ధ సినీ, టీవీ నటుడు జి.సుదర్శన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన బాచి ప్రతిభా విశేషాలను కొనియాడారు. నిర్వహణ సంస్థ రాష్ట్ర సంచాలకులు రామారావు అధ్యక్షత వహించారు. సమన్వయకర్త ఎంబీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు. మొదట స్వరగీతిక సంగీత నిలయం చిన్నారి కళాకారులు గురువు సత్యభామ పర్యవేక్షణలో పాటలు పాడారు. నరేష్,లాస్య, పంచమి,రుద్రాక్షి, నిశిత, రాజ్యలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.





## నిబంధనల ప్రకారమే విక్రయించాలి

**ముషీరాబాద్, న్యూస్‌టుడే:** ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మద్యం విక్రయించాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తామని ముషీరాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వై.నాగేందర్‌గౌడ్ హెచ్చరించారు. శనివారం ముషీరాబాద్‌లోని ఎక్సైజ్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లకు ట్యాబ్‌లను అందజేసిందన్నారు. ఇకనుంచి విక్రయాలు, మద్యం దుకాణాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తామన్నారు.

## ముగ్గురు ఎస్సైలకు పదోన్నతులు

**దుండిగల్, న్యూస్‌టుడే:** దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైలుగా పనిచేస్తున్న 2007 బ్యాచ్‌కు చెందిన పవన్, కిరణ్‌కుమార్, రమేష్‌లు సీఐలుగా పదోన్నతి పొందారు. సూరారం సెక్టార్ ఎస్సైగా పనిచేస్తున్న పవన్ ఏసీబీ విభాగానికి, క్రైం ఎస్సైగా పనిచేస్తున్న రమేష్ హైదరాబాద్ కమిషనరేట్‌కు, దుండిగల్ సెక్టార్‌లో ఎస్సైగా పనిచేస్తున్న కిరణ్‌కుమార్ సీఐడీ విభాగంలో సీఐలుగా నియమితులయ్యారు. డీజీపీ మహేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు వెస్ట్‌జోన్ ఐజీ స్టీఫెన్‌రవీంద్ర శనివారం ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

# కుత్బుల్లాపూర్

# ఆక్రమిత స్థలాల్లోనూ అన్ని వసతులు

### అనాలోచితంగా నిధుల వెచ్చింపు ★ ప్రజా ధనం అంటే ఎందుకో అంత అలుసు?

**న్యూస్‌టుడే, కుత్బుల్లాపూర్**

చింతల్‌ని ప్రభుత్వ భూమిలో దశాబ్దాల క్రితం రామకృష్ణనగర్ రూపుదిద్దుకుంది. అప్పట్లో పక్కన ఉన్న ప్రైవేటు పట్టా భూమిలో కూడా కొందరు ఇళ్లు నిర్మించుకున్నారు. ఆ భూమి యజమాని కోర్టును ఆశ్రయించినా పట్టించుకోకుండా అప్పటి ప్రజాప్రతినిధుల ప్రోద్బలంతో పురపాలక సంఘం హయాంలో ఆ కాలనీలో సుమారు రూ.2 కోట్ల మేరకు వెచ్చించి సిమెంటు రహదారులు, భూగర్భ మురుగు కాలువలు, తాగునీటి పైపులైన్లను విస్తరించి వీధి దీపాలు కూడా ఏర్పాటు చేశారు. చివరకు భూ యజమానికి అనుకూలంగా కోర్టు తీర్పు వెలువరించడంతో అక్కడ వెలిసిన ఇళ్లతోపాటు పురపాలక సంఘం కల్పించిన వసతులన్నింటినీ తొలగించి ఆ భూ యజమానికి అప్పగించాల్సి వచ్చింది. మౌలిక వసతుల కోసం అక్కడ వెచ్చించిన నిధులు వృథా అవడమే కాకుండా పలువురు నిర్వాసితులవడంతో అప్పటి ఎమ్మెల్యే టి.దేవేందర్‌గౌడ్ బాధితులకు గండిమైసమ్మ కూడలిలోని ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు ఇప్పించి ఆదుకున్నారు. మళ్లీ ఇలాంటి పొరపాట్లు చేస్తే సహించేది లేదని అప్పట్లో దేవేందర్‌గౌడ్ అధికారులను హెచ్చరించారు.

ఈ సంఘటన జరిగి ఇప్పటికి పదిహేను సంవత్సరాలు కావస్తున్నా బాధితులు ఇప్పటికీ అప్పుడు పడ్డ కష్టాలను తలుచుకుంటూ కన్నీళ్లు పెట్టుకుంటున్న సందర్భాలు ఉన్నాయి. ఇంత జరిగినా మన అధికారుల్లో మాత్రం మార్పు రాకపోవడం విమర్శలకు తావిస్తోంది. వివాదాస్పదమైన స్థలాల్లో యథాతథంగా తరచూ రూ.లక్షలు వెచ్చించి పనులు చేపడుతూ ప్రజాధనం దుర్వినియోగానికి తెరలేపుతూనే ఉన్నారు.



న్యూ శివాలయనగర్ పక్కన వివాదాస్పదమైన స్థలం మీదుగా రోడ్డు నిర్మాణానికి చేపట్టిన తవ్వకాలు

**వివాదం ఉన్న విషయం తెలియదు:**

**రాజ్‌కుమార్, ఈఈ, కుత్బుల్లాపూర్ సర్కిల్**

ఎమ్మెల్యే సిఫారసు మేరకు న్యూశివాలయనగర్‌లో రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం సిమెంటు రహదారి నిర్మిస్తున్న స్థల వివాదం కోర్టులో ఉన్న విషయం తమకు తెలియదు. ఈ విషయమై రెవెన్యూ అధికారులతో చర్చించి వారి సూచనల మేరకు రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

### పదే పదే అవే తప్పులు

★ మొన్నటికి మొన్న గాంధీనగర్ పక్కన హెచ్ఎంటీ స్థలంలోకి చొచ్చుకొచ్చి శ్మశాన వాటికను ఆధునిక శ్మశాన వాటికగా తీర్చిదిద్దడానికి రూ.49 లక్షలతో అధికారులు టెండర్లు నిర్వహించారు. పనులు ప్రారంభించగానే ఆ కంపెనీ అభ్యంతరం చెప్పడంతో పనులను అర్ధంతరంగా నిలిపేసి చేతులెత్తేశారు.

★ తాజాగా సుభాష్‌నగర్ డివిజన్‌లోని న్యూ శివాలయనగర్ పక్కన వివాదాస్పదమైన స్థలంలో నుంచి రూ.16.50 లక్షలతో సిమెంటు రహదారి నిర్మాణానికి టెండర్లు నిర్వహించి ఆగమేఘాల మీద పనులు చేపడుతుండటం విమర్శలకు తావిస్తోంది.

★ న్యూ శివాలయనగర్ పక్కన గాజులరామారం 49/1 నుంచి 49/9 సర్వే నంబరు వరకు గల అసైన్డ్ భూములు భూమిలేని నిరుపేద రైతులకు కేటాయించారు. నిబంధనలకు విరుద్ధంగా సంబంధిత భూములను కొనుగోలు చేసిన స్థిరాస్తి వ్యాపారులు దశాబ్దాల క్రితం ప్లాట్లు చేసి విక్రయించారు. ఆనంతరం రెవెన్యూ అధికారులు పీఓటీ చట్టం ప్రకారం సంబంధిత భూముల క్రయవిక్రయాలు చెల్లవంటూ స్వాధీనం చేసుకుని ఉమ్మడి రాష్ట్రంలో రాజీవ్ స్వగృహ ఇళ్ల నిర్మాణాల కోసం దిల్ సంస్థకు అప్పగించింది. దీన్ని వ్యతిరేకిస్తూ ఇక్కడ ప్లాట్లు కొన్న వారితో పాటు భూయజమానులు కూడా ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రస్తుతం ఈ వివాదం కోర్టులో ఉంది. నిబంధనల ప్రకారం కోర్టు విచారణలో ఉన్న స్థలాల్లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదు. కాని జీహెచ్ఎంసీ అధికారులు తమకేమీ పట్టనట్టుగా రూ.16.50 లక్షలతో సిమెంటు రహదారి నిర్మాణానికి పూనుకుంటూ ప్రజా ధనం దుర్వినియోగం చేయడంలో తమతో సరిరారని మరో సారి నిరూపించుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## కాలమానిని ఆవిష్కరణ



తెరాస ఆధ్వర్యంలో రూపొందించిన కాలమానిని ఆవిష్కరిస్తున్న మంత్రి హరీష్‌రావు

**దుండిగల్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ తెరాస ఆధ్వర్యంలో రూపొందించిన కాలమానిని శనివారం నగరంలోని మంత్రుల నివాస సముదాయంలో మంత్రి హరీష్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెరాస నేతలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తెరాస జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి, మస్కూరి సాయి, మల్లేష్‌కుమార్, రాంచందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర కాలమానిని ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ

**షాపూర్‌నగర్, న్యూస్‌టుడే:** మార్కండేయనగర్‌లోని సాధన స్కూల్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కాలమానిని శనివారం సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ ఆవిష్కరించారు. గత సంవత్సరం చేసిన తప్పులను సరిదిద్దుకొని నూతన ప్రణాళికలు రూపొందించుకొని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కార్పొరేటర్ విద్యార్థులకు సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## 'కార్మికుల శ్రేయస్సు విస్మరించొద్దు'

**జీడిమెట్ల, న్యూస్‌టుడే:** పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల శ్రేయస్సును విస్మరించవద్దని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. జీడిమెట్ల ఎస్వీ కో-ఆపరేటివ్ సొసైటీ పరిధిలోని ఎ.ఆర్.లైఫ్‌సైన్సెస్ పరిశ్రమలో భారతీయ మజ్దూర్ సంఘ్ యూనియన్ స్థాపించిన సందర్భంగా పరిశ్రమ గేటు వద్ద శనివారం జెండా ఆవిష్కరణ ఏర్పాటు చేశారు. మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాల ప్రకారం కార్మికులకు రావాల్సిన అన్ని సౌకర్యాలను యాజమాన్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మల్లేష్, జయేందర్, శంకర్‌రెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి

### నల్సార్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ బాలకిష్టారెడ్డి



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

**పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే:** మారుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని నల్సార్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. కొంపల్లిలోని సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాల తృతీయ వార్షికోత్సవం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తూ ప్రస్తుతం అన్ని రంగాల్లో పోటీ తీవ్రంగా ఉందన్నారు. విద్యార్థులు కళాశాల నుంచే అందుకోసం సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల అధినేత ఎస్వీ సుందరరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచి జెమ్మి నాగమణి, పాఠశాల డైరెక్టర్ సరిత, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు రాంబాబు, భాస్కరరాజు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## నయా జోష్‌లో జర జాగ్రత్త




ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

**షాపూర్‌నగర్, న్యూస్‌టుడే:** నూతన సంవత్సర వేడుకలను సంతోషంగా, క్షేమంగా జరుపుకోవాలని వేడుకల్లో ప్రమాదాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులు వాహనదారులకు అవగాహన కల్పించారు. గాజులరామారం కూడలిలో శనివారం బ్లూక్రాస్ హైదరాబాద్ సౌజన్యంతో షాపూర్‌నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కారు నడిపేటప్పుడు సీట్‌బెల్టు పెట్టుకోవాలని, వాహనాలను తాగి నడపవద్దని, చరవాణిలో మాట్లాడుతూ వాహనాలు నడపొద్దని, తాగి వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడవద్దని కుటుంబాన్ని, పిల్లలను అనాథలుగా మార్చవద్దని ప్లకార్డులను ప్రదర్శిస్తూ వాహనదారులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు స్వయంగా ఆలోచించి కార్యక్రమాన్ని చేయాలని తెలపడంతో రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని బాలబుచ్చమ్మ, రెడ్‌క్రాస్ ప్రతినిధి నారాయణరావు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్సీ

**శంభీపూర్(దుండిగల్):** ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలను పరిష్కరించడానికి తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికై రెండేళ్లు అయిన నేపథ్యంలో శనివారం శంభీపూర్‌లోని ఆయన నివాసంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గంలో దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలను తనదృష్టికి తీసుకొస్తే సంబంధిత ఉన్నతాధికారులు, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. కార్పొరేటర్లు సత్యనారాయణ, జగన్, మండల తెరాస అధ్యక్షుడు నాగరాజ్‌యాదవ్, నాయకులు సురేష్‌రెడ్డి, గోవిందరెడ్డి, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

★ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.51 లక్షల విలువ చేసే చెక్కులను శనివారం ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు ఐదుగురు లబ్ధిదారులకు అందజేశారు. జడ్పీ వైస్ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు ఆగం పాండు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అబ్బురపరిచిన వైజ్ఞానిక ప్రదర్శన

**నిజాంపేట:** నిజాంపేటలోని రవీంద్రభారతి స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన మెగా వైజ్ఞానిక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. దాదాపు 400 మంది విద్యార్థులచే 175 అంశాలపై రూపొందించిన నమూనాలను ప్రదర్శించారు. ప్రధానంగా మానవరహిత రైలు, విద్యుత్తు సాయం లేకుండా పనిచేసే వాషింగ్‌మిషన్, హైడ్రాలిక్ వంతెన, లేజర్ లైటింగ్, మెట్రో రైలు, మురికి నీటి శుద్ధి విధానం, వ్యర్థాలతో వస్తువుల తయారీ వంటి వాటితో పాటు మేకిన్ ఇండియా అంశాలు ఆకట్టుకున్నాయి. ప్రదర్శనను రాష్ట్ర ప్రభుత్వ సహాయ కార్యదర్శి బి.భారతి లక్‌పతినాయక్, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ కె.వెంకటేశ్వరరావు, ఓయూ హెచ్ఓడీ ఎం.గంగారాజు, పాఠశాల ప్రిన్సిపల్ ఎం.విజయలక్ష్మి తదితరులు తిలకించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న భారతి లక్‌పతినాయక్

# కుత్బుల్లాపూర్

## ఆహారంపై అవగాహన

**జీడిమెట్ల:** సూరారంకాలనీ ఎంబీ గ్రామర్ హైస్కూల్‌లో శనివారం ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆహారపదార్థాలను రుచి చూశారు. పాఠశాల ప్రిన్సిపల్ స్వరూప్‌రెడ్డి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు ఉద్యోగులకు చేయూతనివ్వాలి

**జగద్గిరిగుట్ట:** ప్రైవేటు ఉద్యోగులకు పనికి తగ్గ వేతనం అందేలా ప్రభుత్వం కృషి చేయాలని ప్రైవేటు ఉద్యోగ సంఘం ప్రతినిధులు అన్నారు. జగద్గిరిగుట్టలో శనివారం సమావేశమై కుత్బుల్లాపూర్ అధ్యక్షుడిగా శ్రావణ్ ఎంపికైనట్లు తెలిపారు. ఆయనకు వేతన సలహామండలి ఛైర్మన్ సామ వెంకటరెడ్డి, సంఘం జిల్లా అధ్యక్షుడు అస్లాం నియామక పత్రం అందజేశారన్నారు.




# సమస్యల పరిష్కారానికి రూ.56.20 కోట్ల విడుదల: ఎమ్మెల్యే

**కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే:** 'మన నగరం' కార్యక్రమం సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించడానికి ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.56.20 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జంట సర్కిళ్లలో 'మన నగరం' కార్యక్రమం సందర్భంగా 353 అర్జీలు రాగా జీహెచ్‌ఎంసీకి సంబంధించిన 163 అర్జీల పరిష్కారానికి రూ.45 కోట్లు, ట్రాన్స్‌కోకు సంబంధించిన 23 అర్జీల పరిష్కారానికి రూ.11.20 కోట్లు విడుదల చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌లకు ఎంపీ, ఎమ్మెల్సీ, కార్పొరేటర్లు కృతజ్ఞతలు తెలిపారన్నారు. ఈ నిధులతో కుత్బుల్లాపూర్ పట్టణాన్ని అభివృద్ధి పథాన నిలబెట్టడానికి అవకాశం చిక్కుతుందన్నారు.


ఎంపీడీవో అరుణను సన్మానిస్తున్న ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేక్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

### గ్రామాల అభివృద్ధిలో ఎంపీడీవో విశేష కృషి

**బహదూర్‌పల్లి(దుండిగల్), న్యూస్‌టుడే:** ఎంపీడీవోగా కుత్బుల్లాపూర్ మండల పరిషత్ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి అరుణ చేసిన సేవలు మరువలేనివని ప్రజాప్రతినిధులు ప్రశంసించారు. పదవీ విరమణ పొందిన ఎండీడీవో అరుణను శనివారం ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు. బహదూర్‌పల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేక్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. హరితహారం విజయవంతానికి ఆమె చేసిన కృషికి రాష్ట్ర ప్రభుత్వం హరితమిత్ర అవార్డుతో సన్మానించిందని గుర్తుచేశారు. ముఖ్యంగా పేదల సమస్యల పరిష్కారానికి ఆమె కృషి చేశారన్నారు. ఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డి, జడ్పీ వైస్‌ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ ఎస్.కవిత, డీపీవో సురేష్‌మోహన్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కౌటిల్యరెడ్డి, తహసీల్దార్ మల్లయ్య, మండల, గ్రామశాఖ అధికారులు పాల్గొన్నారు.



## అలరించిన పెద్దల దినోత్సవం

**కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే:** చింతల్ మాణిక్యనగర్‌లోని దిల్లీ వరల్డ్ స్కూల్‌లో శనివారం సాయంత్రం పెద్దల దినోత్సవం సందడిగా జరిగింది. ప్రీప్రైమరీ, నర్సరీ, ఎల్‌కేజీ చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కుటుంబంలో తాతయ్య, నానమ్మల ప్రాధాన్యతను వివరిస్తూ చిన్నారులు పాడిన గీతాలు అలరించాయి. అంతకుముందు పాఠశాల ఆవరణలో పెద్దలకు పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల ఛైర్మన్ నల్లపాటి వెంకటేశ్వరరావు, డైరెక్టర్ నల్లపాటి సాయి, ప్రిన్సిపల్ భావనపాఠక్ పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

## ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

**పేట్‌బషీరాబాద్:** ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఓ యువకుడు జీవితంపై విరక్తి చెంది ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పేట్‌బషీరాబాద్ ఠాణా ఎస్సై ఎస్.శ్రీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం... మెదక్ జిల్లా గజ్వేల్ మండలం కిష్టాసాగర్ గ్రామానికి చెందిన కుప్పల నాగరాజు(23)కు అదే ప్రాంతానికి చెందిన పుష్పతో ఎనిమిది నెలల క్రితం వివాహమైంది. బతుకుదెరువు నిమిత్తం తల్లి మల్లవ్వ, తమ్ముడు హరిప్రసాద్‌తో కలిసి భాగ్యలక్ష్మికాలనీకి వచ్చి నివాసముంటున్నాడు. శనివారం కుటుంబసభ్యులు అందరూ పనికి వెళ్లగా అతను ఒక్కటే ఉన్నాడు. చీర కొంగుతో సీలింగ్ ఫ్యాన్ కొక్కానికి ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు మధ్యాహ్నం ఇంటికి వచ్చి గది తలుపులు కొట్టిని తీయకపోవటంతో పగల గొట్టి చూశారు. ఉరేసుకొని మృతిచెంది కన్పించాడు. ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆత్మహత్య చేసుకొని ఉంటాడని కుటుంబసభ్యులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోలీసులు గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.